వ్యాస మహాభారతం

(తెలుగు వచనం)

విరాటపర్వం



డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి

డాక్టర్ సూరం శ్రీనివాసులు

శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

విజయవాడ - 12.

రామ-తిప్పా 96356

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
విరాట పర్వం

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
డాక్టర్ సూరం శ్రీనివాసులు

894-82781
రామ - మహా

వ్యాస

మహాభారతం (తెలుగు వచనం)

విరాట పర్వం

ప్రథమ ముద్రణ : వికృతి ఉగాది (మార్చి 2010)

18 సంపుటాల వెల : రూ. 720/-

C 27458
సుందరయ్య గ్రంథాలయ సంస్థ
96386
A.C.No.....
గచ్చిబౌలి, హైదరాబాద్-500032.

ప్రతులకు :
డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
శివాలయం వెనుక, **పోలకంపాడు,**
తాడేపల్లి పోస్టు, గుంటూరు జిల్లా - 522501,
ఫోన్ : 08645-272093, సెల్ : 9491727611

ప్రచురణ & ప్రతులకు :
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్
డోర్ నెం. 76-8/1-28, లలితానగర్,
భవానిపురం, విజయవాడ - 520 012.
ఫోన్ : 0866-2414322, సెల్ : 9440346287

అమ్మనాన్నలు : **కరెడ్ల గోపాలకృష్ణమూర్తి, కమలమ్మ**

జన్మనిచ్చిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలతో....

వెంకట సీతారామశాస్త్రి, సుందరశర్మ, శ్రీనివాస్



టైటిల్ ముద్రణకు సహకరించినవారు

శ్రీ కమ్మిల వెంకటేశ్వరరావు దంపతులు

శ్రీనివాస ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ.

కీ॥శే॥ పరుచూరు నాగేశ్వరరావు గారు

వారి జ్ఞాపకార్థం

ట్రైటిల్ బోర్డు ఇచ్చినవారు

కుమారులు :

శ్రీయుతులు వెంకటమోహన్ బాబా

వెంకటరామ సురేష్

కీ॥శే॥ కోడిదాసు సోమేశ్వరరావు

వారి జ్ఞాపకార్థం

ప్రింటింగ్ ఖర్చులు ఇచ్చినవారు

కుమారులు :

శ్రీయుతులు శ్రీనివాస్, సత్యనారాయణ (చినబాబు)

భవాని, విశాలాక్షి

ఎందరో మహానుభావులు

విరాట పర్వం ఇలా సర్వాంగసుందరంగా సకల జనహితంగా తీర్చిదిద్దడానికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను మాకు సహకరించిన డాక్టర్ కాళ్లకూరి అన్నపూర్ణ, డాక్టర్ రేమెళ్ల వేంకట రామకృష్ణ శాస్త్రి, డాక్టర్ చిర్రావూరి శివరామకృష్ణ శర్మ, డాక్టర్ ధూళిపాళ రామకృష్ణ, డాక్టర్ చిలకమర్తి దుర్గాప్రసాదరావు, డాక్టర్ ఈమని వెంకట సత్యనారాయణమూర్తి, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గార్లకు మా హృదయపూర్వక కృతాజ్ఞతాంజలులు సమర్పిస్తున్నాము.

ఏ పనికైనా భగవంతుని ఆశీస్సులతో పాటు మానుషదైవముల సహాయ సహకారాలు కూడా అవసరమే. కొంతమంది అవ్యక్తముగా వెనక వుండి సత్ కార్యక్రమ నిర్వహణం చేయడంలో సిద్ధహస్తులై ఉంటారు. వారు భగవదాదేశాన్ని పాటిస్తున్నట్లు తమంతా తామే దైవం మానుషరూపేణా అన్నట్లు వచ్చి అవ్యక్తముగా సహకరిస్తారు. అది అభిగమ్యకృతే దానం అన్నట్లుగా నిర్వహింపబడుతుంది. అటువంటి అవ్యక్త సుందరులు మా కరెడ్ల సుందరశర్మ గారు. వారు దీనివెనుక వెన్నెముకలా వుండి సర్వంతానే అయి వ్యవహరించారు. ఈ విషయంలో మేము వారికి కృతాజ్ఞతాబద్ధులమై నిలుస్తున్నాము. అటువంటి పెద్దల సహకారంతో **శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్** ఏర్పడినది.

పంచమవేదమూ, సకలశాస్త్రసారమూ, భారతీయ సంస్కృతికి మూలకందమూ అయిన వ్యాసభారతం మొత్తం పద్దెనిమిది పర్వాలు యథాతథంగా, ఉన్నదిఉన్నట్లుగా సరళమైన తెలుగు వ్యావహారిక భాషలో

సామాన్యపాఠకులకు కూడా అర్థమయ్యేటట్లు తక్కువ వెలలో అందించాలని మా సంకల్పం.

ఈ ఆశయాలతో భారతీయ తత్త్వానికి, ఆధ్యాత్మిక తత్త్వానికి, సాహిత్య వైభవానికి సంబంధించిన గ్రంథాలను ముద్రించి తక్కువ వెలలో ప్రజలకు అందివ్వాలని మా ఆకాంక్ష. దీనిని ఆదరించే అభిమానులందరు మా కృతజ్ఞతకు పాత్రులు. ఈ సంస్థ వివిధ పదవులలో పాలుపంచుకుంటున్న పెద్దలు...

1.	గౌరవాధ్యక్షులు	శ్రీ కరెడ్ల సుందరశర్మ
2.	అధ్యక్షులు	డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
3.	ఉపాధ్యక్షులు	డా సూరం శ్రీనివాసులు
4.	కార్యదర్శి	డా॥ పాలపర్తి శ్యామలానందప్రసాద్
5.	కోశాధికారి	డా ధూళిపాళ రామకృష్ణ
6.	సహాయకార్యదర్శి	డా॥ ఉపద్రష్ట వెంకట రమణమూర్తి
7.	కార్యవర్గసభ్యులు	శ్రీ యండూరి గోవిందరావు
8.	।,	శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి
9.	।,	శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి

అందరికీ వందనాలు

కార్యదర్శి
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

చదివి ముందుకు సాగండి

మనిషికి కోరికలు సహజాతాలు. కోరికలు తీర్చుకొనే ప్రయత్నం సహజాతం. కోరికలు తీరినా, తీరకున్నా ఏదో ఒక దశలో ఏదో ఒక కారణం వల్ల కోరికలు దూరం కావాలన్న ఆలోచనా సహజం. ఈ ప్రవృత్తిని అధ్యయనం చేసి, ఆనుపానులు గ్రహించి మహర్షులే మార్గదర్శనం చేశారో, వారి బోధనలు గ్రహించి మనిషే అలా మారాడో కానీ భారతీయులు ఆ ప్రవృత్తికి అద్భుతంగా స్పష్టంగా రూపకల్పన చేసికొన్నారు. ఆ ప్రవృత్తినే నాలుగుగా విభజించి పురుషార్థాలని పేరు పెట్టుకొన్నారు. అవే ధర్మ - అర్థ - కామ - మోక్షాలు. వాఙ్మయమంతా ఏదో ఒక కోణంలో ఈ అంశాలనే ప్రస్తావిస్తుంది. ప్రస్తుతిస్తుంది. వాటిలో తలమానికం, ఆ వాఙ్మయానికి మూలకందం శ్రీమహాభారతం. దానికి స్రష్ట, ద్రష్ట, కర్త అన్నీ వ్యాసమహర్షియే. పురుషార్థాలకు సంబంధించి భారతంలో ఉన్నదే మరెక్కడయినా ఉంటుందని, ఇక్కడ లేనిది మరెక్కడ ఉండదని ఘంటాపథంగా చెప్పగలిగాడు వ్యాసమహర్షి.

వేదశాస్త్రాలు దేవఋణం, పితృఋణం, ఋషిఋణమని మూడు ఋణాలతో మనిషి జన్మిస్తాడని చెప్తే వ్యాసమహర్షి మనుమార్గంలో మనుష్యఋణాన్ని కూడా చెప్పారు. సామాజికదృష్టిలో ఇది చాలా అద్భుతమూ, ఆదరణీయమూ, ఆచరణీయమూ అయిన అంశం. ఆ మనుష్యఋణాన్ని తీర్చుకొనే మార్గంలో ఆనృశంస్యాన్ని (భూతదయ) ఉద్బోధించారు వ్యాసమహర్షి. ప్రాణులన్నింటిపై కరుణ చూపగలగటమే మనుష్య ఋణవిముక్తికి మార్గం. ఆ విలువను ప్రతిపాదించటానికి తనవారినే భీష్మ, ధర్మరాజ; ధృతరాష్ట్ర, దుర్యోధనులు ప్రతినిధులనుగా స్వీకరించి భారతాన్ని నిర్మించాడు. తానూ ఆ మహానిర్మాణంలో పాత్ర అయి, తన వారిలోని గుణదోషాలనే హేతుబద్ధంగా ప్రస్తావిస్తూ మనిషి ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో **స్పష్టారుంధతీన్యాయంగా** భారతంలో ప్రదర్శించాడు వ్యాసమహర్షి. అన్నమాటకు ఒదిగి ఉండటంతో ఫ్లాటు అమ్మమాటకు విలువనివ్వటాన్ని కూడా మానవజాతికి నేర్పాడు. దానికి ఇబ్బంది కలుగుతున్న స్థితిలో తానే స్వయంగా వచ్చి పరిష్కరించాడు (పాండవులందరూ

ద్రౌపదిని పెళ్ళి చేసికొనే విషయంలో ద్రుపదుని ఒప్పించి). అమ్మమాటమేరకు తనకవసరం లేకున్నా బిడ్డలను కన్నాడు. తలచుకొంటే చాలు ప్రత్యక్షమవుతానని అమ్మకు మాట ఇచ్చి దాన్ని నిలబెట్టుకొన్నాడు. మానవుడు సంపాదించవలసిన వాటిల్లో ధనం ముఖ్యం అనుకొంటాం. అంతకన్న ముఖ్యం తపస్సు. లోకకళ్యాణంకోసం ఆ తపస్సును కూడా ఖర్చుచేయటానికి వెనుదీయనివాడు వ్యాసుడు. అందుకే అందరికీ కనువిప్పు కల్గించటానికి భారతమృతవీరులను కూడా చూపించారు.

మహాభారతం మానవజీవనగమనంలో కరదీపిక. ధర్మాధర్మనిర్ణయంలో ఒరపిడిరాయి. కర్తవ్యాకర్తవ్యజ్ఞానాన్ని ఉపదేశించడంలో ఒక ఉత్తమగురువు. నిరాశకు లోను కాకుండా మనిషి బ్రతకటానికి ఒక ఒరవడి. అదుపులేని, అలవిమాలిన ఆశలను తెంచుకోవటానికి ఒక కొడవలి. తనను తాను సజీవశిల్పంగా తీర్చిదిద్దుకొవటానికి ఒక ఉలి.

అయినా భాషకారణంగా దానిని ప్రేమించే వారు, సంశయించే వారు కూడా చాలామంది దానిని చదవలేకపోతున్నారు. అందుకే తెలుగు వారికి ఆ వ్యాసభావాలను యథాతథంగా అందించేందుకే ఈ ప్రయత్నం - వ్యాస మహాభారతం (తెలుగు వచనం).

రామాయణ మహాభారతాలను ఆధ్యాత్మికవాదులు నెత్తికెత్తుకొని మోయటం ప్రారంభమైన తరువాత ఇవి ముసలివాళ్ళకు సంబంధించినవి అన్న భావం లోకంలో ప్రబలింది. ఇది దురదృష్టకరం. యౌవనంలోనే వీటిని చదువగలిగితే జీవితాన్ని సరిగా నడుపుకొనే జవజీవాలు గలుగుతాయి. సర్వమానవసౌభ్రాత్రం, సర్వప్రాణిసమత్వం మనస్సులో మెదిలి నిష్కల్మషంగా నడువగల ప్రవృత్తి కలుగుతుంది. ఇహలోకానికి ఇంతకంటే ఏం కావాలి...?

ఇట్లు
అనువక్తలు

★ మహాభారతం యథాతథంగా అనగా అధికపాఠాలతో సహా ఇచ్చాం. అధికపాఠాలు చిన్నసైజులో బ్రాకెట్లలో ఇచ్చాం.

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
	1. పాండవప్రవేశ పర్వము - 12	
1.	పాండవులు అజ్ఞాతవాసమునకు రహస్య సమాలోచనము చేయుట. (28+6 $\frac{1}{2}$)★	15
2.	భీమార్జునులు విరాటనగరములో తాము చేయు పనులను తెలుపుట. (32+1)	17
3.	నకులసహదేవులు, ద్రౌపది తమ భావి కార్యక్రమమును సూచించుట. (23+2 $\frac{1}{2}$)	18
4.	ధౌమ్యుని ఉపదేశము. (58)	20
5.	పాండవులు తమ ఆయుధములను శమీవృక్షముపై ఉంచుట. (36)	24
6.	యుధిష్ఠిరుడు దుర్గాదేవిని స్తుతించుట - ఆమె వరమిచ్చుట. (35)	26
7.	యుధిష్ఠిరుడు రాజసభలో ప్రవేశించుట. (18)	29
8.	భీమసేనుడు విరాటరాజు సభలో ప్రవేశించుట. (13)	31
9.	ద్రౌపది సైరంధ్రివేషములో విరాటుని రాణివాసము చేరుట. (37)	32
10.	సహదేవుడు గోపాలక వేషములో విరాటుని కొలువు చేరుట. (16)	35
11.	అర్జునుడు విరాటుని కొలువులో కన్యలకు నృత్యము నేర్పుటకు నియుక్తు డగుట. (14+4 $\frac{1}{2}$)	36
12.	నకులుడు అశ్వశిక్షకుడుగ నియుక్తు డగుట. (13+2) .	37
	2. సమయపాలన పర్వము - 1	
13.	భీమసేనుడు జీమూతమల్లుని వధించుట. (46)	39
	3. కీచకవధ పర్వము - 11	
14.	కీచకుడు ద్రౌపదిని మోహించుట, ఆమె తిరస్కరించుట. (52+12)	41
15.	సుదేష్ణ కీచకుని ఇంటికి ద్రౌపదిని పంపుట. (21+25)	46
16.	కీచకుడు ద్రౌపదిని అవమానించుట. (51+92)	49

★ బ్రాకెట్లలోని మొదటి సంఖ్య సంస్కృతంలో ఆ అధ్యాయంలోని శ్లోక సంఖ్య రెండవ సంఖ్య అధికపాఠశ్లోక సంఖ్య

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
17.	ద్రౌపది భీమసేనుని వద్దకు వెళ్లుట. (21)	58
18.	ద్రౌపది భీముని ఎదుట తన దుఃఖమును వెల్లడించుట. (33+13 $\frac{1}{2}$)	59
19.	పాండవుల కష్టములను తలచుకొని ద్రౌపది దుఃఖించుట. (47+5)	63
20.	ద్రౌపది తన కష్టమును భీమునకు తెలుపుట. (31)	66
21.	భీముడు ద్రౌపదిని ఓదార్చుట. (51+2)	68
22.	భీమకీచకుల యుద్ధము, కీచకవధ. (94+2 $\frac{1}{2}$)	72
23.	ఉపకీచకులు సైరంధ్రిని బంధించి శ్మశానభూమికి తీసుకొని పోవుట. (34)	78
24.	ద్రౌపది బృహన్నలతో సంభాషించుట. (30+4)	80
	4. గోహరణ పర్వము - 45	
25.	దుర్యోధనుని వేగులు పాండవుల జాడతెలియక, తిరిగివచ్చుట. (22+6)	82
26.	దుర్యోధనుడు పాండవుల ఉనికిని గూర్చి సభాసదులతో ఆలోచించుట. (18)	84
27.	ద్రోణుని అభిప్రాయము. (10)	85
28.	భీష్ముడు ధర్మరాజు మహిమను చెప్పుట. (33)	86
29.	కృపాచార్యుని సమ్మతి - దుర్యోధనుని నిశ్చయము. (14+20)	88
30.	సుశర్మ దక్షిణగోగ్రహణము చేయుట. (27)	91
31.	పాండవులు నలుగురు విరాటుని సైన్యముతో యుద్ధమునకు వెళ్లుట. (35+13)	93
32.	మత్స్య త్రిగర్త సేనలమధ్య యుద్ధము. (30+4)	95
33.	పాండవులు సుశర్మను ఓడించి విరాటుని విడిపించుట. (61+2)	98
34.	విరాటుడు పాండవులను మెచ్చుకొనుట, నగరములో రాజు విజయమును చాటించుట. (19+6 $\frac{1}{2}$)	102
35.	కౌరవులు ఉత్తరగోగ్రహణము చేయుట. (22)	103
36.	ఉత్తరుడు సారథికొఱకు వెదకుట, ద్రౌపది బృహన్నలనుగూర్చి చెప్పుట. (24)	105

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
37.	ఉత్తరుడు బృహన్నలను సారథిగా చేసుకొని యుద్ధమునకు వెళ్ళుట. (34)	106
38.	ఉత్తరుడు భయపడుట, అర్జునుడు ధైర్యము చెప్పుట. (51+9 $\frac{1}{2}$)	108
39.	ద్రోణాచార్యుడు అర్జునుని ప్రశంసించుట. (17)	111
40.	ఆయుధములను దింపుమని అర్జునుడు ఉత్తరుని ఆదేశించుట. (8+1 $\frac{1}{2}$)	113
41.	ఉత్తరుడు శమీవృక్షము నుండి ఆయుధములను దింపుట. (12)	113
42.	పాండవుల ఆయుధములను చెప్పుమని ఉత్తరుడు కోరుట. (18)	114
43.	బృహన్నల ఉత్తరునికి పాండవుల ఆయుధములను తెలుపుట. (23)	115
44.	అర్జునుడు ఉత్తరునికి పాండవులను తెలుపుట. (25+1 $\frac{1}{2}$)	117
45.	అర్జునుడు యుద్ధసన్నద్ధుడై, ఉత్తరుని భయమును పోగొట్టుట. (41+6)	118
46.	అర్జునుడు రథమెక్కి శంఖము నూదుట, ద్రోణాచార్యుడు కౌరవులకు అపశకునముల నెఱిగించుట. (33+2 $\frac{1}{2}$)	121
47.	దుర్యోధనుడు యుద్ధము చేయుటకు నిశ్చయించుట. (34)	124
48.	కర్ణుని అహంకారపుమాటలు. (23)	126
49.	కృపాచార్యుడు కర్ణుని అధిక్షేపించుట. (23)	128
50.	అశ్వత్థామ కోపము. (28)	130
51.	భీష్ముడు అందరిని శాంతింపజేయుట, ద్రోణుడు దుర్యోధనుని రక్షింపవలెనని చెప్పుట. (22)	132
52.	భీష్ముని అంగీకారము. (23+4 $\frac{1}{2}$)	134
53.	అర్జునుడు కౌరవసైన్యమును ఆక్రమించి గోవులను మరల్చుట. (25+1 $\frac{1}{2}$)	136
54.	కర్ణార్జునులయుద్ధము – కర్ణుడు ఓడి, పారిపోవుట. (36)	138
55.	అర్జునుడు కృపాచార్యునితో యుద్ధము చేయుట. (60)	141
56.	కృపార్జునుల యుద్ధమును చూచుటకు దేవతలు వచ్చుట. (19)	145

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
57.	కృపాచార్యుడు యుద్ధభూమినుండి తొలగుట. (43)	146
58.	అర్జునుడు ద్రోణునితో యుద్ధము చేయుట. (76)	149
59.	అశ్వత్థామతో అర్జునుడు యుద్ధము చేయుట. (21)	154
60.	కర్ణార్జునుల సంవాదము - కర్ణుడు పారిపోవుట. (27)	155
61.	అర్జునుడు దుశ్శాసనాదులను ఓడించుట. (46)	157
62.	అర్జునుడు కౌరవయోధులందరితో యుద్ధముచేయుట. (22)	160
63.	కౌరవులు యుద్ధమునందు వెన్నుచూపుట. (14)	162
64.	అర్జునుడు భీష్మునితో యుద్ధము చేయుట, భీష్ముడు ఓడిపోయి తొలగుట. (49)	163
65.	అర్జునుడు దుర్యోధనునితో యుద్ధము చేయుట - దుర్యోధనుడు పారిపోవుట. (18)	166
66.	కౌరవులందరు ఓడిపోయి వెనుదిరుగుట. (30)	167
67.	అర్జునుడు విజయుడై రాజధానికి మరలుట. (23+2 $\frac{1}{2}$)	170
68.	విరాటుడు ఉత్తరుని గురించి చింతించుట - ఉత్తరుడు నగరప్రవేశము చేయుట. (76+3)	172
69.	గెలుపును గూర్చి విరాటోత్తరుల సంభాషణ. (19)	178
	5. వైవాహిక పర్వము - 3	
70.	అర్జునుడు విరాటునకు ధర్మరాజును గూర్చి తెలుపుట. (28)	180
71.	విరాటుడు మిగిలిన పాండవులను తెలిసికొనుట. (36)	182
72.	ఉత్తరాభిమన్యుల వివాహము. (40)	185

। శ్రీమాత్రే నమః ।

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
విరాట పర్వం

1. పాండవులు అజ్ఞాతవాసమునకు రహస్య సమాలోచనము చేయుట.

విశ్వరూపుడైన నారాయణునికీ, నరశ్రేష్ఠుడయిన అర్జునునికీ, సరస్వతీదేవికీ, వ్యాసమహర్షికీ నమస్కరించి జయాన్ని (శ్రీమహాభారతాన్ని) పఠించాలి. జనమేజయుడు వైశంపాయనుని ఇలా ప్రశ్నించాడు. 'బ్రహ్మజ్ఞానీ! నా ముత్తాత లయిన పాండవులు దుర్యోధనునివల్ల భయంతో అజ్ఞాతవాసం ఎలా గడిపారు? కష్టాలలో ఉన్నా హరిస్మరణం విడువని పతివ్రత ద్రౌపది అజ్ఞాతంగా ఎలా ఉండగలిగింది?'

వైశంపాయను డిలా చెప్పాడు. 'రాజా! నీ ముత్తాతలు విరాటుని నగరంలో అజ్ఞాతవాసం ఎలా గడిపారో చెపుతా విను. ధార్మిక శ్రేష్ఠుడయిన ధర్మరాజు ధర్మదేవత నుండి వరాలు పొంది, ఆశ్రమానికి వెళ్లి, జరిగిన దంతా బ్రాహ్మణులకు చెప్పి, అరణులు రెండూ ఆ బ్రాహ్మణునకు ఇచ్చివేశాడు. జనమేజయా ! తరువాత మహామనస్వి అయిన ధర్మరాజు తన తమ్ముల నందరినీ ఒకచోట చేర్చి, ఇలా అన్నాడు. 'ఈపన్నెండు సంవత్సరాలూ మనం రాజ్యంనుండి దూరమైనాము. ఇపుడు పదమూడో వత్సరం వచ్చింది. ఇది కష్టాతికష్ట మయినది. అర్జునా! శత్రువులకు తెలియకుండా ఈ సంవత్సరం మనం ఎక్కడ నివసించాలో ఆలోచించు.' అర్జునుడిలా అన్నాడు. 'రాజా! ఆ యమధర్మరాజు ఇచ్చిన వరప్రభావంచేతనే నరులకు తెలియ కుండా సంచరించగలం. ఇందులో సందేహం లేదు. మన నివాసానికి కొన్ని ప్రదేశాలు (రాష్ట్రాలు) చెపుతాను. అవి రమణీయాలు. రక్షణ కలవి. వాటిలో ఒకటి నిశ్చయించు. కురు రాష్ట్రానికి చుట్టూరా రమ్యమైన జనపదాలు ఉన్నాయి-అవి సస్యసంపన్నాలు. సుభిక్షాలు. పాంచాల, చేది, మత్స్య, శూరసేన, పటచ్చర, దశార్ణ, నవరాష్ట్ర, మల్ల, శాల్వ, యుగంధర,

విశాల, కుంతిరాష్ట్ర, సౌరాష్ట్ర, అవంతీ రాష్ట్రాలు వాని పేర్లు. రాజా! వీనిలో మనం ఈ సంవత్సరం ఏ రాష్ట్రంలో నివసించటం నీకు ఇష్టం?' ధర్మరాజు చెప్పాడు. "అర్జునా! ఇది నేను పూర్వమే విన్నాను. సర్వభూతేశుడూ, భగవంతుడూ అయిన ఆ ధర్మదేవత చెప్పినది చెప్పినట్లే జరుగుతుంది. నివసించటానికి రమణీయమూ, శుభంకరమూ, సుఖప్రదమూ అయిన ప్రదేశం కావాలి. అందరమూ కలిసి ఆలోచించి, అచట నిర్భయులమై నివసించాలి. మత్స్యదేశపురాజు విరాటుడు చాలా బలవంతుడు. మన మీద అనురాగం కలవాడు. ధార్మికుడు, వితరణశీలి, పెద్దవాడు. సతతం ప్రియమొనరించే వాడు. అర్జునా! ఈ సంవత్సరం మనం విరాటనగరంలో నివసిస్తూ అతనికి సేవలు చేసిపెడుతూ ఉందాం. ఆ మత్స్యరాజు విరాటుని దగ్గర చేరి ఏఏ పనులు చేస్తామని చెపుదామో చెప్పండి". అప్పుడు అర్జునుడు ఇలా అడిగాడు. 'రాజా! ఆ విరాటుని రాజ్యంలో నీవు ఎట్లా సేవ చేస్తావు? నీ కే పని చేయడం యిష్టం? నీవు మృదుస్వభావుడవు. దానపరుడవు. లజ్జాశీలివి. ధార్మికుడవు. సత్యపరాక్రముడవు. పైగా నీవు ఆపదలలో చిక్కుకొన్నావు. నీ వే పని చేస్తావు? సామాన్యమానవుని వలె నీకు కొద్దిపాటి దుఃఖం కూడ తెలియదు. అట్టి నీవు ఈ ఘోరమైన ఆపదనుండి ఎలా గట్టెక్కుతావు?'

ధర్మరాజు ఇలా చెప్పాడు. "నేను పాచికలాట ఎరుగుదును. దాని మీద కాస్త మక్కువ కూడా. కంకుడనే ద్విజుడనై మహాత్ముడయిన ఆ రాజసభలో ఒక గౌరవసభ్యుడ నవుతాను. వైడూర్యాలతోను, బంగారంతోను, దంతంతోనూ చేసిన నలుపు, ఎరుపు రంగులుకల అందమైన పాచికలను, మణులు పొదిగిన ఫలకాలను కొనిపోయి పాచికలాట ఆడగలను. మంత్రులు, బంధువులతోకూడిన విరాటునితో ఆడుతూ ఆ రాజును సంతోషపెడతాను. అపుడు నన్ను ఎవరూ తెలుసుకోలేరు. ఆ రాజు నన్ను నీవు పూర్వం ఎక్కడుండే వాడ వని అడిగితే 'నేను పూర్వం ధర్మరాజుకు ప్రాణ స్నేహితుడిగా ఉన్నాను' అని చెపుతాను. "

(ధర్మరాజు తన ప్రవర్తనను నిర్దేశించి భీమునితో ఇలా అన్నాడు. నీవు మత్స్యదేశంలో ఏ పని చేస్తావు? గంధమాదన పర్వతం మీద క్రోధవశులనే యక్షులనూ, మహాపరాక్రమ వంతులైన, రాక్షసులనూ చంపి ఎన్నో పద్మాలను ద్రౌపదికి ఇచ్చావు. ఏకచక్రపురంలో బ్రాహ్మణుని కోసం నరభక్షకుడయిన బకు డనే రాక్షస రాజును చంపావు. ఏకచక్రపురాన్ని నీవు క్షేమకరమూ, నిర్భయమూ చేశావు. హిడింబుని, కిర్మీర రాక్షసుని చంపి వనం నిష్కంటకం చేశావు.)

ద్రౌపది ఆపదలో చిక్కు కొన్నపుడు జటాసురుని సంహరించి ద్రౌపదిని విడిపించావు. అంతటి పరాక్రమశాలివి నీవు. నీకు కోపం ఎక్కువ. భీమా! మత్స్యరాజు దగ్గరకు ఎలా చేరుతావు? ఎలా ఉంటావు?'

2. భీమార్జునులు విరాటనగరములో తాము చేయుపనులను తెలుపుట.

భీము డిలా చెప్పాడు. "నేను వంటవాడి ననీ, నా పేరు వల్లవుడనీ చెపుతూ విరాటరాజును చేరాలని నా ఉద్దేశం. నేను వంటలలో నేర్పరిని. సుశిక్షితు లయిన వారు చేసిన వంటకాలను మించి రుచికరంగా చేసి, ఆ విరాటునికి సంతోషం కలిగిస్తాను. పెద్దపెద్ద కట్టెలమోపులను సయితం మోసి తీసుకువస్తాను. మానవాతీతాలయిన ఆ పనులు చూసి రాజు అటువంటి పనులకు నన్నే నియోగిస్తాడు. భక్ష్యాన్నాలకూ, రసపానీయాలకూ నేను అధిపతి నవుతాను. బలిష్ఠాలైన ఏనుగుల్ని కానీ, ఎద్దుల్నిగానీ ఎదుర్కొనవలసివస్తే వాటిని ఎదుర్కొంటాను. మల్లులు ఎవరయినా వస్తే వారితో నేను యుద్ధం చేసి మహారాజుయొక్క కోరిక తీరుస్తాను, ఉత్సాహం వృద్ధిపరుస్తాను. అంతేకాని వారితో యుద్ధం చేస్తూ వారిని చంపను. చనిపోకుండా, ఊపిరిమాత్రం మిగిల్చి పడగొడతాను. రాజు అడిగితే పూర్వం నేను ధర్మరాజు దగ్గర మత్తగజాలకు మావటీడుగానూ, పొగరుబోతుగిత్తలను విడదీసే వాడిగానూ, వంటచేసేవాడుగానూ, మల్లుని గానూ ఉండేవాడ' నని చెపుతాను. మహారాజా! నన్ను నేను రక్షించుకొంటూ సంచరింపగల నని తెలిసి సంచరిస్తాను."

ఈ మాట విని ధర్మరాజు ఇలా అడిగాడు. 'అగ్నిహోత్రుడు బ్రాహ్మణ రూపం ధరించి వచ్చి కృష్ణసహితుడయిన అర్జునుని ఖాండవవనం దహించటానికి వర మడిగాడు గదా! అటువంటి బలవంతుడు, అర్జునుడు ఇపుడు విరాటుని దగ్గర ఏ పని చేస్తాడు? నాగులనూ, రాక్షసులనూ చంపి, రథమాత్ర సహాయంతో ఇంద్రుని జయించి, దావాగ్నితో అగ్నిహోత్రుని సంతృప్తిపరచినవాడు అర్జునుడు. సర్పరాజయిన వాసుకి యొక్క చెల్లెలు ఉలూపి(మనసు)ని హరించిన యోధాగ్రేసరుడు అర్జునుడు. ఇపుడు విరాటునికి ఎలా సేవ చేస్తాడు? వైభవంలో ఇంద్రునికి తీసిపోనివాడూ, కృష్ణునితో సమానమైన తేజస్సుకలవాడూ, గాండీవధారీ, అయిన అర్జునుడు (ఈ విరాటుని దగ్గర) ఏం చేస్తాడు? ఇంద్రుని యింట్లో అయిదేళ్ళుండి, మానవులను

ఆశ్చర్య పరిచే దివ్యాస్త్రాలు సాధించాడు అర్జునుడు. అర్జునుడు రుద్రులలో పన్నెండవవాడు. ఆదిత్యుల్లో పదమూడోవాడు. వసువుల్లో తొమ్మిదోవాడు. అట్లే గ్రహాల్లో పదోవాడు అని అనుకొంటాను. పర్వతాల్లో హిమవంతునిలా, నదుల్లో సముద్రంలా, దేవతలలో ఇంద్రునిలా, అగ్నులలో హవ్యం మోసుకుని వెళ్ళే అగ్నిహోత్రునిలా, మృగాల్లో పెద్దపులిలాగా, పక్షులలో గరుత్మంతునిలాగా, యుద్ధవీరుల్లో అర్జునుడు శ్రేష్ఠుడు. అటువంటి అర్జునుడు విరాటుని దగ్గర ఏవిధంగా సేవచేస్తాడు?'

అపుడు అర్జునుడిలా అన్నాడు. 'రాజా! రాజసభలో నేను పేడి నని చెపుతాను. నాచేతుల కిణాంకాలు (వింటినారితో చేతికైన దెబ్బల కాయలు) చాలా పెద్దవి. దాచుకోవటం చాలా కష్టం. చేతులకున్న ఈ కిణాంకాలను గాజులతో దాచుకొంటాను. అగ్నిలా ప్రకాశించే కుండలాలు చెవులనుండి తీసి వేసి చేతులకు శంఖాల గాజులు తొడుగుకొంటాను. తృతీయ ప్రకృతి (పేడితనం) పొందుతాను. శిరోజాలు జడ అల్లుకుని బృహన్నల అని పేరు చెప్పుకొంటాను. స్త్రీ భావంతో పలుమార్లు ఆఖ్యాయికలు (పూర్వరాజుల చరిత్రలు) పాడుతూ రాజునూ, ఇతర అంతఃపురజనుల్నీ సంతోషపెడతాను.

విరాటుని పురస్త్రీలకు గీతాలూ, విచిత్రమయిన నృత్యమూ, అనేక విధాలయిన వాద్యాలు - వీటిలో శిక్షణ ఇస్తాను. రాజా! బహువిధాలయిన పనుల సదాచారం ప్రజలకు తెలుపుతూ మాయతో నన్ను నేను గోప్యంగా ఉంచుకొంటాను. రాజా! విరాటరాజు అడిగితే "నేను పూర్వం ధర్మరాజు భవనంలో ద్రౌపదీ దేవికి పరిచారికగా ఉండేదాన్ని" అని చెపుతాను. రాజా! ఈవిధంగా నివురు గప్పిన నిప్పులాగా విరాటుని అంతఃపురంలో సుఖంగా సంచరిస్తాను.'

3. నకులసహదేవులు, ద్రౌపది తమ భావి కార్యక్రమమును సూచించుట.

ధర్మరాజు "నకులా! నీవు విరాటుని నగరంలో చేసే పనినిగురించి చెప్పు. నీవు సుకుమారుడవు, శూరుడవు, అందమైనవాడవు. సుఖభోగాలు అనుభవింపదగిన వాడవు." అనగానే

నకులు డన్నాడు. 'నేను విరాటమహారాజుకు అశ్వబంధకుడ (గుర్రాలను అదుపు చేసే వాడిని) నవుతాను. గుర్రాల రక్షణలో నేర్పరిని. గుర్రాల గురించి అన్ని విధాలయిన జ్ఞానమూ నాకుంది. గ్రంథికుడనే పేరుతో వ్యవహరిస్తాను. ఈ పని

నాకు చాలా ఇష్టం. అశ్వశిక్షణలో నేను నేర్పరిని. అలాగే అశ్వచికిత్స కూడా బాగా తెలుసు. నాకు గుర్రాలంటే నీవలెనే చాలా ఇష్టం. మహారాజా! విరాటనగరంలో జనులు నన్ను అడిగితే వారికి "నేను పూర్వం ధర్మరాజుచేత అశ్వాల అధికారిగా నియమింపబడిన వాడను" అని చెప్పి విరాటనగరంలో ఎవరికీ తెలియకుండా సంచరిస్తాను.'

అపుడు ధర్మరాజు ఇలా అన్నాడు. 'సహదేవా! ఆ విరాటుని దగ్గర నీ వేపని చేస్తూ ప్రచ్ఛన్నంగా (ఇతరులకు తెలియకుండా) సంచరిస్తావు?' సహదేవుడిలా అన్నాడు. 'విరాటరాజు దగ్గర గోపరీక్షకుడ నవుతాను. నేను ఆవులను రక్షిస్తాను. పాలు పితుకుతాను. గోవులను పరీక్షించడంలో నేను నేర్పరిని. తంతిపాలుడనే పేరుతో ప్రసిద్ధుడనై నేను నేర్పుతో (ఎవరూ గుర్తించకుండా) సంచరిస్తాను. నీవు మనోవ్యధ విడిచిపెట్టు. పూర్వం గోవిషయంలో నీచేత నేనే నియోగింపబడే వాడిని. అందులో నా నేర్పు నీకు తెలిసినదే కదా! ఆవుల లక్షణమూ, సంచారమూ, వాటి మేలు, అంతా నాకు తెలుసును. రాజా! ఇంకా చాలా విషయాలు తెలుసు. మంచి లక్షణాలు గల ఎద్దులను కూడా పసికడతాను. ఏ వృషభాల మూత్రం వాసనచూస్తే గొడ్డుటావులు కూడా చూడి కడతాయో నాకు బాగా తెలుసు. ఇలా నేను గోసేవ చేస్తూ సంచరిస్తాను. సదా ఇది నాకిష్టమైనది. ప్రీతి కలిగిస్తుంది. నన్ను ఎవరూ కని పెట్టలేరు. ఈవిధంగా విరాటుని సంతోషపెడతాను.'

అపుడు ధర్మరాజు ఇలా అన్నాడు. 'ద్రౌపది మనకు ప్రియమైన భార్య. ప్రాణాలకంటె ప్రియమైనది. తల్లి వలె రక్షింపదగినది. పెద్దక్క గారి వలె పూజ్యురాలు. ద్రుపదమహారాజు కుమార్తె అయిన ఈ ద్రౌపది ఏ పని చేస్తూ సంచరిస్తుంది? ఇతర స్త్రీల వలె ఈమె ఏ చిన్న పనీ చేయడం ఎరగనిది. ఈమె చాలా సుకుమారి. నిత్యనూతన/ చిన్నది. రాజకుమారి. కీర్తిమతి. పతివ్రత. సౌభాగ్యవతి. ఈమె ఎలా సంచరిస్తుందో! ఏమో! పుట్టినప్పటినుండీ ఈమె పలువిధాలయిన పూలమాలలు, సుగంధాలు అలంకారాలు, ఎన్నోరకాల వస్త్రాలు, ధరించడం మాత్రమే ఎరుగును.' ద్రౌపది ఇలా అంది. 'రాజా! లోకంలో చాలామంది సైరంధ్రు లుంటారు. వారు రక్షణ కలిగి ఇతరుల ఇళ్లలో ప్రవర్తిస్తారు. గృహిణులు మిగిల్చిపెట్టిన ఎంగిలిలేని భోజనంచేసి వారు జీవిస్తారు. ఇలా ఇతరస్త్రీలు ప్రవర్తింపలేరని లోకుల భావన. నేను కేశాలంకరణలో

నిపుణురాల నని చెపుతూ విరాటుని అంతఃపురం చేరుతాను. రాజు అడిగితే "నేను పూర్వం ధర్మరాజు మందిరంలో ద్రౌపదికి పరిచారికగా ఉండేదాననని చెపుతాను." నీవు అడిగినట్లు ఆత్మరక్షణ కలిగి సంచరిస్తాను. యశస్విని అయిన రాణి సుదేష్ణను చేరుతాను. ఆమె నన్ను రక్షిస్తుంది. నీకు ఈవిషయమై బెంగ అవసరంలేదు.' ధర్మరాజు అపు డిలా అన్నాడు. 'ద్రౌపదీ! నీవు సద్వంశంలో పుట్టిన దానవు. శుభప్రదంగానే మాట్లాడుతావు. పాపమంటే ఏమిటోఎరగవు. పతివ్రతవు. సత్ప్రవర్తనంలో నిలిచేదానవు. పాపపు పనులు చేసే దుష్టుల బారి పడకుండా నడచుకోవాలి. కల్యాణీ! ఇతరులు నిన్ను గుర్తించకుండా ప్రవర్తించాలి.'

4. ధౌమ్యుని ఉపదేశము.

ధర్మరాజు ఇలా అన్నాడు. "విరాటనగరంలో మీరు చేయదలచిన పనులు మీరు చెప్పారు. విధినిశ్చయం వల్ల నాకు తోచినవి నేను చెప్పాను. "మనపురోహితులయిన ధౌమ్యులవారు సూద పౌరోగవులతో సహా ద్రుపదుని యింట్లో అగ్నిహోత్రాలను రక్షించాలి. ఇంద్రసేనాది సేవకులు కేవలం రథాలతో త్వరగా ద్వారకకు వెళ్లాలి" అని నాకు అనిపిస్తోంది. ఈ ద్రౌపదీ పరిచారికలంతా, మన వంటవారూ అధ్యక్షులతో సహా పాంచాలదేశానికే వెళ్లాలి. "పాండవు లేమయ్యారో తెలియదు. మమ్మల్ని ద్వైతవనంలో విడిచి వెళ్లి పోయారు" అని వీరంతా చెప్పాలి." ధౌమ్యుడిలా అన్నాడు. 'పాండవులారా! బ్రాహ్మణు లందు, స్నేహితులందు, విజయయాత్రలో, యుద్ధంలో, అగ్నుల విషయంలో శాస్త్రంలో చెప్పబడిన దంతా మీకు తెలుసు. రాజా! నీవూ, అర్జునుడూ కూడా ద్రౌపదికి రక్షణ కల్పిస్తూ ఉండాలి. లోకమర్యాద మీకూ తెలుసు. మీకు తెలిసినా హితం కోరే స్నేహితులు ప్రేమతో చెప్పాలి.ఇది సనాతన మైన ధర్మం, అర్థం, కామం కూడ. (సనాతన వర్గత్రయం సమకూరుతుంది)

అందుచేత నేను కూడ చెపుతున్నాను. దీనిలోని ఆంతర్యం తెలుసుకోండి. రాజపుత్రులారా! మీరు రాజ మందిరంలో నివసించవలసిన తీరును గురించి చెపుతాను. రాజగృహంలో సంచరించడం కష్టమని ముందుగా తెలిస్తే రాజకులంలో ప్రవేశించాక సర్వదోషాలనూ తరిస్తారు. అగౌరవం జరిగినా, గౌరవం జరిగినా, అజ్ఞాతంగా ఈ సంవత్సరం అంతా గడిపి తరువాత పదునాలుగో సంవత్సరంలో సుఖంగా జీవించండి.

రాజుగారిని చూడటానికి ముందు ద్వారపాలకుని అనుమతి పొందాలి. రాజసంపదలమీద మక్కువ పడరాదు. ఇతరులు ఆసించని ఆసనాన్నే కోరుకోవాలి. నేను రాజుకు ఇష్టుడను కదా అని రాజుగారి వాహనం కాని, శయ్య కాని, పీఠం కాని, ఏనుగును కాని, రథాన్ని కాని అధిరోహింపరాదు. అలా ఉన్న నిపుణుడే రాజు దగ్గర నివసింప గలుగుతాడు. ఎక్కడ కూర్చుంటే దుష్టులు అనుమానిస్తారో అక్కడ కూర్చుండరాదు. అటువంటి వాడే రాజభవనంలో నివసింపగలడు. రాజు అడగకుండా ఎప్పుడూ రాజుకు (కర్తవ్యం) బోధించకూడదు. ఊరకే రాజును (మౌనంగా)సేవించాలి. సమయం తెలిసికొని ప్రశంసించాలి. అసత్యం పలికే వారిని రాజులు దోషులుగా చూస్తారు. వాడు మంత్రి అయినా సరే అవమానిస్తారు. రాజుగారి భార్యలతో ఎన్నడూ సాంగత్యం చేయరాదు. అలా అంతఃపురంలో తిరిగే వారితోను, రాజుగారు ద్వేషించే వారితోనూ, రాజశత్రువులతోనూ మైత్రి చేయరాదు. చిన్న పనులయినా రాజుకు చెప్పిన తరువాతనే చెయ్యాలి. ఇలా రాజభవనంలో సంచరించేవానికి ఎప్పుడూ హాని కలుగదు. కూర్చోటానికి ఉత్తమాసనం లభించినా రాజు ఆజ్ఞాపించనంతవరకూ రాజమర్యాదను భావిస్తూ పుట్టు గ్రుడ్డివానివలె నిలవాలి. రాజాజ్ఞకై ఎదురు చూడాలి. మర్యాద మీరి ప్రవర్తించేవారు పుత్రులయినా, మునిమనుమలయినా, సోదరులయినా సరే రాజులు గౌరవించరు. రాజును అగ్నివలె, దేవుని వలె శ్రద్ధతో సేవించాలి.(అగ్నినిమరీ దగ్గర కాకుండ సేవించాలి. అలాగే రాజునూ) (దేవుడు నిగ్రహానుగ్రహ సమర్థుడు. అందుచేత రాజునూ ఆ దృష్టితోనే సేవించాలి) ఈసేవలో ఏమాత్రం కల్మషమూ, కపటమూ ఉన్నా రాజు అతనిని చంపితీరుతాడు. ఇందులో సందేహం లేదు. రాజు నియోగించిన పనినే సేవకుడు చెయ్యాలి. ఆ సేవలో ఏమరుపాటు, గర్వం, కోపం ఏమాత్రం ఉండరాదు. 'ఇది కార్యం. ఇది అకార్యం.' అని నిశ్చయింప వలసి వచ్చినపుడు సేవకుడు రాజుకు హితం, ప్రియం అయినదే చెప్పాలి. రెండూ కలిపి (హితం, ప్రియం) కుదరక పోతే ప్రియాన్ని విడిచి హితమే చెప్పాలి. రాజుకు సేవకుడు అన్ని విషయాల్లోనూ సామాన్య సంభాషణలో కూడా అనుకూలంగానే చెప్పాలి. అప్రియమైనా, అహితమైనా రాజుకు చెప్పరాదు. "నేను రాజుకు హితుడనే" అనుకొని పండితుడు స్వేచ్ఛగా ప్రవర్తింపరాదు. ఎల్లపుడూ ప్రయత్నపరుడై రాజుకు హితమూ, ప్రియమూ అయిన పనులే చేయాలి. రాజుకు ఇష్టం కాని పనులు చేయరాదు. రాజశత్రువులతో మాట్లాడరాదు.

రాజు నిర్దేశించిన కార్యం నుండి చలింపరాదు. అట్టి నేర్పరి రాజసభలో రాణిస్తాడు. తెలివిగల పండితుడు రాజుకు కుడిప్రక్కనుగాని, ఎడమప్రక్కనుగాని కూర్చోవాలి. వెనుకభాగంలో ఆయుధాలు ధరించిన రక్షకులుంటారు. (అందుచేత వెనుక భాగం పనికిరాదు) రాజు ఎదుట పెద్ద ఆసనం మీద సేవకుడు ఎప్పుడూ కూర్చుండరాదు. రాజు చూస్తూ ఉండగా సేవకుడు ఏ చిన్న పురస్కారమూ స్వీకరింపరాదు. రాజయొక్క అసత్యభాషణాన్ని ఎక్కడా బయట పెట్టరాదు.ఈ తీరు దరిద్రులకు కూడా అప్రియం కలిగిస్తుంది. రాజు విషయంలో ఇంక వేరుగా చెప్పాలా? తమ అబద్దాలు బయటపెట్టేవారిని రాజులు దూషిస్తారు. పండితుల మనుకొనే వారిని కూడా అలాగే అవమానిస్తారు. నేను శూరుడను అని గర్వపడరాదు. బుద్ధి మంతుడననీ (తెలివిగలవాడననీ) విఱ్ఱవీగరాదు. రాజుకు ప్రియమాచరించి, అతనికి ఇష్టుడు కావాలి. అపుడే భోగశాలి అవుతాడు. ఒకసారి రాజుగారి అనుగ్రహంవల్ల పొందలేని (అంతులేని) ఐశ్వర్యం పొందితే ఆ తరువాత రాజుగారి ప్రియ హితాల పట్ల అప్రమత్తుడై ఉండాలి. ఎవని కోపం చాలా కష్టం కలిగిస్తుందో, ఎవని అనుగ్రహం మహాఫలితాన్నిస్తుందో వానికి ఎంత తెలివిగలవాడైనా మనసులో కూడా కీడు తలపకూడదు. రాజు దగ్గర పెదవులు కొరకరాదు. చేతులు చాచరాదు. మోకాళ్లు చాచుకొని కూర్చోరాదు. సాగదీసి మాట్లాడరాదు. ఆవులింత/అపానవాయు విసర్జనంగాని, మాటలుగాని, నిష్ఠీవనంగాని (ఉమ్మివేయడం) ఇతరులకు తెలియకుండా మెల్లగా చెయ్యాలి. ఇతరసేవకు లెవరయినా నవ్వులపాలవుతున్నపుడు ఎక్కువ సంతోష పడరాదు. పిచ్చి వానివలె నవ్వరాదు. అతిధైర్యంతో ప్రవర్తింపరాదు. అలా ఉంటేనే గౌరవం పొందుతాడు. సంతోషాన్నికూడ మృదువైన చిరునవ్వుతో ప్రదర్శించాలి. లాభం కలిగితే పొంగిపోకుండా, అవమానం కలిగితే కుంగిపోకుండా నిత్యమూ ఏకాగ్రతతో (రాజసేవలో) ఉండేవాడు రాజసభలో చిరకాలం ఉంటాడు. రాజును కాని, రాజకుమారుని కాని సదా ప్రశంసించే వాడు మంత్రియో, ఆస్థానపండితుడో అయి రాజుకు ప్రియుడై చిరకాలం రాజసభలో మనగలుగుతాడు. మొదట రాజుచే స్వీకరింపబడిన మంత్రి అకారణంగానే బహిష్కరింపబడినా, కారాగారమం దుంచబడినా ఆ మంత్రి రాజును ద్వేషించకుండా, నిందించకుండా ఉంటే మళ్లీ సంపదను పొందుతాడు. రాజయొక్క రాజ్యమందు కానీ, కొలువులోకానీ ఉన్న నేర్పరి ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని రాజగుణాలనే

చెప్పాలి. (దోషాలు చెప్పరాదు). రాజును బలవంతంగా లొంగదీసుకోవాలనుకొనే మంత్రి ఎంతో కాలం ఆ పదవిలో నిలవడు. అతని ప్రాణాలకు కూడ ముప్పు కలుగుతుంది. ఎప్పుడైనా తన శ్రేయస్సుకు భంగం కలిగే పక్షంలో రాజుతో ఇతరులను కలవనీయరాదు, సంవాదం చేయనీయరాదు. యోగ్యవిషయాల్లో / స్థలాల్లో రాజుకు తన చాతుర్యాన్ని చూపాలి. ఉత్సాహవంతుడు, బలవంతుడు, శూరుడూ, సత్యవాదీ అయి మృదుత్వంతో, ఇంద్రియ నిగ్రహంతో రాజును ఎల్లప్పుడూ నీడవలె అనుసరించేవాడు రాజాస్థానంలో చిరకాలం ఉంటాడు. రాజు ఎవరినయినా ఎక్కడికో పంపాలనుకొన్నపుడు తానై ముందుకువచ్చి 'నే నేమి చేయ గల్గుదును' అని రాజుకు తన ఉత్సాహం తెల్పినవాడు రాజాస్థానంలో చిరకాలం ఉంటాడు. అంతఃపురకార్యాల్లో కాని, శత్రువులను జయించడం మొదలైన బాహ్యవిషయాల్లో కాని నియుక్తుడై ఎప్పుడూ చలించకుండా, సంశయించకుండా వర్తించేవాడు రాజాస్థానంలో చిరకాలం ఉంటాడు. **సేవకుడు రాచకార్యంమీద ఇతర ప్రదేశాలకు వెళ్లినపుడు ఇంటి దగ్గరమన్న భార్యాపుత్రులను/భోగాలను స్మరింపరాదు. సుఖం కోరుకొనే సేవకుడు కష్టపడి పనిచేస్తే రాజాస్థానంలో చిరకాలం మనగలుగుతాడు.*** రాజుతో సమానంగా అతిశయమైన వేషభూషణాలు ధరింపరాదు. రాజుకు మరీ సన్నిహితుడుగా ఉండరాదు. ఎక్కువగా రాజుతో ఆలోచన చేయరాదు (రహస్యం బయట పెట్టరాదు). ఇలా ఉంటే అతడు రాజుకు ప్రీతిపాత్రు డవుతాడు. రాజకార్యంలో నియుక్తుడైనవాడు రాజద్రవ్యం కొద్దిగా కూడా ముట్టుకోరాదు. అలా హరిస్తే వాడు బంధనంకాని, మరణంకాని పొందుతాడు. రాజు వాహనం కాని, వస్త్రం కాని, భూషణం కాని, మరేదైనా కాని ఇస్తే సేవకుడు దానినే నిత్యమూ ధరించాలి. అలా చేస్తే రాజుకు అతడు మిక్కిలి ఇష్టు డవుతాడు. పాండుకుమారులారా! ఈవిధంగా ప్రయత్నించి మీ మనస్సులను చిక్కబట్టుకొని ఈ సంవత్సరం ఇలా ప్రవర్తించండి. తరువాత మీ రాజ్యం పొంది మీరు యథేచ్ఛగా ప్రవర్తించవచ్చు.'

ధర్మరాజు ఇలా అన్నాడు. 'మహాత్మా! మీకు శుభమగుగాక. మేము ఇపుడు మీ శిక్షణ పొందాము. మా తల్లి కుంతీదేవి, మహాబుద్ధిశాలి విదురుడు తప్ప ఈ

---

* యో వై గృహేభ్యః ప్రవసన్ ప్రియాణాం నానుసంస్మరేత్।
దుఃఖేన సుఖమన్విచ్ఛేత్ న రాజవసతిం వసేత్ ॥ 47

విధంగా ఎవరూ చెప్పలేరు. ఈ దుఃఖంనుండి గట్టెక్కటానికి, మా ప్రయాణానికీ, జయానికీ చేయదగిన అనంతరకార్యం మీరు చేయవచ్చు.' ధర్మరాజు ఇలా చెప్పగానే బ్రాహ్మణోత్తముడయిన ధౌమ్యుడు ప్రయాణానికి అవసరమైన సర్వమూ యథావిధిగా చేశాడు. పాండవుల అగ్నిహోత్రాలను ప్రజ్వలింపజేసి సమృద్ధి, వృద్ధి, పృథివీవిజయం కలగాలని (రాజ్యలాభం) సమంత్రకంగా హోమం చేశాడు. పాండవులు అగ్నిహోత్రాలకూ, బ్రాహ్మణులకూ, తాపసులకూ ప్రదక్షిణం చేసి ద్రౌపదిని ముందు నిలిపి ఆరుగురే పయనమయ్యారు.

వీరులైన పాండవులు వెళ్లిన తరువాత జపపరుడైన ధౌమ్యుడు అగ్నిహోత్రాలు పుచ్చుకొని పాంచాలదేశానికి వెళ్లిపోయాడు. పూర్వం అనుకొన్నట్లుగా ఇంద్రసేనాదులు యాదవులను చేరి రథాలనూ, గుర్రాలనూ రక్షించుకొంటూ భద్రంగా, సుఖంగా ఉన్నారు.

5. పాండవులు తమ ఆయుధములను శమీవృక్షముపై ఉంచుట.

పాండవులు ఖడ్గాలు, అమ్ముల పొదులూ ధరించి; చేతులకూ, వ్రేళ్లకూ (రక్షణకోసమయిన) తొడుగులు దాల్చి యమునానది సమీపానికి వెళ్లారు. వారు యమునానది కుడి ఒడ్డున నడిచారు. అరణ్యవాసం ముగించి, తమరాజ్యం పొందాలనే కుతూహలంతో పాండవులు ధనుర్బాణాలు ధరించి గిరిదుర్గాల్లోనూ, వనదుర్గాల్లోనూ (బసచేస్తూ) మృగాలను వేటాడుతూ నడచి పోతున్నారు. పాండవులు అలా దశార్ణదేశానికి ఉత్తరంగా, పాంచాలదేశానికి దక్షిణంగా, యకృల్లోమ-శూరసేన దేశాలమధ్యలో పయనిస్తూ తాము వేటకాండ్రమని చెప్పుకొంటూ అడవిలోంచి మత్స్యదేశంలోకి ప్రవేశించారు. ధనుస్సులు, కత్తులు ధరించి గడ్డాలు మీసాలు పెరిగి వివర్ణులయి పాండవులు ఆ విరాటుని రాజ్యంలో ప్రవేశించారు. అపుడు ద్రౌపది ధర్మరాజుతో ఇలా అంది.

'చూడండి-ఎన్నో రకాల పంటపొలాలు, మధ్యలో ఒంటికాలి త్రోవలూ కనపడుతున్నాయి. ఇక్కడికి దూరంగా విరాటుని రాజధాని ఉండాలి అని తోస్తోంది. నాకు చాలా బడలికగా ఉంది. ఈరాత్రి ఇక్కడ బసచేద్దాం.' అపుడు ధర్మరాజు ఇలా అన్నాడు. 'అర్జునా! ఈ రోజు అడవి నుండి బయటపడి విరాటుని రాజధానిలో బసచేద్దాం. ఉత్సహించి ద్రౌపదిని ఎత్తుకొని రా.' వెంటనే అర్జునుడు భద్రగజంలాగా

ఆమె నెత్తుకొని నగర సమీపానికి తీసుకొని వచ్చి దింపాడు.

రాజధాని వచ్చాక ధర్మరాజు అర్జునునితో "ఈ ఆయుధాలను ఎక్కడ భద్రపరచి మనం పురప్రవేశం చేద్దాం? ఈ ఆయుధాలతో మనం నగరంలో ప్రవేశిస్తే ప్రజలకు భయం కలిగించిన వారమవుతాం. సందేహం లేదు. ఈ నీ గాండీవం చాలా ఘనమైనది. ప్రజలందరికీ తెలిసినది. దీన్ని తీసుకొని నగరంలోకి వెళితే వెంటనే మనల్ని ప్రజలు కనిపెడతారు. మనలో ఒకర్ని గుర్తించినా చాలు. మళ్లీ పన్నెండేళ్లు అరణ్యంలో ప్రవేశించుతాం అని ప్రతిజ్ఞ చేశాం గదా!' అర్జునుడిలా అన్నాడు. 'రాజా! ఊరి పొలిమేరలో ఉంది చక్కగా ఈ జమ్మిచెట్టు. పెద్దది. గుబురుగా ఉంది. పెద్ద పెద్ద కొమ్మలతో ఎవరూ ఎక్కరానట్లుగా భయంకరంగా ఉంది. పైగా శ్మశానానికి సమీపంలో ఉంది. ఇక్కడ ఒక్క మానవుడుకూడా కనపడటం లేదు. మనం ఇక్కడ ఆయుధాలు పెడితే మనలను ఎవరూ చూడరని నా ఉద్దేశం. ఈ చెట్టు ఎత్తైన ప్రదేశంలో మొలిచింది. త్రోవకు దూరంగా అడవిలో ఉంది. క్రూరమృగాలు, సర్పాలూ దీని నిండా ఉన్నాయి. విశేషించి చొరరాని శ్మశానానికి దగ్గరలో ఉంది. అందుచేత ఈ శమీవృక్షం మీద మన ఆయుధాలు భద్రపరచి నగరంలోకి వెళదాం. ఇలా మనం సుఖంగా ఈనగరంలో సంచరిద్దాం.' అర్జునుడిట్లా ధర్మరాజుతో చెప్పి చెట్టుమీద ఆయుధాలు నిక్షేపించటానికి మొదలుపెట్టాడు. తనకెవరూ తోడులేకున్నా దేవతలనూ, మనుష్యుల నందరినీ, దిక్కులనూ జయించేందుకు ఉపకరించినదీ, గొప్ప అల్లెత్రాటిధ్వని కలిగినదీ, బలవంతులను సయితం సంహరించేదీ, భయంకరమైనదీ అయిన గాండీవం యొక్క నారిని అర్జునుడు వదిలించాడు. కురుదేశాన్నంతనూ రక్షించిన తన వింటి యొక్క అక్షయమైన నారిని ధర్మరాజు కూడా వింటినుండి సడలించాడు. భీముడు కూడా తనవింటినారిని వింటినుండి వదిలించాడు. ఆ వింటితోనే భీముడు పాంచాలురను యుద్ధంలో జయించాడు. దిగ్విజయంలో కూడా అనేక శత్రువులను ఒక్కడే ఆ వింటితోనే నిలువరించాడు. పిడుగు పడినట్లుగా పర్వతం బ్రద్దలయినట్లుగా ఉండే ఆ వింటిధ్వని వింటే శత్రువులు యుద్ధంనుండి పారి పోయేవారు. ఆ వింటితోనే సైంధవుని (అరణ్యవాసంలో) లొంగదీసుకున్నాడు. దిగ్విజయంలో పశ్చిమదిక్కును ఏ వింటితో జయించాడో దాని నారిని నకులుడు వదిలించాడు. ఆ వంశంలో అతనితో సమానమయిన రూపం,

అందం ఎవరికీ లేదుట. అందుకే అతడు 'నకులుడు'అని సార్థకనామం పొందాడట. ఇంద్రుని వంటి శూరుడు అతడు. శాస్త్రానుసారవ్యవహర్త. సహదేవుడు దిగ్విజయంలో దక్షిణదిక్కును జయించిన తన వింటినారిని సడలించాడు. మెరిసే పొడవైన కత్తులనూ, అమ్ములపొదులనూ, చురకత్తులనుకూడా ధనుస్సులతో కలిపి కట్టారు.

తరువాత ధర్మరాజు నకులుని" వీరా!నకులా! ఈ చెట్టు ఎక్కి ధనుస్సులన్నీ దీనిపై నిక్షేపించు"అని ఆజ్ఞాపించాడు. నకులుడు చెట్టెక్కి దాని తొర్రలో స్వయంగా ధనుస్సులనూ ఇతర ఆయుధాలనూ దాచాడు. అతనికి అవి దివ్యరూపాలు అనిపించాయి. అక్కడ వాన ఏటవాలుగా పడుతుంది. అందువల్ల ఆయుధాలు తడవవు. నకులుడు వాటిని గట్టి త్రాళ్లతో కట్టాడు. ఒక మృతశరీరాన్ని ఆ చెట్టుకు కట్టారు. దూరం నుంచే దాని దుర్వాసన తగిలి ఇక్కడేదో శవం ఉందని నరులు అనుకొని ఈ జమ్మిచెట్టుకు దూరంగా తొలగిపోతారు. "ఈమె మాతల్లి నూటెనభై ఏళ్ల ముసలి" అని చెప్పుతూ ఇది మా వంశాచారమనీ, మాపూర్వు లంతా ఇలాగే చేశారనీ తమకు ఎదురుపడిన గోపాలకులకూ, గొల్లెలకాపరులకూ చెపుతూ శత్రుసంహారకు లయిన పాండవులు నగరం దగ్గరకు చేరారు.

జయుడు, జయంతుడు, విజయుడు, జయత్సేనుడు, జయద్బలుడు అని పాండవు లయిదుగురికీ (క్రమంగా) ధర్మరాజు రహస్యపు పేర్లు పెట్టాడు. ఆ తరువాత వారు తమప్రతిజ్ఞానుసారం పదమూడవ సంవత్సరం అజ్ఞాతవాసం పూర్తి చేయదలచి ఆ విరాటుని నగరంలో ప్రవేశించారు.

6. యుధిష్ఠిరుడు దుర్గాదేవిని స్తుతించుట - ఆమె వరమిచ్చుట.

రమ్య మయిన విరాటనగరానికి వెడుతూ ధర్మరాజు త్రిభువనాలకూ ఈశ్వరి అయిన దుర్గాదేవిని మనసారా స్తుతించాడు. ఆ దేవి యశోద గర్భంనుండి పుట్టినది, నారాయణునికి ప్రియమైనది, నందగోపుని వంశంలో జనించినది, అందరికీ శుభాల నిచ్చేది, వంశం వృద్ధి పొందించేది, కంసుని పారద్రోలినది, అసురులను నాశనం చేసినది, ఆకాశమీద కొట్టబడినా ఆకాశంలో పయనించినది, వాసుదేవుని సోదరి, దివ్యమైన పూలమాల, దివ్యాంబరమూ ధరించినది, ఖడ్గమును, డాలునూ, దాల్చినది. ధర్మరాజు తమ్ముళ్లతో సహా దుర్గాదర్శనాన్ని కోరుతూ దేవిని సంబోధిస్తూ అనేక

స్తోత్రాలతో స్తుతించడం ప్రారంభించాడు. భారం తగ్గించే పుణ్యమయీ! సదా శుభాల నిచ్చే నీవు నిన్ను స్మరించిన వారిని బురదలోనుండి బలహీనమయిన ఆవును పైకి లాగినట్లు ఉద్ధరిస్తావు. వరాల నొసగే నీకు నమస్కారం. నల్లని రూపుగలదానా! కుమారీ! బ్రహ్మచారిణీ! లేత సూర్యుని వంటి శరీరకాంతి కలదానా! నిండుచంద్రునితో సమానమయిన ముఖం కలదానా! నాల్గుభుజాలు కల్గి నారాయణునితోనూ, నాల్గు ముఖాలు కలిగి బ్రహ్మతోనూ సమానురాలవు. పుష్టికల జఘనం, స్తనాలు కల్గినదానా! నెమలిపించాలు నీకు గాజులు; కేయూరాలు, అంగదాలూ ధరించిన దానవు. నారాయణుని భార్య లక్ష్మీదేవి వలె ప్రకాశిస్తున్నావు. నీరూపమూ, బ్రహ్మచర్యమూ స్వచ్ఛమైనవి. నీవు ఆకాశంలో చరింపగల దేవివి. కృష్ణునితో సమానమైన శరీరకాంతి నీకుంది. అందుకే నీకు కృష్ణ అని పేరు. కాని బలరామునితో సమాన మయిన స్వచ్ఛమైన ముఖకాంతి కూడా కలిగిన దానవు నీవు. వర, అభయ ముద్రలు దాల్చి ఎత్తైన నీ విశాల బాహువులు ఇంద్రధ్వజసమానాలై యుంటాయి. మూడవ చేతిలో పాత్ర, నాల్గవ చేతిలో పద్మమూ, అయిదవ చేతిలో గంట ప్రకాశిస్తున్నాయి. ఆరవచేతిలో పాశమూ, ఏడవచేతిలో ధనుస్సు, ఎనిమిదవ చేతిలో మహాచక్రమూ ఇలా నానావిధ ఆయుధాలు కలిగి ఉన్నావు. భూమిమీద స్త్రీ యొక్క విశుద్ధరూపం అంటే నీవే. నీ చెవులు కుండలాలతో నిండుగా అలంకరింపబడ్డాయి. చంద్రునితో పోటీపడే ముఖంతో విరాజిల్లుతుంటావు. చిత్రరత్నాలు కల కిరీటంతో నీ కేశపాశం శోభిల్లుతోంది. పామువలె ఉన్న కటిసూత్రం (మొలత్రాడు) ధరించి, వాసుకితో కూడిన మందరపర్వతంలా ఉంటావు. నెమలిపించాలు ఎత్తి కట్టిన ధ్వజంతో విరాజిల్లుతావు. కౌమారం అనే బ్రహ్మచర్యవ్రత పాలనంతో స్వర్గాన్ని పవిత్రం చేశావు. అందుకే దేవీ! నీవు దేవతలచేకూడ స్తుతింపబడుతున్నావు, పూజింపబడుతున్నావు. త్రిలోకాలనూ రక్షించటానికి మహిషాసురసంహారం చేశావు. దేవతలలో శ్రేష్ఠురాలవు నీవు. నాకు ప్రసన్నురాలవై నామీద దయ చూపు. నాకు శుభ మిమ్ము. నీవే జయవు, విజయవు. యుద్ధంలో జయమిచ్చే దానవు నీవే. నాకు కూడా విజయం ఇయ్యి. ఇపుడీ వరమియ్యి. కాళీ! మహాకాళీ! ఖడ్గమూ, ఖట్వాంగమూ (పైభాగాన కపాలం కల దండం) ధరించి పర్వతశ్రేష్ఠమైన వింధ్యపర్వతం శాశ్వతనివాసంగా చేసుకొన్నావు.

నిన్ను అనుసరించేవారి కోరికలు తీరుస్తావు. నీవు కామసంచారిణివి. వరా

లీయగలవు. తమ ఆపదల భారం తీరటానికి నిన్ను స్మరించేవారికీ, ఉదయమే నీకు నమస్కరించే వారికీ పుత్రవిషయంలో కాని, ధనవిషయంలో కాని దుర్లభ మేదీ లేదు. భరింపరాని కష్టాలనుండి తరింప జేస్తావు నీవు. అందుకే ప్రజలు నిన్ను దుర్గ అంటారు. అడవుల్లో చిక్కుకొన్నవారికీ, సముద్రం దాటేవారికీ, దుర్గమ మార్గాలలో పయనించే వారికీ, క్రూరుల బారిపడినవారికీ నీవే గతి. సముద్రాలు దాటాలన్నా, అడవుల తిక్రమించాలన్నా నిన్ను స్మరించినవారు కష్టాలపాలు కారు. నీవే కీర్తివి. శ్రీ, ధృతి, సిద్ధి, లజ్జ, విద్య, సంతానం, బుద్ధి, సంధ్య, రాత్రి, తేజస్సు, నిద్ర, వెన్నెల, కాంతి, ఓర్పు, దయ మొదలైన రూపాలు నీవే. నిన్ను పూజించిన వారి బంధనం, మోహం, పుత్రశోకం, ధననాశం, రోగం, మృత్యువు, భయమూ తీరుస్తావు. అమ్మా! ఇపుడు నేను రాజ్యభ్రష్టుడ నయ్యాను. నీ శరణు వేడుతున్నాను. దేవతలకు కూడా దేవివైన నీకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నాను. నీవు పద్మపత్రాలవలె ప్రసన్నమైన కనులు కలదానవు. నన్ను రక్షించు. నీవు సత్యవు. మాకు సత్యవు (సత్పురుషులయందు సాధువు) కమ్ము. దుర్గా! నీవు శరణ్యురాలవు. భక్తులయందు వాత్సల్యం కలదానా! నాకు శరణ మగుము' అని ధర్మరాజు స్తుతించాడు. వెంటనే దేవి దర్శనమిచ్చి ధర్మరాజుతో ఇలా అంది.

'ధర్మరాజా! నామాట విను. త్వరలోనే యుద్ధంలో నీకు విజయం కలుగుతుంది. నా అనుగ్రహంతో కౌరవసేనను జయించి రాజ్యమంతా శత్రురహితం చేసికొని, నీ భూమిని నీవు మరల అనుభవిస్తావు. తమ్ములతో పుష్కలమైన సంతోషం పొందుతావు. నా అనుగ్రహం తోనే నీకు సౌఖ్యమూ, ఆరోగ్యమూ కలుగుతాయి. లోకంలో నన్ను కల్మషం లేకుండా కీర్తించే వారికి నేను (సంతోషించి) రాజ్యమూ, ఆయువూ, చక్కనిరూపమూ, సత్పుత్రునీ అన్నీ ఇస్తాను. ఊరు విడిచి ఉన్నా, నగరంలో ఉన్నా, యుద్ధంలో ఉన్నా, శత్రుబాధలో ఉన్నా, చొరరాని అడవిలో ఉన్నా, సముద్రంలో ఉన్నా, పర్వతం మీదున్నా నీవు స్మరించినట్లు నన్ను స్మరించేవారికి ఈ లోకంలో దుర్లభమైన దేదీ ఉండదు. పాండవులారా! ఈ స్తోత్రం భక్తితో పఠించినవారికీ, విన్నవారికీ, సకలకార్యాలూ సిద్ధిస్తాయి. నా అనుగ్రహంవల్ల విరాటనగరంలో (మీలో ఎవరినీ) అక్కడ కౌరవులు కానీ, ఇతరులు కానీ తెలుసుకోలేరు.' ఇలా యుధిష్ఠిరునికి వరమిచ్చి, పాండవులకు రక్షణ కల్పించి దేవి అక్కడే అంతర్ధాన మయింది.

7. యుధిష్ఠిరుడు రాజసభలో ప్రవేశించుట.

పిమ్మట పుణ్యమై; మంగళస్వరూపిణియై; మహర్షులు, గంధర్వులు సేవించే నీరుకల గంగానదిలో పాండవులు యథావిధిగా స్నానం చేసి ఋషులకూ, దేవతలకూ, పితృదేవతలకూ తర్పణా లిచ్చారు. ధర్మరాజు అగ్నిహోత్రం, జపం, మంగళకృత్యం నిర్వహించి, ధర్మదేవత ఇచ్చిన వరాన్ని స్మరించి, తూర్పుదిక్కుకు తిరిగి, చేతులుజోడించి మెల్లగా ధర్మదేవతను ఇలా ధ్యానించాడు.

'ప్రసన్నమైన చిత్తంతో ప్రజాపతియైన నాతండ్రి నాకు వరమిచ్చాడు. దప్పిగొన్న నేను నీటిని కోరి, పంపితే నాసోదరులు ఆ చెరువులోకి ప్రవేశించారు. మహాసంగ్రామంలో ఇంద్రునిచే రాక్షసులు చంపబడినట్లు వనంలో (నాసోదరులు) వారు ఆ యక్షవరునిచే పడగొట్టబడ్డారు. అపుడు నేను వెళ్లి, ఆయన అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పితే నాతండ్రి మిక్కిలి తృప్తిపొందాడు. పూజ్యుడైన అతడు ప్రసన్నుడై నాకు వరమిచ్చాడు. 'పాండునందనా! నీవు వర మడుగు. వరదుడనై ఆకాశంలో ఉన్నాను. చూడు' అన్నాడు. అంత నాతండ్రితో ఇలా అన్నాను. "ప్రభూ! నాబుద్ధి ఎల్లపుడు ధర్మప్రీతి కల దగు గాక! ఈసోదరులు మునుపటివలె శరీరమూ, రూపమూ, బలమూ పొందుదురుగాక! ఓర్పు, కీర్తి కోరినట్లు సిద్ధించుగాక! మా సత్యవ్రతం సమాప్తినొందు గాక! ఇదియే నాకు వర మగు గాక!' అని అనగానే ఆ దేవశ్రేష్ఠుడు 'అది అసత్యం కాదు' అని పలికాడు.' ఇలా ధర్మరాజు ధర్మదేవతను స్మరిస్తూ అతని అనుగ్రహంచేత తాను కోరిన రూపం వెంటనే పొందాడు. అతడు యువకుడై త్రిదండమూ, కమండలువూ, తల పాగ, మంచి కాషాయవస్త్రం, తలమీద పిలక,చేతిలో దర్భలు కలిగిన బ్రాహ్మణరూపం పొంది, అందరికీ ఆశ్చర్యం కలిగించాడు. అలాగే ధార్మికులూ, సత్ఫలాన్ని కోరిన మహాత్ములూ అయిన పాండవులకు వారు కోరినట్లు ఆభరణాలు, వస్త్రాలు, దండలూ క్షణంలో లభించాయి.

మొదటగా యుధిష్ఠిరుడు వైడూర్యంవలె ఎఱ్ఱనైన బంగారు పాచికలు గుడ్డలో చుట్టి చంకన బెట్టుకొని సభలో నున్న విరాటుని సమీపించాడు. ధర్మరాజు కీర్తితో కౌరవవంశాన్ని వర్ధిల్లజేసే మహానుభావుడు, రాజులచే సత్కరింపబడినవాడు. అతడు ఇతరులకు చేరశక్యం కాని భయంకర విషసర్పంవలె ఉన్నాడు. బలరూపాలతో ధర్మరాజు అపూర్వరూపంతో దివ్యపురుషునివలె ఉన్నాడు. వీరుడైన ధర్మరాజు దట్టమైన

మేఘాలతో కప్పబడిన సూర్యుని లాగా, నివురుగప్పిన నిప్పులాగా ఉన్నాడు. అతడు విరాటుని చేరాడు. మొదట్లో మేఘావృతమయిన చంద్రునివలె, రానురాను పూర్ణిమాచంద్రునివలె అనిపించిన అతనిని విరాటరాజు చూశాడు.

అపుడు విరాటుడు తనచుట్టూ ఉన్న మంత్రులను బ్రాహ్మణులను, క్షత్రియులను, వైశ్యులను, ఇతరులను ఇలా అడిగాడు. "నన్ను చేరిన ఇతడు ఎవడు? ఇత డీ సభలో రాజువలె కనబడుతున్నాడే. నరోత్తముడైన ఇతడు బ్రాహ్మణుడు కాడు. ఇతడు భూపతి (రాజు) అని నా అభిప్రాయం. ఇతని దగ్గర సేవకుడు లేడు. రథం లేదు. ఏనుగు లేదు. కాని ఇంద్రునివలె ప్రకాశిస్తున్నాడు. శరీరలక్షణాలనుబట్టి ఇతడు మూర్ధాభిషిక్తుడైన రాజు అని నా అభిప్రాయం. మదించిన ఏనుగు తామరతూడును చేరుతున్నట్లు ఇతడు నిశ్చింతగా నాదగ్గరకు వస్తున్నాడు." అలా ఊహించుకొంటున్న విరాటుని దగ్గరకు ధర్మరాజు వచ్చి ఇలా అన్నాడు. 'మహారాజా! సర్వస్వమూ కోల్పోయి జీవనంకోసం ఇక్కడకు వచ్చిన నన్ను ద్విజుడని గ్రహించు. నీయిష్టానుసారం నీవద్ద నివసింప గోరుతున్నాను." అనగానే రాజు సంతసించి, స్వాగతంచెప్పి, ధర్మజుని స్వీకరించాడు.

రాజసింహుడైన ధర్మరాజును ఆదరించి విరాటరాజు ప్రసన్నచిత్తంతో ఇలా అన్నాడు. 'నాయనా! నేను ప్రేమతో అడుగుతున్నాను. నీవు ఏ రాజు రాజ్యం నుండి ఇక్కడకు వచ్చావు. నీగోత్రం, (వంశం) పేరు యథార్థంగా చెప్పు. నీకు ఏ విద్యలో నైపుణ్య ముందో తెలుపు.' ధర్మరాజు అన్నాడు. 'విరాటరాజా! మునుపు నేను ధర్మరాజుకు స్నేహితుణ్ణి. వ్యాఘ్రపాద గోత్రంలో పుట్టాను. విప్రుణ్ణి. అక్షక్రీడాకారులలో పాచికలను ప్రయోగించటంలో నేర్పరిని. కంకుడనే పేర ప్రసిద్ధుణ్ణి.' ఆ మాటలు విని విరాటుడు ఇలా చెప్తున్నాడు. 'నీవు కోరిన వరం ఇస్తున్నాను. నేను నీ అధీనుణ్ణి. ఈమత్స్యదేశాన్ని పాలించు. ద్యూతవిద్య తెలిసిన జూదరు లెప్పుడూ నాకిష్టులే. దైవసమానుడవైన నీవు రాజ్యానికే తగుదువు.' అనగానే యుధిష్ఠిరుడు 'మత్స్యరాజా! జూదంలో హీనునివల్లనూ వివాదం రాదని లేదు. నాచే జయింపబడిన వాడెవడూ నాకు అప్పుపెట్టకూడదు. నీ అనుగ్రహం వలన నా కీ వర ముండుగాక' అన్నాడు. విరాటుడు అన్నాడు. 'నీకు అప్రియంగా నడచినవానిని తప్పక వధిస్తాను. వారు బ్రాహ్మణు లయితే దేశంనుండి బహిష్కరిస్తాను. ఇక్కడున్న ప్రజలందరూ నామాటను వినండి.

'ఈదేశాన నేనెట్లు ప్రభువునో అట్లే ఈ కంకుడు కూడ.' ఇక నీవు నాస్నేహితుడవు. నాతో సమానమైన వాహనమూ, గొప్పవస్త్రాలు, కావలసిన అన్నపానాలూ నీకు సమకూరుతాయి. ఆంతరంగికంగా, బాహ్యంగా నీకోసం మా ద్వారం తెరిచే ఉంటుంది. జీవనోపాధిలేక కృశించి, విన్నవించటానికి నీవద్దకు వస్తే వారి మాటలు నాకు చెప్పు. అన్నింటిని నేను ఇస్తాను. నీవు సందేహించకు. నావద్ద నీకెట్టి భయమూ లేదు.'

ఇలా శ్రీమహావిష్ణువుకూ ఇంద్రునికీ లాగా, విరాటరాజుకు ఆ ధర్మరాజుకు కలయిక జరిగింది. ప్రియమైనరూపంతో ఆసనంమీదున్న ధర్మరాజును చూస్తున్న విరాటరాజు తృప్తినొందలేదు. ఇంద్రుడు తనకాంతిచే స్వర్గాన్ని ప్రకాశింపజేసినట్లు ధర్మరాజు ఆ సభను ప్రకాశింప జేశాడు. ఇలా నరశ్రేష్ఠుడైన ధర్మరాజు విరాటరాజును కలిసి అతనిచేత పూజింపబడుతూ ధీరుడై, సుఖంగా ఉన్నాడు. అతని చరిత్ర ఎవరూ తెలియలేకపోయారు.

8. భీమసేనుడు విరాటరాజు సభలో ప్రవేశించుట.

తరువాత బలశాలి, సింహం శీవి-నడక గల ఒక పరాక్రమశాలి తెడ్డును, గరిటెను, ఒరలేని మొక్కవోని ఉక్కుకత్తిని చేతబట్టి విరాటుని సమీపించాడు. వంటవానివేషంతోనున్న అతడు తేజస్సుతో సూర్యునిలా ఈ లోకాన్ని వెలిగిస్తూ, నల్లని వస్త్రంతో, కొండంత ధైర్యంతో ఆ విరాటరాజును సమీపించి నిలుచున్నాడు.

తన్ను సమీపిస్తున్న అతణ్ణి చూసి ఆనందిస్తూ రాజు అక్కడున్న జనులతో "సింహంలా ఎగుభుజాలు కల్గి అందమైన, నరశ్రేష్ఠునిలా ఉన్న ఈ యువకు డెవడో! సూర్యునివలె ఉన్న ఈ పురుషుని మునుపు చూసినట్లు ఎంత ఆలోచించినా గుర్తురావటం లేదు. ఇతని హృదయం తెలియలేకున్నాను. చూడగానే ఇతడు గంధర్వరాజా? లేక ఇంద్రుడా? అనిపిస్తోంది. నా ముందున్న ఇతడెవరో తెలుసుకోండి. అతనికోరిక వెంటనే తీరుస్తాను" అన్నాడు. విరాటుడు పంపగానే వెళ్లి, రాజభటులు భీముని సమీపించి రాజు అడిగిన వన్నీ భీముని అడిగారు. ఉదాత్తమనస్సుగల భీముడు విరాటుని సమీపించి దైన్యంలేకుండా ఇలా అన్నాడు. 'రాజా! నేను వల్లవుడనే వంటవాడను. బాగావంటచేయగల నన్ను ఈ పనిలో నియమించు.'

విరాటుడు అన్నాడు. 'వల్లవా! నీవు వంటవాడవనే మాటను

విశ్వసించలేకపోతున్నాను. ఇంద్రునిలా ప్రకాశిస్తున్నావు. కాంతి, రూపం, విక్రమాలతో నీవు నరశ్రేష్ఠుని వలె ప్రకాశిస్తున్నావు.'

భీముడు 'రాజా! నేను వంటవాడను. సేవకుడను. ప్రత్యేక భక్ష్యాలను బాగా చేయగలను. మునుపు నావంటలు ధర్మరాజు కూడ ఆస్వాదించాడు. బలంలో నాతో సమానుడు లేడు. నేనెప్పుడూ మల్లయుద్ధం చేస్తుంటాను. ఏనుగులు, సింహాలతో కూడా పట్టుపట్టగలను. నీకెప్పుడూ ప్రియం చేకూరుస్తాను." అన్నాడు. విరాటుడు వెంటనే "నీకు వంటశాలలో తగినవారిని ఇస్తాను. అలాగే చెయ్యి. నేర్పుతో మాట్లాడుతున్నావు. ఈపని నీకు తగినదిగా నేను అనుకోవటంలేదు. నీవు సముద్ర పర్యంతమైన భూమిని పాలింప తగినవాడవు. అయినా నీ కోరికప్రకారం నీవు నా పాకశాలలో మొదటివానిగా ఉండు. మును పక్కడ ఉన్న వారందరికీ నిన్ను నాయకునిగ చేస్తున్నాను' అన్నాడు అలా పాకశాలలో నియమింపబడిన భీముడు విరాటరాజుకు మిక్కిలి ఇష్టుడై, ఆ రాజ్యంలో నివసించాడు. ఇతరులు కాని, అనుచరులు కాని, అతనిని గుర్తించ లేకపోయారు.

9. ద్రౌపది సైరంధ్రివేషములో విరాటుని రాణివాసము చేరుట.

వైశంపాయనుడు చెప్పాడు. తెలినవ్వుతో.. కాటుక కనులుగల ద్రౌపది చిక్కువడిన, చక్కని, నల్లని, సన్నని, మెత్తని, పొడవైన జుట్టును పైకి ముడికట్టుకొని, కుడివైపునకు మలచుకొన్నది. ఆమె బాగా మాసినచీర కట్టుకొని, సైరంధ్రీవేషం దాల్చి కష్టాల్లో ఉన్నదానివలె సంచరిస్తోంది. అలా తిరుగాడుతున్న ద్రౌపదిని నగరంలోని పురుషులూ, స్త్రీలూ సమీపించి 'నీవెవరివి? ఏమి చేయాలనుకొంటున్నావు?, అని అడిగారు. ఆమె వారితో ఇలా అంది. 'నేను సైరంధ్రిగా ఇక్కడకు వచ్చాను. నన్ను నియోగించిన వారు చెప్పిన పనిని చేయాలనుకొంటున్నాను'. ఆమెయొక్క రూపం, వేషం, నేర్పుగల మాట గమనించి తిండికోసం వచ్చినదాసిగా ఆమెను వారు నమ్మలేకపోయారు. అపుడు విరాటుని భార్య సుదేష్ణ మేడపైనుండి ద్రౌపదిని చూసింది. చక్కని రూపమున్నా దిక్కు లేనిదై, ఒకే వస్త్రం ధరించి యున్న ద్రౌపదిని ఆమె పిలిపించి 'కళ్యాణీ! నీవెవరవు? ఏమి చేయాలనుకొంటున్నావు?' అని అడిగింది. అపుడు ద్రౌపది ఆమెతో ఇలా అంది. 'నేను సైరంధ్రిని. నన్ను పనిలో నియోగించిన వారిపనులు

చేయాలనుకొంటున్నాను'.

సుదేష్ణ అన్నది. 'భామినీ! నీవు చెప్పినట్లు నీ రూపం లేదు. ఇట్టి రూపం కలది సైరంధ్రి కాజాలదు. అనేక దాసదాసీ జనులకు పని చెప్పేటట్లు నీ వున్నావు. మడమలు ఎత్తుగా లేవు. ఒరసిన తొడలు, లోతైన నాభి, వాక్కు, బుద్ధి కలదానవు. ముక్కు, చెవి, కళ్లు, స్తనాలు, గోళ్లు, పెడతల అనే ఆరూ ఉన్నతంగా ఉన్నాయి. అరచేతులు అరికాళ్లు, కనుకొలకులు, పెదవి, నాలుక, గోళ్లు ఐదూ ఎఱ్ఱగా ఉన్నాయి. హంసవలె గద్గదస్వరం ఉంది. చక్కని కేశాలు, స్తనాలు కల్గి ఉన్నావు. నల్లని శరీరచాయ, బలిసిన పిరుదులు ఉన్నాయి. కాశ్మీరదేశపు గుఱ్ఱంవలె మంచి లక్షణాలు కల్గి, వంపుతిరిగిన కనుబొమలుగల నేత్రాలు, దొండపండువంటి ఎఱ్ఱని పెదవి, సన్నని నడుము, శంఖంవంటి కంఠం, బయటకు కనబడని నాడులు, పున్నమిచంద్రునివంటి ముఖమూ కల్గిన నీవు సైరంధ్రివి కాజాలవు. శరత్కాలపు కలువరేకులవంటి కన్నులూ, పరిమళమూ ఆ కలువలతో సేవించిన లక్ష్మితో సమానమైన రూపమూ కల నీవు దాసివి కాజాలవు. కళ్యాణీ! నీవెవరు? నిజం చెప్పు. ఎలాగైనా నీవు దాసివి కాజాలవు. యక్షకన్యవా? దేవతవా? గంధర్వ యువతివా? అప్సరసవా? దేవకన్యవా? నాగకన్యవా? లేక ఈ నగరదేవతవా? విద్యాధరివా? కిన్నరివా? లేక సాక్షాత్తు రోహిణివా? నీవు అలంబుసవా, మిశ్రకేశివా, పుండరీకవా, మాలినివా,(వీరు అప్సరసలు) ఇంద్రాణివా? లేక వరుణుని భార్యవా? విశ్వకర్మ భార్యవా? ధాత భార్యవా, ప్రజాపతి భార్యవా? ఎవరు నీవు?'

ద్రౌపది చెప్పింది. 'నేను దేవతాస్త్రీని కాను. గంధర్వస్త్రీని కాను. ఆసురస్త్రీని కాను. రాక్షసస్త్రీని కూడా కాను. నేను సేవచేసి జీవించే సైరంధ్రిని. నేను నీకు నిజం చెపుతున్నాను. విలేపనాలు బాగా తయారుచేసి పూయగలను. కేశాలను బాగా అలంకరించడం ఎరుగుదును. మల్లికలు, కలువలు, పద్మాలు, చంపకాలు, వీటిదండలు చిత్రవిచిత్రంగా అందంగా కూర్చగలను. శ్రీకృష్ణుని ప్రియ మయిన పట్టమహిషి సత్యభామను సేవించాను. కురువంశజులలో పాండవులభార్య, మిక్కిలి సౌందర్యవతి అయిన ద్రౌపదిని సేవించాను. ఇలా అక్కడక్కడ తిరుగుతూ, మంచిభోజనం, వస్త్రాలు లభించినంతకాలం అక్కడే ఆనందించేదాన్ని. ద్రౌపదీదేవి స్వయంగా 'మాలిని' అని నాకు పేరు పెట్టింది. సుదేష్ణాదేవీ! అటువంటి నేను ఇపుడు నీమందిరానికి

వచ్చాను'. అది విని సుదేష్ణ ఇలా పలికింది. 'నిన్ను నా నెత్తిన పెట్టుకొంటాను. నాకెట్టి సందేహం లేదు. కాని రాజు తన మనసంతా నీమీద పెట్టి నిన్ను కోరకుండా ఉంటే నీవు ఇక్కడ ఉండవచ్చు. ఈ రాజకులంలో స్త్రీలు, ఈ నా మందిరంలో స్త్రీలూ నిన్నే ఆసక్తితో చూస్తున్నారు. ఇక పురుషుని మోహింప జేయకుంటావా? నాయింట్లో ఈవృక్షాలను చూడు. అవి కూడా నిన్ను చూడటానికి వంగుతున్నట్టున్నాయి. ఇక ఏ పురుషుణ్ణి నీవు మోహింప జేయవు? సుశ్రోణీ! మారాజు విరాటుడు మానవులలో లభ్యంకాని అందమైన నీశరీరం చూసి నన్ను వదలి నిండుమనస్సుతో నిన్ను కోరుతాడేమో! దోషంలేని శరీరసౌష్ఠవం నీది., నీవు విశాలచంచలనేత్రవు. ఆ కళ్లతో నీవు చూస్తే ఏ పురుషుడైనా కామానికి వశం కావలసినదే. అందమైన నవ్వు, చక్కని శరీరసౌష్ఠవమూ కల నిన్ను ఎవరు చూసినా మన్మథునికి వశం కావలసిందే. తనచావు కోరి తానే వృక్షా లెక్కేవాడిలాగా ఈ నా రాజభవనంలో నిన్ను ఉంచుకొనడం నాకు కష్టం కలిగిస్తుంది. కర్కటి (ఆడుపీత) తనకు చావు తెచ్చే గర్భం ధరించినట్లు నీవిచట ఉండటం మాకు మృత్యువు అవుతుంది.'

ద్రౌపది అన్నది. 'భామినీ! నేను విరాటునిచేగాని, వేరొకనిచే గాని ఎప్పుడును పొందశక్యం కానిదాన్ని. నాకు అయిదుగురు గంధర్వయువకులు భర్తలు. వారు బలవంతుడైన ఒకానొక గంధర్వరాజయొక్క కుమారులు. నిత్యమూ నన్ను రక్షిస్తారు. నేను కఠినమయిన నియమం కలదానను. నాకు ఎంగిలి పదార్థం పెట్టరాదు. పాదాలు ఒత్తు మని చెప్పరాదు. అటువంటివారిదగ్గర నేను నివసిస్తే నాగంధర్వపతులు సంతోషిస్తారు. ఇతర (సాధారణ) స్త్రీలనువలె నన్ను కోరిన వాడు ఆ రాత్రే ఈ శరీరం విడుస్తాడు. అమ్మా! నన్ను నాధర్మంనుండి ఎవరూ చలింప జేయలేరు. ఇపుడు కష్టాలలో ఉన్నా, బలవంతులయిన నాగంధర్వప్రియులు చాటుగా ఉండి నన్ను నిత్యమూ రక్షిస్తూ ఉంటారు.'

సుదేష్ణ అంది. 'ఆనందదాయినీ!అయితే నీవు కోరినట్లే ఇక్కడ ఉండవచ్చు. పాదాలు కాని, ఎంగిలి గాని నీవు తాక నవసరంలేదు.' ద్రౌపది ఇలా విరాటుని భార్యచే ఓదార్పబడింది. పతివ్రతా ధర్మం ఆచరిస్తూ ఆ నగరంలో నివసించింది. ఆమెను గూర్చిన యథార్థం అక్కడ ఎవరూ తెలుసుకోలేకపోయారు.'

10. సహదేవుడు గోపాలక వేషములో విరాటుని కొలువు చేరుట.

సహదేవుడు కూడా గోపాలకవేషం ధరించి, వారి భాషనే మాట్లాడుతూ, విరటుని సమీపించాడు. రాజభవనానికి దగ్గరలోఉన్న గోశాలను సమీపించి నిలుచున్నాడు. అతణ్ణి చూసి విరాటరాజు ఆశ్చర్యపడి భటులను పంపాడు. తనదగ్గరకు వస్తున్న ఆ నరశ్రేష్ఠుని చూసి విరాటరాజు అతనిని సమీపించి ఇలా అడిగాడు. 'నీవెవ్వరివాడవు? ఎక్కడ నుండి వచ్చావు? నీవేమి చేయాలనుకొంటున్నావు? ఇంతకు మునుపు నిన్ను నేను చూడలేదు. నిజం చెప్పు.' శత్రుసంహారకుడైన ఆ రాజును సమీపించి మేఘగర్జనం వంటి గంభీరధ్వనితో సహదేవుడిలా అన్నాడు. 'నేను వైశ్యుణ్ణి. నాపేరు అరిష్టనేమి. కురుశ్రేష్ఠుల గోశాలలో ఉండేవాణ్ణి. నరశ్రేష్ఠా!నీరాజ్యంలో ఉండాలనుకొంటున్నాను. రాజసింహులైన ఆ పాండవులెక్కడ ఉన్నారో తెలియదు. పనిచేయకుండా జీవించడం నా శక్యంకాదు. నీవుకాక వేరొక రాజు నాకిష్టుడు కాదు.' విరాటుడు అన్నాడు.' శత్రుమర్దనా! నీవు బ్రాహ్మణుడవా? లేక క్షత్రియుడవా? భూమిని పాలించేవానిలా ఉన్నావు. నిజం చెప్పు. ఈవైశ్యకర్మ నీకు తగినది కాదు. ఏ రాజ్యంనుండి ఇక్కడకు వచ్చావు? నీకు ఏ పనిలో నేర్పు ఉంది? నీవు మాదగ్గర ఎలా ఉంటావు? నీకిక్కడ జీతమెంత కావాలి? చెప్పు.'

సహదేవుడు చెపుతున్నాడు. 'పాండుకుమారు లైదుగురిలో పెద్దవాడు యుధిష్ఠిరుడు. అతనికి ఎనిమిదిలక్షల గోగణాలు ఉన్నాయి. అందులో ఒక్కొక్క గణంలో వందగోవులున్నాయి. ఇంకొక రకం గోవులు లక్ష ఉన్నాయి. మరొకరకమైన గోవులు రెండు లక్ష లున్నాయి. వారిగోవులన్నీ లెక్కించి సంరక్షించే నన్ను తంతిపాలుడని అంటారు. గోవులకు సంబంధించిన భూతభవిష్య ద్వర్తమానా లన్నీ నేనెరుగుదును. పదియోజనాల విస్తీర్ణంలో నాకు తెలియని దేమీ లేదు. మహాత్ము డయిన ఆ కురురాజు యుధిష్ఠిరుని గుణాలు నేను బాగా ఎరుగుదును. అతడు చాలాసార్లు నానేర్పులు చూసి సంతోషించేవాడు. గోవులు వేగంగా వృద్ధిచెందే తీరులూ, రోగం రాకుండా పెంచే ఉపాయాలూ నేను బాగా ఎరుగుదును. రాజా! వేనిమాత్రం వాసనచూసినంత మాత్రాన వంధ్య (గొడ్డుటావు) కూడ చూడిదవుతుందో, అట్టి మంచి లక్షణాలున్న ఎద్దులనూ నే నెరుగుదును.' విరాటుడు అన్నాడు. 'సవర్ణాలైన లక్ష పశువులను సంగ్రహించాను. అనేక గుణాలున్న పశువులనూ, వాటి పాలకులనూ

నీకిస్తున్నాను. ఇక నాపశువులు నీరక్షణలో ఉంటాయి'. ఇలా ప్రజాపాలకుడైన ఆ విరాటుడికి నిజం తెలియకుండా అతని గోశాలలో సహదేవుడు సుఖంగా ప్రవేశించాడు. ఇతరులు కూడా ఏ విధంగాను అతణ్ణి తెలుసు కోలేకపోయారు. విరాటుడు అతడు కోరినంత జీతం ఇచ్చాడు.

11. అర్జునుడు విరాటుని కొలువులో కన్యలకు నృత్యము నేర్పుటకు నియుక్తుడగుట.

తరువాత అందమైన రూపంతో, స్త్రీల అలంకారాలు, పొడవైన కుండలాలు, బంగారుగాజులూ ధరించిన ఒకానొక ఉన్నతపురుషుడు కోటగోడవద్ద కనబడ్డాడు. అతడు పొడవైన చేతు లూపుకొంటూ శిరోజాలు విదల్చుకొంటూ, ఏనుగునడకతో భూమిని కంపింపజేస్తూ, విరాటుని సభాసమీపానికి వచ్చాడు. తననిజరూపం దాచిపెట్టి మారువేషంలో సభలోకి వచ్చిన, అర్జునుని చూసి, విరాటరాజు సభాసదులతో 'ఇతడు ఎక్కడ నుండి వస్తున్నాడు? మునుపు నేను వినియుండలేదు. జనులు ఇతనిని పూర్వం పరిచయం కలవానిగా చెప్పటం లేదు' అంటూ ఆశ్చర్యంతో ఇలా అన్నాడు. 'ఓయీ! బలశాలివైన నీవు దైవంలా ఉన్నావు. గజరాజులా ఉన్నావు. నల్లని యువకుడివై ఉన్నావు. చేతులకు శంఖవలయాలపై బంగారుగాజులు ధరించావు. జుట్టువిరబోసుకుని కుండలాలు ధరించావు. పూల మాలను ధరించావు. మంచి కేశాలున్నాయి. విలక్షణంగా వస్త్రం ధరించి, ధనుర్బాణాలూ, కవచం ధరించి వీరునివలె ఉన్నావు. నీవు రథం ఎక్కి తిరుగు. నాకుమారులతో లేదా నాతో సమానుడవై ఉండు. నేను వృద్ధుడిని. రాజ్యభారం తగ్గించుకోవా లనుకొంటున్నాను. నీవు శక్తితో ఈ మత్స్యదేశం పాలించు. ఇలాంటిరూపం కలవారు నపుంసకులు కారు అని నామనసు చెపుతోంది.'

(అదివిని అర్జునుడు ఇలా అన్నాడు. 'నేను కేశాలు అలంకరిస్తాను. అందంగా చెవికమ్మలు పెట్టగలను. అందమైన దండలు, ఉత్తరీయాలు, మేలిముసుగులూ అలంకరించ గలను స్నానం చేయించగలను. అద్దాన్ని శుభ్రం చేయగలను. చందనరేఖాద్యలంకారాల్లో నాకు నేర్పు ఉన్నది నపుంసకులలో, బాలురలో, సాధారణజనులలో తిరుగుతాను నాట్యం చేయటంలో, నాట్య శిక్షణలో నాకు అర్హత ఉంది. జడలలో పూలను అలంకరిస్తాను. స్త్రీలు ఈ పనిలో నాకంటె ఎక్కువ నేర్పరులు కారు.'

తన్ను సమీపించిన ఆ ఉన్నతుని చూసి విరాటరాజు ఆశ్చర్యపడి యిలా అన్నాడు 'నరరాజసింహా! హీనమైన ఈవేషమూ, ఈపేడితనమూ నీకు తగినది కాదు. అమంగళకరమైన ఈ అలంకారాలూ, వేషమూ పశుపతికి అలంకారంలా ఉన్నాయి దట్టమైన మేఘాలు కప్పిన సూర్యునివలె

ప్రకాశిస్తున్నావు. బలిష్ఠులైన నీ ఆజానుబాహువులకు విల్లుమాత్రమే శోభకలిగిస్తుందని నానమ్మకం.')

అర్జునుడు చెప్పాడు.'రాజా! నేను గానం చేస్తాను. నృత్యం చేస్తాను. మృదంగవాదనంకూడ చేస్తాను. నృత్యంలో, గానంలో నేర్పరిని. నీకుమార్తె ఉత్తరకు విద్య నేర్పటానికి నన్ను నియమించు. నేను స్వయంగా ఆమెకు నాట్యాచార్యుడను అవుతాను. నీవు నారూపాన్ని ప్రశంసించి ప్రయోజనంలేదు. అది నా దుఃఖాన్నిమరింత పెంచుతుంది. తల్లిదండ్రులు వదిలివేసిన కొడుకో లేక కూతురో ఈ బృహన్నల అనుకో.'

విరాటు డన్నాడు. 'బృహన్నలా! నీవు కోరిన వరం ఇస్తున్నా. నాకుమార్తెకూ, ఇతర కన్యలకూ, నృత్యం నేర్పు. కాని ఈ నీ పని నాకిష్టం లేదు. నీవు నిజానికి సముద్రాలు హద్దుగా గల ఈ భూమిని పాలింపదగిన వాడవు.' మత్స్యరాజు విరాటుడు ఆ బృహన్నలను చూసి వివిధమంత్రులతో ఆలోచన చేసి కళలలో, నృత్యాలలో, వాదనాలలో అతనిని స్త్రీలచే పరీక్ష చేయించి, అతని నపుంసకత్వం నిజమైనదే అని స్థిరపరచుకొని, అతనిని కన్యకాంతఃపురానికి పంపాడు. సమర్థుడైన ధనంజయుడు విరాటుని పుత్రికకూ, ఆమె చెలులకూ, పరిచారికలకూ, నృత్యగీతవాద్యాలను నేర్పసాగాడు. దీనితో అతడు వారి కిష్ట డయ్యాడు. ఇలా మారువేషంలో రహస్యంగా అర్జునుడు అక్కడ నివసిస్తూ, వారితో కలిసి ఇష్టమైన పనులు చేస్తూ, మనస్సును స్వాధీన పరచుకొని ఉన్నాడు. అంతఃపురంలో తిరిగేవారు గాని, బయటవారు కాని, అతనిని గూర్చి తెలుసుకోలేకపోయారు.

12. నకులుడు అశ్వశిక్షకుడుగ నియుక్తుడగుట.

పాండవులలో మరొకశక్తిశాలి నకులుడు విరాటరాజును సమీపించాడు. వస్తున్న అతనిని చూసి సాధారణజనులు మేఘాల్లోంచి వచ్చే సూర్యు డనుకొన్నారు. అతడు వచ్చి అక్కడున్న గుర్రాలను చూస్తున్నాడు. అలా చూస్తున్న అతనిని మత్స్యరాజు విరాటుడు చూశాడు. విరాటుడు అనుచరులతో ఇలా అన్నాడు. 'ఇతడు ఎక్కడ నుండి వస్తున్నాడు? ఇంద్రునిలా ఉన్నాడెవరు? ఇతడు స్వయంగా నాగుర్రాలను పట్టిపట్టి చూస్తున్నాడు. తప్పక ఇతడు అశ్వపరిజ్ఞానంగల వివేకవంతుడు కావాలి. ఈ వీరుడు అమరునివలె ప్రకాశిస్తున్నాడు. ఇతనిని వెంటనే నాముందర ప్రవేశపెట్టండి.'

అపుడు నకులుడు రాజును సమీపించి ఇలా అన్నాడు. 'రాజా! మీకు జయ మగుగాక. మీకు శుభ మగుగాక. నేను గుర్రాలకు శిక్షణనివ్వడంలో నేర్పరిని. సదా రాజులకు ఇష్టుడను. మీగుర్రాలకు నేర్పరియగు సారథిని అవుతాను.'

విరాటుడు అన్నాడు. 'ఓయీ! నీకు రథాలూ, ధనమూ, నివాసమూ, ఇస్తున్నాను. నా అశ్వాలకు సారథిగా ఉండటానికి నీవు అర్హుడవు. నీవు ఎక్కడ నుండి వస్తున్నావు? ఏ రాజుకు సంబంధించిన వాడవు? ఎలా వచ్చావు? నీకు దేనియందు నైపుణ్యముందో వివరంగా చెప్పు.' వెంటనే నకులుడు ఇలా అన్నాడు.'శత్రుమర్దనా! పాండుకుమారు లైదుగురిలో జ్యేష్ఠుడైన యుధిష్ఠిరుడు నన్ను పూర్వం అశ్వాలను చూడటానికి నియమించాడు. అశ్వాల స్వభావం ఎఱుగుదును. వాటిని లొంగదీసుకోవటమూ తెలుసును. గుర్రాల రోగాలూ, వాటి నివారణమూ పూర్తిగా ఎరుగుదును. నా వాహనం ఎప్పుడూ పిరికిది కాజాలదు. నావద్ద చెడ్డదైన ఆడుగుర్రం ఒకటికూడా లేదు. ఇక మగ గుర్రాల విషయం చెప్పాలా! జనులూ, యుధిష్ఠిరుడూ నన్ను గ్రంధికుడని అనేవారు.

(దేవేంద్రుని సారధియైన మాతలివలె, దశరథుని సారధి సుమంత్రునివలె, పరశురాముని సారధి సుమహుని వలె నీగుర్రాలకు నేను శిక్షణనిస్తాను. రాజేంద్రా! మహారాజైన యుధిష్ఠిరుని శాసనంవల్ల లక్షకోటి గుర్రాలకు రక్షకునిగా ఉన్నాను.')

విరాటుడు అన్నాడు. 'నాగుఱ్ఱాలు, రథాలు, అన్నీ ఇప్పుడే నీఅధీనం అవుతాయి. నావద్దనున్న సారథులంతా నీఅధీనంలో ఉందురుగాక! ఈ పని నీకిష్టమైతే ఇందుకు నీవు కోరే ధనమెంతో చెప్పు. ఈ అశ్వకర్మ నీకు నిజానికి తగినది కాదు. రాజు వలె ప్రకాశిస్తున్నా వని నాఅభిప్రాయం. ఇక్కడ నీదర్శనం యుధిష్ఠిరుని దర్శనంవలె నాకు ప్రియంగా ఉంది. సేవకులు లేకుండా అరణ్యంలో మహానుభావుడైన ఆ ధర్మరాజెలా సంతోషంగా నివసిస్తున్నాడో!' అంటూ గంధర్వ శ్రేష్ఠునిపోలిన యువకుడైన ఆ నకులుని విరాటరాజు ఆనందంతో సత్కరించాడు. అందమైన, ప్రియమైన రూపంతో తిరుగుతున్న అతనిని గూర్చి ఇతరు లెవ్వరూ తెలుసుకోలేక పోయారు. ఇలా పాండవులు తమ ప్రతిజ్ఞల కనుగుణంగా సార్థకదర్శనంతో మత్స్యదేశంలో నివసించారు. భూమండలాధిపతు లైనప్పటికీ మిక్కిలి దుఃఖంతో, జాగరూకులై అజ్ఞాతవాసం చేశారు.

13. భీమసేనుడు జీమూతమల్లుని వధించుట.

రాజర్షి తృణబిందువుయొక్క, ధర్మదేవతయొక్క అనుగ్రహంవలన విరాటనగరంలో పాండవులు అజ్ఞాతవాసం ఇలా చేశారు. సభాస్తారుడైన ధర్మరాజు మత్స్యదేశజనులకూ, విరాటునికీ, అతని కుమారునికీ మిక్కిలి ప్రీతిపాత్రు డయ్యాడు. పాచికలమర్మం తెలిసిన ధర్మరాజు అక్షశాలలో త్రాటికి కట్టిన పక్షులనువలె ఇష్టానుసారంగా పాచికలను వేయసాగాడు. విరాటరాజుకు తెలియకుండా పురుషశ్రేష్ఠుడైన ధర్మరాజు తాను జయించిన ధనాన్ని యోగ్యమైన రీతులలో తన సోదరులకు ఇస్తూ ఉండేవాడు. భీమసేనుడు విరాటునికై వినియోగించగా మిగిలిన మాంసాదులనూ, భక్ష్యాలనూ తన సోదరులైన ధర్మజాదులకు అమ్మేవాడు. అర్జునుడు అంతఃపురంలో లభించిన జీర్ణవస్త్రాలను అందరకు అమ్ముతూ ఉన్నట్లు పాండవులకు ఇచ్చేవాడు. గోపాలకుని వేషంలో సహదేవుడుకూడా పాలు, పెరుగు, నెయ్యి, పాండవుల కిస్తూ ఉండేవాడు. నకులుడు కూడ గుర్రాల పనితో విరాటరాజును సంతోషపెట్టి, తాను పొందిన ధనాన్ని పాండవులకు ఇస్తూ ఉండేవాడు. ద్రౌపది మాత్రం దీనురాలై తనభర్త లందరినీ నిరీక్షిస్తూ ఎవరికీ తెలియకుండా సంచరిస్తూ ఉండేది. ఇలా అన్యోన్యంగా పాండవులు మరల మాతృగర్భంలో ప్రవేశించినట్లు అజ్ఞాతంగా విరాటనగరంలో సంచరించారు. దుర్యోధనుని వల్ల భయంతోనూ, అనుమానంతోనూ ఉన్న పాండవులు ద్రౌపదిని కనిపెట్టుకొంటూ అజ్ఞాతంగా ఉన్నారు. నాల్గవనెలలో మత్స్యరాజ్యంలో ప్రజలకిష్టమైన బ్రహ్మోత్సవం జరిగింది. అక్కడకు అన్నిదిక్కులనుండి వేలకొలది మల్లులు వచ్చారు. ఆ బ్రహ్మోత్సవసభ ఈశ్వరునిసభవలె ఉంది. ఆ మల్లులు అనేకపర్యాయాలు రాజు ఎదుట యుద్ధరంగంలో విజయాన్ని సాధించిన వారు. వారిలో ఒక గొప్ప మల్లయోధు డున్నాడు. అతడు మల్లులనందరినీ యుద్ధానికి పిలవసాగాడు. అలా రంగంలో తిరుగుతున్న అతని మీదకు ఒక్కడైనా వెళ్లలేకపోయాడు. అక్కడున్న మల్లు లందరూ ఉదాసీనులూ, భీతచిత్తులూ అయ్యారు. విరాటరాజు తన పాకశాలలోని వంటవానిని అతనితో పోరాడటానికి పంపాడు. అపుడు రాజు ఉత్సాహపరచగా భీముడు అజ్ఞాతవాసభయంతో ఇష్టం లేకపోయినా పోరాడటానికి సిద్ధపడ్డాడు. పైకి రాజు మాటను తిరస్కరింపలేక పోయాడు. తరువాత పురుషశ్రేష్ఠుడైన భీముడు విరాటుని గౌరవిస్తూ పులివలె విలాసంగా నడుస్తూ ఆ మహారంగంలో

ప్రవేశించాడు. భీముడు అచటిజనులను ఆనందపరుస్తూ నడుము బిగించికొని, ఆ జీమూతమల్లుని ఆహ్వానించాడు. వారిద్దరూ మిక్కిలి ఉత్సాహవంతులు. ఇద్దరూ భయంకర పరాక్రమంకలవారు. ఇరువురూ పెద్ద శరీరంకల అరవైఏళ్ల మదపుటేనుగుల్లాగా ఉన్నారు. ఆ నరశ్రేష్ఠ లిద్దరూ బాహుయుద్ధం ప్రారంభించారు. వీరులు ఇద్దరూ మిక్కిలి ఆనందంలో ఉన్నారు. పరస్పరం విజయం కాంక్షించే వారిపోరు వజ్రాయుధమూ, పర్వతమూ తలపడినట్లు భయంకరంగా ఉంది. వారిరువురూ మిక్కిలిప్రసన్నులై ఉన్నారు. ఇద్దరూ బలవంతులే. పరస్పరం జయం కాంక్షిస్తూ ఒకరిపై వేరొకరు అవకాశం కోసం చూస్తున్నారు. చేతులతో పట్టినొక్కడం, వదలడం, పిడికిలితో చేతులు పట్టి బలహీనపరచటం, పడగొట్టడం, విసిరివేయటం, క్రింద పడవేసి పిండి చేయడం, పైకిలేపి శరీరం నుగ్గుచేయడం ఇలా విచిత్రంగా పోరాడుతున్నారు. శూరుల ఉత్సవంలో భుజబలంతో, మనోబలంతో శస్త్రంలేని ఘోరయుద్ధం జరిగింది. రాజా! వృత్రాసుర దేవేంద్రులవంటి ఆ బలశాలుల యుద్ధంలో పెద్దపెద్ద హర్షధ్వానాలతో జనులందరూ లేచి నిలబడి చూస్తూ ఆనందించారు. ఒక్కసారిగా లాగి ముద్ద చేయడం, ముందువెనుకలకు గుంజడం, వేగంగా వెనక్కి త్రోసి పడగొట్టడం, మోకాళ్ళతో పొడుచుకోవడం ఇలా వివిధరీతులుగా పోరాడారు. ఎత్తైన వక్షం, పొడవైన బాహువులు కలిగి, మల్లయుద్ధ నిపుణులైన ఆ ఇద్దరూ పరస్పరమూ పెద్దశబ్దంతో బెదిరించుకొంటున్నారు. ఇనుప గడియల వంటి బాహువులతో ఒకరినొకరు పట్టుకొని పోరాడుతున్నారు. అంతలో శత్రుసంహారకుడైన భీముడు పెద్దపులివలె గర్జిస్తూ, ఏనుగువలె శబ్దంచేసే ఆ మల్లుణ్ణి చేతులతో పైకెత్తి పట్టుకొన్నాడు. పెద్ద భుజాలతో భీముడు అతణ్ణి పైకి పట్టుకొని త్రిప్పసాగాడు. అక్కడ ఉన్న మల్లులూ, మత్స్యదేశస్థులూ ఎంతో ఆశ్చర్య పడ్డారు.

వందసార్లు తిప్పడంతో బలం నశించి అచేతనమై పోయిన ఆ మల్లుని మహాబాహువైన భీముడు పడవేసి, నేలరాచాడు. జీమూతమల్లుడు అలా చనిపోతే బంధువులతో బాటు విరాటరాజు ఎంతో ఆనందించాడు. పెద్దమనసుగల కుబేరుని వంటి విరాటరాజు ఆనందంతో ఆ రంగభూమిపై భీమునికి ధనమిచ్చాడు. ఆ భీముడు అలాగే చాలామంది మల్లులనూ, బలవంతులైన పురుషులనూ సంహరిస్తూ మత్స్యరాజుకు మిక్కిలి ప్రీతి కలిగించేవాడు. తనతో సమానుడైన పురుషుడు లేకపోవడంతో

భీమసేనుడు పులులతోనూ, సింహాలతోనూ, ఏనుగులతోనూ యుద్ధం చేసేవాడు. విరాటుడు అంతఃపుర(స్త్రీల నడుమకూర్చొని బలిష్ఠాలైన సింహాలతో భీమునిచేత యుద్ధం చేయించేవాడు. అర్జునుడు కూడ తన నృత్యగీతాలతో విరాటరాజునూ, అంతఃపుర(స్త్రీలనూ సంతోషపెట్టేవాడు. నకులుడు అక్కడక్కడ నుండి ఆ గు(ర్రాలతో ఆ విరాటుని సంతోషపెట్టేవాడు. సంతోషించిన రాజు అతనికి తగినంత ధనమిచ్చేవాడు. సహదేవుని చుట్టూ సుశిక్షితాలయిన ఎద్దులను చూసి విరాటరాజు అతనికి ఎంతో ధనమిచ్చేవాడు. క్లేశాలనుభవిస్తున్న ఆమహారథులను చూసి ద్రౌపది మనసు కష్టపెట్టుకొని నిట్టూరుస్తూ ఉండేది. ఇలా పురుషశ్రేష్ఠులైన పాండవులు విరాటరాజుకు పనులుచేస్తూ అజ్ఞాతంగా నివసించారు.

14. కీచకుడు ద్రౌపదిని మోహించుట, ఆమె తిరస్కరించుట.

మహారథులైన కుంతీపు(త్రులు మత్స్యరాజు నగరంలో (ప్రచ్ఛన్నులై ఉంటూండగా అప్పటికి పదిమాసాలు పైబడి గడిచిపోయాయి. (దుపదుని కూతురు, స్వయంగా రాణివలె సేవలు పొందడానికి అర్హురాలూ అయిన ద్రౌపది సుదేష్ణకు సేవలు చేస్తూ మిక్కిలి కష్టంగా కాలం వెళ్లబుచ్చుతోంది. సుదేష్ణ భవనంలో అలా సేవ చేస్తున్న పాంచాలి మహారాణి సుదేష్ణను, అంతఃపుర(స్త్రీలను సంతృప్తి పరిచింది. ఆ సంవత్సరం చివరకు వచ్చాక ఒకరోజు విరాటరాజు సేనాపతి, మహాబలవంతుడు అయిన కీచకుడు ద్రౌపదిని చూశాడు. రాజమందిరంలో దేవతామూర్తిలా తిరుగుతూ, దేవకన్యలా మెరిసిపోతున్న ద్రౌపదిని చూసి కీచకుడు మన్మథ బాణపీడితుడై ఆమెను పొందాలను కొన్నాడు. కామాగ్నిలో దహించుకుపోతున్న ఆ కీచకుడు తన అక్క సుదేష్ణ దగ్గరకు వెళ్లి నవ్వుతూ అన్నట్లుగ ఇలా అన్నాడు. 'సుదేష్ణా! తన రూపంతో నన్ను మిక్కిలిగ ఉన్మత్తుడిని చేస్తున్న ఈమెను ఇంతకుముందెప్పుడూ విరాటుని అంతఃపురంలో నేను చూడనే లేదు. తన దివ్యగంధంతో ఈమె నన్ను మదిరలా మత్తెక్కిస్తోంది. శుభాంగీ! ఈమె ఎవరు? ఈమె దేవతా(స్త్రీవలె అందంగా ఉంది. ఈమె ఎవరి భార్యయో ఎక్కడనుండి వచ్చిందో నాకు చెప్పు. నాహృదయాన్ని కలచివేస్తూ ఈమె తన వశం చేసుకొంటోంది. ఈ రోగానికి ఈమెను పొందడం కంటె వేరొక మందు ఏదీ లేదు అనిపిస్తోంది నాకు. ఈసుందరి నీ దాసియా! ఆశ్చర్యంగా ఉంది.

ఈమె రూపం నిత్యనూతనం అనిపిస్తోంది నాకు. నీ దగ్గర దాసీపని చేయడం ఈమెకు ఎంతమాత్రం తగినది కాదు. నా ఇంటికి యజమానురాలిగా నాకున్నదంతా ఆమె ఏలుకోవాలని నాకోరిక. నా భవనంలో చాలా గుర్రాలు, ఏనుగులు, రథాలు ఉన్నాయి. సేవ చేయడానికి ఎంతోమంది పరిజనులు ఉన్నారు. అంతులేని సంపద ఉంది. అనేకవిధాలైన భోజనపానీయాలు ఉన్నాయి. చూడటానికి మనోహరంగా ఉంటుంది. బంగారుచిత్రాలు ఆ అందాన్ని ఇనుమడింప చేస్తున్నాయి. అటువంటి విశాలమైన నాభవనంలో అడుగుపెట్టి ఈసుందరి దానికి మరింత శోభ కలిగించాలి." తరువాత కీచకుడు సుదేష్ణ అనుమతి తీసుకొని రాచకూతురయిన ఆ ద్రౌపది దగ్గరకు వచ్చి, అడవిలో నక్క ఆడసింహాన్ని బుజ్జగిస్తున్నట్లుగా ఆమెతో ఇలా అన్నాడు. 'కల్యాణీ! నీ వెవరవు? ఎవ్వరి దానవు? సుముఖీ! నీవు ఎక్కడినుండి ఈ విరాటనగరానికి వచ్చావు? శుభాంగీ! ఉన్నదున్నట్లు చెప్పు. నీ యీ రూపం శ్రేష్ఠమైనది. నీ కాంతి దివ్యమైనది. నీ సుకుమారత ఉత్తమమైనది. నీముఖం మచ్చలేని చంద్రుడిలా ప్రకాశిస్తోంది. చక్కని కనుబొమలు కల సర్వాంగసుందరీ! నీ విశాలమైన కన్నులు తామరరేకులతో సమానాలు. నీమాట కోకిల స్వరం వలె ఇంపుగా ఉంది. సలక్షణమైనసుందరీ! నీవంటి మనోహరమైన రూపంగల స్త్రీని ఈ భూలోకంలో ఇంతకు ముందెన్నడూ నేను చూడలేదు. చక్కని నడుము కలదానా! నీవు పద్మం నివాసంగా కల లక్ష్మివా? లేక ఆకృతి దాల్చిన ఐశ్వర్యానివా? సుముఖీ! హ్రీ (లజ్జ), శ్రీ, కీర్తి, కాంతి - అనే వారిలో నీవు ఎవరవు? నీవు మన్మథుని శరీరంతో ఆటలాడుకొనే అతిశయ రూపవతి అయిన రతీదేవివా? చక్కని కనుబొమలు కలదానా! చంద్రుని అత్యుత్తమ మైన కాంతివలె మిక్కిలిగా ప్రకాశిస్తున్నావు. నీ ముఖచంద్రుడు సాటిలేని కాంతితో అలరారుతున్నాడు. అర్ధనిమీలితాలైన నీకనురెప్పలు వెన్నెలవలె ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. దివ్యకిరణాలతో ఆవరింపబడిన నీ ముఖ మనే చంద్రుడు దివ్యకాంతితో మనసును లోగొంటున్నాడు. ప్రపంచంలోని ఏ మానవు డయినా నిన్ను చూసి కామపరవశుడు కాకుండా ఉండగలడా! ఎత్తయి, స్థూలమై, శోభావహమై, గుండ్రని, క్రిక్కిరిసిన నీచనుదోయి హారాదిభూషణాలకు యోగ్యమై మిక్కిలి సుందరంగా ఉన్నది. అందమైన కనుబొమలు, మనోహరమైన చిరునవ్వుకల సుందరీ! తామరమొగ్గలవంటి నీ వక్షోజాలు రెండూ మన్మథుని అంకుశాలవలె నన్ను అమితంగా

బాధిస్తున్నాయి. మూడు వళులచే ముడుతలుపడి అందమైన నీ నడుము స్తనభారం చేత కొద్దిగా వంగినట్లు కనబడుతోంది. చేతి వ్రేళ్లకొనల చేత కొలవడానికి వీలయినంత (గుప్పిటలో ఇమిడేంత) సన్నంగా ఉంది నీ నడుము. భామినీ! ఇసుకతిన్నెలవలె మనోహరమైన నీ జఘనభాగం చూడగానే కామ మనే అసాధ్యరోగం నావంటి వీరుని కూడా ఆక్రమిస్తోంది. నిర్దయుడైన మన్మథుడు అగ్నిస్వరూపుడై నామన స్సనే అడవిని దావాగ్నివలె దహిస్తున్నాడు. నిన్ను పొందాలనే బలమైన కోరిక నేయివలె అగ్నిని మరింత పెంచుతోంది. దానితో మన్మథుడు తీవ్రంగా నన్ను దహించివేస్తున్నాడు. ముద్దుగుమ్మా! నీ పొందు అనే మేఘం చేత ఆత్మసమర్పణ మనే వర్షం ద్వారా ఈ మండుతున్న మదనాగ్నిని చల్లార్చు.

చంద్రముఖీ! నామనసుకు ఉన్మత్తత కలిగించే మన్మథుని బాణసమూహాలు నీ సమాగమం అనే ఆశచేత ఒరపిడిపొంది మరింత పదునెక్కాయి. కాటుక కనులదానా! కోపంతో మన్మథుడు వేస్తున్న ఆ భయంకరమైన తీవ్రబాణాలు దయలేనివి. అవి వేగంగా నామనసును చీల్చి అందులో ప్రవేశిస్తున్నాయి. అవి నాకు ప్రేమోన్మాదాన్ని పుట్టిస్తున్నాయి. స్వయంగా నీవు ఇచ్చే సంభోగరూపమైన ఔషధంచేత నన్ను నీవే ఉద్ధరించగలవు. విలాసినీ! చిత్రాలైన మాలలు, సుందరమైన వస్త్రాలు ధరించి సర్వాభరణభూషితురాలవై నాతో కలిసి కామభోగాలు ఇచ్చువచ్చినట్లు అనుభవించు. నీవు సుఖం లేని ఇటువంటి చోట్ల ఉండతగవు. నీవు సుఖాలు అనుభవించడానికి యోగ్యమైనదానవు. కానీ సుఖాలకు దూరమైనావు. తీవిగా నడిచేదానా! నా వలన సర్వోత్తమసౌఖ్యాలు పొందు. అమృతం వలె రుచికరమై, మనోహరమైన రకరకాల పానీయాలను త్రాగుతూ సుఖం కలిగేలా రమించు. అదృష్టవంతురాలా! అనేక విధాలైన భోగసామగ్రిని, సర్వోత్తమ సౌభాగ్యాన్ని పొంది, ఆ ఉత్తమోత్తమ శుభ భోగాలతోపాటు త్రాగడానికి యోగ్యమైన పానీయాలనూ ఆస్వాదించు. నీ ఈ సర్వోత్కృష్ట సౌందర్యం ఇక్కడ వ్యర్థమై పోతోంది. భామినీ! ఉత్తమమైన హారాన్ని ఎవరూ మెడలో ధరించకపోతే శోభావిహీన మవుతుంది. అలాగే అందగత్తెవు అయినప్పటికీ నీ యీ సౌందర్యం ఎవరికీ చెందని కారణంగా శోభించడం లేదు. చారుహాసినీ! (నీవు కోరితే) ఇంతకుముందున్న నా భార్యలందరిని వదిలివేస్తాను. లేదా వారు నీకు దాసీలు అవుతారు. సుందరీ! నేను కూడా దాసుడిలా ఎప్పుడూ నీకు వశమై

ఉంటాను.' అపుడు ద్రౌపది అంది -' సూతపుత్రా! నీవు కోరదగని నన్ను కోరుతున్నావు. నేను హీనజాతి దానను. పైగా సైరంధ్రిని. వెగటు కలిగించే వస్త్రాలను ధరించినదానను. ఇతరులకు కేశాలంకారాలు చేసి జీవించే దాసిని.

(బుద్ధిమంతుడు తన భార్యయందే అనురక్తుడై ఉండటానికి ప్రయత్నిస్తాడు. తన భార్యయందు అనురాగం కల పురుషుడు శీఘ్రంగా శుభాలను పొందగలుగుతాడు. మనుష్య డెప్పుడూ పాపాత్ముడు కాకూడదు. అపకీర్తి పొందకూడదు. తనభార్యయందే అనురాగం కలిగి ఉండాలి. ఇది పరమధర్మం. చనిపోయాక కూడా అతనికి శుభాన్ని కలిగిస్తుం దిది. ఇందులో సంశయం లేదు. తమకులస్త్రీలు పురుషునికి ఇహపరలోకాలలో కూడా మేలు చేకూరుస్తారు. అపరకర్మలు చేసి తిలోదకాలు ఇవ్వడం ద్వారా చనిపోయిన వ్యక్తికి తృప్తి కలిగిస్తారు. వారి ఈ పనులన్నిటినీ బుద్ధిమంతులైన పురుషులు అక్షయమనీ, ధర్మసంగత మనీ, స్వర్గ ప్రాప్తికారక మనీ చెప్తూ ఉంటారు. తమ కుల స్త్రీలవలన పుట్టిన సంతానం కులంలో గౌరవింప బడుతుంది. సమస్తప్రాణులకు తమతమ భార్యలే ప్రీతిపాత్రం అవుతారు. కాబట్టి నీవుకూడా ఆలాగే నడుచుకొని ధర్మపరుడవు కమ్ము. పరస్త్రీలంపటుడైన పురుషుడు ఎన్నడూ శుభాలను పొందలేడు.)

అన్నిటినీమించి నేను పరస్త్రీని. నీకు శుభమగు గాక. ఇప్పుడు నాతో ఇలా మాటలాడడం నీకు ఏవిధంగానూ తగినది కాదు. ప్రపంచంలోని అన్ని ప్రాణులకు తమ స్త్రీయే ప్రియమైనది అవుతుంది. నీవు ఈ ధర్మాన్ని గురించి ఆలోచించు. పరస్త్రీయందు నీకు ఎప్పుడూ ఏ కోరికా కలగ కూడదు. చేయకూడని అనుచితకార్యాలు సర్వథా విడువదగినవి. ఇదే సత్పురుషుల వ్రతం. అసత్యవిషయాలలో ఆసక్తి కలిగిన పాపాత్ముడైన పురుషుడు మోహంలో పడి ఘోరమైన అపకీర్తిని పొందుతాడు. లేదా పెద్దభయాన్ని (మృత్యువును) ఎదుర్కొనవలసి ఉంటుంది.'

సైరంధ్రి ఈ రీతిగా హెచ్చరించినా కీచకునకు బుద్ధి రాలేదు. వాడు కామమోహితుడై ఉన్నాడు. పరస్త్రీయొక్క పొందువలన లోకనింద కలుగుతుంది. ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడవచ్చు. ఇన్ని దోషాలు దానివలన కలుగుతాయని తెలిసినా ఇంద్రియనిగ్రహం లేని కీచకుడు ద్రౌపదితో ఇలా అన్నాడు. 'వరారోహా! నా ఈ కోరికను తిరస్కరించకు. చారుహాసినీ! నీగురించే నేను మన్మథునిచే పీడింపబడుతున్నాను. భీరూ! నేను నీకు అధీనుడను. ప్రియం పలుకుతున్నాను. నన్ను తిరస్కరించి నిశ్చయంగా నీవు పశ్చాత్తాపం పొందుతావు. నేను ఈ సమస్తరాజ్యానికి అధిపతిని. అంతేకాదు. ఈ రాజ్యాన్ని నిలబెట్టినది నేనే. బలపరాక్రమాలలో ఈ భూమి మీద నాతో సమానులు ఎవరూ లేరు. రూపయౌవన సౌభాగ్యాలతోను,

సర్వోత్తమమైన భోగాలతోను నాతో సాటిరాగలవాడు ఈ భూమిమీద మరొకడు లేడు. కల్యాణి! సమస్తమైన మనోరథాలు తీర్చగల అనుపమమైన భోగాలు ఇక్కడ నీకు అనుభవించడానికి అందుబాటులో ఉండగా ఈ దాసిపనిలో నీ కెందుకు ఆసక్తి? నేను ఈ సమస్తరాజ్యాన్నీ నీకు అర్పిస్తున్నాను. నీవు ఇప్పుడు దీనికి మహారాణివి. నన్ను స్వీకరించు. నాతో కూడి ఉత్తమోత్తమభోగాలు అనుభవించు.'

కీచకుని ఆ పాపపుమాటలు వినక పరమసాధ్వి అయిన ఆ ద్రౌపది అతని మాటలను నిరసిస్తూ ఇలా బదులు చెప్పింది. 'సూతపుత్రా! నీవు ఇలా మోహజాలంలో పడకు. ఇప్పుడే నీ ప్రాణాలు పోగొట్టుకోకు ఐదుగురు భయంకరులైన గంధర్వులు నన్ను నిత్యం రక్షిస్తూ ఉంటారని తెలుసుకో. గంధర్వులే నాపతులు. నీవు నన్నెప్పటికీ పొందలేవు. వారు ఆగ్రహిస్తే నిన్ను చంపుతారు. కాబట్టి నిన్ను నీవు అదుపులో ఉంచుకో. ఈ పాపబుద్ధిని విడిచిపెట్టు. సర్వనాశనం కాకు సుమా! ఎవరూ నడవని మార్గంలో నీవు నడవాలనుకొంటున్నావు. మందబుద్ధి అయి ఒడ్డున కూర్చున్న కదలలేని బాలుడు నది అవతలి ఒడ్డుకు చేరాలని కోరుకొన్నట్లుగ నీవు కూడా వినాశకరమైన పని చేయాలని కోరుకొంటున్నావు. సూతసుతుడా! నన్ను పాపచింతనతో చూస్తే నీవు పాతాళంలో దాగినా, ఆకాశానికి ఎగిరినా, సముద్రపు ఆవలితీరానికి పారిపోయినా నాభర్తల చేతినుండి తప్పించుకోలేవు. ఎందుకంటే వారు దేవపుత్రులు. ఆకాశంలో సంచరించ గలిగినవారు. వారు తమ శత్రువులను మథించగలిగిన శక్తి సంపన్నులు. సూతపుత్రా! నీవు నన్ను అవమానిస్తున్నావు. కొడుకులతో బంధువులతో కూడా నీకు ఇప్పుడే చేటు మూడుతుంది. నీ వినాశనానికి ఇంక సమయం లేదు. వీరులైన గంధర్వులచేత రక్షింపబడే నేను నీకు పొందరానిదానను. మగ్గిన తాటిపండు తొడిమనుండి ఎలా రాలిపోతుందో అలాగే నన్ను అవమానించిన నీవు రాలిపోతావు. నీవు నన్నెరుగక కామాతురుడవై ఇలా వెంగలి మాటలు పలుకుతున్నావు. అశక్తుడైన పురుషుడు ఎంత ప్రయత్నించినా పర్వతాన్ని ఎగిరి దాటలేడు. దిక్కులను శరణుచొచ్చి తిరిగినా, కొండగుహలలో దుర్గమ కందరాలలో దాగినా, భూమిలో చొచ్చుకుపోయినా, హోమాలు జపాలు చేసినా, కొండశిఖరాలనుండి దూకినా, ప్రచండకిరణాలు కలిగిన సూర్యాగ్నులను శరణు వేడినా, మహాత్ములైన గంధర్వుల భార్యనైన నన్ను అవమానించిన నీవు వారి చేతులనుండి తప్పించుకొని బ్రతుకలేవు. నీ ఈ మాటలన్నీ వ్యర్థాలే. మహాపర్వతాన్ని

త్రాసులో ఉంచి తూచడం లాగే నన్ను పొందడం కూడా అసాధ్యం. వేసవిలో మిట్టమధ్యాహ్నంవేళ కార్చిచ్చుతో మండుతూ ఉన్న అడవిలోకి ఆతురతతో స్వయంగా ప్రవేశించిన వానివలె నీవు నీ చావు కోరి నీ వంశమంతా నశించడానికే ఇందులో ప్రవేశించాలనుకొంటున్నావు. నేను ఇక్కడ ఎవరికీ తెలియకుండా బ్రతుకుతున్నాను. అయినా నీవు తెలిసి తెలిసీ నన్ను అవమాన పరుస్తున్నావు. కాని ఒక్క విషయం గుర్తుంచుకో. నీవు అలాచేసి నీప్రాణాలను దక్కించుకోవడం కోసం గంధర్వుల, మహర్షుల, దేవతల దగ్గరకు పోయినా, నాగలోకం, అసురలోకం, రాక్షసస్థావరాలలో దాగినా నీకు అక్కడ శరణు లభించదు. కీచకా! రోగి కాలరాత్రిని ఆహ్వానించినట్లుగా నీవు ఎందుకు ఇంతగా పట్టుపట్టి ఈ నాడు నన్ను పొందాలని ప్రార్థిస్తున్నావు? తల్లి ఒడిలోని బిడ్డ ఆకాశం లోని చందమామను పట్టుకోవాలని కోరుకొన్నట్లుగా నీవు నన్ను పొందాలనుకొంటున్నావు. కీచకా! ఆ గంధర్వుల ప్రియపత్నినైన నన్ను అనుచితంగా కోరిన నీకు ఆకాశంలో గాని, భూమిమీద గాని శరణు ఇచ్చేవారు లేరు. నీ జీవితాన్ని సురక్షితంగా ఉంచుకోవాలనే ముందుచూపు గాని, ఆలోచనగాని చేయలేనంత కామాంధుడవు అయ్యావు.'

15. సుదేష్ణ కీచకుని ఇంటికి ద్రౌపదిని పంపుట.

రాజకుమారి ద్రౌపది చేత ఇలా తిరస్కరింపబడి వెళ్లిన కీచకుడు హద్దు లెరుగని భయంకరమైన కామంలో కొట్టుమిట్టాడుతూ సుదేష్ణతో ఇలా అన్నాడు. 'కేకయరాజపుత్రీ! గజగమన అయిన ఆ సైరంధ్రి నాదగ్గరకు వచ్చి నన్ను అంగీకరించే ఉపాయం ఆలోచించు. ఆ పనిచెయ్యి. ఆమె మీది మోహంతో నా ప్రాణాలు పోకుండా చూడు.' ఈ రీతిగా పదేపదే విలపిస్తున్న కీచకుని మాటలు విని విని విరాటుని మహారాణి సుదేష్ణ మనసులో అతనిపట్ల జాలి కలిగింది.

(సుదేష్ణ ఇలా అన్నది. 'ఈ సుందరి సైరంధ్రి నా ఆశ్రయంలో ఉంది. నేనీమెకు అభయం ఇచ్చాను. నీకు మేలు కలుగుగాక! ఈమె ఎంతో సదాచారిణి. నేను ఈమెకు నీ మనోగతాన్ని చెప్పలేను. ఈమెను పరపురుషు లెవరూ దుర్బుద్ధితో తాక లేరు. ఈమెను ఐదుగురు గంధర్వులు రక్షిస్తూ ఉంటారు. సుఖపెడుతూ ఉంటారు ఈమె ఈ విషయాన్ని మొదటిసారి కలిసినపుడే చెప్పింది. ఈ సుందరి కోపిస్తే తన భర్తలు ప్రాణాలను తీస్తారని నా ఎదుట వాస్తవం చెప్పింది. రాజుకూడా ఈమెమ చూసి మోహితు డయ్యాడు. అప్పుడు నేను (ఆమె చెప్పిన యథార్థ వచనాలన్ని చెప్పి)

ఎలాగో నచ్చచెప్పాను.అప్పటినుండి ఆయనకూడా లోలోపలే ఆమెను మెచ్చుకోసాగారు. గంధర్వులు ప్రాణాలు తీస్తారనే భయంతో మహారాజు ఎప్పుడూ కూడా మనసులోనైనా ఆమెను గురించి తలచుకొనేవారు కారు. మహాత్ములైన ఆ గంధర్వులు గరుడునివలె, వాయువువలె, మిక్కిలి వేగం కలవారు. వారు కోపిస్తే ప్రళయకాలపు సూర్యులవలె ముల్లోకాలను దగ్ధం చేయగలరు. సైరంధ్రి స్వయంగా నాకు వారి బలాన్ని గూర్చి చెప్పింది. సోదరప్రేమ కారణంగా నేను నీకు ఈ రహస్యాన్ని చెప్పాను. ఈమెను ధ్యానిస్తూ నీవు అనూహ్యమైన సంకటపరిస్థితిలో చిక్కుకోకు. గంధర్వులు బలవంతులు. వారు నీ వంశాన్ని, సంపదనూ కూడా నాశనం చేస్తారు. అందుకని నీకు నీప్రాణాలమీద తీపి ఉంటే, నాకు ప్రియాన్ని చేయాలనుకొంటే సైరంధ్రిమీద మనసు పడకు. ఆమెను గూర్చిన ఆలోచనలు వదిలి పెట్టు. ఆమె దగ్గరకు కూడా పోవద్దు.' సుదేష్ణ ఇలా చెప్పగానే దుష్టాత్ముడైన కీచకుడు తన సోదరితో ఇలా అన్నాడు. 'నేను వందలు, వేలు, లక్షల గంధర్వులనుకూడా ఒక్కడినే చంపి వేయగలను. ఇక ఐదుగురొక లెక్కా?' కీచకుడిలా చెప్పేసరికి సుదేష్ణ శోకంతో మిక్కిలి వ్యధ చెందింది. మనసులోనే "అయ్యో! గొప్పదుఃఖం, సంకటం, పాపం కలుగుతున్నాయి" అనుకొంది. దీని వలన కలిగే పరిణామాన్ని తలచుకొని రోదించసాగింది. మనసులో తన తమ్ముడు పిచ్చి మాటలు మాట్లాడుతూ స్వయంగా పాతాళంలోనో, బడబాగ్నిలోనో పడిపోతున్నాడని అనుకొంది. (ఆ తరువాత ఆమె కీచకునికి ఇలా చెప్పసాగింది) 'నాకు తెలుసు. నీకారణంగా నా సోదరులు, మిత్రులూ అందరూ నశించిపోతారు. నీవు ఇటువంటి అనుచితమైన కోరికను మనసులో ఉంచుకొన్నావు. నేను దీనికోసం ఏమి చేయగలను? నీ మేలేదో నీవు తెలుసు కోలేకపోతున్నావు. కేవలం కామానికి దాసుడి వవుతున్నావు. పాపీ! నిశ్చయంగా నీ ఆయువు తీరిపోయింది. అందుకే నీవు కామమోహితుడవు అవుతున్నావు. నరాధమా! నీవు నన్ను చేయకూడని పాప కృత్యానికి ఒడిగట్టేలా చేస్తున్నావు. కులంలో ఒక్కడు పాపం చేస్తే, వాని కారణంగా ఆ కులంలోని వారందరూ నశించిపోతారని పూర్వం పెద్దలు, నిపుణులు సరిగానే చెప్పారు. నీవు యముని ఇంటికే వెళ్తున్నావు. ఇందులో సందేహం లేదు. నీవు నీతో బాటు నిరపరాధులైన సమస్త బంధువులనూ కూడా చంపించబోతున్నావు. నేను ఈ సమస్త పరిణామాలనూ తెలిసికూడా సోదరప్రేమతో నీ ఆజ్ఞ పాటిస్తున్నాను. అదే నాకు అన్నింటిని మించిన దుఃఖకారణం. నీవు మాత్రం వంశాన్ని అంతరింపచేసి సంతుష్టుడవు అగుదువు కాని.')

తరువాత సుదేష్ణ తాను చేయవలసిన దేమిటో ఆలోచించి, కీచకుని కోరికను గుర్తించి, అతనికి ద్రౌపదియొక్క పొందు లభించడానికి తగిన ఉపాయాన్ని నిశ్చయించుకొని అతనితో ఇలా అంది. 'నీవు పర్వదినాన్ని పురస్కరించుకుని నీ ఇంటిలో మద్యాన్ని, భోజనసామగ్రిని సిద్ధం చేయించు. ఆపైన నేను సైరంధ్రిని సుర తెచ్చే మిషమీద నీదగ్గరకు పంపుతాను. అక్కడికి పంపబడిన ఈమెను ఏకాంతంలో ఎలాంటి ఆటంకం లేకుండా నీ ఇచ్ఛానుసారం బుజ్జగించుకో. నీ బుజ్జగింపులు పొందాక ఆమె నీకు వశమవడానికి సిద్ధం కావచ్చు.'

సోదరి మాటలను విని ఊరట పొందిన కీచకుడు అప్పుడు అక్కడనుండి వెళ్లిపోయాడు. ఇంటికి వెళ్లి అతడు సమయానుకూలంగా నేర్పుగల వంటవాళ్లను పిలిపించి రాజులుపయోగించ తగిన ఉత్తమమైన, రుచికరమైన మద్యాన్ని తెప్పించాడు. ఇంకా రకరకాల పిండివంటలను, శ్రేష్ఠమైన అన్నపానాలను తయారు చేయించాడు. ఆ ఏర్పాట్లన్నీ అయిన తరువాత కీచకుడు సుదేష్ణను భోజనానికి పిలిచాడు. మూఢాత్ముడైన కీచకుడు మెడలో ఉరిత్రాడు కట్టబడిన పశువువలె తనను సమీపిస్తున్న మృత్యువును గుర్తించ లేకపోతున్నాడు. అతడు ద్రౌపదిని పొందాలని ఉవ్విళ్ళూరుతున్నాడు. కీచకుడంటున్నాడు. 'సుదేష్ణా! అనేక విధాలైన మధురమైన మద్యాలను తెప్పించాను. రకరకాల వంటకాలను సిద్ధం చేయించాను. ఇక ఇప్పుడు సైరంధ్రి నా ఇంటికి వచ్చేలా నీవు ఆమెకు చెప్పు. ఏదో ఒక పని వంకతో ఈరోజు ఆమెను త్వరగా నాదగ్గరకు పంపు. నా కోరికను త్వరగా సిద్ధింపచేయి. నేను భగవంతుడైన శంకరుని శరణు కోరి "ప్రభూ! నన్ను సైరంధ్రితో కలుపు. లేదా మరణం ప్రసాదించు" అని వేడుకొంటున్నాను.'అన్నాడు. అప్పుడు సుదేష్ణ దీర్ఘంగా నిట్టూర్చి అతనితో "నీవు నీ ఇంటికి వెళ్లు. నేను సైరంధ్రిని వెంటనే అక్కడకు మదిర తెమ్మని పంపుతాను." అన్నది. ఆమె అలా చెప్పడంతో సైరంధ్రిని తలచుకొంటూ పాపాత్ముడైన కీచకుడు వెంటనే తిరిగి తన ఇంటికి వెళ్లిపోయాడు. అప్పుడు సుదేష్ణ సైరంధ్రిని కీచకుని ఇంటికి పంపదలచింది.

సుదేష్ణ అంటోంది.' సైరంధ్రీ! లే. కీచకుని ఇంటికి వెళ్లు. కల్యాణీ! నన్ను దాహం బాగా బాధిస్తోంది. అందుకని అక్కడి నుండి నేను త్రాగడానికి తగిన పానీయాన్ని తెచ్చిపెట్టు.' సైరంధ్రి అన్నది.' రాజకుమారీ! నేను అతని ఇంటికి వెళ్లలేను. మహారాణీ! నీకు కూడా తెలుసుగదా. అతడెంత సిగ్గుమాలినవాడో. నేను నీ భవనంలో నా భర్తల దృష్టిలో స్వేచ్ఛాచారిణిగ, వ్యభిచారిణిగ మారి ఉండలేను. దేవీ! పూర్వం నేను ఈ రాజభవనంలో ప్రవేశించే సమయంలో చేసిన ప్రతిజ్ఞ కూడా నీకు తెలుసు. మూర్ఖుడైన కీచకుడు మదనదర్పంతో ఉన్మత్తుడై ఉన్నాడు. అతడు నన్ను చూడగానే అవమానిస్తాడు. కనుక నేను అక్కడికి వెళ్లను. రాజపుత్రీ! నీ దగ్గర ఇంకా చాలామంది దాసీలు ఉన్నారు. వారిలో ఎవరినైనా ఒకరిని పంపు. నీకు మేలు జరుగుతుంది. నేను వెళ్తే కీచకుడు తప్పకుండా నన్ను అవమానపరుస్తాడు.' అప్పుడు సుదేష్ణ ఇలా

అన్నది. 'నేను నిన్ను ఇక్కడి నుండి పంపుతున్నాను. కనుక అక్కడ అతడు నీకు ఏ హానీ చేయడు' అని చెప్పి సుదేష్ణ ద్రౌపది చేతిలో మూత ఉన్న ఒక బంగారు పాత్రను పెట్టింది. ద్రౌపది మద్యం తేవడానికి ఆ పాత్రను తీసుకొని శంకిత హృదయంతో ఏడుస్తూ, (తన పాతివ్రత్యాన్ని రక్షించుకోవడానికి మనసులోనే) సూర్యభగవానుని వేడుకొంటూ కీచకుని యింటికి బయలుదేరింది. సైరంధ్రి అన్నది. 'భగవంతుడా! నేను నా పతులను తప్ప వేరెవరినీ మనసులో తలవని దాననయితే, ఆ సత్యప్రభావం వల్ల కీచకుడు తన ఇంటికి వచ్చిన అబలనైన నన్ను బలవంత పెట్టకుండును గాక!' అన్ని విధాలా అబల అయిన ఆ ద్రౌపది అలా కొద్దిసేపు సూర్యుణ్ణి ఆరాధిస్తూ ఉండిపోయింది. అప్పుడు సూర్యుడు ఆ ద్రౌపదియొక్క పరిస్థితిని అంతటిని గ్రహించి ఆమె రక్షణకోసం అదృశ్యరూపంలో ఒక రాక్షసుడిని నియమించాడు. వాడు ఎట్టి పరిస్థితులలోను పతివ్రత అయిన ద్రౌపదిని అక్కడ అసహాయురాలిగా వదిలిపెట్టడు.

భీతి చెందిన ఆడలేడివలె భయపడుతూ ద్రౌపది సమీపించడం చూసి కీచకుడు ఆనందంతో పొంగిపోయి లేచి నిలబడ్డాడు. నదిని దాటాలనుకొన్నవానికి నావ లభించినంత ఆనందం పొందాడు.

16. కీచకుడు ద్రౌపదిని అవమానించుట.

కీచకుడిలా అన్నాడు. 'నీకు స్వాగతం. ఈ రాత్రి చక్కగా గడిచి నాకు సుప్రభాత మయింది. నాకు రాణివై ప్రీతి కలిగించు. నీకోసం బంగారు హారాలు, శంఖపుగాజులు, వివిధ నగరాల్లో తయారుచేయబడిన శుభ్రమైన పసిడి తాటంకాలు, అందమైన మణిరత్నాభరణాలు, పట్టుచీరలు, మృగచర్మాలు మొదలైనవి తెమ్మని నేను దాసీలను ఆజ్ఞాపిస్తాను. నేను నీకోసం ఇంతకుముందే నా దివ్యమైన శయ్యను ఏర్పాటు చేసి ఉంచాను. రా. నాతో కలిసి తీయని మాధ్వీరసాన్ని త్రాగుదువుగాని.'

(ద్రౌపది ఇలా సమాధానం చెపుతోంది.' దుర్మతీ! నిషాదుడు బ్రాహ్మణస్త్రీని అంటజాలనట్లుగా నీవు నన్ను తాకలేవు. నీవు నన్ను అవమానించి దుర్గతిని పొందకు. ధర్మమర్యాదను అతిక్రమించి పరస్త్రీని స్పృశించిన మనుష్యులు చాలామంది గుంటల్లో పార్లే పురుగులుగా పుడతారు. నీవు అట్టి దుర్దశను పొందకు.)

రాజపుత్రి సుదేష్ణ నన్ను మదిర తెమ్మని నీవద్దకు పంపింది. "నాకు బాగా

దాహం వేస్తోంది. వెంటనే నేను త్రాగడానికి తగిన పానీయాన్ని తీసుకురా" అని కూడా చెప్పింది.' కీచకు డిలా అన్నాడు.'కళ్యాణీ! రాజపుత్రి సుదేష్ణ అడిగినదాన్ని వేరేదాసీలు తీసుకువెడతారులే' అని చెప్పి సూతపుత్రుడు ద్రౌపది కుడిచేతిని పట్టుకొన్నాడు. ద్రౌపది 'ఓరిపాపీ! నేను ఇంతవరకు ఎప్పుడూకూడా మనసులో నైనా కోపంతో నాపతులకు విరుద్ధంగా ప్రవర్తించని దాన నయితే, ఆ సత్యప్రభావానికే నీవు చిక్కి, నశించిపోవడం చూస్తాను.'

విశాలమైన కన్నులు కల ఆ ద్రౌపది ఆ రీతిగా తన్ను నిందించడం చూసి కీచకుడు ఆమెను పట్టుకోబోయాడు. కాని ఆమె వెంటనే అతడిని త్రోసివేసి వెనక్కి జరిగింది. అంతలోనే కీచకుడు ఆమె పైట కొంగును పట్టుకొన్నాడు. అప్పుడతడు వేగంగా ఆమెను తనవశం చేసుకోవాలని ప్రయత్నించాడు. ఇటు రాజకుమారి ద్రౌపది కూడా మాటిమాటికీ నిట్టూరుస్తూ అతని నుండి విడిపించుకోవడానికి ప్రయత్నించసాగింది. ఆమె ప్రయత్నపూర్వకంగా తన రెండు చేతులతో కీచకుడిని ఒక్కసారిగా వేగంగా త్రోసివేసింది. దానితో ఆ పాపాత్ముడు మొదలు నరికిన చెట్టులాగా నేలమీద కూలబడ్డాడు. అలా కీచకుడు పట్టుకోగా అతడిని భూమిమీద పడద్రోసి భయంతో వణికిపోతూ ద్రౌపది పరుగెత్తుతూ యుధిష్ఠిరుడు ఉన్న రాజసభను శరణుచొచ్చింది. కీచకుడు ఆమె జుట్టు పట్టుకొన్నాడు. పైగా అతడు రాజుగారు చూస్తూ ఉండగానే ఆమెను క్రిందపడేసి తన్నాడు.

ఇంతలోనే సూర్యభగవానుడు ద్రౌపది రక్షణకోసం నియమించిన రాక్షసుడు కీచకుని పట్టుకొని తుపాను వేగంతో దూరంగా విసిరివేశాడు. రాక్షసుడు బలంగా తోసివేయడంవలన కీచకుని శరీరం అంతా గిర్రున తిరిగిపోయింది. అతడు మొదలు నరికిన చెట్టులా నిశ్చేష్టుడై భూమిమీద పడిపోయాడు.

(సభలో మహాత్ముడైన రాజు, వృద్ధబ్రాహ్మణులు, క్షత్రియులు అందరూ చూస్తూనే ఉన్నారు. కీచకుడు తన్నడం చేత దెబ్బ తగిలిన ద్రౌపదిముఖంనుండి రక్తం స్రవిస్తోంది. ఆమెను అట్టి అవస్థలో చూసిన సభాసదులందరూ అన్నివైపులనుండి హాహాకారాలు చేశారు. వారు 'సూతపుత్రా! కీచకా! నీవు చేసిన ఈపని మంచిది కాదు. ఈమె బాంధవులు లేని నిస్సహాయురాలైన అబల. ఈమె నెందుకు బాధిస్తున్నావు?' అని ఆడిగారు.)

ఆ సమయంలో భీమసేనుడు, యుధిష్ఠిరుడు కూడా రాజసభలో కూర్చుని ఉన్నారు. వారు ద్రౌపదికి కీచకుడు చేసిన అవమానాన్ని తమ కళ్లారా చూశారు.

A.C.No. 96356

దానిని వారు సహించలేకపోయారు. మహాత్ముడైన భీముడు పాపాత్ముడైన కీచకుని చంపాలనుకొని కోపంతో ఆ సమయంలో పళ్లు పటపట కొరికాడు. అతని కంటి రెప్పలు పైకిలేచి తీక్ష్ణ మయ్యాయి. కన్నులలో పొగనీడలు వ్యాపించినట్లయింది. నుదుటి మీద చెమట పట్టింది. కనుబొమలు ముడిపడి భయంకరంగా కనిపించసాగాడు. భీముడు చేతితో నుదుటి మీది చెమటను తుడుచుకొన్నాడు. వెంటనే ప్రచండమైన కోపంతో క్రుద్ధుడై ఒక్కసారిగా లేవబోయాడు. అప్పుడు రహస్యం వెల్లడి అయిపోతుందనే భయంతో ధర్మరాజు తన బొటన వ్రేలితో భీముని బొటనవ్రేలిని నొక్కిపెట్టి భీముని కోపాన్ని అడ్డుకొన్నాడు. భీమసేనుడు మదించిన ఏనుగులా ఒకచెట్టువైపు చూడడం గమనించి యుధిష్ఠిరుడు అతనిని వారిస్తూ ఇలా అన్నాడు. 'వల్లవుడా! ఏమి నీవు వంటకట్టెలకోసం చెట్టువైపు చూస్తున్నావా? వంటకోసం ఎండుకట్టెలు కావాలనుకొంటే బయటకు వెళ్లి తెచ్చుకో.

(ఏ పచ్చని చెట్టుయొక్క చల్లని నీడలో ఆశ్రయం పొందుతున్నామో దాని ఒక్క ఆకుకయినా నష్టం కలిగించకూడదు. అది అంతకు ముందు చేసిన ఉపకారాలను ఎల్లప్పుడూ స్మరించుకొంటూ దానిని రక్షించాలి.' అన్నగారి సంకేతాన్ని తెలుసుకొన్న భీముడు ఊరకుండిపోయాడు. భీముని కోపాన్నీ, ధర్మరాజు యొక్క శాంతిపూర్వకమైన చేష్టనూ చూసి ద్రౌపదికి అంతులేని కోపం వచ్చింది. కీచకుడు వెన్నంటి తరమడంచేత ఆమె కన్నులు కోపంతో ఎరుపెక్కాయి. ఆమె అవమానంతో మాటిమాటికీ ఏడవసాగింది.)

ఆ ద్రౌపది రాజసభాద్వారం దగ్గరకు వచ్చి దీనహృదయులై ఉన్న భర్తలవైపు చూస్తూ మత్స్యరాజుతో ఇలా అంది. అప్పుడు ద్రౌపది ప్రతిజ్ఞారూపమైన ధర్మానికి కట్టుబడిన కారణంగా తన ఆకారాన్ని మరుగు పరచుకొంటూ కన్నులతో దహించి వేస్తుందా అన్నట్టుగా భయంకలిగిస్తూ చూసింది.

ద్రౌపది అంటోంది. 'సహజంగానే రాజ్యంలోని ప్రజలను రక్షించాలనుకొని, ఎల్లప్పుడూ సత్యధర్మ మార్గాలలో నడుచుకునే రాజులకు, ప్రజలయందు, తన కన్న సంతానమందు ఎలాంటి తేడా లేదనుకునే తేజస్వులయిన రాజులకు ఆశ్రితజనులను రక్షించడం తప్పనిసరిగా చేయవలసిన పని. ప్రియజనులపట్ల, ద్వేషింపదగిన వారిపట్ల సమభావం కలిగిన రాజులు, వివాదాలు చెలరేగినపుడు ధర్మాసనం మీద కూర్చుని సమభావంతో ప్రతివివాదాన్ని విచారించే వారు ఇహపర లోకాలు రెంటిలోను జయం పొందుతారు. రాజా! మీరు ధర్మాసనం మీద కూర్చున్నారు. నిరపరాధిని, అబలను అయిన నన్ను రక్షించండి. మహారాజా! నేను ఏ అపరాధమూ చేయనప్పటికీ కీచకుడు మీరు చూస్తుండగానే నన్ను బానిసను తన్నినట్లు తన్నాడు. మత్స్యరాజా! తండ్రి తన కన్నపుత్రులను రక్షించేటట్లుగా మీరు

మీ ప్రజలను సంరక్షించండి. మోహగతుడై అధర్మకార్యం చేసే ఆ దురాత్ముని శత్రువులు శీఘ్రమే తమ వశం చేసుకొంటారు. మీరు మత్స్యవంశంలో పుట్టారు. మత్స్య రాజులకు సత్యమే గొప్ప ఆశ్రయంగా ఉంది. మీరు కూడా అట్టి ధర్మపరాయణమైన వంశంలో ధర్మాత్ముని గానే పుట్టారు. రాజా! నిన్ను నేను శరణుకోరి ఆక్రందిస్తున్నాను. రాజేంద్రా! ఈ నాడు పాపాత్ముడైన కీచకుని బారినుండి నన్ను రక్షించు. పురుషాధముడైన కీచకుడు ఇక్కడ నేను అసహాయురాలిని అని తెలిసి తన్నాడు. ఆ నీచుడు ధర్మాన్ని చూడటం లేదు. రాజులు చేయకూడని పనులు చేయకపోవడం వలనమూ, చేయవలసిన పనులను నిరంతరం చేస్తూ ఉండడం వలనమూ, ప్రజలపట్ల చక్కని నడత కలిగి ఉన్నపుడు వారు స్వర్గాన్ని పొందగలరు. రాజా! రాజులు కర్తవ్యం ఏదో, అకర్తవ్యం ఏదో తేడాను గుర్తెరిగికూడా స్వేచ్ఛాచారులై, ప్రజలపట్ల పాపాచారులై ప్రవర్తిస్తే వారు అధోముఖులై నరకానికే పోతారు. రాజులు తమ కర్తవ్యాన్ని సరిగా నిర్వర్తించడం వలన పొందే పుణ్యాన్ని యజ్ఞంచేత గాని, దానంచేత గాని, గురుసేవచేతగాని పొందలేరు.

పూర్వకాలంలో సృష్టిరచన చేసే సమయంలో బ్రహ్మ కర్మలు చేయడంలోను, చేయకపోవడంలోను కలిగే పుణ్యపాపాలప్రాప్తి గురించి ఇలా చెప్పాడు. 'మానవులారా! మీరంతా ఈ భూలోకంలో ద్వంద్వ రూపంలో ప్రాప్తించే ధర్మాధర్మాల విషయంలో బాగా ఆలోచించి పనులు చేయాలి. ఎందు కంటే మంచిదైనా చెడ్డదైనా ఏ నీతిని అనుసరించి పని చేస్తారో అటువంటి కర్మ ఫలితమే లభిస్తుంది. మంగళకరమైన పనులు చేసేవాడు శుభాన్ని, పాపపుపనులు చేసేవాడు దుఃఖాన్ని అనుభవిస్తాడు. వీటి సాంగత్యాన్ని పొందినవారు (కర్మానుసారంగా) స్వర్గ నరకాలు పొందుతారు. మనుష్యుడు మోహవశుడై సత్కర్మ గాని, దుష్కర్మ గాని చేస్తే మరణం తరువాత కూడా మనసులోనే పశ్చాత్తాపం చెందుతూ ఉంటాడు.' ఈ విధంగా మంచిమాటలు చెప్పి బ్రహ్మ ఇంద్రుడికి వీడ్కోలు చెప్పాడు. ఇంద్రుడు కూడా బ్రహ్మ అనుమతిని తీసుకొని దేవలోకానికి వచ్చి దేవ సామ్రాజ్యాన్ని పరిపాలించసాగాడు. రాజేంద్రా! బ్రహ్మ ఇచ్చిన ఉపదేశాన్ని అనుసరించి నీవుకూడా కర్తవ్య మేదో, అకర్తవ్య మేదో నిర్ణయించుకోవడంలో దృఢంగా వ్యవహరించు.'

ద్రౌపది ఈ రీతిగా విలపిస్తున్నప్పటికీ మత్స్యరాజు విరాటుడు బలగర్వితుడైన కీచకుని శాసించలేకపోయాడు. విరాటరాజు శాంతిపూర్వకంగానే బుజ్జగించి, నచ్చచెప్పి, సూతుణ్ణి అలా చేయవద్దని వారించాడు. కీచకుడు పెద్ద అపరాధమే చేసినా మత్స్యరాజు ఆ అపరాధానికి తగిన దండన విధించలేదు. ఇది చూసి వ్యవహారధర్మం తెలిసి, పతివ్రత అయిన ద్రౌపది ఉత్తమమైన ధర్మాన్ని స్మరించుకొంటూ రాజైన విరాటునీ, సమస్తసభాసదులను చూస్తూ దుఃఖిత హృదయయై ఇలాఅంది.)

'నా భర్తలతో వైరాన్ని పూనినవాడు ఐదుదేశాలు దాటి ఆరవదేశంలో నివసిస్తూ ఉన్నా భయంతో నిద్రపోలేడు. అటువంటివారికి భార్యనై, మానవతి నైన నన్ను అసహాయురాలిని, అబలను ఈనాడు ఒక సూతపుత్రుడు కాలితో తన్నాడు. ఎప్పుడూ ఇవ్వడమేగాని పుచ్చుకోవడం ఎరుగని వారై, బ్రాహ్మణులయందు భక్తి కలిగి సత్య వాదులైన వారి భార్యనై, మానవతినైన నన్ను ఒక సూతపుత్రుడు కాలితో తన్నాడు.

ఎవరి ధనుష్టంకారం దేవదుందుభుల ధ్వనివలె నిరంతరం వినపడుతూ ఉంటుందో వారి భార్యను అయిన నన్ను ఒక సూతపుత్రుడు కాలితో తన్నాడు. తేజస్సంపన్నులు, జితేంద్రియులు, బలవంతులు, అత్యంతమానధనులు అయిన వారి భార్యను, మానవతిని నన్ను ఒక సూతపుత్రుడు కాలితో తన్నాడు. నాభర్తలు ఈ లోకాన్నంతటినీ సంహరించగలరు. కాని వారు ధర్మానికి కట్టుబడినవారు. వారి భార్యను అయిన నన్ను సూతపుత్రుడు కాలితో తన్నాడు. శరణు కోరి వచ్చిన వారికి శరణు ఇచ్చేవారు, మహారథులు, తమరూపాలు మరుగుపరుచుకొని ఇపుడు ఈ లోకంలో ఎక్కడ సంచరిస్తున్నారో? మిక్కిలి తేజస్సులు, బలవంతులు అయిన వారు పతివ్రత అయిన తమ ప్రియపత్నిని ఒక సూతపుత్రుడు తన్నుతూ ఉంటే ఆ అవమానాన్ని పిరికివారివలె, నపుంసకులవలె ఎలా సహించ గలుగుతున్నారు? ఈనాడు వారి క్రోధం, పరాక్రమం, తేజస్సు ఎక్కడకు పోయాయి? ఒక దురాత్ముడు తన్నుతూండగా తమ భార్యను రక్షించలేకపోతున్నారు. నిరపరాధినిని, అబలను అయిన నన్ను తన ఎదుటనే తన్నుతూ ఉంటే చూసి, సహించి, ఊరకున్న ఈ విరాటమహారాజుకూడా ధర్మదూషకుడే. ఇతని వంటి వారు ఉండగా నేను ఈ అవమానానికి బదులు తీర్చుకోవడానికి ఏం చేయగలను? ఇతడు రాజు అయి ఉండికూడా కీచకుని పట్ల రాజోచితమైన కొద్దిపాటి న్యాయం కూడా చేయలేక పోయాడు. మత్స్యరాజా! నీ ఈ బందిపోటుధర్మం ఈ రాజసభకు శోభనివ్వదు. నీ సమక్షమందే ఈ కీచకుడు నన్ను హింసించడం తగినదేనా? ఇక్కడ కూర్చున్న సభాసదులు కూడా కీచకుని యొక్క ఈ అత్యాచారాన్ని చూశారుగదా. కీచకునికి ధర్మజ్ఞానం లేదు. ఈ రాజుకూడా ఏ రకంగానూ ధర్మజ్ఞుడు కాడు. అధర్మపరుడైన ఈ రాజు దగ్గర ఉన్న సభాసదులు కూడా ధర్మాన్ని ఎరుగరు.'

అప్పుడు విరాటుడన్నాడు. 'సైరంధ్రీ! మా పరోక్షంలో మీ ఇరువురిమధ్య ఎలాంటి తగవు ఉందో అది నేనెరుగను. వాస్తవవిషయ మేదో తెలియకుండా న్యాయం చేయడంలో నేనేం నేర్పు చూపగలను?' పిమ్మట సభాసదులందరూ విషయం తెలుసుకుని ద్రౌపదిని మిక్కిలి ప్రశంసించారు. కీచకుని నిందిస్తూ ఆమెకు అనేక సాధువాదాలు తెలిపారు. సభాసదులు ఇలా అన్నారు. 'సర్వాంగసుందరి, విశాల మయిన నేత్రాలుగల యీ సాధ్వి ఎవరి ధర్మపత్నియో వానికి జీవితంలో గొప్ప లాభం కలుగుతుంది. అతనికి ఏవిధంగానూ శోకం కలగదు.

(ఈమె శరీరం శోభాకరంగా పుష్టిగా ఉంది. ముఖం పద్మాన్ని జయిస్తోంది. మందగమనం హంసనడకను జయిస్తోంది. చిరునవ్వు కుందపుష్పాల శోభను తిరస్కరిస్తోంది. ఇటువంటి స్త్రీ పాదప్రహారానికి తగినదికాదు. ఈమె ముప్పదిరెండు పళ్లు చిగుళ్లతో దృఢంగా ఉండి, తెల్లగా మెరుస్తున్నాయి. వెంట్రుకలు నిగనిగ లాడుతూ మృదువుగా ఉన్నాయి. ఇట్టి ఈమె తన్నులు తినదగినది కాదు. ఈమె అరచేతులలో పద్మం, చక్రం, ధ్వజం, శంఖం, మందిరం, మొసలిచిహ్నం ఉన్నాయి. అట్టి శుభచిహ్నాలున్న ఈమె తన్నులు తినడం ఎంతమాత్రం ఉచితం కాదు. శరీరంలో నాలుగు సుడులు , అన్నీ కుడికి తిరిగినవే ఉన్నాయి. శరీరమంతా సమానంగా, శుభలక్షణాలతో కూడి నిగనిగలాడుతోంది. ఈమె తన్నులు తినడానికి యోగ్యమైనది కాదు. ఈమె చేతులలో గాని, కాళ్లలో కాని, దంతాలలో గాని, ఎట్టి దోషాలూ లేవు. తామరరేకుల వంటి కన్నులు గల ఈమె కాలితాపులకు ఎట్లు అర్హురా లవుతుంది? సమస్త శుభలక్షణాలూ కల ఈమె ముఖం నిండుచంద్రునివలె ఉంది. సుందరి, రూపసి, చక్కని మోము కలిగిన ఈమె కాలితో తన్ని తిరస్కరింపదగినది కాదు. ఈమె దేవతావనిత వలె సౌభాగ్యశాలిని. ఇంద్రుని భార్య శచీదేవివలె శోభసంపన్నురాలు. అప్సరసవలె మిక్కిలి అందగత్తె. ఈమె తన్నులు తినడానికియోగ్యురాలు కానే కాదు.)

మనుష్యజాతిలో అయితే ఇటువంటి సాధ్వి, సుందరి ఉండడం సులభం కాదు. ఈమె శరీరం సమస్తం నిర్దుష్టంగా ఉంది. మేము ఈమెను మానవకాంతగా కాదు, దేవీరూపంగా భావిస్తున్నాం.' ఈ విధంగా ద్రౌపదిని చూసి సభాసదులందరూ ప్రశంసిస్తూంటే కీచకునిపై కలిగిన కోపంతో యుధిష్ఠిరుని నుదుటి మీద చెమటలు పట్టాయి.

(అనంతరం ద్రౌపది దీర్ఘంగా నిట్టూర్చి, తల దించుకుని, అక్కడే నిలబడిపోయింది. యుధిష్ఠిరుడు ఏదో చెప్పడానికి సిద్ధపడడం చూసి ఆమె మౌనంగా ఉండిపోయింది.)

అప్పుడు కురువంశజుడయిన ధర్మరాజు తమకు ప్రియమైన ద్రౌపదితో ఇలా అన్నాడు. 'సైరంధ్రీ! ఇప్పుడిక నీవు ఇక్కడ నిలువకు. రాణి సుదేష్ణ భవనానికి వెళ్లిపో. భర్తలను అనుసరించే వీరపత్నులు అన్ని కష్టాలను మౌనంగా భరిస్తారు. పతిసేవాపూర్వకమైన కష్టాలను భరించే ఆ సాధ్వీమణులు పతులను మించి విజయం సాధించగలుగుతారు.సూర్యవర్చస్వులైన నీ పతులు గంధర్వులు కోపం చూపడానికి తగిన సమయం కాదనుకొంటున్నారని నేను అనుకొంటున్నాను. కాబట్టే నీదగ్గరకు వారు పరుగెత్తుకొని రావడంలేదు.

సైరంధ్రీ! మోక్ష ధర్మానికి సంబంధించిన మాటలు విను. ధర్మ శాస్త్రాన్ని అనుసరించి కులస్త్రీల ధర్మం ఇలా ఉంటుంది. **స్త్రీలకు ఏ యజ్ఞమూ లేదు. శ్రాద్ధమూ లేదు. ఉపవాసవిధానమూ లేదు. తమ భర్తలకు సేవ చేయడం వలవనే వారికి స్వర్గప్రాప్తి కలుగుతుంది. కుమారిగా**

ఉన్నపుడు తండ్రి, యౌవనంలో భర్త, వార్ధక్యంలో పుత్రుడు స్త్రీలను రక్షిస్తూ ఉంటారు. స్త్రీ ఎప్పుడూ స్వతంత్రంగా ఉండకూడదు. పతివ్రతలయిన స్త్రీలు అనేక కష్టాలు సహిస్తూ, శత్రువులచేత అవమానింపబడినా కూడా పతులపై ఎప్పుడూ క్రోధం చూపకూడదు. అనన్యభావంతో పతిశుశ్రూష చేసిన స్త్రీలు పుణ్యలోకాలు పొందుతారు. సైరంధ్రీ! నీ పతులు కనుక కోపిస్తే వృత్రాసురుని చంపిన ఆ ఇంద్రుడుకూడా యుద్ధంలో వారిని ఎదుర్కోలేడు. ఒకవేళ నీకు వారితో ఏమయినా ఒప్పందం ఉందేమో అది గుర్తుకు తెచ్చుకో. క్షమాశీలీ! క్షమ అన్నిటికంటె ఉత్తమమయిన ధర్మం. క్షమయే సత్యం, క్షమయే దానం, క్షమయే ధర్మం, క్షమయే తపస్సుకూడా. క్షమావంతులకు ఈలోకం పరలోకం కూడా ఉంటాయి. రెండు అంశాలు (ఉత్తరాయణం, దక్షిణాయనం), పన్నెండు అంగాలు (మాసాలు), ఇరవై నాలుగు పర్వాలు, (పక్షాలు), మూడువందల అరవై ఆకులు (దినాలు) కల కాలచక్రం పూర్తికావడానికి ఒక్కమాసమే తక్కువైతే దానికోసం ప్రతీక్షించకుండా క్షమను ఎవరు విడిచిపెట్టగలరు?'

ఇంత చెప్పినా కూడా ద్రౌపది అక్కడే నిలబడిఉంది. అప్పుడు ధర్మరాజు మరలా ఇలా అన్నాడు.)

'సైరంధ్రీ! సమయాన్ని నీవు గుర్తించడంలేదు. కనుకనే నటి లాగా రాజసభలో ఏడుస్తూ ఉన్నావు. పైగా ద్యూతక్రీడలో నిమగ్నమై ఉన్న మత్స్యమహారాజులకు, సభలో జూదానికి విఘ్నం కలిగిస్తున్నావు. సైరంధ్రీ! వెళ్లు. గంధర్వులు నీకు ప్రీతి కలిగిస్తారు. నీకు అపకారం చేసిన వానిని చంపి నీ దుఃఖాన్ని దూరం చేస్తారు.' అనగానే సైరంధ్రి అన్నది. 'ఆ గంధర్వులలో పెద్దన్నగారు జూదం ఆడుతూ ఉంటాడు. ఆ దయాత్ములపట్ల నేను ఎప్పుడూ అత్యంత ధర్మపరాయణురాలిగానే ఉంటున్నాను. నాకు అవమానం కలిగించిన దురాత్ములను వారిలో ఎవ్వరైనా చంపవచ్చు". ఇలా అని.. ద్రౌపది విసురుగా నడుస్తూ రాణి సుదేష్ణ భవనానికి వెళ్లిపోయింది. ఆమె జుట్టు విడిపోయింది. కళ్లు కోపంతో ఎరుపెక్కి పోయాయి. ఆ సమయంలో ఏడుస్తున్న ద్రౌపదియొక్క అందమైన ముఖం ఆకాశంలో మేఘమాలికనుండి విముక్తమైన చంద్రబింబంవలె శోభించింది.

(భర్త ఆజ్ఞను శిరసావహించి ద్రౌపది శరీరమంతా ధూళితో నిండిన ఆడపీనుగు వలె రాజసభనుండి అంతఃపురానికి వెళ్లింది. లేడిపిల్ల కన్నులవలె చంచలమైన కనులు, క్రిక్కిరిసిన చనులు కల ద్రౌపది కీచకుని చేతినుండి తప్పించుకొని శోకదుఃఖాలతో వర్షాకాలపు మేఘాల చేత కప్పబడిన చంద్రకాంతివలె మలినమై ఉంది. ఏ ద్రౌపదికోసం పాండవులందరూ తమ ప్రాణాలు కూడా అర్పిస్తారో ఆ ద్రౌపదియొక్క అవస్థను చూసికూడా ధర్మాత్ములైన పాండవులు తమ క్షమను విడువలేదు. సముద్రం చెలియలికట్టను దాటనట్లుగా వారు అజ్ఞాతవాస సమయాన్ని అతిక్రమించలేదు.)

సుదేష్ణ ఇలా అంది. 'సుందరాంగీ! నిన్నెవరు కొట్టారు? నీవు ఎందుకు ఏడుస్తున్నావు? శోభనాంగీ! ఈ రోజు ఎవరిసుఖం ముగిసిపోయింది? ఎవరు నీకు అపరాధం చేశారు?

(కమలం వలె కమనీయమై, అందమైన పలువరుస, పెదవులు, కన్నులు, ముక్కు కలిగి, పూర్ణచంద్రునితో సమానమైన కాంతి కలిగిన నీ ఈ అందమైన ముఖం ఇలా ఉందేమిటి? ఏడుపుతో ముఖం మీద కారుతున్న ఆ కన్నీటిని తుడుచుకో. నల్లని కంటిపాపలు కల సరళమైన నేత్రాలతో దొండపండు వంటి పెదవితో, అత్యంతమనోహరమైన కాంతితో వెలిగే నీ ముఖం ఇప్పుడు ఎందుకు కన్నీటిని వర్షిస్తోంది?

అప్పుడు ద్రౌపది దీర్ఘంగా నిట్టూర్చి ఇలా అంది – నీకు అంతా తెలిసికూడా నన్నెందుకు అడుగుతావు? స్వయంగా నీవే నీ తమ్ముడి దగ్గరకు పంపి, ఇప్పు డిలాంటి మాటలు ఎందుకు అంటున్నావు?)

నేను నీకోసం మదిర తేవడానికి వెళ్లాను. అక్కడ కీచకుడు సభలో రాజు చూస్తుండగానే నిర్జనవనంలో అబలను హింసించి నట్లుగా నన్ను తన్నాడు.' సుదేష్ణ అన్నది. 'సుందరీ! కామోన్మత్తుడై నీవంటి దుర్లభమైన దేవిని అవమానించిన ఆ కీచకుని నీవు అంగీకరిస్తే చంపిస్తాను, శిక్షిస్తాను.' సైరంధ్రి అన్నది. 'అతడు ఎవరిపట్ల అపరాధం చేశాడో వారే అతనిని చంపుతారు. నాకు తెలుసు... వాడు ఇప్పుడు నిశ్చయంగా యమలోకానికి పోతాడని.

(రాణీ! ఈ రోజే నీవు నీ తమ్ముడికి వెంటనే జీవశ్రాద్ధం పెట్టించు. దానాలన్నీ ఇప్పించు. అంతేకాదు. కన్నులనిండుగా బాగా అతడిని చూసుకో. ఇక అతడి ప్రాణాలు నిలువవు అని నా నమ్మకం. ధర్మాత్ములయిన నా భర్తలు ఐదుగురిలో ఒకడు అత్యంత దుస్సహమైన క్రోధంగల వీరుడు. ఈ భూమిమీద అతనితో సమానమైన బలం గలవాడు వేరొకడు లేడు అతడు కోప్పేస్తే ఈరాత్రిలోనే ఈప్రపంచాన్ని నిర్మానుష్యం చేయగలడు. కాని కామరూపధారి అయిన ఆ గంధర్వుడు ఇంతవరకు ఎందుకు కోపించలేదో తెలియదు.' రాణి సుదేష్ణతో ఇలా చెప్పి దుఃఖివశ అయిన సైరంధ్రి కీచకవధకు వ్రతదీక్ష పూనింది. ఇతరస్త్రీలు ఎంత ప్రార్థించినా రాణి సుదేష్ణ ఎంత బ్రతిమాలినా ఆమె స్నానం చేయలేదు. భోజనం చేయ లేదు. కనీసం ఒంటిమీది ధూళికూడా తుడుచుకోలేదు. ఆమె ముఖంలోకి రక్తం పొంగి వచ్చింది కన్నులు కన్నీటితో నిండి పోయాయి. ఈరకంగా శోక సంతప్తురాలై ఏడుస్తున్న ఆమెను చూసి అచ్చటి స్త్రీలంతా మనసులోనే కీచకుని చావును ఊహించుకొన్నారు.

జనమేజయుడు అన్నాడు. 'ప్రపంచంలోని స్త్రీలందరికంటె శ్రేష్ఠురాలు, పతివ్రత, మహానుభావురాలు అయిన ద్రౌపది కీచకుని చేత తన్నబడింది. గొప్ప దుఃఖాన్ని పొందింది. అయ్యో! ఆమెకు ఎంతటి క్లేశం కలిగింది! సింధురాజు జయద్రథుడు బలవంతంగా ఆమెను అపహరించిన సమయంలోకూడా ఆమె తన భర్తలకు సోదరి అయిన దుశ్శల గౌరవాన్ని నిలబెడుతూ ఆ కష్టాన్ని సహించిందే కాని

అతనిని శపించలేదు. దేవి ద్రౌపది తేజోరాశి, ధర్మజ్ఞ, సత్యవాదిని. ఆమె వంటి తేజస్విని జుట్టు పట్టుకొని ఈడ్వబడినపుడు అసమర్థురాలివలె నిశ్శబ్దంగా ఎందుకు సహించింది? ఆమె అలా సహించిందంటే దానికి కారణం చిన్నదై ఉండదు. సాధుసత్తమా! నాకు ఆ కారణం వినాలని ఉంది. ద్రౌపదికి కలిగిన కష్టం విన్న నా మనసు మిక్కిలి వ్యాకులంగా ఉంది. మునీశ్వరా! మత్స్యరాజు బావమరిది అయిన దుష్టకీచకుడు ఏ వంశంలో జన్మించాడు? అతడు బలంచేత ఉన్మత్తుడు ఎలా అయ్యాడు?'

వైశంపాయనుడు చెప్పాడు! నీవు అడిగిన ఈ ప్రశ్న సరియైనదే. నేను ఇదంతా సవిస్తారంగా చెపుతాను. రాజా! క్షత్రియుడైన తండ్రికి, బ్రాహ్మణి అయిన తల్లికి పుట్టినవాడు 'సూతుడు' అనబడతాడు. ప్రతిలోమసంకరమైన జాతులలో కేవలం ఈ సూతజాతి మాత్రమే ద్విజజాతిగా చెప్పబడుతోంది. ద్విజులకు ఉచితమైన పనులు చేసే ఆ సూతుడినే రథకారుడు అని కూడా అంటారు. ఇతడిని క్షత్రియుని కంటె తక్కువగానూ, వైశ్యునికంటె ఎక్కువగాను చెప్తారు. రాజా! పూర్వపురాజులు సూతజాతితో వైవాహిక సంబంధాలు ఏర్పరచుకొన్నారు. అయినా వారికి రాజ శబ్దం లభించలేదు. వారికి సూతుల పేరుమీదుగా సూతరాజ్యమే ఏర్పాటు చేయబడింది. సూతజాతికి చెందిన ఒక పురుషుడు ఎవరో ఒక క్షత్రియుడికి సేవ చేయడం ద్వారా ఆ రాజ్యం ప్రాప్తించింది. సుప్రసిద్ధుడయిన కేకయుడు అనే రాజు సూతులకు అధిపతి. అతడు ఎవరో ఒక క్షత్రియకన్య గర్భం నుండి పుట్టాడు. అతడు సారథికృత్యంలో ఆరితేరినవాడు. అతనికి మాళవియందు అనేకపుత్రులు కలిగారు. రాజా! ఆ పుత్రులలో కీచకుడే అందరికంటె పెద్దవాడు. అతడు మిక్కిలి బలవంతుడు. అందరినీ జయించగల యోధుడు. రాజు అయిన కేకయునికి రెండవ భార్య కూడా మాళవ కన్యయే. ఆమె యందు కీచకబంధువు లందరికీ చిన్నచెల్లెలుగా 'చిత్ర' అనే పేరుగల కన్య పుట్టింది. ఆమెనే సుదేష్ణ అని కూడా అంటారు. ఆమెయే తరువాత కాలంలో మహారాజ విరాటుడికి పట్టపురాణి అయింది విరాటరాజు యొక్క పెద్దరాణి కోసలదేశపు రాజకుమారి సురథ. ఆమె శ్వేతుడనే వానికి కన్నతల్లి. ఆమె చనిపోయిన తరువాత కేకయరాజు తన కూతురు సుదేష్ణను మత్స్యరాజు విరాటునకు ఇచ్చి ఆనందంగా వివాహం చేశాడు. సుదేష్ణను మహారాణిగా పొంది రాజు విరాటుడు దుఃఖాన్ని పోగొట్టుకున్నాడు. రాజా! కేకయకుమారి రాణి సుదేష్ణ విరాటుని వలన అతని వంశాన్ని వృద్ధి పొందిస్తూ ఉత్తరుడు, ఉత్తర అనే ఇద్దరు బిడ్డలనీ కన్నది. కీచకుడు తన పినతల్లి కూతురయిన సుదేష్ణను ప్రీతిపూర్వకంగా సేవిస్తూ, విరాటుని దగ్గర సుఖంగా నివసిస్తున్నాడు. అతని తమ్ముళ్లు అందరూ పరాక్రమవంతులు. కీచకుని పట్ల అనురాగం, భక్తి కలవారు. కాబట్టి వారు కూడా విరాటుని బలాన్ని, కోశాన్ని వృద్ధి చేస్తూ అక్కడే సంతోషంగా ఉండసాగారు. రాజా! ఈ భూమండలంలో కాలేయులనే పేరుతో తరచుగా వినుతి కెక్కిన దైత్యులే ఈ కీచకుల రూపంలో పుట్టారు. కాలేయులలో బాణుడు అందరికంటె పెద్దవాడు. అతడే సంపూర్ణ శస్త్రాస్త్రసంపన్నుడు, భయంకరమైన పరాక్రమం కలవాడు, మహాబలుడు అయిన కీచకుడు అయ్యాడు. అతడు ధర్మమర్యాదను అతిక్రమించేవాడు, మనుష్యులను భయపెట్టేవాడు. ఆ బలోన్మత్తుడయిన కీచకుని సహాయం పొంది ఇంద్రుడు దానవులను జయించినట్లు విరాటుడు కూడా సమస్తశత్రువులనూ జయించాడు. మేఖల, త్రిగర్త, దశార్ణ, కశేరుక, మాలవ, యవన, పులింద, కాశీ కోసల, అంగ వంగ, కలింగ, తంగణ పరతంగణ, మలద, నిషధ, తుండికేర కోంకణ కరద,

నిషిద్ధ, శివ, దుశ్చిల్లిక – మొదలగు అనేక జనపదాల నాయకులు, అనేక శూరవీరరాజులు యుద్ధభూమిలో కీచకునిచేత పరాజితులై దశదిశలకు పారిపోయారు. ఇటువంటి పరాక్రమసంపన్నుడై, యుద్ధంలో పదివేల ఏనుగుల బలం కలిగి ఉండే కీచకుడిని రాజు విరాటుడు తనకు సేనాపతిగా చేసుకొన్నాడు. దశరథనందనుడైన శ్రీరామునితో సమానమైన శక్తి కలిగిన విరాటుని పదిమంది తమ్ముళ్లూ కూడా బలవంతులైన కీచకబంధువులనే అనుసరించేవారు. అట్టి బలసంపన్నులైన కీచకులు విరాటరాజుకు బావమరదులై శౌర్యంలో తమకు సాటివచ్చేవారే లేరు అనిపించుకొన్నారు. వారు విరాటరాజుకు ఎప్పుడూ హితైషులుగా ఉన్నారు. ఈ రీతిగా నేను నీకు కీచకుని పరాక్రమానికి సంబంధించిన సంగతి అంతా చెప్పాను. ఇక ద్రౌపది అతనిని ఎందుకు శపించలేదో ఆ సంగతి కూడా విను.

క్రోధం వలన తపస్సు నష్టమవుతుంది. అందుకనే ఋషులుకూడా వెంటనే ఎవరికీ శాపం ఇవ్వరు. ద్రౌపదికి ఈ విషయం బాగా తెలుసు. కనుకనే అతనిని శపించలేదు. సహనమే ధర్మం, దానం, యజ్ఞం, క్షమయే యశస్సు, సత్యం, శీలం, కీర్తి. క్షమయే అన్నింటికంటె ఉత్కృష్టతత్వం. క్షమయే పుణ్యం. క్షమయే తీర్థం. క్షమయే వసుత్తం - అని చెప్తోంది. ఈ లోకం క్షమావంతులది. పరలోకంకూడా వారిదే. ద్రౌపదికి ఇదంతా తెలుసు కనుకనే క్షమను ఆశ్రయించింది. భరతనందనా! క్షమాశీలురు, ధర్మాత్ములు అయిన పతుల భావం తెలిసినది కనుక ఆ ద్రౌపదీసాధ్వి సమర్థురాలైనా కీచకుని శపించలేదు. పాండవు లందరూ కూడా ద్రౌపది దురవస్థను చూసి దుఃఖించినా అజ్ఞాతవాస సమయవూర్తి కోసం ఎదురుచూస్తూ క్రోధాగ్నితో మండిపోతున్నారు. మహాబలుడైన భీముడు మాత్రం కీచకుని అప్పుడే చంపడానికి సిద్ధపడ్డాడు కాని మహాసాగరాన్ని చెలియలి కట్టవలె యుధిష్ఠిరుడు అతనిని అడ్డుకొన్నాడు.

అతడు మనసులోనే కోపాన్ని అణచుకొని రాత్రిఅంతా దీర్ఘమైన నిట్టూర్పులు విడుస్తూ కాలం గడుపుతున్నాడు. పాకశాలకు పోయి ఆ రాత్రి చాలా కష్టంమీద వడుకొన్నాడు.)

17. ద్రౌపది భీమసేనుని వద్దకు వెళ్లుట.

సూతపుత్రుడైన కీచకుడు తన్నినప్పటినుండి ద్రౌపద్ది అతని చంపటాన్ని గూర్చియే ఆలోచించసాగింది. ఆమె తన నివాసస్థానానికి వెళ్లింది. తన శరీరాన్ని, వస్త్రాన్ని జలంతో శుభ్రం చేసుకొంది. విలపిస్తూ తన ఆ దుఃఖానికి నివారణోపాయాన్ని ఆలోచించసాగింది. 'ఏం చేయను? ఎక్కడకు వెళ్లను? నా పని ఎలా నెరవేరుతుంది?' అని ఆలోచిస్తూ మనసులో భీమసేనుడిని తలచుకొంది. "భీమసేనుడు తప్ప వేరెవరూ నేడు నామనసుకు ప్రియం కలిగే పనిచేయలేరు"- అని నిశ్చయించుకొన్న కృష్ణ ఆ రాత్రి తన శయనం విడిచి లేచి, తన నాథుడిని (రక్షకుడిని) కలుసుకోవాలనే కోరికతో శీఘ్రంగా భీమసేనుని భవనానికి వెళ్లింది. అక్కడికి వెళ్తూనే సైరంధ్రి ఇలా అంది. 'ఆర్యపుత్రా! నా శత్రువు, మహాపాపి అయిన సేనాపతి నాపట్ల అలా

అవమానకరంగా ప్రవర్తించినా వాడు బ్రతికి ఉండగానే నేడు నీకు నిద్ర ఎలా పడుతోంది?' ఇలా అంటూనే మనస్విని ద్రౌపది ఆ భవనంలో ప్రవేశించింది. అక్కడ సింహంవలె ఉచ్ఛ్వాసనిశ్వాసాలు తీస్తూ భీముడు నిద్రిస్తూ ఉన్నాడు. గోమతి తీరంలో మొలిచి బాగా పెరిగిన ఉన్నతమైన సాలవృక్షాన్ని లత అల్లుకు పోయినట్లుగా పాంచాలి పాండవమధ్యముని ఆలింగనం చేసుకొంది. ఆమె అతనిని రెండుచేతులతో బిగించి పట్టుకొని దుర్గమమైన వనంలో నిద్రిస్తున్న సింహాన్ని ఆడసింహంవలె మేల్కొలిపింది. 'భీమసేనా! లే లెమ్ము. ఏమిటిలా దీర్ఘ నిద్ర పోతున్నావు? (శవంలా పడిఉన్నావు?) పురుషుడు జీవించి ఉండగా అతని భార్యను స్పృశించిన మహా పాపాత్ముడైన వాడు జీవించి ఉండకూడదు కదా!'

రాజకుమారి ద్రౌపది మేలుకొలుపగానే మేఘంవలె నల్లని వర్ణం కల కురునందనుడు భీమసేనుడు మెత్తగా పరచిన ప్రక్కమీది నుండి లేచి కూర్చున్నాడు. తనకు ప్రియమైన రాణితో "దేవి! ఏ పనిమీద నీవింత తొందరపడి నాదగ్గరకు వచ్చావు? నీ శరీరకాంతి ఎప్పటివలె లేదు. నిరుత్సాహంగా కనిపిస్తున్నావు. పాలిపోయి చిక్కిపోయి కనిపిస్తున్నావు. నాకు విషయమంతా పూర్తిగా తెలిసేలా చెప్పు. నీవు సుఖమైనా, దుఃఖమైనా, కీడయినా, మేలయినా విషయమంతా ఉన్నదున్నట్లుగా చెప్పు. అదంతా విన్నాక నేను దానిని నివారించడానికి తగిన ఉపాయాన్ని ఆలోచిస్తాను. కృష్ణా! అన్ని పనులలోను నేనే నీకు విశ్వాసపాత్రుడను. నేనే అన్ని ఆపదలనుండి మాటిమాటికి సహాయపడి నిన్ను తప్పిస్తున్నాను. కాబట్టి నీకు ఇష్టమైన రీతిగా ఏపని గూర్చి ఏమి చెప్పదలచుకొన్నావో అది వెంటనే చెప్పి, ఇతరులెవరికీ తెలియకముందే నీ శయనగృహానికి వెళ్లిపో.' అన్నాడు.

18. ద్రౌపది భీముని ఎదుట తన దుఃఖమును వెళ్లడించుట.

ద్రౌపది అన్నది. 'యుధిష్ఠిరుని భర్తగా పొందిన స్త్రీ శోకం లేనిది ఎలా అవుతుంది? నా దుఃఖాలన్నీ తెలిసికూడా నన్ను ఎలా అడుగుతున్నావు? దుర్యోధనుని దాసి అనే ప్రవాదంతో ప్రాతికామి ద్వారానన్ను సభాభవనం మధ్యలో ఉన్న సభ్యులందరి లోకి తెచ్చిన ఆ అవమానం నేటికీ నన్ను దహిస్తూనే ఉంది.

(భీమసేనా! ఆ సమయంలో అక్కడే ఉన్న కర్ణాదులు క్షత్రియులు, దుర్యోధనుడు, నా

అత్తమామలు, భీష్ముడు, బుద్ధిమంతుడైన విదురుడు, ఇంకా ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు కూడా నన్ను ఆ దురవస్థలో ఉండగా చూశారు కదా! పాండునందనా! నీవు బ్రతికిఉండగానే నాజుట్టు పట్టుకొని అత్త మామలు, దుర్యోధనుడు మొదలుగాగల సోదరుల మధ్య రాజసభకు తీసుకొనివచ్చారు.)

స్వామీ! ద్రుపదకన్యక నైన నేను తప్ప వేరే ఏరాజకుమారి ఇలాంటి బాధను అనుభవించి, జీవించి ఉంటుంది? వనవాసం చేసే రోజుల్లో దుర్మార్గుడు సింధురాజు జయద్రథుడు నన్ను స్పృశించాడు. ఇది రెండవ అవమానం. దీన్ని ఎవరు సహించగలుగుతారు?

(పాండుకుమారా! మీరు బ్రతికి ఉండగానే క్రూరమృగాలతో నిండి చొరశక్యం కాని ఎగుడు దిగుడు ప్రాంతాల్లో కాలినడకతో తిరగవలసివచ్చింది. పండ్లు, కందమూలాలు ఆహారంగా తీసుకొంటూ అడవిలో పన్నెండు సంవత్సరాలు గడిచాక విరాట నగరానికి వచ్చి సుదేష్ణకు పరిచారిక నయ్యాను. సత్యధర్మమార్గంలో నడుస్తూనే నేడు వేరొక స్త్రీకి సేవ చేస్తున్నాను. పాండుపుత్రా! మీరు జీవించి ఉండగానే నేను ప్రతిదినమూ విరాటరాజుకోసం గోశీర్షం, పద్మకాష్ఠం, హరిశ్యామం అనే చందనాలను మారుతున్నాను, అయినా మీ సంతోషం కోసం నేను ఇలాంటి ఎన్ని కష్టాలనైనా కొంచెం కూడా లెక్కచేయను. నేను ద్రుపదమహారాజు కూతుర్ని. ధృష్టద్యుమ్నుని చెల్లెలిని. అగ్నికుండంలోంచి పుట్టినదానిని. నేను ఎన్నడూ నేలమీద కాలు మోపి నడవలేదు. (కాని నేడు ఇక్కడ ఇలాటి దుర్దశను అనుభవిస్తున్నాను.))

మత్స్యదేశపురాజు విరాటుని సమక్షంలోనే ఆ జూదరి చూస్తుండగానే కీచకుడు తన్ని నన్ను అవమాన పరిచాడు. అది సహించి నాలాంటి ఏరాజకుమారి జీవించి ఉండగలదు? భరతవంశానికి ఆభరణమైన కుంతీనందనా! ఇలాంటి ఎన్నో కష్టాల ద్వారా నేను నిరంతరం బాధపడుతూనే ఉన్నాను. నీకిది తెలియదా? అయినా నేను బ్రతికిఉండడం వలన లాభం ఏమిటి? పురుష సింహమా! విరాటరాజు దగ్గర సేనాపతిగా ఉన్న కీచకుడు అతనికి బావమరిది అవుతాడు. అతని బుద్ధి చాలా దుష్టమైనది. రాజభవనంలో సైరంధ్రి వేషంతో నివసిస్తున్న నన్ను చూసి ఆ దుష్టుడు వచ్చి 'నాకు భార్యవు కమ్మని" సదా నన్ను అడుగుతూనే ఉన్నాడు. శత్రుదమనుడా! మట్టుపెట్టదగిన ఆ పాపాత్ముడు చేసే ఈ జుగుప్సాకరమైన ప్రస్తావన వినీవినీ నామనస్సు సమయానికి పక్వమైన పండువలె బ్రద్దలైపోతోంది. పాండుపుత్రా! నేను నీకోపాన్ని, బలాన్ని, పరాక్రమాన్ని ఎరుగుదును. కనుకనే నేను నీముందు విలపిస్తున్నాను.

(పాండుపుత్రా! ఆరువై ఏళ్ల, మదించిన, గజయూథానికి నాయకుడయిన గజరాజు నేలమీద రాలిన మారేడుపండును కాళ్లతో తొక్కి నుజ్జు నుజ్జు చేసినట్లుగా కీచకుని నేల రాల్చి, అతని శిరస్సును ఎడమకాలితో మర్దించు కీచకుడు కనుక ఈరాత్రి గడిచాక ప్రాతఃకాలంలో లేచి ఉదయించే

సూర్యుడిని చూశాడంటే నేను జీవించి ఉండను. (సూర్యోదయం అయ్యేలోపునే కీచకుడు చనిపోవాలని ద్రౌపది కోరిక.))

దూషింపదగిన ద్యూతక్రీడలో తగుల్కొన్న మీ ఆ పెద్దన్నను నిందించు. ఆయన చేసిన పనులవల్లనేకదా నేను ఈ అనంతమైన దుఃఖంలో కూరుకుపోయాను. తనతోపాటుగా రాజ్యాన్ని సర్వస్వాన్ని విడిచి వనవాసానికి వెళ్లాలనే నియమం పెట్టుకొని జూదమాడగలిగేవాడు ద్యూతక్రీడావ్యసనం గల ఆ జూదరికాక వేరొక డెవడుంటాడు? అతడు ప్రతిరోజూ సాయంకాలం, ప్రొద్దుటా కూడా వేయిబంగారు నాణాలతో జూదమాడినా, లేదా విలువైన ధనాలు అంటే బంగారం, వెండి, వస్త్రాలు, రథాలు, బళ్లు, మేకలు, గొఱ్ఱెలు, గుర్రాలు మొదలైనవి ఏళ్లతరబడి పణంగాపెట్టి ఆడినా మనరాజ్యవైభవం ఎన్నటికీ క్షీణించేదికాదు. జూదంలో అతనికి ఉన్న ఆ వ్యసనమే సింహాసనం నుండి అతనిని క్రిందికి దింపివేసింది. ఈనాడు అతడు తాను చేసిన పనులను తలచుకొంటూ అజ్ఞానివలె ఉలుకూపలుకూ లేకుండా ఉన్నాడు. ఎక్కడికయినా బయలుదేరేటపుడు పదివేల ఏనుగులు, బంగారు గొలుసులు ధరించిన వేల కొద్దీ గుఱ్ఱాలు వెన్నంటి బయలుదేరేవి. ఆ మహారాజే ఇప్పుడు జూదంతో జీవితం గడుపుకొంటున్నాడు. ఇంద్రప్రస్థంలో అతడు ఎక్కడానికి ఒకలక్షరథాలు సిద్ధంగా ఉండేవి. ఆ మహారాజు యుధిష్ఠిరుని సేవించడానికి వేలకొద్దీ పరాక్రమవంతులైన రాజులు ఉండేవారు. అతని భోజనాలయంలో నిత్యమూ లక్షమంది దాసీలు బంగారుపాత్రలు చేతితో పట్టుకొని పగలు-రాత్రి అతిథులకు భోజనం పెడుతూ ఉండేవారు. దాతలలో ఉత్తముడైన యుధిష్ఠిరుడు రోజూ వేలకొద్దీ బంగారు నాణెములు దానంగా ఇస్తూ ఉండేవాడు. ఆ ధర్మరాజే నేడు జూదంలో సంపాదించిన అనర్థదాయకమైన ధనంతో జీవితం గడుపుతున్నాడు. ఇంద్రప్రస్థంలో విశుద్ధమణిమయ కుండలాలు ధరించిన అనేకులు సూతులు మాగధులు, మధురస్వరంతో సాయంప్రాతఃకాలాలలో ఈ మహారాజును స్తుతిస్తూ ఉండేవారు. తపస్సుతో, వేదవిజ్ఞానంతో నిండియున్న వేలకొద్దీ పూర్ణకాములైన ఋషులూ, మహర్షులూ ప్రతిదినమూ ఇతని రాజసభలో కొలువుతీరి ఉండేవారు. ఒక్కొక్కరివద్ద సేవకోసం ప్రత్యేకంగా ముప్పదిమంది దాసీలను పెట్టి, ఎనభైఎనిమిదివేలమంది స్నాతక గృహస్థ బ్రాహ్మణులను యుధిష్ఠిరుడు తనవద్ద ఉంచుకొని పోషించేవాడు. వారితోపాటే దానంపట్టని పదివేలమంది ఊర్ధ్వరేతులైన

సన్యాసులనుకూడా స్వయంగా భరించి పోషిస్తూ ఉండేవాడు. అట్టివాడే ఇప్పు డీ అవస్థలో జీవిస్తున్నాడు. కోమలత్వం, దయ, అందరికీ అన్నవస్త్రాలు ఇవ్వడం మొదలైన సమస్తసద్గుణాలు ఉండే ఆ మహారాజే ఈనాడు ఇట్టి దురవస్థలో పడిపోయాడు. ధైర్యసత్యపరాక్రమాలు కలిగిన యుధిష్ఠిరుడు తనకోమలస్వభావం కారణంగా అందరికీ భోజనాది సదుపాయాలు కల్పించడంలో మనసు లగ్నం చేస్తూండే వాడు. తన రాజ్యంలోని అంధులను, వృద్ధులను, అనాథులను, బాలకులను, దుర్గతికి లోనైన వారిని అనేకులను రక్షించి పోషిస్తూ ఉండేవాడు. ఆ యుధిష్ఠిర మహారాజే ఈనాడు మత్స్యరాజుకు సేవకుడై పరాధీనత అనే నరకంలో పడి ఉన్నాడు. సభలో రాజుతో జూదం ఆడుతూ తన్ను తాను కంకునిగా పరిచయం చేసుకొన్నాడు. ఇంద్రప్రస్థంలో నివసించే సమయంలో రాజులందరూ అతనికి కానుకలు సమర్పించేవారు. ఈనాడు అతడే తన భరణ పోషణాల నిమిత్తం ఇతరులనుండి ధనాన్ని పొందాలని కోరుకొంటున్నాడు. ఈ భూమిని పాలించే అనేక రాజులు అతనికి వశవర్తులై అతని ఆజ్ఞను పాటించేవారు. ఆ మహారాజే ఈనాడు వివశుడై ఇతరుల వశంలో ఉంటున్నాడు. సూర్యునివలె తన తేజస్సుచేత సంపూర్ణ భూమండలాన్ని వెలిగించిన ఆ ధర్మరాజు విరాటరాజు సభలో ఇపుడు ఒక సాధారణ సభ్యునిగ ఉన్నాడు. పాండునందనా! చూడు. రాజసభలో ఋషులతో పాటుగా అనేకరాజులు ఆయనను ఉపాసిస్తూ ఉండేవారు. ఈనాడు ఆయనే ఇతరులను ఉపాసిస్తున్నాడు. ఒక సామాన్య సభ్యుని గౌరవంతో ఇతరుల యొక్క సేవలో ఉంటూ విరాటుని మనసునకు ప్రియం కలిగే మాటలు చెప్తూ ఉండే యుధిష్ఠిర మహారాజుయొక్క ఈ అవస్థను చూసి నామనసులో కోపం పెరిగిపోతూ ఉంది. ధర్మాత్ముడు, మహాప్రాజ్ఞుడు, ఎప్పుడూ ఇట్టి దురవస్థను పొందతగనివాడు - ఈనాడు జీవిక కోసం ఇతరుల ఇళ్లల్లో ఉండవలసివచ్చింది. యుధిష్ఠిరుని ఇలాంటి స్థితిలో చూస్తే ఎవరికి బాధ కలుగకుండా ఉంటుంది? మునుపు రాజసభలో భూమండలంలోని ప్రజలు అన్నిదిక్కులనుండి వచ్చి అతనిని కొలిచేవారు. ఇప్పుడు ఆ భరతవంశ శిరోమణియే మరియొక రాజు సభలో కూర్చుండడం. చూడు మరి. ఇలా అనేకకష్టాలతో అనాధవలె బాధపడుతున్న నేను శోకసాగరంలో మునిగిపోయాను. నీవు నా దుర్దశను గమనించ లేదా ఏమి?'

19. పాండవుల కష్టములను తలచుకొని ద్రౌపది దుఃఖించుట.

నేనీ మాటలు దుఃఖం భరింపలేక అంటున్నానే గాని నిన్నాక్షేపించటానికి గాదు. కాబట్టి నాపై కోపం చెందకూడదు.. నీవు అతినీచమైన పాచకవృత్తిని చేపట్టి వల్లవజాతికి చెందిన వానిగా పరిచయం చేసుకొన్నప్పుడు అది వింటే ఎవరి మనసు కలత చెందదు? లోకులు నిన్ను విరాటరాజు వంటలవాడైన వల్లవుడుగానే అనుకొంటున్నారు. నీవు ప్రభువయి ఉండి కూడా సేవకునిగా సంచరిస్తున్నావు. ఇంతకు మించిన గొప్ప కష్టం మరేమిటి ఉంటుంది నాకు? పాకశాలలో వంటలు చేసి విరాటమహారాజు దగ్గరకు వచ్చి నీవు "మహారాజా! వంటవాడు వల్లవుడు మిమ్మల్ని భోజనానికి రమ్మని పిలవడానికి వచ్చాడు"అని చెప్తూ ఉంటే అది విని నా మనసుకు చాలా కష్టం కలుగుతూ ఉంటుంది. విరాటమహారాజు ఆనందంగా ఉన్నపుడు నిన్ను ఏనుగులతో పోరిస్తూఉంటే, ఆ సమయంలో రాణివాసపు స్త్రీలందరూ నవ్వుతూ ఉంటారు. నాకైతే మనసంతా దుఃఖంతో నిండిపోతూ ఉంటుంది. సుదేష్ణాదేవి ప్రేక్షకురాలిగా విచ్చేసి కూర్చున్నపుడు నీవు భవనప్రాంగణంలో పులులతో, సింహాలతో, దున్నలతో పోరాడుతూ ఉన్నపుడు నామనసు మిక్కిలి వ్యథ చెందుతూ ఉంటుంది. ఇలా ఉండగా ఒకసారి ఆ జంతువులతో నీ పోరాటం ముగిశాక లేచివెళ్తూ దుఃఖిస్తూ ఉన్న నన్ను చూచి కేకయరాజపుత్రి సుదేష్ణ, ఆమెతో పాటు వస్తున్న దాసీలు పరస్పరం ఇలా చెప్పుకోసాగారు." అందమైన చిరునవ్వుతో ఉండే ఈ సైరంధ్రి పూర్వం ఒకేచోట యుధిష్ఠిరుని దగ్గర ఉండడం కారణంగా కలిగిన స్నేహభావంవల్లనో, మానవధర్మంవల్లనో వల్లవుడు జంతువులతో పోరుతూఉంటే అతనికోసం మాటిమాటికి విచారిస్తోంది. సైరంధ్రి అందగత్తె. వల్లవుడూ అందగాడే మరి. స్త్రీలమనసులు తెలుసుకోవడం చాలా కష్టం. నాకయితే ఈ ఇద్దరి జంట బాగుందనిపిస్తోంది. సైరంధ్రి తన ప్రేమ కారణంగా వంటలవాడు ఏనుగులు మొదలైన వాటితో పోరాడే ప్రసక్తి వచ్చినపుడల్లా (దీనురాలై) ఎప్పుడూ కరుణాయుక్తంగానే మాటలాడుతుంది. ఈ రాజపరివారంలోకి కూడా వీరిద్దరూ ఒకే సమయంలో వచ్చి చేరారు" ఈ విధమైన మాటలతో రాణి సుదేష్ణ తరచుగా నేను ఉలికిపడేలా చేస్తోంది. పైగా నేను కోపించడం చూసి, నీపట్ల నాకు గూఢమైన ప్రేమ ఉన్నట్లు శంకిస్తూ ఉంటారు. వారు ఇలాంటి మాటలు అన్నప్పుడల్లా నాకు చాలా దుఃఖం కలుగుతూ ఉంటుంది.

భయంకరమైన పరాక్రమం గల నీవు ఈ రీతిగా సేవ అనే నరకాన్ని అనుభవిస్తూ ఉంటే, యుధిష్ఠిరునివల్ల కలిగినశోకంలో మునిగిన నాకు ఇప్పుడు బ్రతికి ఉండాలనే ఉత్సాహం ఏకోశానా లేదు. ఆ అర్జునుడు ఒంటరి రథికుడై మనుష్యులను దేవతలను కూడా జయించినవాడు, ఈనాడు విరాటుని కన్యలకు నాట్యం నేర్పుతున్నాడు. ఖాండవవనంలో సాక్షాత్తుగా అగ్నిదేవుడినే తృప్తి పరచిన ఆ అర్జునుడు నేడు నూతిలోని అగ్నిలా అంతఃపురంలో దాగి ఉన్నాడు. శత్రుభయంకరు డయిన అర్జునుడు లోకులు హీనంగా చూసే నపుంసకవేషంతో ఉన్నాడు. వింటి నారిని లాగి, కాయలు కాచిన ఆ చేతులకే శంఖవలయాలు గాజులుగా ధరించి అర్జునుడు దుఃఖం అనుభవిస్తున్నాడు. తన ధనుష్టంకారంతోనే శత్రువులను హడలెత్తించే ఆ అర్జునుడు నేడు స్త్రీలకు మధురగీతాలు వినిపిస్తూ వారిని సేవిస్తున్నాడు. శిరస్సుపై సూర్యకాంతితో వెలుగొందే కిరీటాన్ని ధరించి శోభించిన అర్జునుడు నేడు జడవేసుకొని వికృతంగా కన్పిస్తున్నాడు. భయంకరమైన గాండీవధనుస్సు ధరించి ఉండే అర్జునుడు ఈనాడు జడఅల్లుకొని ఉండటం, కన్యలు చుట్టూచేరి ఉండడం చూస్తే నాహృదయం విషాదంతో క్రుంగిపోతోంది. సంపూర్ణదివ్యాస్త్రాలు ధరించి, సమస్తవిద్యలకు ఆధారభూతుడైన మహాత్ముడు ఈనాడు (స్త్రీలవలె) చెవులకు కమ్మలు ధరించాడు. మహాసాగరం చెలియలికట్టను అతిక్రమించలేనట్లుగా వేలకొలది రాజులు, సాటిలేని పరాక్రమవంతులు అతనిని తాకడానికి ముందుకు రాలేకపోయేవారు. అలాంటి అర్జునుడు ఈవేళ విరాటుని కన్యలకు నాట్యం నేర్పుతూ, నపుంసక వేషంలో తన్ను మరుగుపరుచుకొని, ఉన్నాడు. భీమసేనా! ఎవరి రథచక్రఘోషచేత కొండలు, అడవులు, చరాచరప్రాణులతో కూడిన ఈ భూమండలమంతా కంపిస్తుందో, ఏ మహాభాగ్యశాలిని పుత్రునిగా పొంది కుంతీమాత తన దుఃఖాన్నంతా పోగొట్టుకుందో,ఆ నీ తమ్ముడు అర్జునుడు తన దురవస్థ కారణంగా నాకు శోకాన్ని కలిగిస్తున్నాడు. అర్జునునితో పోటీపడగల వీరుడైన ధనుర్ధరుడు ఈ భూమిమీద లేడు. అటువంటి అర్జునుడు ఈనాడు కన్యకలమధ్య కూర్చుని పాటలు పాడుతున్నాడు. ధర్మంలో, పరాక్రమంలో, సత్యభాషణంలో జీవజగత్తుకే ఆదర్శంగా నిలిచినవాడు అర్జునుడు. అలాంటి వాడు ఈనాడు స్త్రీవేషంలో వికృతంగా ఉండడం చూసి నామనసు దుఃఖంలో మునిగిపోతోంది. తన కొడుకు అర్జునుడు ఇలాంటి సంకటస్థితిలో పడతాడని కాని; కురువంశశ్రేష్ఠుడు, అజాతశత్రువు అయిన

యుధిష్ఠిరుడు దుర్వ్యూతం ఆడి శోకమగ్ను డవుతాడని కాని నిశ్చయంగా మా అత్త కుంతికి తెలిసి ఉండదు.

(కుంతీకుమారుడు అర్జునుడు ఇంద్ర, వారుణ, వాయవ్య, బ్రాహ్మ, ఆగ్నేయ, వైష్ణవ అస్త్రాలద్వారా అగ్నిదేవుడిని తృప్తిపరుస్తూ ఒక్క రథం సహాయంతోనే సమస్త దేవతలను జయించాడు. తన దివ్యాస్త్రాలద్వారా సమస్త శత్రువులను నాశనం చేయడంలో సమర్థుడైన అతని ఆత్మబలం అచింత్యమైనది. అతడొక్కడే రథాన్ని ఎక్కి దివ్యమైన, గాంధర్వ, వాయవ్య, వైష్ణవ, బ్రాహ్మ, పాశుపత, స్థూణాకర్ణాది అస్త్రాలు ప్రదర్శించి ఇంద్రునికి శత్రువులైన నివాతకవచులను, భయంకరులైన పౌలోమకాలకేయులను ఓడించాడు. అలాంటి అర్జునుడు ఈనాడు అంతఃపురంలో నూతిలో దాగిన అగ్నిలాగ అలా మరుగున పడి ఉన్నాడు. గొప్పఎద్దు గోశాలలో కట్టివేయబడినట్లు స్త్రీవేషంతో వికృతంగా ఉన్న అర్జునుని కన్యాంతఃపురంలో చూస్తే నాకు మాటిమాటికి కుంతీదేవి జ్ఞాపకం వస్తోంది.)

అలాగే నీ చిన్నతమ్ముడు సహదేవుడు గోపాలుడుగా మారి గోవుల మధ్యలో గోవులకాపరి వేషంతో ఉండడం చూస్తే నాకు శరీరం పాలిపోయినట్లుగా అయిపోతుంది. భీమసేనా! సహదేవుని దుర్దశను మాటిమాటికి తలచుకుంటే నాకు కంటికి నిద్రే రాదు. నాకు తెలిసినంతవరకు సహదేవుడు ఎప్పుడూ ఏ పాపమూ చేయలేదు. కాని ఈ సత్యవిక్రముడు ఇలాంటి దుఃఖం అనుభవించవలసి వచ్చింది. గిత్తలాగ తుష్టిగా పుష్టిగా ఉన్న నీ ప్రియసోదరుడైన సహదేవుడిని విరాటుడు గోరక్షణకు నియోగించడం చూసి నాకు చాలా దుఃఖం కలుగుతూ ఉంది. ఎట్టనిరంగుగల అందమైన గోపాలుర అంగరఖా ధరించిన సహదేవుడిని చూస్తే ఆనందం కలిగినా, అతడు విరాటరాజును అభినందించడం చూసినప్పుడు మాత్రం నాకు జ్వరం వచ్చినట్లుగా ఉంటుంది. వీరుడా! పూజ్యురాలు కుంతి నాతో ఎప్పుడూ సహదేవుని గూర్చి గొప్ప వంశంలో పుట్టాడనీ, శీలవంతుడనీ, సదాచార సంపన్నుడనీ ప్రశంసిస్తూ ఉండేది. నాకింకా జ్ఞాపకం ఉంది. సహదేవుడు వనవాసానికి వచ్చేటపుడు పుత్రవాత్సల్యంతో కుంతీమాత అతడిని హృదయానికి అత్తుకొని ఏడుస్తూ నాతో "యాజ్ఞసేనీ! సహదేవుడు సిగ్గుపడుతూ ఉంటాడు, మధురంగా మాట్లాడుతాడు. ధార్మికుడు, వీడంటే నాకు చాలా ఇష్టం. ఇతడిని అడవులలో రాత్రిళ్ళు నీవే స్వయంగా జాగ్రత్తగా (చేయిపట్టుకుని) చూసుకో. ఎందుకంటే వీడు చాలా సుకుమారుడు, (అలసిపోతే నడవలేడేమో). నాకొడుకు సహదేవుడు పరాక్రమవంతుడు. పెద్దన్నగారికి భక్తుడు. అన్నలను పూజించేవాడు. పాంచాలీ! ఇతనికి నీ చేతులతోనే అన్నం తినిపించు." అని అప్పగించింది.

పాండునందనా! యోధులలోశ్రేష్ఠుడయిన ఆ సహదేవుడు గోసేవలో మునిగిఉండడం, దూడలచర్మాల మీద రాత్రిళ్లు పడుకోవడం చూస్తున్న నేను ఎలా బ్రతికి ఉండగలను?

అలాగే అందమైన రూపం, అస్త్రబలం, మేధాశక్తి- ఈమూడూ నిత్యసంపదలుగా గల వీరవరుడు నకులుడు నేడు విరాటుని దగ్గర గుర్రాలను సాకేవాడుగా ఉన్నాడు. చూడు. కాలవైపరీత్యం ఎలా ఉందో? ఎవరిని చూసి శత్రువుల సమూహం దూరంగా చెల్లాచెదరై పారిపోతుందో ఆ నకులుడు అశ్వశిక్షకుడై గుర్రాల మంకుతనాన్ని పోగొట్టి వాటిని కళ్లెములతో అదుపుచేస్తూ, మహారాజుఎదుట వాటికి వేగంగా పరిగెత్తే శిక్షణ ఇవ్వవలసి వచ్చింది. ఉత్తమరూపవంతుడు అయిన నకులుడు, ఆ మత్స్యనరేశునికి రకరకాల గుర్రాలను చూపుతూ అతనిని సేవిస్తూ ఉండడం నాకళ్లారా చూశాను. ఇదంతా చూస్తూ నేను సుఖంగానే ఉన్నానని నీవు అనుకొంటున్నావా? ధర్మరాజు కారణంగానే ఇన్నివందల కష్టాలు నన్ను చుట్టుముడుతున్నాయి.ఇన్నిటిని మించిన మరొక పెద్దకష్టం నాకు వచ్చిపడింది. అదీ చెప్తాను విను. మీరందరూ జీవించి ఉండగానే నానారకాల కష్టాలు నా శరీరాన్ని శుష్కింపచేస్తున్నాయి. ఇంతకంటె మించిన దుఃఖం మరొకటి ఏమి ఉండగలదు?

20. ద్రౌపది తన కష్టమును భీమునకు తెలుపుట.

ద్రౌపది చెపుతోంది.పరంతపా! జూదంలో ఆసక్తికల మీఅన్నగారి కారణంగా ఈనాడు నేను రాజభవనంలో సైరంధ్రీ వేషంలో సుదేష్ణాదేవికి స్నానానికి కావలసిన వస్తువులు సమకూర్చి సేవిస్తున్నాను. రాజకుమారిని అయిఉండి కూడా ఎంత నీచమయిన పని చేయవలసివచ్చిందో చూడు. కాని కష్టాలు వచ్చినపుడు, అవి ఎప్పటికైనా తీరుతాయని అనుకూలసమయంకోసం ఎదురుచూస్తూ ఉన్నాను. మానవులకు జయ పరాజయాలు అనిత్యాలు. ఇది తలచుకునే నేను నా భర్తల అభ్యుదయానికై ఎదురుచూస్తున్నాను. సంపత్తి-విపత్తి ఎప్పుడూ బండి చక్రంలా తిరుగుతూనే ఉంటాయి. ఇది ఆలోచించే నేను నా భర్తల పునరభ్యుదయం కోసం ఎదురుచూస్తున్నాను. మనిషికి విజయాన్ని చేకూర్చి పెట్టే కాలమే పరాజయానికీ కారణ మవుతుంది. ఇది తెలిసే నేను నా పక్షానికి విజయం కలిగే దారిని ప్రతీక్షిస్తున్నాను. భీమసేనా! ఈ దుఃఖాల తాకిడితో నేను జీవచ్ఛవంలా ఉన్నానని నీకు తెలియదా? దానం చేసినవారే

ఎప్పటికయినా యాచకులుగా మారుతారని, ఇతరులను చంపేవారు ఎందరో ఇతరుల చేతిలో చస్తూఉంటారు అని, ఎదుటివారిని దుర్దశకు తెచ్చినవారు స్వయంగా శత్రువులవలన దుర్దశకు లోనవుతారు అనీ నేను విన్నాను. కాబట్టి **దైవం చేయలేనిది ఏదీ లేదు. విధి విధానాన్ని ఉల్లఘించడం అసంభవం.** కనుకనే నేను దైవప్రాధాన్యాన్ని చాటిచెప్పే శాస్త్రవాక్యాల పట్ల ఆదరం చూపుతూ ఉంటాను. నీరు మొదట ఉన్న చోటికే చేరుతుంది. ఈ క్రమాన్ని కోరే నేను తిరిగి అభ్యుదయకాలాన్ని గూర్చి ప్రతీక్షిస్తున్నాను. విజ్ఞుడైన పురుషుడు దైవాన్ని అనుకూలంగా మార్చుకొనేందుకే ప్రయత్నం చేయాలి. నేను ఇప్పుడు చెప్పిన మాటలవలన ప్రయోజనం ఏమిటి? దుఃఖపడుతున్న నన్ను అడిగితే అసలు సంగతి చెప్తాను.

పాండవుల పట్టమహిషిని, ద్రుపదమహారాజు కూతురిని అయిఉండి కూడా ఇటువంటి దుర్దశను అనుభవిస్తున్నాను. నేను తప్ప వేరే ఏ స్త్రీ కూడా ఇలాంటి స్థితిలో జీవించాలని అనుకోదు. నాకు కలిగిన ఈ కష్టం సమస్తకౌరవులకు, పాంచాలురకు, పాండవులకు కూడా అవమానకరమే. ఎంతోమంది సోదరులు, అత్త మామలు, పుత్రులు అందరూ అన్ని విధాలా ఉచ్చస్థితిలో ఉండికూడా ఇట్టి పరిస్థితిలో నా వంటిది తప్ప వేరే ఏ స్త్రీ దుఃఖాన్ని అనుభవిస్తుంది? తప్పకుండా నేను చిన్నతనంలో విధిపట్ల ఏదో గొప్ప అపచారమే చేసి ఉంటా ననిపిస్తోంది. తత్ఫలితంగానే ఈనాడు ఈ దుర్దశను అనుభవిస్తున్నాను. చూడు. నా శరీరకాంతి ఎలా తరిగిపోయిందో! ఇప్పుడు నగరంలో నేను పడుతున్న అవస్థ ఆ రోజులలో అత్యంతదుఃఖపూర్ణమైన వనవాసంలో కూడా పడలేదు. భీమసేనా! నీకూ తెలుసు..ఇంతకు ముందు నేనెంత సుఖాన్ని అనుభవించానో. ఇక్కడకు వచ్చి దాసీగా మారినప్పటినుండి పరాధీనం కారణంగా నాకు ఏ మాత్రం కూడా శాంతి లభించడం లేదు. ఇది నేను దైవలీల అనుకొంటున్నాను. ఎందుకంటే ప్రచండమైన ధనుస్సు ధరించి ఉండే ఆజానుబాహువైన అర్జునుడు కూడా నివురుగప్పిన నిప్పులా అంతఃపురంలో మరుగునపడి ఉన్నాడు. కుంతీనందనా! **దైవాధీనాలైన ప్రాణులు ఎప్పుడు ఏగతి పొందుతాయో మనుష్యులు తెలుసుకోలేరు.** మీకు కలిగిన ఈ అవమానం ఎవరూ మనసులలోనూ ఊహించి కూడా ఉండరు. ఒకప్పుడు ఇంద్రునితో సమానమైన పరాక్రమం గల మీ సోదరులంతా నా ముఖాన్ని చూసి ఎప్పుడూ పొగడుతూ ఉండేవారు. అట్టి శ్రేష్ఠురాలనైన నేనే

ఈనాడు నికృష్టలైన వేరే స్త్రీలముఖాలను పొగడవలసి వస్తోంది. పాండునందనా! చూడు. మీరందరూ జీవించి ఉండగానే నేను పొందకూడని ఇలాంటి దురవస్థను పొందాను. కాలవిపర్యయం చూడు. ఒకనాడు సముద్రంవరకూ వ్యాపించిన భూమి అంతా అధీనంలో ఉన్న నేను నేడు సుదేష్ణ కనుసన్నలలో మెలగుతూ ఆమెకు భయపడుతున్నాను. ముందువెనుకల అనేక పరిచారికలు సేవిస్తూ ఉండే నేను ఈనాడు ఈ రాణి సుదేష్ణకు ముందూ, వెనుకా నడుస్తున్నాను. ఇదే కాకుండా నాకు మరొక సహించలేని కష్టం కూడా ఉంది. చూడు, ఇంతకు ముందు కుంతీదేవికి తప్ప (ఇతరుల మాట చెప్పేదేమిటి) స్వయంగా నాకోసం కూడా నేను నలుగుపిండి నూరలేదు. పార్థా! ఇవిగో నాచేతులు రెండూ చూడు. కాయలు కాశాయి. ఇంతకు ముందు ఇలా లేవు.'

అని చెప్పి ద్రౌపది భీమసేనునికి తన రెండు చేతులనూ చూపింది. చందనం అరగతీయడంతో నల్లని కాయలు ఏర్పడ్డాయి ఆ చేతులలో. 'ఇంతకు ముందు ఎప్పుడూ పూజ్యురాలైన కుంతికి గాని, మీకు గాని నేను భయపడలేదు. అలాంటి నేను ఈనాడు దాసీగా విరాటరాజు ఎదుట భయపడుతూ ఉంటున్నాను. ఆ సమయంలో "మహారాజు ఏమంటాడో? ఈ నలుగుపిండిని సరిగ్గా తయారుచేశానో లేదో" అని ఆలోచిస్తూ ఉంటాను. నేను తప్ప వేరెవరు సిద్ధం చేసినా ఆ గంధం మత్స్యరాజుకు నచ్చదు.' ద్రౌపది ఈ రీతిగా భీమసేనునికి తన దుఃఖాన్ని గూర్చి చెప్పి, అతని ముఖంవైపు చూస్తూ మెల్లమెల్లగా ఏడుస్తూ 'భీమసేనా! నేను పూర్వకాలంలో దేవతలపట్ల చిన్న అపరాధం కూడా చేయలేదు. అందుకే అభాగ్యురాలను అయిన నేను చచ్చిపోవలసిన స్థితిలో కూడా బ్రతుకుతున్నాను' అన్నది. అనంతరం శత్రుమర్దనుడైన భీముడు - చిక్కిపోయి, కాయలు కాచిన ఆ చేతులను తన ముఖానికి ఆనించి విలపించాడు. పరాక్రమవంతుడైన భీముడు ఆ చేతులను పట్టుకొని కన్నీళ్లు విడుస్తూ, దుఃఖంతో బాధపడుతూ ఇలా అన్నాడు.

21. భీముడు ద్రౌపదిని ఓదార్చుట.

'పూర్వం కోమలంగా ఎట్టగా ఉండే నీ యీ చేతులు రెండూ నేడు నల్లగా కాయలు కాసి పోవడంవలన నాభుజబలమూ, అర్జునుని గాండీవమూ రెండూ పనికిరానివే

అయ్యాయి. నేను అపుడే విరాటుని సభలో పెద్దమారణకాండ జరిపి ఉందును. కాని అలా చేయకపోవడానికి కారణం యుధిష్ఠిరమహారాజు చూపే. (అజ్ఞాతవాసం బయట పడుతుందనే భయాన్ని సూచిస్తూ నాకేసి చూశాడు.) లేకపోతే ఐశ్వర్యమదాంధుడైన ఆ కీచకుని తలను ఏనుగు ఆటలాడుతూ వెదురు బొంగును త్రొక్కి వేసినట్లుగా కాళ్లతో త్రొక్కివేసేవాడిని. ద్రౌపదీ! కీచకుడు నిన్ను కాలితో తన్నినపుడు నేను అక్కడే ఉండి నాకళ్లతో ఆ దృశ్యాన్ని చూశాను. నాకు అప్పుడే ఈ మత్స్యదేశవాసుల నందరినీ చంపేయాలి అనిపించింది. కాని ధర్మరాజు అక్కడ నన్ను కళ్లతోనే సైగచేసి ఆపని చేయకుండా వారించాడు. భామినీ! నేను కూడా ఆసైగను గ్రహించాను కనుకనే నిశ్శబ్దంగా ఉండిపోయాను. మనం రాజ్యం కోల్పోయిన నాడే కౌరవులవధ జరిగిఉండాల్సింది. దుర్యోధనుడు, కర్ణుడు, శకుని, దుశ్శాసనుడు-వీరందరి శిరసుల్ని నరికి ఉండాల్సింది. ఇదంతా ఆలోచిస్తే నామనసులో ముల్లు గుచ్చుకొన్నట్లుంటుంది. శరీరంలో మంటలు రేగుతున్నాయి. సుశ్రోణీ! నీవు చాల బుద్ధిమంతురాలివి. **ధర్మాన్ని విడిచిపెట్టకు. క్రోధాన్ని విడిచిపెట్టు.** కళ్యాణీ! ఒకవేళ యుధిష్ఠిరుడు నీ ఈ నిందను పూర్తిగా వింటే అతడు తప్పక మరణించేవాడు. అర్జునుడు గాని, నకులసహదేవులు గాని నీవు చేసిన నిందను వింటే వారు తప్పక మరణిస్తారు. వారు మరణిస్తే నేను బ్రతకలేను.

పూర్వం భృగుమహర్షి యొక్క కొడుకు చ్యవనుడనే ఋషి ఉండేవాడు. అతడు తపస్సు చేసి చేసి పుట్టగా మారిపోయాడు. అతని భార్య సుకన్య భర్తకు సేవలు చేసి సుఖాలు పొందింది. నారాయణి అయిన ఇంద్రసేన- రూపవతి అని నీవు వినే ఉంటావు- వేలసంవత్సరాల ముసలివాడైన తన మగనికి - ముద్గలమహర్షికి సేవలు చేసి తరించింది ఆమె. జనకుని కూతురైన సీత గురించికూడ నీవు వినే ఉంటావు. ఆమె దండకారణ్యంలో కూడా పతిని అనుసరించింది. రాక్షసుడైన రావణుడు ఆమెను లంకకు తీసుకుపోయాడు. రామునికి ప్రియమైన ఆమె అక్కడ ఎన్నో బాధ లనుభవించి చివరకు రాముణ్ణి చేరుకుంది. (అంతే గాని ధర్మాన్ని తప్పలేదు.) సౌందర్యవతి, యౌవనవతి అయిన లోపాముద్రకూడ సమస్త సుఖాల్ని విడిచిపెట్టి అగస్త్యమహర్షిని అనుసరించింది. పతివ్రత, అభిమానవతియైన సావిత్రి సత్యవంతుని ప్రాణాలు కాపాడుకోవడానికి యమ ధర్మరాజును అనుసరించి ఒంటరిగానే

యమలోకానికి కూడా వెళ్ళింది. కల్యాణీ! పతివ్రతలు, రూపవతులు, గుణవతులు అయిన సైవారివలె నీవు కూడా సద్గుణవంతురాలవు. కొద్దికాలం ఓపికపట్టు. ఒక్క పదిహేను రోజులు. పదమూడోఏడు నిండగానే నీవు రాణు లందఱకు రాణివౌతావు.

(దేవీ! నేను ఒట్టువేసి చెబుతున్నా. నామాటనిజం. నీవు స్త్రీలందఱిలో కెల్ల ఆదర్శవతిగా పేరుపొందుతావు. నీవు నీపతిభక్తి వల్ల రాజులందరికంటె ఉన్నతస్థానం పొంది వారందఱు నిన్ను శిరసావహించే విధంగా సకలభోగాలు అనుభవిస్తావు.')

ఆ మాటలు విని ద్రౌపది ఇలా అంది. 'భీమా! నేను దుఃఖాన్ని భరించలేక దీనతతో నీ ముందు కంటనీరుపెట్టాను గాని యుధిష్ఠిరుని నిందించడంలేదు. జరిగినదాని గురించి మాట్లాడుకోవడం వల్ల ఏమీ ప్రయోజనం లేదు. ఈ విషయంలో నీవు చేయవలసిన పనిగురించి ఆలోచించు. కేకయరాజకుమారి తనకంటే అందమైన నన్ను చూసి తన భర్త విరాటమహారాజు నాయందెక్కడ ఆసక్తి చూపుతాడో నని నిత్యం కలతచెందుతోంది. ఆ కీచకుణ్ణి చూస్తేనే పాపం చుట్టుకొంటుంది. అటువంటి కీచకుడు రాణిసుదేష్ణ యొక్క భావాన్ని గుర్తించి స్వయంగా నావద్దకు వచ్చి పదేపదే అడగడం మొదలుపెట్టాడు. భీమా! అతని అభిప్రాయాన్ని తెలుసుకొన్న నాకు చాలాకోపం వచ్చింది. కాని కోపాన్ని నిగ్రహించుకొన్నాను. "కామాంధుడా! కీచకా! నిన్ను నీవు రక్షించుకోనే వైదుగురు గంధర్వులకు ప్రియపత్నిని. వాళ్లు శూరులు. సాహసం గలవాళ్లు. వాళ్లకు కోపం వస్తే నిన్ను తప్పక చంపేస్తారు." అన్నాను. వెంటనే వాడు నన్ను చూసి నీ భర్తలైన గంధర్వులకు నేను భయపడ నన్నాడు. పిరికిదానా! గంధర్వులు వందలకొద్ది లక్షలకొద్ది వచ్చినా నేనొక్కణ్ణే వాళ్ళందర్ని చంపెయ్యగలను గాని నీవు నాకోరిక తీర్చు అన్నాడు. నేను కామాతురుడైన కీచకుడితో ఇలా అన్నాను. "నీవు కీర్తికల ఆ గంధర్వులతో సమానం కావు. నేను ఉన్నతకులంలో పుట్టాను. శీలం కలదాన్ని. పాతివ్రత్యధర్మంతో ఉన్నాను. నా కారణంగా ఎవరూ చావ కూడదు. అందువల్లనే నీవింకా బ్రతికిఉన్నావు." నేనలా అన్నాక కీచకుడు బిగ్గరగా నవ్వాడు. ఆ తర్వాత సుదేష్ణ కీచకుడికి మేలు చెయ్యాలనుకొంది. "కల్యాణీ! నీవు కీచకుని ఇంటికి వెళ్ళి సురను తెచ్చిపెట్టు, అని నన్ను పంపించింది. నే నక్కడకు వెళ్లాను. ఆ కీచకుడు నన్ను చూసి అనేకవిధాలుగా బ్రతిమాలాడు. నేనతనికోరిక కాదన్నాను. వాడు కోపంతో నన్ను బలవంతంగా లోబరుచుకోడానికి ప్రయత్నించాడు. నేను దురాత్ముడైన ఆ కీచకుని అభిప్రాయాన్ని

తెలుసుకొని రక్షణకోసం విరాటరాజున్న చోటికి వేగంగా పరుగెత్తాను. దుర్మార్గుడైన ఆ కీచకుడు రాజు చూస్తుండగానే నన్ను క్రింద పడేసి కాలితో తన్నాడు. అది విరాటరాజు చూస్తున్నాడు. కంకుభట్టు ఇంకా చాలామంది జనం చూస్తున్నారు. రథికులూ, రాజుకు ఇష్టమయిన వారూ, నాగరికులూ చూస్తూనే ఉన్నారు. నేను రాజును, కంకుభట్టును చాలసార్లు నిందించాను. అయినా రాజు కీచకుని దుర్మార్గాన్ని దండించలేకపోయాడు. కీచకుడనే పేరుగల వీడు విరాటునకు సహాయకుడు, సారథి. ధర్మాన్ని విడిచి పెట్టినవాడు. క్రూరుడు. అయినప్పటికి విరాటుడు, సుదేష్ణ ఇద్దరూ ఇతనిని అభిమానిస్తూ ఉంటారు. వీడు శూరుడు. తన శూరత్వంపై అభిమానం కలవాడు. పాపాత్ముడు. పరస్త్రీలను చెరబట్టేవాడు. ఇతరుల నుంచి ధనరాసుల్ని సంపాదిస్తూ ఉంటాడు. ప్రజలు వీడ్చిమొత్తుకొంటున్నా వీడు వాళ్ళనుంచి ధనం కాజేస్తూనే ఉంటాడు. మంచిమార్గంలో ఎప్పుడూ నిలవడు. ధర్మం అనుసరించడు. వీడు పాపాత్ముడు. పాపపుటాలోచనలు కలవాడు. కామానికి వశుడయ్యాడు. నీతిలేనివాడు. దుష్టుడు. వీడు నేను కనిపించినప్పుడల్లా హింసిస్తే భయంతో నేను వీనాడైనా చచ్చిపోవచ్చు. ఈస్థితిలో ధర్మం కోసం ప్రయత్నించే మీకు ధర్మహాని కలగవచ్చు. ఒకవేళ మీరు మీ ప్రతిజ్ఞకోసం (పదమూడేళ్లు) వేచి ఉండాలనుకొంటే మీ భార్య బ్రతకదు. భార్యను రక్షిస్తేనే సంతానానికి రక్ష. సంతానాన్ని రక్షిస్తేనే తనక్కూడా రక్షణ కల్గుతుంది. ఎందుకంటే మనిషి తానే స్వయంగా భార్య ద్వారా సంతానంగా పుడుతున్నాడు కదా! అందువల్లే పండితులు భార్యను జాయ అంటున్నారు. వర్ణధర్మాలగురించి బ్రాహ్మణులు చెప్తుంటే విన్నాను. తనచేత రక్షింపదగిన భర్త తన గర్భంలో ఎలా పుడతాడా..అని భార్య ఎదురుచూస్తూ ఉంటుందట. భీమసేనా! క్షత్రియుడికి శత్రువుల్ని చంపడంకంటే వేరే ధర్మం లేదు. ధర్మరాజూ, నీవూ చూస్తుండగానే ఆ కీచకుడు నన్ను తన్నాడు. నీవే కదా ఒకప్పుడు భయంకరుడైన జటాసురుని బారినుండి నన్ను రక్షించావు. జయద్రధుడు నన్నవమానించినపుడు నీ అన్నదమ్ములతో కలిసి అతనిని జయించావు. అలాగే ఇప్పుడు కూడా నన్నవమానించిన ఆ పాపాత్ముడైన కీచకుణ్ణి చంపు. ఆ కీచకుడంటే రాజుకు చాల ఇష్టం. ఆ అండతో నన్ను బాధపెడుతున్నాడు. కామంతో కళ్లు మూసుకుపోయిన ఆ కీచకుణ్ణి రాతిపై కుండను పడేసి కొట్టినట్లుగా కొట్టి చంపు. నాకిన్ని కష్టాలు కల్గించిన ఆ కీచకుణ్ణి రేపు

సూర్యు డుదయించే లోపుగా చంపకపోతే నేను విషం త్రాగి చచ్చిపోతాను. కాని వాడికి మాత్రం చిక్కను. ఆ కీచకుడికి లొంగిపోయేకన్నా నీయెదుట చచ్చిపోవడమే మంచిది.' ద్రౌపది అలా అని భీమునిగుండెలపై వాలి ఏడ్చింది. భీముడు ఆమెను కౌగిలించుకుని ఎంతో ఓదార్చాడు. మిక్కిలి దుఃఖించే ద్రౌపదిని భీముడు ఎన్నో విధాల ఓదార్చాడు. కన్నీటితో నిండిన ఆమె ముఖం తనచేతితో తుడిచి ఒక్కసారి కీచకుని స్మరించాడు. కోపం ముంచుకొని వచ్చింది. పెదవుల ప్రక్క నుండి జారే నీటిని నాలుకతో తుడుచుకొంటూ, దుఃఖార్తురాలయిన ద్రౌపదితో భీముడిలా అన్నాడు.

22. భీమకీచకుల యుద్ధము, కీచకవధ.

'ప్రియా! నేను నీవు చెప్పినట్లే చేస్తా. నేడే ఆ కీచకునీ, అతని బంధువుల్నీ చంపివేస్తాను. యాజ్ఞసేనీ! నీవు శోకమూ, దుఃఖమూ విడిచి కీచకుణ్ణి ఈ రాత్రిమొదటి జాము నర్తనశాలకు రమ్మని ఒప్పందం కుదుర్చుకో. ఈ నర్తనశాలను విరాటమహారాజు కట్టించాడు. ఇందులో స్త్రీలు (కన్యలు) పగలంతా నాట్యం చేస్తారు. రాత్రివేళ ఇళ్లకు పోతారు. అక్కడ దృఢమైన చక్కని శయ్య ఒకటి అమర్చబడి ఉంది. అక్కడ ఆ కీచకుడికి చనిపోయిన వాడి తాతముత్తాతల్ని చూపిస్తాను. కల్యాణీ! నిన్నెవరూ చూడకుండ ఈ సంకేతాన్ని వాడికి తెలియచెయ్యి. ఎలాగైనా వాడు అక్కడికి వచ్చేటట్లు చెయ్యి.' ఇలా వాళ్ళిద్దరూ మాట్లాడు కొని, ఏడ్చి, కళ్లు తుడుచుకొని భయంకర మయిన మిగతా రాత్రి ఎలాగో అతికష్టంమీద గడిపారు. (వెళ్లబుచ్చారు.) రాత్రి గడిచింది.

ప్రొద్దుటే కీచకుడు లేచి రాజమందిరానికి వచ్చి ద్రౌపదితో ఇలా అన్నాడు. 'ద్రౌపదీ! నేను సభలో మహారాజు చూస్తుండగానే నిన్ను కాలితో తన్ని క్రింద పడేశానుగదా! బలవంతుల్లో ఏ ఒక్కడైనా నిన్ను రక్షించగలిగాడా? ఈ విరాటుడు మత్స్యదేశానికి పేరుకు మాత్రమే రాజు. సేనానాయకుణ్ణి, అసలైన రాజును నేనే. పిరికిదానా! నన్ను పొందు. సుఖాలు పొందు. నేను నీకు దాసుణ్ణి అవుతాను. సుశ్రోణీ! నేను నీకు రోజూ వంద బంగారు నాణెములు ఇస్తాను. వందలకొలది దాసీజనాన్ని, సేవకుల్ని నీకిస్తాను. మంచి గుఱ్ఱాలున్న రథాలను నీకు కానుకగా ఇస్తాను. మనమిద్దరం తప్పక కలవాలి.'

అపుడు ద్రౌపది ఇలా అంది. 'కీచకా! నీకిష్టమైతే నేనొక నియమం చెబుతా. విను. నీవు నన్ను కలవాలంటే ఆ విషయం నీ స్నేహితులకుగాని, సోదరులకుగాని తెలియకూడదు. నా భర్తలైన గంధర్వులు ఎంతో పేరుగలవారు. ఈ విషయమై నిందకు నేను భయపడుతున్నాను. ఈ విషయం ఎవరికీ చెప్ప నని ప్రమాణం చెయ్యి. అప్పుడే నేను నీకు వశమవుతాను.' వెంటనే కీచకు డిలా డన్నాడు. 'సుశ్రోణీ! నీవు చెప్పినట్లే నడుచుకొంటాను. ఎవ్వరూ లేనప్పుడు మీయింటికి నేనొక్కణ్ణే వస్తాను. రంభోరూ! కామమోహితుడ నైన నేను సూర్యునితో సమానమైన తేజస్సుగల గంధర్వులు చూడకుండానే నిన్ను కలుసుకోవటానికి వస్తాను.'

ద్రౌపది – 'కీచకా! మత్స్యరాజు కట్టించిన నాట్యశాల ఉందిగదా! అక్కడ కన్యలందరు పగలంతా నాట్యం చేస్తారు. రాత్రి సమయంలో ఇళ్లకు పోతారు. చీకట్లో అక్కడకు రా. అది గంధర్వులు తెలుసు కోలేరు. అక్కడ కలుసుకొంటే దోషం ఉండదు. ఈ విషయంలో ఎటువంటి సందేహం లేదు.'

(కీచకుడు – 'సుందరీ! నీవు ఎలా చెపితే అలా చేస్తాను. నీసమాగమంకోసం నేనొక్కణ్ణే నర్తనశాలకు వస్తాను. నేను నాపుణ్యంమీద ఒట్టేసి చెబుతున్నా. సుందరీ! నీపతులైన గంధర్వులకు తెలియకుండ ఉండేలాగ నేను ప్రయత్నం చేస్తా. ప్రతిజ్ఞ చేస్తున్నాను. గంధర్వులవలన నీకెటువంటి భయమూ లేదు.')

ద్రౌపది కీచకుడితో ఆ విషయం చెప్పిన తర్వాత కీచకుడికి ఆ పూట ఒకమాసంలా అనిపించింది. కీచకుడు సంతోషంలో తేలియాడి ఇల్లు చేరుకొన్నాడు. మృత్యువు సైరంధ్రిరూపంలో పొంచి ఉందని ఆ మూర్ఖుడు తెలుసుకోలేకపోయాడు. వెంటనే కామమోహితుడైన ఆ కీచకుడు గంధం పూసుకోవడం, ఆభరణాలు పెట్టుకోవడం, దండలు ధరించడం మొదలుగాగల అలంకరణలపట్ల ఆసక్తు డయ్యాడు. ఆ కీచకుడు ఆ ద్రౌపదినే పదేపదే తలచుకొంటూ, అందంగా అలంకరించుకొంటూ ఉత్కంఠతో క్షణమొక యుగంలా గడిపాడు. ఆరిపోయే దీపానికి వెలుగెక్కువన్నట్లు రాజ్యాన్ని, ప్రాణాల్ని పోగొట్టుకోబోయే అతని శరీరం కాంతితో ప్రకాశించింది. కాముకుడైన కీచకుడు ద్రౌపది యొక్కమాటలు పూర్తిగా నమ్మి ఆమెపొందునుగురించే ఆలోచిస్తూ ప్రొద్దుపోవడం కూడ గమనించలేక పోయాడు.

ఆ తరువాత ద్రౌపది వంటశాలలోనున్న భీమునివద్దకు చేరుకుంది. ద్రౌపది భీమునితో "నీవు చెప్పినట్లే నర్తనశాలకు రమ్మని కీచకుడితో అన్నాను. ఆ కీచకుడు

నిర్మానుష్యంగా ఉన్న నర్తనశాలకు రాత్రికి ఒంటరిగా వస్తాడు. వాణ్ణి అక్కడ చంపు. కీచకుడు గర్వంతో గంధర్వుల్ని కూడ లెక్కచెయ్యడం లేదు. మడుగునుండి పామును బయటకులాగి చంపేటట్లు నీవు కీచకుని చంపు. దుఃఖంతో విలపించే నాకన్నీరు అప్పుడు తుడిచి వెయ్యి. నీయొక్క, నీవంశంయొక్క గౌరవాన్ని నిలబెట్టు. నీకు శుభం కలుగుగాక.' అంది. అది విని భీమసేనుడు ఇలా అన్నాడు. సుందరీ! నా కిష్టమైన మాటనే నీవు చెప్పావు. అందుకే నీ అభిప్రాయానికి స్వాగతం పలుకుతున్నాను. నీవు చెప్పినట్లే చేస్తాను. కీచకుణ్ణి చంపడానికి నాకు వేరొకరి సహాయం అవసరంలేదు. పూర్వం నేను హిడింబాసురుని చంపినపుడు నాకు ఎటువంటి ఆనందం కల్గిందో అటువంటి ఆనందమే నీవు కీచకుని చంపమని అడిగినపుడు కూడ కల్గింది. నేను సత్యాన్ని, అన్నదమ్ముల్ని, ధర్మాన్ని ముందుంచుకొని ప్రతిజ్ఞ చేస్తున్నా. దేవేంద్రుడు వృత్రాసురుని చంపినట్లు కీచకుని చంపుతా. వాడిని రహస్యంగా కానీ, బయలుగా కాని నేను చూర్ణంచేస్తాను. మత్స్యదేశప్రజలు కీచకుడి పక్షాన యుద్ధానికి వస్తే వాళ్ళని కూడా చంపుతాను. ఆ తర్వాత దుర్యోధనుని చంపి రాజ్యాన్ని సంపాదిస్తా. కుంతీపుత్రుడైన యుధిష్ఠిరుడు ఇష్టపడి విరాటరాజు కొలువులోనే ఉండి అతని సేవలు చేస్తూ ఉన్నా సరే!'

ద్రౌపది అంది. 'ప్రభూ! నాకోసం నీవు సత్యాన్ని వదిలిపెట్టకుండ కార్యం నెరవేర్చు. నీవు రహస్యంగా ఉండి ఆ కీచకుణ్ణి చంపు.' భీమసేను డన్నాడు. 'నీవు ఎలా చెపుతావో నేను అలాగే చేస్తాను. నేడే నేను ఆ కీచకుణ్ణి అతని బంధువులను కూడ చంపుతాను. ఆ చీకటిలో నే నెవరికంట పడకుండ ఏనుగు మారేడుపండును చిదిపి వేసినట్లు, కోరకూడనిదాన్ని కోరిన ఆ కీచకుని తలను చిదిపి ముద్దచేస్తాను.' తరువాత భీముడు రాత్రి సమయంలో ముందు వెళ్ళి నర్తనశాలలో ఒంటరిగా దాక్కున్నాడు. సింహం ఎవరికీ తెలియకుండ లేడికోసం మాటువేసినట్లు కీచకుని కోసం ఎదురుచూస్తున్నాడు భీముడు. కీచకుడు కూడా తనయిష్టానుసారం అలంకరించుకొని ద్రౌపదిని కలుసుకోవాలని నర్తనశాలకు వచ్చాడు. ఆ మందిరాన్ని సంకేతగృహంగా భావించి అందులో ప్రవేశించాడు. ఆ విశాలభవనం అంతటా అంధకారంతో నిండి ఉంది. అంతకుముందే భీముడు అక్కడకు వచ్చి శయ్యమీద ఉన్నాడు. దుర్మతియైన కీచకుడు వచ్చి శయ్యపై పండుకొని ఉన్న భీమునిపై చెయ్యివేశాడు.

ద్రౌపదికి కీచకుడు చేసిన అవమానాన్ని అప్పుడు భీముడు తలచుకొని కోపంతో రగిలిపోయాడు.

కామమోహితుడైన కీచకుడు అక్కడకు చేరి సంతోషంతో మత్తెక్కి ఆశ్చర్యంగా ఇలా అన్నాడు. 'సుందరీ! అనేకవిధాలుగా సంపాదించిన అనంతధనాన్ని నీకిచ్చివేశాను. వివిధసంపదలతో రత్నాలతోనిండి, వందలకొలదీ పరిచారికలతో క్రీడాగృహాలతో కూడిన అంతఃపురం అంతా నీకు ఇవ్వడానికే త్వరగా నీ దగ్గరకు వచ్చాను. ఎల్లపుడు మాఇంటిలోఉండే స్త్రీలు అకస్మాత్తుగా (నీవు వరించడంచేత)నన్ను 'నీవలె అందంగా వస్త్రాలు కట్టుకొనేవాడు, అందగాడు వేరొకడు లే'డని ప్రశంసిస్తున్నారు. భీమసేనుడు ఇలా అన్నాడు. 'నీవు నిజంగా అంతటి అందగాడివే. నిన్ను నీవే పొగడుకుంటున్నావు. ఇటువంటి స్పర్శ నీవింతకు ముందెన్నడూ పొంది ఉండవు. నీవు కామశాస్త్రంలో మంచి పండితుడివి. స్పర్శ సుఖం తెలుసుకోగల్గిన నేర్పరివి. స్త్రీలకు ప్రేమపాత్రులైన పురుషులలో నీ వంటివాడు మరొకడు లేడు.' ఆ విధంగా చెప్పి భీముడు ఒక్కపెట్టున లేచి బిగ్గరగా నవ్వుతూ ఇలా అన్నాడు. 'ఓరీ! నీవు చాలపెద్దశరీరంతో పర్వతంలా ఉన్నావు. అయినప్పటికీ సింహం మదపుటేనుగును ఈడ్చినట్లుగా నిన్ను నేను నేలమీద ఈడ్చడం మీ అక్కకూడా చూస్తుంది. నీవు చస్తే సైరంధ్రి ఎటువంటి బాధాలేకుండా సుఖంగా తిరుగుతుంది. ఆమె భర్తలు కూడ సుఖంగా సంచరిస్తారు.

భీముడు అలా అని పూలమాలలతో నిండిన ఆ కీచకుని జుట్టు పట్టుకొన్నాడు. వాడు కూడ వెంటనే జుట్టు వదిలించుకుని భీముడి భుజాల్ని పట్టుకొన్నాడు. వారిద్దరికీ బాహుయుద్ధం జరిగింది. అది వసంతకాలంలో ఒక ఆడవీనుగుకోసం రెండు మదగజాలు పోట్లాడుకొంటున్నట్లుగా ఉంది. కీచకశ్రేష్ఠునకు, మానవోత్తముడైన భీమునకు జరిగిన ఆ యుద్ధం పూర్వం వాలిసుగ్రీవులకు జరిగిన యుద్ధంవలె ఉంది. వారిద్దరు పరస్పరం(ఒకరినొకరు) గెలవాలనే కోరికతో యుద్ధం చేశారు. చేతులు వైకెత్తి ఒకరినొకరు గోళ్ళతో గీరుతూ, పళ్లతో కరుస్తూ యుద్ధం చేస్తుంటే క్రోధమనే విషంతో నిండిన ఐదుతలల పాములవలె ఉన్నారు. కీచకుడు భీమున్ని గట్టిగా వేగంగా కొట్టాడు. అయినప్పటికీ దృఢప్రతిజ్ఞ గల భీముడు ఒక్కఅడుగు కూడ కదలలేదు. వారిద్దరు ఒకరినొకరు లాగుతూ, తోస్తూ బలిసిన రెండు ఆబోతుల్లాగా ప్రకాశించారు. గోళ్లు, దంతాలే వాళ్లిద్దరికి ఆయుధాలయ్యాయి. వాళ్ళిద్దరి మధ్యజరిగిన యుద్ధం రెండు

మదించిన పెద్దపులుల మధ్య జరిగే యుద్ధంలా ఉంది. మదించిన ఏనుగు వేరొక మదించిన ఏనుగును తొండంతో పట్టుకొన్నట్లుగా కీచకుడు క్రోధంతో భీముని రెండు చేతులతోను పట్టుకొన్నాడు. బలవంతుడైన భీముడు కూడ కీచకుణ్ణి పట్టుకొన్నాడు. అయినా కీచకుడు బలంతో భీముణ్ణి విదుల్చుకొన్నాడు. మహాబలవంతులైన వాళ్ళిద్దరు ఒకరి నొకరు చేతులతో చరుచుకొంటుంటే వెదుళ్లు పగిలినప్పుడు వచ్చే శబ్దంలాంటి శబ్దం పుట్టింది. తర్వాత భీముడు నర్తనశాలయొక్క మధ్య ప్రదేశంలో కీచకుణ్ణి బలంగా పట్టుకొని, సుడిగాలి చెట్టును ఊపివేసిన విధంగా గిరగిరా త్రిప్పాడు. ఆయుద్ధంలో బలహీనుడైన కీచకుణ్ణి భీముడు పట్టుకొన్నప్పటికీ ప్రాణాలతో బయటపడి శక్తిమేరకు అతడు భీముణ్ణి పట్టుకొన్నాడు. కొంచెం కాళ్లు వంచుకుని, ముందుకు నిలబడి పైకి దూకబోతున్న భీముని రెండుకాళ్లు పట్టుకొనిలాగి పడేశాడు బలవంతుడైన కీచకుడు. కీచకుడు భీముణ్ణి నేలపై త్రోసి పడవేయగా భీముడు వెంటనే యుమునివలె విజృంభించి పైకిలేచి కీచకునిపై పడ్డాడు. బలగర్వితులైన భీమసేన కీచకులిద్దరూ ఆ రాత్రి నిర్జనంగా ఉన్న నర్తనశాలలో పోటాపోటిగా యుద్ధం చేశారు. వారిద్దరు క్రోధంతో ఒకరిపై ఒకరు గర్జిస్తూ ఉంటే శ్రేష్ఠమైన ఆ నర్తనశాల భవనం బలిష్ఠమైనదైనా మాటిమాటికీ కంపించసాగింది. బలవంతుడైన భీముడు తన అరచేతులతో కీచకుణ్ణి గుండెలపై కొట్టాడు. రోషం గల కీచకుడు ఒక్క అడుగు కూడా కదలలేదు. కీచకుడు దుస్సహమైన ఆ వేగాన్ని ఎలాగో సహించాడు. కాని తరువాత శక్తికోల్పోయి నేలపై కూలిపోయాడు. కీచకుడు బలహీనపడడం, నిస్తేజంగా ఉండడం గమనించి మహాబలవంతుడైన భీముడు వేగంగా అతనిని ఈడ్చుకొనివచ్చి గుండెపై గుద్దాడు. చక్కని గెలుపు పొందినప్పటికి కోపంతో నిండిన భీమునికి ఆకోపం ఇంకా చల్లారలేదు. కోపంతో నిట్టూర్చి చాలాదారుణంగా జుట్టుపట్టుకొని ఈడ్చివేశాడు. పెద్దపులి మాంసం కోసం పెద్దజింకను పట్టుకొన్నట్లుగా మహాబలశాలియైన భీముడు కీచకుని పట్టుకొని గొప్పగా శోభించాడు. తరువాత భీమసేనుడు అలిసిపోయిన కీచకుణ్ణి చేరి పశువును త్రాళ్లతో బంధించినట్లుగా తనరెండు చేతులతో బంధించాడు. అప్పుడు కీచకుడు పగిలిపోయిన భేరీలాగ వికృతధ్వనితో అరుస్తూ, విడిపించుకొనడానికి గింజుకొనసాగాడు. అతని ప్రాణాలు మెల్లమెల్లగా పోతున్నాయి. అదే స్థితిలో భీముడు అతనిని చాలాసేపు గిరగిరా త్రిప్పాడు. భీమసేనుడు వెంటనే ద్రౌపదియొక్క కోపాన్ని శాంతింప చేయడానికి

తనరెండుచేతులతో కీచకుని కంఠాన్ని పట్టుకుని గట్టిగా నొక్కేశాడు. కీచకుడి అన్నిఅవయవాలు విరిగి ముక్కలై పోయాయి. కళ్లు తేలేశాడు. బట్టలు చిరిగిపోయాయి. అతని నడుమును అప్పుడు మోకాళ్లతో నొక్కిపట్టి భీముడు జంతువును మెడవిరిచి చంపినట్లుగా చంపసాగాడు. చావు దగ్గర పడుతూ విషణ్ణుడైన కీచకుణ్ణి చూసి భీముడు అతణ్ణి నేలపై పడవేసి దొర్లిస్తూ ఇలా అన్నాడు. 'సైరంధ్రి పాలిటి కంటకుడు, నాసోదరుని భార్యను అపహరించినవాడు, దుష్టుడు అయిన కీచకుణ్ణి చంపి నేడు ఋణవిముక్తుణ్ణి అయి పరమశాంతి పొందాను.'

అలా అంటున్న మహావీరుడైన భీమునికళ్లు క్రోధంతో ఎఱబడ్డాయి. అతడిని నేలపై ఎత్తిపడవేశాడు. అప్పటికే కీచకుని ఆభరణాలు బట్టలు ఊడిపోయి చెల్లాచెదురుగా పడిఉన్నాయి. కళ్లు తేలేశాడు. ప్రాణాలుకూడ పైకెగిరిపోయాయి. భీముడు ఇంకా కోపం తగ్గక పళ్లు కొరుకుతూ తనచేతితో అతని చేతిని మెలిపెట్టి, మళ్ళీ అతని పైకి ఎక్కాడు. పినాకపాణి అయిన శివుడు గయాసురుణ్ణి వలె భీముడు కీచకుని కాళ్లను, చేతుల్ని, తలను, మెడను మొండెం లోనికి చొప్పించాడు. మహాబలుడైన భీముడు అతని అవయవాలన్నిటినీ నుగ్గుచేసి అతనిని ఒక మాంసపిండంగా మార్చివేశాడు. దానిని ద్రౌపదికి చూపించాడు. అపుడు మహాతేజస్వి అయిన భీముడు వనితాశిరోమణియైన ద్రౌపదితో "పాంచాలీ! ఇలా రా. కాముకుడైన కీచకుణ్ణి ఏంచేశానో చూడు" అన్నాడు. భీముడు అలా పల్కి ఆ దుర్మార్గుడి శరీరాన్ని కాలితో ఒక్కతన్ను తన్నాడు. తరువాత మహావీరుడైన భీముడు దీపం పెద్దది చేసి, కీచకుడి శవాన్ని ద్రౌపదికి చూపించి, ఆమెతో ఇలా అన్నాడు.

'పాంచాలీ! మంచి గుణశీలాలు గల నిన్ను కామించే వారికి ఈ కీచకునకు పట్టిన గతియే పడుతుంది.' ద్రౌపదికి చాలా ఇష్టమూ, కఠినమూ అయిన పనిని ఆ విధంగా పూర్తిచేసి కోపం తీరిన భీముడు ఆమెను విడిచి వెంటనే వంటశాలకు వెళ్ళిపోయాడు. స్త్రీలలో శ్రేష్ఠురాలైన ద్రౌపది కీచకుణ్ణి చంపించిన తర్వాత సంతోషంగాను, నిర్భయంగాను ఉంది. నర్తనశాలను కాపలాకాస్తున్న వారి దగ్గరకు వెళ్ళి ఇలా అంది. 'రండి చూడండి. పరస్త్రీని కామించిన ఈ కీచకుణ్ణి నాపతులైన గంధర్వులు చంపారు. ఇక్కడ చచ్చి పడి ఉన్నాడు.' నర్తనశాలను కాపలాకాసేవారు ఆమెమాటను విని వెంటనే చాలా కాగడాలు తీసుకొని అక్కడకు వచ్చారు. వారంతా నర్తనశాలలోపలకు

వెళ్లి రక్తంతో తడిసి ముద్దయి నేలపై చచ్చిపడిఉన్న కీచకుణ్ణి చూశారు. కాళ్లు చేతులు లేని, ఆ కీచకుణ్ణి చూసి వారు బాధ పడ్డారు. ఆశ్చర్యంతో అతణ్ణి చాలా పరీక్షగా చూశారు. కీచకుడు ఈ విధంగా చావడం చూసి వాళ్లు తమలో తాము ఇలా అనుకొన్నారు. "ఇది మనుష్యులు చేసిన పనిగా కనిపించడంలేదు. చూశారా.. వీడి మెడ, చేతులు, కాళ్లు ఎక్కడకు పోయాయి?" అలా అనుకొని పరీక్షగా చూసి గంధర్వులే అతడిని చంపారనే నిశ్చయానికి వచ్చారు.

23. ఉపకీచకులు సైరంధ్రిని బంధించి శ్మశానభూమికి తీసుకొని పోవుట.

ఆ సమయంలో ఈవార్త తెలుసుకొన్న కీచకుని బంధువులంతా అక్కడకు వచ్చి, అతనిని చూసి, చుట్టూ చేరి, ఏడవసాగారు. అతని అవయవాలన్ని శరీరంలోకి ముడుచుకు పోయి ఉన్నాయి. వాడు నీటిలోంచి బయటకు తీసిపడేసిన తాబేలువలె ఉన్నాడు. అటువంటి కీచకుణ్ణి చూసి అందరూ భయభ్రాంతు లయ్యారు. వారికి రోమాలు నిక్క పొడుచుకున్నాయి. దేవేంద్రుడు వృత్రాసురుణ్ణి చంపినట్లు భీమసేనుడు కీచకుణ్ణి చంపాడు. అలా చచ్చిన కీచకునికి దహనసంస్కారం చేయాలని బయటకు తీసుకురాసాగారు. ఆ సమయంలో అక్కడకు వచ్చిన ఉపకీచకులు అక్కడకు దగ్గర్లో స్తంభాన్ని ఆనుకొని నిలబడి ఉన్న ద్రౌపదిని చూశారు. ఆ ఉపకీచకులందరు ఒక్కచోట గుమిగూడి ద్రౌపదిని చూసి 'ఈదుష్టురాలివల్లనే కీచకుడు మరణించాడు. కాబట్టి ఈమెను చంపాలి' అని అన్నారు. 'లేదా ఈమెను చంపకుండా ఈమెను కోరిన కీచకునితో సహా తీసుకుపోయి తగలబెట్టాలి. అలా చేస్తే మరణించిన కీచకుడికి అన్ని విధాల ప్రియం చేసినట్లు అవుతుంది' అనుకొన్నారు. ఆ తరువాత వారు విరాటరాజువద్దకు వెళ్లి ఆయనతో 'ఈమె వల్ల కీచకుడు చచ్చిపోయాడు. అందుచేత ఈమెను కీచకుడితోబాటు కాల్చి బూడిద చేస్తాం. ఆజ్ఞ ఇవ్వండి'. అని అడిగారు. విరాటరాజు ఆ ఉపకీచకుల పరాక్రమం ముందే బాగా తెలిసిన వాడు. కాబట్టి భయపడి సైరంధ్రిని సూతపుత్రుడైన కీచకుడితో పాటుగా తగలబెట్టడానికి అనుమతించాడు. ఇంకేముంది? ఉపకీచకులు ఆమెవద్దకు వెళ్లి భయంతో మూర్ఛచెందుతున్నట్లున్న ద్రౌపదిని పట్టుకొన్నారు. తరువాత ఆమెను పాడెపై ఎక్కించి

శవంతో కలిపి త్రాళ్లతో కట్టి, వారందరు శవాన్ని మోసుకుని శ్మశానం వైపు బయలుదేరారు.

పూజ్యురాలైన ద్రౌపదిని సూతపుత్రులు బలవంతంగా తీసుకొని పోతుండగా ఆమె భర్తలుండి కూడా, అనాథ లాగా రక్షణకోసం ఈ విధంగా మొరపెట్టు కోసాగింది. ద్రౌపది అంది. 'జయా ! జయంతా ! విజయా ! జయత్సేనా ! జయద్బలా ! మీరు నామొర వినండి. ఈ సూతపుత్రులు నన్ను తీసుకొనిపోతున్నారు. ఎవరి ధనుష్టంకారం వజ్రాయుధంతో, పిడుగు పాటుతో సమానమో, ఎవరి రథధ్వని శత్రువుల గుండెల్ని పిండి చేస్తుందో అటువంటి మీరుండగానే సూతపుత్రులు నన్ను తీసుకొనిపోతున్నారు. నామొర ఆలకించండి.' దీనమైన ఆమె ప్రార్థన విని భీముడు మరేమీ ఆలోచించకుండా "సైరంధ్రీ! నీ మాటలు నేను వింటున్నాను. అందువల్ల నీకు సూతపుత్రుల వల్ల ఎటువంటి భయమూ లేదు" అంటూ వెంటనే శయ్య నుండి లేచాడు.

రాజా! భీముడు అలా అని ఉపకీచకుల్ని చంపాలనుకొని ఒక్కసారి విజృంభించాడు. తన శరీరాన్ని పెంచాడు. వేషం మార్చుకొన్నాడు. గుమ్మంద్వారా కాకుండా గోడదూకి పాకశాలనుండి బయటపడ్డాడు. అలా దాటి వెంటనే ఒక చెట్టెక్కి చూశాడు. ఉపకీచకులు ఎటువెళ్తున్నారో గమనించి భీముడు గోడదూకి, ఊరుదాటి శ్మశానంవైపు వేగంగా వెళ్ళి ఉపకీచకుల కంటె ముందు ఆ ప్రదేశానికి చేరుకొన్నాడు. ఒక చితి దగ్గరకు వెళ్లి సమీపంలో ఉన్న తాడిచెట్టును చూశాడు. పొడుగైన బోది, ఎండిపోయిన పైభాగమూ ఉంది దానికి. ఆ భీముడు ఏనుగువలె చెట్టుదగ్గరికి చేరి పదిబారలపొడవుగల ఆ చెట్టును చేతులతో పెకలించి శత్రుభయంకరంగా భుజంమీదకెత్తుకొన్నాడు. బలవంతుడైన ఆ భీముడు పెద్దమాను కలిగి పదిబారల పొడవైన ఆ చెట్టు పుచ్చుకొని ఉపకీచకుల వైపు దండధరుడైన యముడి వలె పరుగెత్తాడు. ఆ భీముని తొడలవేగంవల్ల (భూమిఅదిరి) ఆ సమీపంలో ఉన్న మర్రి, రావి, మోదుగ మొదలైన చెట్లు కలిసికట్టుగా క్రింద పడిపోయాయి. సింహంలా కోపంతో అక్కడకు వచ్చిన గంధర్వుణ్ణి చూసి ఉపకీచకులందరూ దుఃఖంతోను, భయంతోను వణికిపోయారు. 'అరే! చూడండి! బలవంతుడైన గంధర్వుడు కోపంతో చెట్టు పుచ్చుకొని వస్తున్నాడు. ఇతని వల్ల మనకు భయం కల్గుతోంది. వెంటనే సైరంధ్రిని విడిచిపెట్టండి.'

భీముడు చెట్టును గిరగిరా త్రిప్పడాన్ని చూసి, ద్రౌపదిని విడిచి, వారు నగరంవైపు

పరుగుతీశారు. ఇంద్రుడు రాక్షసుల వెంటబడి తరిమినట్లు భీముడు పారిపోయే ఉపకీచకుల వెంటబడి తరిమాడు. భీముడు ఆ చెట్టుతో నూటైదుగురు ఉపకీచకులనూ యమలోకానికి పంపాడు. తరువాత ద్రౌపదిని విడిపించి ఓదార్చాడు. ఆ సమయంలో ద్రౌపది చాలా దీనంగా ఉంది. ఆమె ముఖం కన్నీటితో నిండి ఉంది. మహావీరుడైన భీముడు ఆమెకు ధైర్యం చెపుతూ ఓదార్చాడు. 'భీరూ! ఏ పాపం ఎరుగని నిన్ను బాధపెట్టినవాళ్లు ఇలాగే మరణిస్తారు. కృష్ణా (ద్రౌపదీ)! నీవు నగరానికి వెళ్లు. ఇప్పుడు నీకేం భయంలేదు. నేను ఇంకోదారిలో విరాటుని వంటశాలకు చేరుకొంటా.'

చచ్చిపడి ఉన్న ఆ ఉపకీచకులు నూటైదుగురు అడవిని నరికేస్తే అందులో పడిఉన్న చెట్లవలె ఉన్నారు. ఈ విధంగా ఉపకీచకులు నూటైదుగురు అంతకుముందే చనిపోయిన సేనాపతి కీచకుడు కలిసి మొత్తం నూటారుగురు హతులయ్యారు. ఆ సమయంలో అక్కడ చాలామంది స్త్రీలు, పురుషులు పోగయ్యారు. ఆ దృశ్యాన్ని చూసి ఆశ్చర్యపడ్డారు. ఆశ్చర్యంలో ఎవరూ ఏమీ మాట్లాడలేక పోయారు.

24. ద్రౌపది బృహన్నలతో సంభాషించుట.

ఆ నగరంలో జనమంతా ఉపకీచకుల మరణం చూసి, రాజు దగ్గరకు వెళ్ళి 'రాజా! గంధర్వులు సూతపుత్రులైన ఉపకీచకుల్ని చంపేశారు' ఇంద్రుడు తన వజ్రాయుధంతో పర్వతాల శిఖరాల్ని చీల్చినప్పుడు ఎలా పడిపోతాయో అలాగే ఈ సూతపుత్రులు నేలపై అంతటా పడిఉన్నారు. సైరంధ్రి బంధవిముక్తయై మళ్లీ మీఇంటికి వస్తోంది. ఆమె వస్తే అసలు నీనగరమూ, ప్రజలూ దక్కుతారా అని సందేహం. ఆ సైరంధ్రి ఎంత అందగత్తెయో ఆ గంధర్వులు అంత బలవంతులు. పురుషులకు రతిక్రీడ అంటే ఇష్టం. ఇందులో ఎటువంటి సందేహం లేదు. ఈసైరంధ్రివల్ల మన పట్టణం నశించి పోకుండా వెంటనే తగిన నీతిని అనుసరించండి.' అన్నారు. ప్రజల మాటలు విని విరాట మహారాజు వారితో 'ఆ సూతపుత్రులకు ఉత్తరక్రియలు చెయ్యండి. రత్నాలు, మంచిగంధం మొదలయిన సుగంధ ద్రవ్యాలతో వెంటనే వారందరికీ ఒకే అగ్నితో దహనసంస్కారాలు చెయ్యండి.' అన్నాడు. ఆ తరువాత విరాటరాజు కంగారుగా భయంతో సుదేష్ణ దగ్గరికి వెళ్లాడు. ఆమెతో' దేవీ! సైరంధ్రి ఇక్కడకు వచ్చాక ఆమెతో నామాటగా ఇలా చెప్పు. సైరంధ్రీ! నీకు శుభం కల్గుతుంది.

నీకిష్టమైన చోటికి వెళ్లిపో. గంధర్వులవల్ల పరాభవానికి రాజు చాలా భయపడుతున్నాడు. గంధర్వులు నిన్ను రక్షిస్తున్నారు. నేను మగవాణ్ణి అవడంవల్ల నీతో స్వయంగా మాట్లాడలేకపోతున్నా.కాని స్త్రీలు అటువంటి మాటలు నీతో మాట్లాడ్డం తప్పుకాదు. అందుచే నేను భార్యద్వారా ఈవిషయం చెపుతున్నా' అన్నాడు.

తరువాత భీమునిచే విడిపింపబడిన ద్రౌపది సూతపుత్రులను దాటి, భయంవదిలి, నగరానికి బయలుదేరింది. మనస్వినియైన ఆమె నీటితో శరీరాన్ని, బట్టల్ని శుభ్రం చేసుకొని పెద్దపులివల్ల భయపడ్డ ఆడ లేడిపిల్ల వలె నగరాన్ని చేరుకొంది. ఆ సమయంలో గంధర్వులవల్ల భయపడ్డ పురుషు లందరు ఆమెను చూసి దశదిశలకు పరుగెత్తారు. కొంతమంది భయపడి కళ్లు మూసుకొన్నారు. అపుడు పాంచాలి పాకశాలగుమ్మంలో మదపుటేనుగులా నిలుచున్న భీముణ్ణి చూసింది. అపుడు ద్రౌపది భీమునకు ఆశ్చర్యం కల్గించేటట్లు "నన్ను కష్టాలనుండి విడిపించిన గంధర్వరాజుకు నమస్కారం" అని మెల్లగా సైగలతో అంది. అపుడు భీముడు అన్నాడు. 'పూర్వం నుండి నీకు వశమయి తిరిగే ఆ గంధర్వులు ఈనాడు నీ ఈ మాటవిని తమ ప్రతిజ్ఞను చెల్లించుకొని ఋణవిముక్తులై తిరుగుతారు.' తరువాత ద్రౌపది నర్తనశాల వద్దకువెళ్ళి విరాటకన్యలకు నాట్యం నేర్పుతున్న అర్జునుని చూసింది. అపుడు రాజకన్యలు అర్జునునితోకూడా నర్తనశాల నుండి బయటకువచ్చి నిరపరాధినియై కష్టాల ననుభవిస్తూ ఆ సమీపానికి వస్తున్న ద్రౌపదిని చూశారు.

కన్యలు అన్నారు. 'సైరంధ్రీ! నీవు దైవవశంచేత బయటపడ్డావు. తిరిగి రాగలిగావు. ఏ పాపమెరుగని నిన్ను కష్టపెట్టిన కీచకుడూ, ఉపకీచకులూ మరణించారు.' బృహన్నల అన్నాడు. 'సైరంధ్రీ! నీవు ఎలా విడుదలయ్యావు. ఆ పాపాత్ము లెలా మరణించారు. నీ సంగతంతా ఉన్నదున్నట్లుగా వినగోరుతున్నాను.' సైరంధ్రి అంది. 'బృహన్నలా! నీకిప్పుడు సైరంధ్రితో పనేముంది? నీవు ఎల్లప్పుడు కన్యాంతఃపురంలో సుఖంగా ఉంటుంటావుగా. నాలాంటి పనివారు పొందే కష్టం నీవు పొందవు కదా! అందుకే ఏడుస్తున్న నన్ను చూసి నీవు నవ్వుతూ మాట్లాడుతున్నావు.' బృహన్నల అన్నాడు. 'కల్యాణీ! బృహన్నలకు కూడ చెప్పలేనంత బాధ కలుగుతున్నది. బాలా! బృహన్నల నీచపుట్టువు పుట్టడంచేతే ఏమిచేయలేని స్థితి ఉన్నది. ఈ విషయాన్ని నీవు తెలుసుకోలేక పోతున్నావు. చాలాకాలంనుండి నీతో ఉంటున్నాను. నీవు కూడ చాలాకాలంనుండి

అందరితో కలిసిఉంటున్నావు. నీవు బాధపడుతుంటే ఎవరు బాధపడకుండా ఉంటారు? ఒకవ్యక్తి మరొకరి హృదయాన్ని ఎన్నడూ తెలుసుకోలేడు. అందుకే నన్ను అర్థం చేసుకోలేక పోతున్నావు.'

తరువాత ద్రౌపది రాజకన్యలతో అంతఃపురంలో ప్రవేశించి మెల్లగా సుదేష్ణ సమీపానికి వెళ్లింది. సుదేష్ణ విరాటరాజుమాటలుగా ఇలా అంది. "సైరంధ్రీ! నీవు వెంటనే నీకు నచ్చినచోటికి వెళ్లిపో. రాజయిన విరాటుడు గంధర్వులేమి పరాభవిస్తారో అని భయపడుతున్నాడు. నీవు ఈభూమిపై అపురూప సౌందర్యరాశివి. పురుషులు అందగత్తెల్ని చూస్తే మోహించడం సహజం. గంధర్వులేమో చాలాకోపం గలవాళ్ళు మరి.' సైరంధ్రి అంది. భామినీ! కేవలం ఇంక పదమూడు రోజులు మాత్రమే రాజు నాకు అనుమతి ఇవ్వాలి. (నేను ఇక్కడ ఉంటాను.) అప్పటికి గంధర్వులు కృతకృత్యులౌతారు. ఇందులో నీకు ఎటువంటి సందేహం లేదు. తరువాత నన్ను గంధర్వులు తీసుకుపోతారు. నీకు తప్పక మేలు చేస్తారు. రాజునూ, బంధువులనూ క్షేమంగా నిలుపుతారు. ఇది నిజం.

(రాజువల్ల ఉపకారం పొందిన నాభర్తలు చేసిన మేలు మరువనివారు. వారు సత్పురుషులు. బలవంతులు. పొందిన ఉపకారానికి ప్రత్యుపకారం చెయ్యా లనుకొనేవాళ్లు. నేను నిన్ను బ్రతిమాలు కొంటున్నాను. ఏదోవిధంగా అనుకో. అంతవరకు భరించు. ఆపై మేలు కల్గుతుంది.' సోదరులు మరణించటంవల్ల ఎంతో బాధపడుతున్న సుదేష్ణ ఆ ద్రౌపది చేసిన దీనమైన ప్రార్థన విని ఆమెతో "పూజ్యురాలా! నీవు నీఇష్టం వచ్చినట్లుండు. నేను నిన్ను శరణువేడుకొంటున్నాను. ముఖ్యంగా నాభర్తను, పిల్లల్ని ఏకష్టం కలగకుండా రక్షించు" అంది.)

25. దుర్యోధనుని వేగులు పాండవుల జాడతెలియక, తిరిగివచ్చుట.

(కీచకుడు మరణించిన తరువాత విరాట మహారాజు మంత్రిపురోహితులతో కలిసి చాలా దుఃఖించాడు.)

సోదరసహితంగా కీచకుడు చంపబడడం చేత నగరంలోని సామాన్య జనులంతా దీనిని పెద్ద దుర్ఘటనగా, చాలా దుస్సాహసంతో కూడిన పనిగా తలచి ఆశ్చర్యపోయారు. ఆ నగరంలోను, దేశంలోనూ కూడా జనం గుంపులు గుంపులుగా గుమికూడి మహాబలవంతుడయిన కీచకుడు తన శౌర్యంచేత మహారాజుకు చాలా ప్రియమయిన వాడు అనుకొంటున్నారు. 'అతడు ఎన్నో శత్రుసైన్యాలను నాశనం చేశాడు. కాని

అతనిది దుర్బుద్ధి. వాడు పరస్త్రీలను బలాత్కారం చేసే పాపాత్ముడు, దుష్టుడు. కాబట్టి గంధర్వ లతనిని సంహరించారు.' శత్రుసంహారం చేసే దుర్ధర్ష వీరుడయిన కీచకుని గూర్చి దేశదేశాల్లో జనం అలా మాట్లాడుకొంటున్నారు. 'దుర్యోధనుడు పంపిన చారులు పాండవులను గుర్తించడం కోసం ఇతరదేశాలలో సంచరిస్తూ ఎన్నో గ్రామాలు, నగరాలు, దేశాలు వెదికారు. వారన్ని ప్రదేశాలలో అంతటా వెదకి ఆ విషయం వెల్లడించడానికి మరల హస్తినాపురానికి తిరిగి వచ్చారు. వారక్కడ (ధృతరాష్ట్రకుమారుడు, కురురాజు అయిన) దుర్యోధనుని కలిశారు. ద్రోణుడు, కర్ణుడు, కృపాచార్యుడు, భీష్ముడు, తనసోదరులూ, త్రిగర్తుడూ ఆసీనులయిన రాజసభలో అతడు కూర్చొని ఉన్నాడు. అతనితో గూఢచారు లిలా చెప్పారు.

'నరేంద్రా! ఆ విశాలారణ్యంలో పాండవుల్ని వెదకడం కోసం సదా గొప్ప ప్రయత్నం చేశాం. నిర్జనవనంలో సుదృఢ విక్రమం కల పాండవుల పాదాల గుర్తులు వెదికాము. అయినా వా రేమార్గంలో వెళ్ళారో తెలియలేదు. మహారాజా! ఎత్తైన పర్వత శిఖరాల మీద, వేరు వేరు దేశాలలో, జనం గుంపులుగా ఉన్నచోట్ల, కొండల్లో లోయల్లో గ్రామాలలో, పట్టణాలలో చాలా వెదికాము. ఎక్కడా పాండవుల జాడ తెలియలేదు. నరశ్రేష్ఠా! మీకు శుభం కలుగుగాక! వాళ్ళు పూర్తిగా నశించి పోయి ఉంటారు.

మేము రథాలు వెళ్ళే బాటలో కూడా అన్వేషించాము. పాండవు లెలా వెళ్ళారో, ఎక్కడ ఉన్నారో మాకు తెలియలేదు. మానవేంద్రా! కొంతకాలం మేము వారి రథ సారథుల వెంట వెళ్ళాము. బాగా వెదికాము. ఒక యథార్థ విషయాన్ని తెలుసుకొన్నాము. ఆ పాండవరథసారథులు ద్వారకానగరానికి వెళ్ళారు. రాజేంద్రా! అక్కడ ద్రౌపదిగాని, మహావ్రతాన్ని పూనిన పాండవులు గాని లేరు. వారన్ని విధాలా నశించి ఉంటారు. భరత శ్రేష్ఠా! మీకు నమస్కారం. మహాత్ము లయిన పాండవుల మార్గంకాని, నివాస స్థానం కాని, ప్రవర్తన కాని, వాళ్ళు చేసిన పనిని గూర్చి కాని తెలియలేదు. మానవేంద్రా! ఈపైన మేము చెయ్యవలసిన పనిని ఆజ్ఞాపించు. పాండవులను వెదకడం కోసం మేం మళ్ళీ ఏం చేయాలి? వీరా! మా యీ మాట వినండి. ఇది మీకు ప్రియమైనది. దీనిలో మీకు మంగళకరమయిన సమాచారముంది. రాజా! మత్స్యరాజుకు మహాబలవంతుడు, సూతపుత్రుడు, అయిన సేనాని కీచకు

డున్నాడు. అతడు త్రిగర్తదేశాన్ని, ఆ దేశవాసులను ఓడించాడు. భారతా! ఎవరో గంధర్వులు గుప్తరూపంలో రాత్రివేళ కీచకుని, అతని సోదరులను చంపేశారు. అసహనం కల దుర్మార్గుడయిన కీచకుడు తమ్ములతో సహా ఒక స్త్రీ కారణంగా అర్ధరాత్రి గంధర్వులచేత చంపబడ్డాడు. అతని ప్రియమిత్రులు, శ్రేష్ఠయోధులూ కూడా మరణించారు. కురునందనా! శత్రుపరాభవాన్ని తెలిపే యీ ప్రియవిషయాన్ని విని కృతకృత్యులై తరువాత చేయవలసిన దానిని చేయండి.

26. దుర్యోధనుడు పాండవుల ఉనికిని గూర్చి సభాసదులతో ఆలోచించుట.

దుర్యోధన మహారాజు ఆ సమయంలో దూతల మాటలను గూర్చి తనమనస్సులో చాలా సేపు ఆలోచించాడు. తరువాత సభాసదులతో ఇలా చెప్పాడు. 'కార్యగతి, పర్యవసానం సరిగా తెలుసుకోవడం మిక్కిలి కష్టం. మీరందరూ కూడా పాండవు లెక్కడకు వెళ్ళారో ఆలోచించి చూడండి. ఈ పదుమూడవ సంవత్సరంలో పాండవుల అజ్ఞాతవాసంలో ఎక్కువ భాగం అయిపోయింది. కొద్ది రోజులు మిగిలి ఉన్నాయి. మిగిలిన సమయం పాండవు లిలా గడిపితే వారు ప్రతిజ్ఞాపాలన భారాన్నుండి విడివడుతారు. సత్యవ్రతు లయిన పాండవులు మదధారలను స్రవించే గజరాజుల వలె, విషం క్రక్కే సర్పాల వలె కోపంతో కౌరవులకు దుఃఖం కలిగిస్తారు ఇది నిశ్చయం. వారందరు అజ్ఞాతవాసం అవధిని ఎరుగుదురు. కాబట్టి గుర్తించడానికి వీలుకాని మారువేషంలో ఉంటారు. మీరు వారిని తొందరగా గుర్తించడానికి ప్రయత్నించండి. వారు కోపాన్ని అణచుకొని మరల పన్నెండు సంవత్సరాలు వనవాసం చేయడానికి అడవికి వెళ్లాలి. అలా అయితే నా యీ రాజ్యం చిరకాలం మరో సమ్రాట్టు లేనిదీ, వ్యగ్రత లేనిదీ, శత్రువు లేనిదీ అవుతుంది.'

ఇది విని కర్ణుడిలా అన్నాడు. 'భరతనందనా! కార్యకుశలు లయిన ఇతర గూఢచారులను తొందరగా పంపు. వారు మాయావులూ, దక్షులూ అయి తమ కార్యాన్ని బాగా చేయగలగాలి. వారు మారువేషంతో ధనధాన్యాలతో సమృద్ధమై జనసమూహాలతో నిండిన దేశాలకు వెళ్ళాలి. అక్కడ అందమైన సభలలో; సిద్ధులు, సన్యాసులు, మహాత్ములు ఉండే ఆశ్రమాలలో; రాజనగరాలలో, నానావిధాలయిన తీర్థాలలో, సర్వోత్తమ స్థానాలలో నివసించే మనుష్యులను వినయపూర్వకంగా యుక్తితో

అడిగి ఊహతో పాండవులుండే తావును గుర్తించాలి. పాండవులు మారువేషంతో రహస్యస్థానంలో నివసిస్తూంటారు. కాబట్టి కార్యసాధన తత్పరులూ, వారిని బాగా గుర్తించ గలిగిన బుద్ధిమంతులూ మారువేషాలు ధరించి, మిక్కిలి నిపుణంగా ప్రవర్తించాలి. ఇలా పలువురు గూఢచారులు నదుల ఒడ్డున ఉండే పాదరిళ్ళలో, తీర్థాలలో, గ్రామాలలో, నగరాలలో, అందమైన ఆశ్రమాలలో, పర్వతాలలో, గుహలలో వారిని వెదకండి.'

'తరువాత దుశ్శాసనుడు తన అన్నయ్యతో ఇలా అన్నాడు. రాజా! మనకు బాగా విశ్వాసంగల గూఢచారులకు ఇవ్వదగిన సాధనాలన్నీ ఇచ్చి మరల పాండవులను వెదకడానికి పంపండి. కర్ణుడు చెప్పిన దంతా మనం చేద్దాం. ఆతడు చెప్పిన స్థానాలన్నింటిలో గూఢచారులు సంచరించి పాండవులను వెదకాలి. వారూ, ఇంకా ఇతరులూ ఒక దేశాన్నుండి మరొక దేశం వెళ్ళి యథావిధిగా వెదకాలి. ఇంతవరకు పాండవులు చేరదగిన చోటు, వారి నివాసం, వారిప్రవర్తన కొంచెం కూడా తెలియలేదు. పాండవులు మిక్కిలి రహస్యస్థానంలో ఉన్నారో! సముద్రానికి ఆవలితీరానికి వెళ్ళారో! లేదా ఆ మహావనంలోనే మిక్కిలి శూరవీరుల మనుకొనే ఆ పాండవులను కొండచిలువలు మ్రింగాయేమో ! లేదా చాలాకాలం విషమ పరిస్థితిలో పడి వారు శాశ్వతంగా నశించిపోయారేమో ! మనుజేశ్వరా! మీరు మనస్సును స్వస్థపరచుకొని సరైన పనిని నిండు ఉత్సాహంతో చెయ్యండి.

27. ద్రోణుని అభిప్రాయము.

ద్రోణాచార్యు డిలా అన్నాడు. ' పాండవులు వీరులు, విద్వాంసులు, బుద్ధిమంతులు, జితేంద్రియులు, ధర్మజ్ఞులు, కృతజ్ఞులు. తమ పెద్దన్న అయిన ధర్మరాజు ఆజ్ఞను పాటించేవారు, అతనియెడ భక్తిభావం కలవారు. ఇలాంటి మహా పురుషులు నశించరు, పరాభవాన్ని పొందరు. వారిలో ధర్మరాజు నీతి, ధర్మం, అర్థం వీటి తత్త్వం ఎరిగినవాడు, సోదరు లతనిని తండ్రివలె గౌరవిస్తారు. అతడు ధర్మమార్గ మందుండేవాడు, సత్యపరాయణుడు, సోదరు లందరిలో పెద్దవాడు. రాజా! సోదరులు కూడా తమ అన్నల ననుసరించేవారు. మహాత్ముడు, అజాతశత్రువు అయిన యుధిష్ఠిరుని పట్ల సోదరులకు భక్తి ఉంది. ధర్మరాజు కూడా సోదరుల పట్ల మిక్కిలి స్నేహంతో ఉంటాడు. తన ఆజ్ఞను పాటించేవారు, వినయశీలులు, మహాత్ములు అయిన

సోదరులకు నీతిజ్ఞ డయిన ధర్మరాజు ఎందుకు శ్రేయస్సు కలిగించడు?

పాండవులు నశించరు, వారనుకూల సమయం కోసం ఎదురు చూస్తూ ఉంటారని నాబుద్ధి, అనుభవాలను బట్టి నేను తలుస్తున్నాను. ఈ సమయంలో చేయవలసినపని బాగా ఆలోచించి తొందరగా చేయాలి. ఆలస్యం చేయడం సరికాదు. అన్ని విషయాల్లో ధైర్యంగా ఉండే ఆ పాండవుల నివాసస్థానం సరిగా గుర్తించాలి. వారందరూ శూరులు, వీరులు. వారి తపశ్శక్తి గొప్పది. కాబట్టి వారిని తెలుసుకోవడమే కాదు,సమీపించడం కూడా చాలా కష్టం. కుంతీపుత్రుడయిన ధర్మరాజు శుద్ధచిత్తం కలవాడు, గుణవంతుడు, సత్యవంతుడు, నీతిమంతుడు, పవిత్రుడు. అతడు తేజోరాశి. అతనిని గుర్తించడం అసంభవం. కంటితో అతడు మనుషులకు మోహాన్ని కలిగించగలడు. అతనిని గుర్తించలేరు. కాబట్టి మనం బాగా ఆలోచించి ఏదైనా పని చేయాలి. బ్రాహ్మణులు, గూఢచారులు, సిద్ధపురుషులు, ఇంకా వారిని గుర్తించగల జనుల ద్వారా మరల వెదికించాలి.'

28. భీష్ముడు ధర్మరాజు మహిమను చెప్పుట.

తరువాత భీష్ముడు ద్రోణుని మాటలు విని, ఆయన మాటలతో పొందు పడేరీతిగా, కౌరవుల హితం కోసం వారితో ఇలా చెప్పాడు. 'ధర్మరాజుకు సంబంధించిన ఈ పలుకులు ధర్మంతో కూడినవి. అవి దుష్టపురుషులకు దుర్లభాలు. సత్పురుషులకు ఎల్లపుడూ ఇష్టమయినవి. అన్ని విషయాల తత్త్వం తెలిసిన బ్రాహ్మణ శ్రేష్ముడు ద్రోణాచార్యుడు. ఆయన చెప్పినది సరియైనది. వాస్తవానికి పాండవులు సమస్తశుభలక్షణాలతో కూడినవారు, సత్పురుషులకు తగిన నియమాలను వ్రతాలను పాలించడంలో తత్పరులు. వేదోక్తవ్రతాలను పాటించేవారు. వివిధ వేదాల నెరిగినవారు, పెద్దవారి ఉపదేశాలను, ఆదేశాలను తలదాల్చేవారు. సత్యవ్రత పరాయణులు, శుద్ధవ్రతాన్ని ధరించేవారు. వా రజ్ఞాతవాసానికి గడువు ఎరుగుదురు. కాబట్టి దానిని పాలిస్తారు. పాండవులు క్షత్రియధర్మంలో నిత్యానురక్తులై భగవంతుడయిన శ్రీకృష్ణుని సదా అనుసరిస్తూ ఉంటారు. వా రుత్తమవీరులు, మహాత్ములు, మహాబలవంతులు. సాధుపురుషులకు తగిన ధర్మభారాన్ని వహించే వారు క్షీణించిపోరు. పాండవులు తమ ధర్మంచేతనూ, ఉత్తమ పరాక్రమం చేతనూ సురక్షితులు. కాబట్టి వారు

నశించరని నా నిశ్చయం. భరతనందనా! పాండవుల విషయంలో నాబుద్ధి నిశ్చయం చెపుతాను. **ఉత్తమనీతికలవాని నీతిని ఇతరు లన్వేషించ లేరు.**

పాండవుల విషయంలో మనబుద్ధితో బాగా ఆలోచించి మనకు చేతనైన ఉపాయాన్ని మనం ఆచరించాలి. వారికి ద్రోహం చేయడం కోసం కాదు, నీమంచి కోసం చెపుతాను. ఏకాగ్రంగా విను. యుధిష్ఠిరుని నీతిని నావంటి వారు నిందింప రాదు. అది మంచినీతి అనే చెప్పాలి. అది నీతి కాదని చెప్పడం ఏవిధంగానూ సరికాదు. నాయనా! **పెద్దల మాటను పాటించేవాడు, సత్యశాలి అయిన ధీరుడు సజ్జనసమాజంలో ఏదైనా చెప్పదలిస్తే, ధర్మకాంక్షతో నత్యమూ, ఉచితమూ అయిన మాటనే చెప్పాలి.** కాబట్టి యీ పదమూడవ సంవత్సరంలో ధర్మరాజు నివాసం విషయంలో ఇతరులు భావిస్తున్నట్లు నేను భావించడం లేదు. నాయనా! యుధిష్ఠిరుడు నివసిస్తున్న నగరంలో కానీ, గ్రామంలో కానీ రాజులకు అశుభం కలగదు. ధర్మరాజు ఉన్న జనపదంలో నివసించే జనానికి దానశీలం, ప్రియవాదిత్వం, జితేంద్రియత్వం, ఔదార్యం, వినయం, లజ్జాశీలం ఉంటాయి. ధర్మరాజున్నచోట మనుష్యులు సదా ప్రియం పలికేవారు, జితేంద్రియులు, కళ్యాణభాజనులు, సత్యపరాయణులు, సంతోషమూ, పుష్టి కలవారు, పవిత్రులు, కార్యకుశలులూ అవుతారు. అక్కడ ఇతరుల దోషాలను చూసేవారు ఉండరు. ఈర్ష్యాళువులూ, దురభిమానమూ, మాత్సర్యమూ కలవారూ ఉండరు. అచ్చట జనులంతా స్వయంగా ధర్మతత్పరు లౌతారు. అక్కడ ఎక్కువగా వేదధ్వని వినబడుతుంది. యజ్ఞాలలో పూర్ణాహుతులు ఇస్తూ ఉంటారు. గొప్ప దక్షిణలు గల యజ్ఞాలు జరుగుతుంటాయి. అక్కడ ఎప్పుడూ మేఘం సరిగా సకాలంలో వర్షిస్తుంది. దీనిలో సంశయంలేదు. అక్కడ భూమి సస్యసంపన్నంగా, క్షోభరహితంగా ఉంటుంది. ధాన్యాలు గుణవంతంగా ఉంటాయి. పళ్ళు రసంతో ఉంటాయి. పూలదండలు సుగంధంతోను, వాక్కులు మంగళ శబ్దాలతోను నిండి ఉంటాయి. గాలి సుఖస్పర్శ నిస్తుంది. దర్శనం ఋజువుగా ఉంటుంది. వక్రదృష్టి ఉండదు. ధర్మబ్రహ్మ స్వరూప విచారణ ఉంటుంది. ధర్మరా జున్నచోట భయం ప్రవేశించదు.

అక్కడ ఆవులు ఎక్కువగా ఉంటాయి. అవి బక్కగా, బలహీనంగా ఉండవు. వాటి పాలు, పెరుగు, నెయ్యి, బాగా రుచిగా, హితకరంగా ఉంటాయి. ధర్మరా

జొన్నచోట సద్గుణాలు కల పానీయాలు, రసవంత మయిన భోజన పదార్థాలు లభిస్తాయి. మనసు ప్రసన్నమయ్యే దృశ్యాలు కనబడతాయి. ఈ పదమూడవ సంవత్సరంలో ధర్మరా జొన్న చోట బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు తమ తమ ధర్మాలను పాలిస్తారు. ధర్మం కూడా తన గుణాలతో, ప్రభావంతో కూడి ఉంటుంది. నాయనా! పాండవు లున్న దేశంలో అన్ని విశేషాలూ ఉంటాయి. అక్కడి జనం ప్రసన్నులు, సంతుష్టులు, పవిత్రులు, వికారరహితులూ (అకాలమరణం లేనివారు) అవుతారు. దేవతలకు, అతిథులకు చేసే పూజలలో సర్వాత్మనా అనురాగం ఉంటుంది. జనులందరికీ దాన మందు ఇష్టం. అందరిలో బాగా ఉత్సాహం ఉంటుంది. అంతా తమ తమధర్మాన్ని పాలించడంలో ఆసక్తులై ఉంటారు. ధర్మరా జొన్నచోట ప్రజలు అశుభాన్ని వదిలి శుభాన్ని కోరతారు. యజ్ఞాలను ఆచరించడం వారికి అభీష్టకార్యం అవుతుంది. శ్రేష్ఠవ్రతాలను పాటిస్తారు. ధర్మరా జొన్నచోట అసత్యభాషణం లేనివారు, శుభాన్ని, కల్యాణాన్ని, శుభ వస్తువులను కోరేవారు, శుభంపై మనస్సు లగ్నం చేసేవారు ఉంటారు. యుధిష్ఠిరుడు ధర్మాత్ముడు. ఎల్లప్పుడు ఇష్టజనులకు ప్రియం కలిగించడం అతని వ్రతం. సత్యం, ధైర్యం, దానం, పరమశాంతి, స్థిరమయిన ఓరిమి, సిగ్గు, సంపద, కీర్తి, తేజస్సు, దయాళుత్వం, సరళత్వం మొదలయిన గుణాలు ధర్మరా జొకున్నాయి. ద్విజులు కూడా పాండవులను గుర్తించలేరు. ఇక సాధారణ మనుషుల మాట చెప్పేదేమిటి? పై సులక్షణాలు కలిగిన చోటే బుద్ధిమంతు డయిన యుధిష్ఠిరుడు ప్రయత్నపూర్వకంగా దాగిన నివాసస్థానం. అదే అతని ఉత్కృష్టమయిన ఆశ్రమం. దీనికి విరుద్ధంగా నే నే మాటా చెప్పలేను. కురునందనా! నామాటపై నీకు నమ్మకముంటే ఈ విషయం ఆలోచించి, ఏపని చేస్తే నీకు హితం కలుగుతుందనుకొంటావో ఆ పని వెంటనే చెయ్యి.

29. కృపాచార్యుని సమ్మతి - దుర్యోధనుని నిశ్చయము.

కృపాచార్యు డిలా చెప్పాడు. "రాజా! వయోవృద్ధుడైన భీష్ముడు పాండవుల విషయంలో చెప్పిన మాట యుక్తియుక్తం. ఈ సమయానికి తగినది. భీష్ముని వాక్యాలు ధర్మార్థాలు రెండింటితో కూడినవి. అవి మధురమైనవి, తాత్త్వికమైనవి, సకారణమైనవి. ఈవిషయంలో నేను చెప్పేది కూడా భీష్మ వచనాలకు అనుగుణమే.

నామాట విను. మీరు గూఢచారుల ద్వారా పాండవులెక్కడకు వెళ్ళారో, ఎక్కడ ఉన్నారో గుర్తించండి. ఈ సమయంలో హితాన్ని కలిగించే నీతిని ఆశ్రయించండి. సమ్రాట్టు కావాలనే కోరిక ఉంటే సాధారణ శత్రువును కూడా అవహేళన (చులకన) చేయకూడదు. ఇక యుద్ధంలో అన్ని అస్త్రశస్త్రాలను ప్రయోగించడంలో నిపుణు లయిన పాండవుల మాట చెప్పేదేమిటి? మహాత్ము లయిన పాండవులు ప్రతిజ్ఞాపాలన ధర్మంలో నిమగ్నులై మారువేషాన్ని ధరించి రహస్యంగా దాగి ఉన్నారు. అజ్ఞాతవాసకాలం అయిపోతోంది. కాబట్టి మన దేశంలోను, ఇతర దేశాల్లోను మన కెంత శక్తి ఉందో తెలుసుకోవాలి. అనుకూలసమయం వచ్చినపుడు పాండవులు బయటపడుతారనే విషయంలో సంశయం లేదు. అజ్ఞాతవాసం పూర్తయ్యాక మహాబలవంతులు, పరాక్రమవంతులు, మహాత్ములు అయిన కుంతీ కుమారులు మహోత్సాహం పొందుతారు. అందుచేత మీరు మీ సైన్యాన్ని, కోశాన్ని, నీతిని సమయం వచ్చినపుడు సంధించుకోవడానికి (ఒప్పందం/బాణ సంధానం) వీలుగా ఏర్పరచుకోవాలి. నాయనా ! నీవు స్వయంగా నీబుద్ధితో విచారించి 'మన సంపూర్ణశక్తి యెంత' అనే విషయం తెలుసుకో. బలవంతులు, బలహీనులు అయిన నీ మిత్రు లందరి బలం ఎంతో నిశ్చితంగా తెలుసుకో. భారతా! ఉత్తమమూ, మధ్యమమూ, అధమమూ అయిన మూడు రకాల సైన్యస్థితి తెలుసుకో. ఉత్తమమధ్యములో మనపట్ల సంతోషంతో ఉన్నవారు, మనవిషయంలో సంతోషంగా లేనివారు ఎవరెవరో తెలుసుకోవాలి. అపుడు మనం శత్రువులతో సంధి (ఒప్పందం- బాణసంధానం) చేయగలం. సామదానభేదదండోపాయాల నుపయోగించి, పన్నులను పెంచి బలవంతులను లోబరుచుకొనడం; దుర్బలులను బలంతో ఆక్రమించు కొనడం; సైన్యాన్ని మంచిమాటలతో అదుపులో ఉంచుకొనడం ద్వారా కోశబలాలను పెంపొందించుకొని మంచి ఫలితాన్ని పొందగలవు. ఆ దశలో బలవంతు లయిన శత్రువులు పాండవులయినా, ఇతరు లయినా దండెత్తి వస్తే వారికి సేన, వాహనాలు నీకంటె తక్కువ కాబట్టి నీవు వారందరితో యుద్ధం చేయగలుగుతావు. నరేంద్రా! ఈ విధంగా ధర్మానికి అనుకూలంగా సంపూర్ణంగా కర్తవ్యనిశ్చయం చేసి, కాలానుగుణంగా దానిని పాలించినట్లయితే చిరకాలం సుఖాన్ని అనుభవిస్తావు.'

(దుర్యోధనుడు ఆ మహాత్ముల వచనాన్ని విన్న తరువాత కొద్దిసేపు ఆలోచించాడు. మళ్ళీ మంత్రులతో ఇలా అన్నాడు. 'మంత్రులారా! నేను పూర్వం జనులు సమావేశమయి మాట్లాడుకొన్న

సమయంలో శాస్త్రవిద్వాంసులు, జ్ఞానులు, వీరులు, పుణ్యాత్ములు అయిన వారి నిశ్చితాభిప్రాయం ఒకటి విన్నాను. దానివల్ల నీతి దృష్టితో మనుష్యుల బలాబలాలు తెలుసుకొన్నాను. ఈ కాలంలో మనుష్యలోకంలో నలుగురు పురుష శ్రేష్ఠు లున్నారు. వారీభూమిపై ఆత్మబలం, బాహుబలం, ధైర్యం, శారీరకశక్తులలో ఇంద్రునితో సమానులు. వారు ప్రాణు లందరిలో ఉత్తములు. సంపూర్ణ బలపరాక్రమ సంపన్నులు. వారు బలదేవుడు, భీమసేనుడు, శల్యుడు, కీచకుడు. వారితో సమాను డయిన అయిదవ వీరుడిని గురించి నేను వినలేదు. వీరు పరస్పరం సమానబలం కలవారు. ఒకరు మరొకరిని జయించడానికి ఉత్సుకతతో ఉంటారు. వీరి మనస్సుల్లో ఒకరికి రెండవ వారిపై రోషం నిండి ఉంటుంది. వీరు పరస్పరం బాహుయుద్ధం చేయాలని కోరుతారు. ఈ ఆధారం ద్వారా నేను భీమసేనుని గుర్తిస్తాను. నామనస్సులో ఈమాట స్పష్టంగా ఉంది. పాండవులు నిశ్చయంగా జీవించి ఉన్నారు.

విరాటనగరంలో కీచకుని భీమసేనుడు చంపాడు. సైరంధ్రి ద్రౌపది అనుకొంటున్నాను. ఈవిషయంలో ఎక్కువ ఆలోచించ నక్కరలేదు. ద్రౌపదికోసం భీమసేనుడు గంధర్వుడని పేరు పెట్టుకొని రాత్రివేళ మహాబలవంతు డయిన కీచకుని చంపి ఉంటాడని నా సందేహం. భీమసేనుడు కాకుండా మరో వీరుడు అస్త్రశస్త్రాలు లేకుండా కేవలం బాహుబలంతో, శారీరకశక్తితో కీచకుని చంపగలడా? కీచకుని అన్ని అవయవాలను చూర్ణం చేసి వేగంగా ఎముకలు, మాంసం, చర్మం చూర్ణం చేసి మాంసం ముద్దలా చేయడం మరొకరికి వీలుకాదు. భీముడు మరొక రూపాన్ని ధరించి యీ పరాక్రమం చూపించాడని నిశ్చయంగా చెప్పవచ్చు. గంధర్వనామాన్ని ధరించిన భీముడే ద్రౌపదికోసం రాత్రివేళ సూతపుత్రులను కూడ చంపాడు.ఈ విషయంలో సందేహం లేదు. ధర్మరాజు నివసించడం వల్ల ఆ దేశానికి, జనసమూహానికి ఏ సుగుణాలు కలుగుతాయని పితామహుడు చెప్పాడో అవన్నీ మత్స్యదేశంలో ఉన్నట్లు గూఢచారుల ద్వారా విన్నాను. కాబట్టి పాండవులు విరాటరాజు నగరంలో మారువేషాన్ని ధరించి నివసిస్తున్నారని నేను భావిస్తున్నాను. అందుచేత ఆ దేశంపై దండయాత్ర చేయాలి. మనవారు అక్కడకు వెళ్ళి మత్స్యదేశాన్ని ధ్వంసం చేయాలి. వాళ్ళ ఆవులను వశం చేసుకోవాలి. గోధనాన్ని మనం పట్టుకొంటే నిశ్చయంగా పాండవులు మనవారితో యుద్ధం చేస్తారు. ఈస్థితిలో వారి అజ్ఞాతవాసం పూర్తి కావడానికి ముందు మనం పాండవులను చూసినట్లయితే, మరోసారి పన్నెండు సంవత్సరాలు వారు వనప్రవేశం చేయాలి. కాబట్టి రెండింటిలో ఒకదానిచేత నయినా మనకు లాభం కలుగుతుంది. ఈ దండయాత్ర వల్ల మన ధనాగారం వృద్ధిపొందుతుంది. శత్రునాశ మవుతుంది. మత్స్యదేశరాజు విరాటుడు నాయెడల తిరస్కార భావంతో "పూర్వం యుధిష్ఠిరుడు చేసిన పాలన పోషణలు దుర్యోధనుని అధికారంలో ఎలా అవుతాయి?" అన్నాడు. కాబట్టి మత్స్యదేశంపై దండయాత్ర చేయాలి. దాన్ని ఆక్రమించడం కర్తవ్యం. మీకందరకూ నచ్చితే , ఈ కార్యం నీతికి అనుకూలమని భావిస్తాను.')

30. సుశర్మ దక్షిణగోగ్రహణము చేయుట.

త్రిగర్తరాజు సుశర్మ తొందరపాటుతో ఆ సమయానికి కర్ణునివైపు చూసి దుర్యోధనునితో ఇలా అన్నాడు. 'ప్రభూ! పూర్వం మత్స్య, సాల్వదేశ సైనికులు చాలా సార్లు దాడిచేసి మాకు కష్టం కలిగించారు. మత్స్యరాజు సేనాపతి, సూతపుత్రుడు అయిన కీచకుడు తమ బంధువులతో కూడా మాటి మాటికి దాడిచేసి నన్ను బలంతో బాధించాడు. మత్స్యదేశపు రాజు ఇంతకుమునుపు చాలాసార్లు తన బల పరాక్రమాలతో దాడి చేసి, మా రాష్ట్రాన్ని క్లేశపెట్టాడు. బలవంతుడయిన కీచకుడే అతని సేనానాయకుడు. ఆ దుష్టాత్ముడు మిక్కిలి క్రూరుడు, కోపం కలవాడు. ఈ భూమిపై ప్రసిద్ధపరాక్రమం కలవాడు. దయలేనివాడు, పాపాచారుడు. ఆ కీచకుడు ఇప్పుడు గంధర్వుల వల్ల చంపబడ్డాడు. అతడు మరణించాక విరాటరాజు గర్వంపోయి ఆశ్రయం లేనివాడు, నిరుత్సాహుడూ అవుతాడని నా అభిప్రాయం. నీకంగీకార మయితే ఆమత్స్య రాజ్యంపై దండయాత్ర చేయడం నాకు సమ్మతం. కౌరవు లందరకే కాదు. మహాత్ము డయిన కర్ణుడికి కూడా ఈ దాడి ఇష్టం. మనం ధనధాన్య సంపన్న మయిన మత్స్యదేశాన్ని ఆక్రమించే అదృష్టకాలం వచ్చింది. ఇది మనకు మిక్కిలి ఆవశ్యకకార్య మని నేను భావిస్తున్నాను. విరాటరాజుకు చాలా రకాల రత్నాలు, ధనాలు ఉన్నాయి. అతని గోవులు, గ్రామాలు, రాష్ట్రమూ జయించి పంచుకుని తీసుకొందాం. లేదా అతని పురంలో అందమయిన ఆవులు వేలకొలది ఉన్నాయి. మన బలంతో ఆ పురాన్ని ముట్టడించి ఆ గోవులను లాగుకొందాం. మహారాజా! కౌరవులు, త్రిగర్త సైనికులు కలిసి సంఘటితంగా ఉండి మనం విరాటుని గోవులను అపహరిద్దాం. అతని బలాన్ని రెండుభాగాలుగా అనుకొని మనం చెరొకవైపు నుంచి ముట్టడించి బాధిద్దాము. అతని సామర్థ్యాన్ని నష్టపరచి మొత్తం సైన్యాన్ని వశం చేసుకుందాం. విరాటుని రాజనీతితో వశం చేసుకొని మనం సుఖంగా నివసిద్దాం. దీని వల్ల మీసైన్యమూ, శక్తీ వృద్ధి పొందుతాయి. సందేహం లేదు.' త్రిగర్తరాజు మాట విని కర్ణుడు దుర్యోధనునితో ఇలా చెప్పాడు. 'సుశర్మ సరిగ్గా చెప్పాడు. ఇది ఈ సమయానికి తగినదీ, మనకు హితాన్ని కలిగించేది. కాబట్టి సైన్యాన్ని సిద్ధం చేసుకుని కొన్ని భాగాలుగా విభజించుకొని వెంటనే దాడికి బయలుదేరుదాం. లేదా నీవు ఎలా చేస్తే బాగుంటుందనుకుంటే అలా చేద్దాం. లేదా కురుకులంలో అందరికంటె

వృద్ధుడు, మనకు తాతగారు, పరమబుద్ధిమంతు డయిన భీష్ముడు, ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు ఏరీతి తగినదని భావిస్తారో ఆ రీతిగా దండయాత్ర చేయవచ్చు. మనం కలిసి బాగా ఆలోచించి విరాటరాజును వశం చేసుకోవడం కోసం వేగంగా దండయాత్ర చేయాలి. పాండవులు ధనం, బలం, పౌరుషం లేనివారు. కాబట్టి వారితో మనకు పని యేమి? రాజా! వారు అసలు కనబడకుండా పోయారో, యమలోకానికే వెళ్ళారో! మనం ఉద్వేగం లేకుండా విరాటనగరంపై దాడిచేయాలి. అక్కడ మనం విరాటుని గోవులను, ధనరత్నాలను వశపరుచుకొని, తీసుకొని రావాలి.'

దుర్యోధనుడు కర్ణుని మాటను స్వీకరించి, తన ఆజ్ఞను పాటించడానికి సదా సిద్ధంగా ఉన్న తమ్ముడైన దుశ్శాసనునికి వెంటనే స్వయంగా ఆదేశ మిచ్చాడు- 'పెద్దవారితో ఆలోచించి వెంటనే సేనను దండయాత్రకు సిద్ధం చేయాలి. మనం ఏవైపునుండి దాడిచేయాలో ఆ వైపునకు మనం కౌరవ సైనికులతో బయలుదేరాలి. మహారథికుడైన సుశర్మ త్రిగర్తులతో కూడా నిశ్చయించిన దిక్కువైపు తన సమస్త సైన్యంతో, వాహనాలతో వెళ్ళాలి. సుశర్మ మొదట మత్స్యదేశంపై ఆక్రమణం చేయాలి. ఒకరోజు తరువాత మనవారు కూడా పూర్తిగా సంఘటితమై విరాటుని సమృద్ధమయిన రాజ్యంపై దాడిచేయాలి. త్రిగర్తసైనికులు ఒకటై ఒక్కసారి వేగంగా విరాటనగరంపై దాడి చేయాలి. మొదట గోపకుల దగ్గరకు వెళ్ళి, అక్కడ అధికంగా ఉన్న గోధనంపై అధికారం పొందాలి. మనం మన సైన్యాన్ని రెండు భాగాలుగా చేసి సుందరమై, సుగుణంగా లక్షలసంఖ్యలోనున్న విరాటుని ఆవులను అపహరించాలి.'

తదనంతరం పూర్వవైరానికి ప్రతీకారం చేయాలనుకొనే సుశర్మ, త్రిగర్త రథికులు, పదాతులు కవచాదులను ధరించి సిద్ధమయ్యారు. సుశర్మ విరాటుని గోవులను అపహరించడం కోసం పూర్వం నిశ్చయించిన ప్రణాళిక ననుసరించి కృష్ణపక్ష సప్తమినాడు ఆగ్నేయం వైపునుండి విరాటనగరంపై దాడి చేశాడు. రాజా! మరునాడు అష్టమీ తిథిలో మరో వైపునుండి కౌరవులందరూ కలిసి దాడిచేసి వేల గోసమూహాలను పట్టుకొన్నారు.

31. పాండవులు నలుగురు విరాటుని సైన్యముతో యుద్ధమునకు వెళ్లుట.

మారువేషాల్లో దాగి, ఆ మహానగరంలో విరాట రాజు పనులు చేస్తూ నివసించే తేజస్సులు, మహాత్ములు అయిన పాండవులకు పదమూడవ సంవత్సరం చక్కగా పూర్తి అయింది. కీచకుడు మరణించిన తరువాత విరాటుడు యుధిష్ఠిరునిపై బాగా ఆదరంతో ఉండి, గొప్ప ఆశలు పెట్టుకున్నాడు. పదమూడవ సంవత్సరానికి చివర సుశర్మ వేగంతో ఆక్రమించి, విరాటుని గోవుల నెన్నింటినో పట్టుకొన్నాడు.

(ఆ సమయంలో పెద్ద కోలాహల మయింది. ధూళి ఆకాశాన్ని తాకింది. శంఖాలు, దుందుభులు, భేరులు అధికంగా ధ్వనించాయి. గోవులు, గుర్రాలు, రథాలు, ఏనుగులు, పదాతు లయిన సైనికులు పెద్ద శబ్దాలు చేశారు. త్రిగర్త దేశీయయోధులు మత్స్యరాజు గోధనాన్ని తీసుకొని వెళ్ళే సమయంలో ఆ గోరక్షకులు సైనికులను అడ్డగించారు. అపుడు త్రిగర్తులు చాలా ధనం తీసుకొని, తమ వశం చేసుకోవడం కోసం వేగంగా వెళ్ళే గుర్రాలు, రథాలద్వారా యుద్ధంలో విజయం సాధించాలని దృఢసంకల్పం చేసుకొని గోపాలురతో యుద్ధం ప్రారంభించారు. త్రిగర్తుల సంఖ్య చాలా ఉంది. వారు ప్రాసాలు, తోమరాలు పట్టుకొని విరాటుని గోపాలకులను చంపుతున్నారు. గోవులను పాలించే గోపాలురు బలంతో ఆ సైన్యాన్ని నిరోధించారు. ఆ గోపాలకులు పరశ్వథాలు, రోకళ్ళు, భిందిపాలాలు, ముద్గరాలు, కర్షణాలనే ఆయుధాలతో అంతటా గుర్రాలను కొట్టారు. గోపాలకుల దెబ్బలతో మిక్కిలి కోపగించిన త్రిగర్తులు రథాలపై యుద్ధం చేస్తూ, బాణవర్షంతో గోపాలురను రణభూమినుండి తరిమివేశారు.)

కుండలాలు ధరించిన ఒక గోపకుడు రథం ఎక్కి వేగంగా వెళ్ళి నగరాన్ని చేరాడు. మత్స్యరాజును చూసి దూరంనుండి రథం దిగాడు. విరాటుడు కుండలాలు, భుజకీర్తులు ధరించి వీరయోధులతో, మంత్రులతో, మహాత్ములయిన పాండవులతో కూడిన రాజసభలో కూర్చుని ఉన్నాడు. విరాటుని చెంతకు వెళ్ళి గోపాలకుడు ప్రణామం చేసి ఇలా చెప్పాడు. "త్రిగర్త సైనికులు మమ్ము రణరంగంలో ఓడించి, సోదరబంధువులతో కూడ మనల్ని తిరస్కరించి, లక్షలకొలదీ ఉన్న మన ఆవులను తీసుకొని పోతున్నారు. రాజేంద్రా! వాటిని విడిపించుకొని తీసుకొని రావడానికి ప్రయత్నం చేయండి. ఇలా చేస్తే మీ పశువులు నశించవు. మీచేతులలో నుండి బయటికి పోవు." గోపాలకుడు చెప్పిన మాట విని మత్స్యదేశ రాజు సేనను సిద్ధం చేశాడు.

దానిలో రథాలు, ఏనుగులు, గుఱ్ఱాలు, పదాతులు అనే చతురంగ సైన్యం ఉంది. ఆ సైన్యం ధ్వజపతాకాలతో నిండి ఉంది. రాజులు, రాజకుమారులు కవచాలను ధరించారు. విరాటరాజు ప్రియసోదరుడు శతానీకుడు వజ్రాలు పొదిగిన బంగారుకవచం ధరించాడు. శతానీకుని తమ్ముని పేరు మదిరాక్షుడు. అతడు బంగారు రేకులతో

కప్పబడిన సుదృఢకవచాన్ని ధరించాడు. అన్ని అస్త్రశస్త్రాలను సహించగలిగిన ఆ కవచాన్ని ఉక్కుతో నిర్మించారు. మత్స్యదేశరాజు విరాటుడు అభేద్యకల్ప మనే కవచం ధరించాడు. ఇది ఏ అస్త్రశస్త్రాలతోనూ. విరగదు. దానియందు సూర్యునితో సమానంగా ప్రకాశించే నూరుపూవులు చెక్కినారు. నూరు సుడులు, నూరుచిన్న చక్రాలు, నూరు కన్నుల బొమ్మలు చెక్కారు. ఇవికాక దానిపై క్రింద నుండి పైకి సౌగంధిక కమలాల పంక్తిని చెక్కారు. సేనాపతి సూర్యదత్తుడు బంగారపు వెన్నుకలిగి సూర్యునితో సమానంగా ప్రకాశించే కవచం ధరించాడు. విరాటుని పెద్దకుమారుడు, వీరవరుడు ఐన శంఖుడు తెల్లని రంగుకల సుదృఢకవచాన్ని ధరించాడు. దానికి లోపల ఇనుముంది. బయట కంటి బొమ్మలు నూరు చిత్రించారు. ఈ రీతిగా దేవతలతో సమానమైన రూపం కలిగిన వేలకొలది మహారథులు యుద్ధంకోసం సిద్ధమయి తమ తమ వైభవాన్ని అనుసరించి కవచాల్ని ధరించారు. వారందరు అన్నిరకాల యుద్ధాలలో నిపుణులు. రథాలకు మహారథికులు బంగారు అలంకారాలు గల గుర్రాలను పూన్చారు. మత్స్యరాజు సువర్ణ దివ్య రథం మీద బాగా ఎత్తయిన జెండా నిలుపబడింది. ఆ రథం సూర్యచంద్రులతో సమానంగా ప్రకాశిస్తోంది. ఇలాగే ఇతరవీరక్షత్రియులు కూడా తమ రథాలకు యథాశక్తిగా బంగారు అలంకారాలు కలిగిన వివిధ రూపాలయిన జెండాలను నిలిపారు.

(రథాలు సిద్ధమయి వెళ్ళే సమయంలో కంకుభట్టు విరాటునితో "నేనుకూడా ఒక మహర్షివల్ల నాలుగు విధాల ధనుర్వేద శిక్షణను పొందాను. కాబట్టి నేను కవచాన్ని ధరించి రథంపై కూర్చుని గోవుల పాదచిహ్నాలను అనుసరించి వెడతాను. రాజా! ఇక్కడ వల్లవుడనే వంటవాడు బలవంతుడుగా, శూరుడుగా కనబడుతున్నాడు. గోవులను లెక్కించే గోశాలాధ్యక్షుడు తంతిపాలుని, గుఱ్ఱాలకు శిక్షణ వ్యవస్థను నిర్వహించే గ్రంథికుని కూడా రథంపై కూర్చోబెట్టండి. వీరు గోవులకోసం యుద్ధం చేయడంలో వెనుకంజ వేయరని నానమ్మకం". అన్నాడు.)

తరువాత మత్స్యరాజు తన తమ్ముడు శతానీకునితో ఇలా అన్నాడు. 'సోదరా! కంకుడు, వల్లవుడు, తంతిపాలుడు, గ్రంథికుడు గూడా యుద్ధం చేయగలరు కాబట్టి వారికి కూడా ధ్వజాలు, పతాకాలతో శోభించే రథాలు ఇయ్యి. వారు కూడా పైన దృఢంగా లోపల మృదువుగా ఉండే కవచాలను తమ శరీరాలకు ధరించాలి. వారికి కూడా అన్నిరకాలయిన అస్త్రశస్త్రాలు ఇవ్వండి. వారి శరీరమూ, స్వరూపమూ వీరోచితంగా ఉన్నాయి. ఆ వీరపురుషుల భుజాలు గజరాజు తొండంలా శోభిస్తున్నాయి. వారు

యుద్ధం చేయకుండా ఉండలేరు. వారు నిశ్చయంగా యుద్ధ నిపుణులు, రాజు పలికిన యీ వాక్యం విని శతానీకుడు మనసు తొందరపడగా కుంతీపుత్రులకై శీఘ్రంగా రథాలు తీసుకురావడానికి ఆదేశం ఇచ్చాడు.

సహదేవునికి, ధర్మజునకు, భీమసేనునికి, నకులునకు, రథాలను తీసుకురావడానికి ఆజ్ఞ ఇచ్చాడు. ఈ మాటతో పాండవులు బాగా ప్రసన్నులయ్యారు. అపుడు రాజభక్తులైన సారథులు విరాటుడు చెప్పిన ప్రకారం రథాలను తొందరగా పూన్చి తీసుకు వచ్చారు. తరువాత అనాయాసంగా పరాక్రమించే పాండవులకు విరాటరాజు తన చేతులతో విచిత్ర కవచాల నిచ్చాడు. అవి పైభాగంలో సుదృఢంగా, లోపల కోమలంగా ఉన్నాయి. అవి తీసుకుని ఆ వీరులు తమ శరీరాలకు వాటివాటి స్థానాల్లో కట్టుకొన్నారు.

కుంతీ పుత్రులు గుర్రాలను పూన్చిన రథాలెక్కి ప్రసన్నులై రాజభవనంనుండి బయటకు బయలుదేరారు. వారు చాలా వేగంగా వెళ్ళారు. వారింతవరకు వారి అసలు స్వరూపాలను దాచి ఉంచారు. వారు విరాటుని వెనుక వెడుతున్నారు. పాండవులు నలుగురూ శూరులు, సత్యపరాక్రమం కలవారు.

(ఆ వీరులు పొడవైన, దృఢమైన అల్లెత్రాళ్ళను తమబలా న్నెనుసరించి సైకిలాగి ధనుస్సు రెండవ కొనకు తగిలించారు. సుందరవస్త్రాలను ధరించి చందనం పూసుకున్న ఆ వీరులు నలుగురూ విరాటరాజు ఆజ్ఞచేత వేగంగా తమ గుర్రాలను నడిపించారు. రధభారాన్ని వహించగలిగి, బంగారంతో అలంకరించిన ఆ గుఱ్ఱాలు పాండవులు నడుపుతుండగా వరుస కట్టి ఎగిరే పక్షుల వలె కనపడ్డాయి.)

గండస్థలంనుండి మదజలం స్రవిస్తూ భయంకరమై కదిలే పర్వతాలలా ఉండే గజాలు పాండవులు ఎక్కగా విరాటరాజు వెంట వెళ్ళాయి. యుద్ధకళలో నిపుణులు, ప్రసన్నంగా ఉండేవారు, ఉత్తమజీవనం కలవారు, మత్స్యదేశంలో చాలా ప్రధానులు - ఆ సైన్యంలో ఎనిమిదివేల రథికులు, వెయ్యిమంది గజయోధులు, అరవైవేల అశ్వికులు ఉన్నారు. వారు యుద్ధానికి సన్నద్ధులై బయలుదేరారు.

32. మత్స్య త్రిగర్త సేనలమధ్య యుద్ధము.

మత్స్యదేశవీరులు నగరం నుండి బయలుదేరి, తమ సైన్యాన్ని వ్యూహంగా చేసి, ప్రొద్దువాలే సమయానికి త్రిగర్తులను ఢీకొన్నారు. క్రోధంతో నిండి యుద్ధంకోసం ఉన్మత్తులుగా ఉన్న ఆ త్రిగర్త మత్స్యదేశ వీరులు గోవులను వశం చేసుకోవాలనే కోరికతో ఎదుటి పక్షాన్ని లక్ష్యం చేసుకొని గర్జిస్తున్నారు. వారు తోమరాలతో, అంకుశాలతో

పొడుస్తూ మదించిన ఏనుగులను ముందుకు నడిపారు. అవి రెండువైపులనుండి ఎదుటిపక్షాన్ని డీకొన్నాయి. పరస్పరం ఆయుధాలతో ఆ గజవాహనులు చేసేయుద్ధం కోలాహలంగా, భయంకరంగా, సంకులంగా, ఒడలు జల్లుమనే విధంగా ఉంది.

సూర్యుడు పశ్చిమం వైపు దిగుతున్నాడు. ఆ సమయంలో పదాతులు, రథికులు, గజవాహనులు, గుట్టపురౌతులతో నిండిన ఆ సైన్యాలు చేసేయుద్ధం దేవాసురయుద్ధంతో సమానంగా ఉంది. ఒకరినొకరు ఎదురుకొంటూ, పరస్పరం కొట్టుకొంటూ యుద్ధంచేసే ఆ సైనికుల పాదాల త్రొక్కిడిచేత దుమ్ము పైకి లేచి ఏమీ కనబడటం లేదు. దుమ్ముచే కప్పబడి ఎగిరే పక్షులు నేలపై పడ్డాయి. రెండు వైపులనుండి వచ్చే బాణాలవల్ల ఆకాశం దట్టంగా నిండిపోవడంతో సూర్యుడు కనబడడంలేదు. బాణాలవల్ల అంతరిక్షం మిణుగురుపురుగులతో నిండినట్లు ప్రకాశించింది. విశ్వవిఖ్యాత ధనుర్ధర వీరులు కుడివైపునుంచి, ఎడమవైపునుంచి బాణాలు వేస్తున్నారు. వారు గాయాలు తగిలి పడిపోతుంటే బంగారు పీఠభాగం కల వారి ధనుస్సులు మరొకరి చేతుల్లోకి వెళ్ళి పోతున్నాయి. రథికులు రథికులతోను, పదాతులు పదాతులతోను డీకొంటున్నారు. గుర్రపురౌతులు గుర్రపురౌతులతోను, మావటి వాండ్రు మావటివారితోను యుద్ధం చేస్తున్నారు. రాజా! వారందరూ పరస్పరం కత్తులు, పట్టిసాలు ప్రాసాలు, తోమరాలు మొదలయిన ఆయుధాలతో క్రోధంతో కొట్టుకొంటున్నారు. పరిఘవంటి బాహువులు కల ఆ శూరులు పరస్పరం కోపంతో కొట్టుకొంటున్నా, శత్రువీరులను పారద్రోల లేకపోతున్నారు. కుండలాలతో కూడిన శిరస్సులు ఎన్నో దుమ్ములో పడుతున్నాయి. ఒక ముఖానికి ముక్కు చాలా అందంగా ఉంది. కాని పైవెదవి తెగిపోయింది. ఒకడు బాగా అలంకరించుకొన్నాడు. కాని వాడిజుట్టు తెగి, ఎగిరిపోయింది. ఆ మహాసంగ్రామంలో చాలామంది క్షత్రియ వీరుల శరీరాలు సాలవృక్షాల కొమ్మలవలె విశాలంగా బలిసి ఉన్నాయి. అవి బాణాలచే ముక్కలు ముక్కలయి పడిపోతున్నాయి. సర్పాల పడగల వలె శోభిస్తూ చందనంతో అలంకరింపబడిన భుజాలు, కుండలాలు గల శిరస్సులతో నిండిన రణభూమి అపూర్వంగా శోభిస్తోంది. అన్ని వైపులా రక్తధారలు ప్రవహిస్తున్నాయి. పైకిలేచిన దుమ్ము రక్త ప్రవాహంతో అణగిపోతోంది. యుద్ధం చేసే వీరులకు మూర్ఛ వస్తోంది. హద్దులు లేని భయంకర యుద్ధం జరిగింది.

(పాండునందనుడు, ధర్మాత్ముడు అయిన యుధిష్ఠిరుడు సోదరులతో కూడా వ్యూహాన్ని రచించి, విరాటరాజుకోసం త్రిగర్తులతో యుద్ధం ప్రారంభించాడు. అతడు తమసేనను డేగ ఆకారంలో నిలబెట్టి తాను ముక్కుస్థానంలో ఉన్నాడు. నకుల సహదేవులు రెక్కల స్థానంలో నిలబడ్డారు. భీమసేనుడు తోక స్థానంలో ఉన్నాడు. కుంతీ పుత్రుడయిన యుధిష్ఠిరుడు వెయ్యిమంది సైనికులను సంహరించాడు. శస్త్రధారులలో శ్రేష్ఠ డయిన భీమసేనుడు మిక్కిలి కోపగించి, రెండువేల మంది రథికులను పరలోకానికి పంపాడు. నకులుడు మూడు వందల మందిని, సహదేవుడు నాలుగు వందల సైనికులను చంపారు.)

ఆకాశంలో సంచరించే పక్షులు కూడా బాణ సమూహాల వల్ల మిక్కిలి ఉద్వేగాన్ని పొంది అక్కడక్కడ కూర్చుండిపోతున్నాయి. అవి ఆకాశంలో ఎగరలేక, దూరం దాకా చూడలేకపోతున్నాయి. శతానీకుడు వందమందిని, విశాలాక్షుడు (మదిరాక్షుడు) నాలుగు వందలమంది త్రిగర్త సైనిక వీరులను చంపారు. ఆ రథికు లిద్దరూ త్రిగర్త సైన్యంలోకి దూసుకు పోయారు. శారీరకంగా, మానసికంగా బలవంతులైన యిరువురూ కోపంతో సేనాప్రవేశంచేసి త్రిగర్తసైన్యాన్ని తికమక పెట్టారు. వారు త్రిగర్తసైనికులతో కేశాకేశి, రథారథి యుద్ధం చేశారు. సూర్యదత్తుడు ముందు వైపునుండి, మదిరాక్షుడు వెనుకవైపునుండి త్రిగర్తుల రథసైన్యాన్ని లక్ష్యంగా చేసుకొని ప్రవేశించారు. రథికులలో శ్రేష్ఠ డయిన విరాటరాజు రథమెక్కి వివిధవిన్యాసాల్లో వెడుతూ, అనేకవిధాలుగా రణకౌశలం చూపిస్తూ ఆ యుద్ధంలో అయిదు వందలమంది త్రిగర్త రథికులను, ఎనిమిది వందల గుఱ్ఱపు రౌతులను, అయిదువందల మహారథికులను చంపి, తరువాత సుశర్మ యొక్క బంగారు రథాన్ని డీకొన్నాడు. మహాత్ములు, మహామనస్వులు అయిన వారిద్దరు గర్జిస్తూ గోశాలలో ఎద్దులవలె ఒకరు మరొకరితో రణం చేశారు. అపుడు యుద్ధోన్మాదంతో త్రిగర్తరాజైన సుశర్మ ద్వంద్వయుద్ధంతో విరాటుని సమీపించాడు. ఒకరిపై మరొకరికి కోపం, అసహనం పెరిగి పోయాయి. ఇద్దరూ అస్త్రవిద్యలో నిపుణులు. ఇరువురికీ కత్తి, శక్తి, గదలు ఉన్నాయి. అపుడు ఇద్దరూ వాడియైన బాణాలతో పరస్పరం కొట్టుకొంటూ రణరంగంలో సంచరించారు. ఈ సమయంలో విరాటరాజు సుశర్మను పది బాణాలతో కొట్టాడు. ఐదేసి బాణాలతో నాలుగు గుర్రాలను గాయపరిచాడు. అలాగే అస్త్రవేత్త అయిన సుశర్మకూడా యుద్ధోన్మత్తుడయి ఏభయి పదునైన బాణాలతో విరాటుని కొట్టాడు. తరువాత సైనికుల పాదాల తాకిడిచే దుమ్ము చాలా ఎక్కువగా పైకి రేగింది. ఆ దుమ్ములో ఎవరు ఎక్కడ ఏం చేస్తున్నారనే విషయం ఎవరికీ తెలియలేదు.

33. పాండవులు సుశర్మను ఓడించి విరాటుని విడిపించుట.

జనులంతా దుమ్ముతోనిండి చీకటిచే ఆవరింపబడ్డారు. యుద్ధం చేసే సైనికులు వ్యూహంగా నిలిచి కొంచెం సేపు యుద్ధం నిలిపివేశారు. ఇంతలో చీకటిని తొలగిస్తూ చంద్రు డుదయించి రణరంగంలో క్షత్రియుల కానందమిచ్చాడు. వెలుగు వచ్చాక మరల ఘోర యుద్ధం ప్రారంభమయింది. ఆసమయంలో (యుద్ధావేశంలో) యోధులు ఒకరినొకరు చూడలేకపోయారు. తరువాత త్రిగర్తరాజు సుశర్మ తన తమ్మునితో కూడా రథికుల సమూహాన్ని వెంటబెట్టుకొని, నాలుగు వైపులనుండి మత్స్యరాజు విరాటుని చుట్టుముట్టాడు. క్షత్రియులలో శ్రేష్ములయిన ఆ సోదరు లిద్దరూ రథాల నుండి క్రిందికి దూకి, గదలు చేతితో పట్టుకొని క్రోధంతో శత్రువుల రథసైన్యంవైపు ఉరికారు.

(వారిద్దరూ మదించిన ఎద్దులవలె, మదోన్మత్తా లయిన గజరాజులవలె, ఏనుగును పట్టుకొనే రెండు సింహాలవలె, యుద్ధసన్నద్ధులయిన ఇంద్ర వృత్రాసురుల వలె ఉన్నారు. వారిరువురి బలం, ఉత్సాహం సమానం. వారు సమాన పరాక్రమం కలవారు, సమానంగా అస్త్రశస్త్రాల నెరిగినవారు, యుద్ధనిపుణులు.)

ఈవిధంగానే ఆ సేనలన్నీ కోపగించి గద, చురకత్తి, ఖడ్గం, గండ్రగొడ్డలి, పదునైన బల్లెములతో ఒకరిని ఒకరు డీకొంటున్నారు. త్రిగర్తదేశాధిపతి సుశర్మ మత్స్యరాజసేనను తన బలగంతో కలచివేసి, ఓడించి, పరాక్రమ వంతుడైన విరాటరాజును డీకొన్నాడు. సుశర్మ, సోదరుడు వేరు వేరుగా విరాటుని రెండు గుర్రాలనూ, చక్ర భాగాన్ని రక్షించే సైనికులనూ, సారథినీ చంపారు. రథహీనుడైన విరాటుని ప్రాణాలతో పట్టుకొన్నారు. కాముకుడు యువతిని బలాత్కరించి పట్టు కొన్నట్టు సుశర్మ విరాటరాజును పట్టుకొన్నాడు. వేగంగా వెళ్ళే గుర్రాలు పూన్చిన తనరథంపై ఎక్కించుకొని వెళ్ళిపోయాడు. బలవంతుడైన విరాటరాజు రథహీనుడై పట్టుబడగానే, త్రిగర్తులచే పీడింపబడుతున్న మత్స్యదేశ సైనికులు భయంతో పారిపోయారు. వారు భయపడి పోతూ ఉండగా, కుంతీపుత్రుడైన యుధిష్ఠిరుడు భీమసేనునితో ఇలా అన్నాడు. 'మహాబాహూ! మత్స్యరాజు విరాటుణ్ణి త్రిగర్తరాజు సుశర్మ పట్టుకొన్నాడు. అతనిని వెంటనే విడిపించు. అతడు శత్రువులకు వశం కాకూడదు. మనమందరం మత్స్యనగరంలో సుఖంగా నివసించాం. అతడు మనకు అన్ని విధాలా ఇష్టమయిన వస్తువు లిచ్చి మనను చాలా బాగా సత్కరించాడు. భీమసేనా! అతని యింటిలో నివసించినందువల్ల

అతనికి ప్రత్యుపకారం నీవు చేయాలి.' భీమసేనుడు ఇలా అన్నాడు. 'మహారాజా! నీ ఆజ్ఞవల్ల విరాటుణ్ణి సుశర్మచేతులలోనుండి నేడు విడిపించి రక్షిస్తాను. ఇపుడు నేను శత్రువులతో యుద్ధం చేసే సమయంలో నా పరాక్రమాన్ని చూడు. రాజా! తమరు బాహుబలాన్ని ఆశ్రయించి నిలిచి, సోదరులతో కూడా ఏకాంతంలో ఉండి నా పరాక్రమాన్ని చూడండి. దగ్గరగా ఉన్న ఈ మహావృక్షానికి క్రామను చాలా అందంగా గదవలె ఉంది. దీనిని నేను పెకలించి దీనితో శత్రుదళాలను తరుముతాను.' 'భీమసేనా! ఇలాంటి దుస్సాహసం చేయవద్దు. ఈ వృక్షాన్ని ఉండనీ. నీవీవృక్షాన్ని పెకలించి మానవుల కసాధ్యమయిన పని చేస్తే జనులందరూ నీవు భీముడవు అని గుర్తిస్తారు. కాబట్టి నీవు మానవులకు తగిన మరో ఆయుధాన్ని తీసుకో. ఇతరులకు నీవు భీమసేనుడ వని తెలియని విధంగా ధనుస్సు, శక్తి, కత్తి, గొడ్డలి మొదలయిన మనుష్యోచితా లయిన ఆయుధాలతో యుద్ధం చేసి శీఘ్రంగా రాజును విడిపించు. మహాబలవంతులయిన నకుల సహదేవులు నీ రథచక్రరక్షకులుగా ఉంటారు. మీ ముగ్గురూ కలిసి యుద్ధం చేసి విరాటమహారాజును విడిపించండి.' యుధిష్ఠిరుడు ఇలా ఆదేశించాక మహావేగశాలి, బలవంతుడు అయిన భీమసేనుడు వేగంగా ఒక గొప్ప ధనుస్సును తీసుకొన్నాడు. మేఘం నీటిధారలను కురిపించినట్లు బాణవర్షం కురిపించాడు. తరువాత భీమసేనుడు భయంకరుడయిన సుశర్మ వైపు పరుగుపెట్టాడు. విరాటుని వైపు చూస్తూ సుశర్మతో 'ఓయీ! ఆగు, ఆగు' అన్నాడు. రథికులలో శ్రేష్ఠుడయిన సుశర్మ తనవెనుక వస్తూ 'ఆగు, ఆగు' అని అరుస్తూ , కాలాంతకు డయిన యమునితో సమానంగా భయంకరంగా ఉన్న వీరపురుషుని చూసి ఆలోచించాడు. తన తోటివారితో "చూడండి మరల పెద్దయుద్ధం వచ్చింది. ఇపుడు నా పరాక్రమం చూడండి" అన్నాడు.

ఇలా చెపుతూ సుశర్మ సోదరులతో కూడా ధనుస్సులను పట్టుకొని వెనుదిరిగాడు. ఇటు మహాత్ముడయిన భీముడు నిమేషమాత్రంలో శత్రువులకు భయాన్ని కలిగించే ధనుర్ధరులైన రథికులను, గజవాహనులను, గుఱ్ఱపు రౌతులను ఒక లక్ష సైనికుల సమూహాలను విరాటరాజు ఎదుట సంహరించాడు. గద తీసుకుని చాలామంది పదాతులను కూడా చంపాడు. ఇలాంటి భయానకమయిన యుద్ధాన్ని చూసి రణోన్మత్తు డయిన సుశర్మ మనస్సులో ఇలా విచారించాడు. 'నాసైన్యంలో ఏం మిగిలింది? నారెండో సోదరుడు ఈ విశాలసైన్యంలో ముందే మునిగి నట్లున్నాడు.' అలా విచారించి

అతడు చెవివరకు లాగి ఎక్కుపెట్టిన ధనుస్సుతో యుద్ధానికి సిద్ధమైనాడు. సుశర్మ తీక్ష్ణమయిన బాణాలను మాటిమాటికి వేస్తున్నాడు. ఇది చూసి మత్స్యదేశయోధులందరూ త్రిగర్తులపై కోపగించి దివ్యాస్త్రాలను ప్రయోగిస్తూ రథాలను, గుఱ్ఱాలను ముందుకు నడిపారు. పాండవులు త్రిగర్తులవైపు వెళ్ళడం చూసి మత్స్య వీరుల విశాలసైన్యం కూడా త్రిగర్తులవైపు మళ్ళింది. విరాటరాజకుమారుడు శ్వేతుడు అత్యంతక్రోధంతో అద్భుతయుద్ధం చేశాడు. యుధిష్ఠిరుడు వెయ్యి మంది త్రిగర్తులను చంపాడు. భీమసేనుడు ఏడువేలమంది యోధులకు యమలోకం చూపించాడు. నకులుడు ఏడువందల సైనికులను యమపురికి పంపాడు. పురుషులలో శ్రేష్ఠుడు, ప్రతాపవంతుడు అయిన సహదేవుడు ధర్మరాజు ఆజ్ఞచే మూడువందలమంది శూరులను సంహరించాడు. తరువాత మహారథియైన సహదేవుడు త్రిగర్తుల సైన్యాన్ని సంహరించడం కోసం మిక్కిలి ఉగ్రరూపాన్ని ధరించి, ఆయుధంతో సుశర్మపైకి వెళ్ళాడు. మహారథుడైన ధర్మరాజు కూడా తొందరగా సుశర్మ మీదికి వెళ్ళి, అతనిని బాణాలతో మిక్కిలిగా కొట్టాడు. అపుడు సుశర్మ కూడా మిక్కిలి కోపించి చాలా వేగంతో తొమ్మిది బాణాలతో ధర్మరాజును, నాలుగు బాణాలతో అతని నాలుగు గుఱ్ఱాలను కొట్టాడు. భీముడు సుశర్మ దగ్గరకు వెళ్ళి అతని గుఱ్ఱాలను చంపాడు. అతని అంగరక్షకులయిన సైనికులను చంపి, కోపంతో అతని సారథిని కూడా నొగలి నుండి పడ వేశాడు.

సుశర్మకు రథం లేకపోవడంతో చక్రరక్షకుడు, సుప్రసిద్ధవీరుడు అయిన మదిరాక్షుడు, అక్కడకు వచ్చి త్రిగర్తరాజును బాణాలతో కొట్టాడు. ఇంతలో విరాటరాజు సుశర్మ రథాన్నుండి క్రిందకు దూకి, అతని గదనే తీసుకొని సుశర్మ పైకి వెళ్ళాడు. గద పట్టిన విరాటరాజు ముసలివాడైనా యువకునితో సమానంగా రణభూమిలో సంచరించాడు. ఇంతలో పారిపోయే త్రిగర్తుని చూసి భీమసేనుడు "రాజకుమారా! వెనుదిరిగి రా. రణరంగంలో పారిపోవడం నీకు తగినది కాదు ఈ పరాక్రమంతో నీవు విరాటుని గోవులను బలపూర్వకంగా ఎలా తీసుకువెళ్ళాలని అనుకొన్నావు? నీ సేవకులను శత్రువులమధ్య వదిలి పారిపోతూ విషాదాన్ని ఎందుకు పొందుతున్నావు?" భీమసేనుడిలా చెప్పిన తరువాత సుశర్మ 'నిలు, నిలు' అంటూ భీమసేనుని మీదికి వచ్చాడు. భీముడు కూడా వ్యగ్రత పొందలేదు. రథాన్నుండి దిగి సుశర్మ ప్రాణాలు తీయడంకోసం వేగంగా అతనివైపు పరుగెత్తాడు. చిన్న మృగాన్ని పట్టుకోవడానికి

సింహం పరుగు పెడుతున్నట్లు పరాక్రమవంతుడైన భీముడు పారిపోతున్న సుశర్మ వెంట పడ్డాడు. ఒక్కదూకుతో అతని జుట్టు పట్టుకొని, కోపంతో అతనిని ఎత్తి, నేలపై పడవేసి, గట్టిగా నొక్కివేశాడు. సుశర్మ ఏడుస్తున్నా తలపై మోకాలు పెట్టి, భీముడు మోచేతితో కొట్టాడు. ఆ పెద్ద దెబ్బకు సుశర్మ మూర్ఛపోయాడు. త్రిగర్తుల మహారథికుడు సుశర్మ రథహీనుడై శత్రువులకు పట్టుబడగా, త్రిగర్త సైన్యమంతా భయంతో వ్యాకులమయి భగ్నమయి పోయింది. తరువాత మహారథు లయిన పాండుపుత్రులు సుశర్మ నోడించి, గోవుల నన్నింటిని మళ్ళించి సుశర్మ అపహరించిన ధనమంతా తీసుకొన్నారు.

పాండవు లందరూ బాహుబలంతో కూడిన లజ్జాశీలులు, సంయమంతో వ్రతాలనుష్ఠించేవారు, మహాత్ములు, విరాటుని దుఃఖాలన్నీ దూరం చేసేవారు. వారందరూ రాజు ఎదుటికి వచ్చి నిలిచారు. అపుడు భీమసేను డన్నాడు - 'ఈ పాపాత్ముడయిన సుశర్మ నా చేతులలో నుండి తప్పించు కొని జీవించడానికి యోగ్యుడుకాడు. కాని నేనేం చేయను? మా మహారాజు ఎల్లప్పుడూ దయాళువు.' తరువాత భీమసేనుడు సుశర్మను మెడ పట్టుకొని తీసుకువచ్చాడు. ఆ సమయంలో సుశర్మ శరీరంలో పట్టులేక భీమునికి వశమై ఉన్నాడు. తప్పించుకోవడంకోసం పెనగులాడుతూ శరీరమంతా దుమ్ము కొట్టుకుపోయి స్పృహపోతున్న సుశర్మను భీమసేనుడు త్రాటితో బంధించి రథంపై ఎక్కించాడు. తరువాత భీముడు రణభూమిలో ఉండే ధర్మరాజు దగ్గరకు వెళ్ళి, సుశర్మను చూపించాడు. ధర్మరాజు సుశర్మను ఆ దశలో చూసి నవ్వి, భీమసేనునితో "ఈ నరాధమున్ణి వదిలివెయ్యి!"అన్నాడు- వెంటనే భీమసేనుడు సుశర్మతో ఇలా అన్నాడు. 'మూర్ఖుడా! నీవు బ్రతికి ఉండాలని కోరితే దానికి ఉపాయం చెపుతాను. నామాట విను. నీవు సదస్సులకు, సభలకు వెళ్ళి 'నేను విరాటరాజు దాసున్ణి' అని చెప్పాలి. ఇలా చేయడానికి అంగీకరిస్తే నిన్ను బ్రతకనిస్తాను. యుద్ధంలో ఓడిన వారవలంబించదగిన పద్ధతి యిది.' అపుడు యుధిష్ఠిరుడు భీమసేనునితో ప్రేమతో ఇలా అన్నాడు. "సోదరా! నీవు నామాటను మన్నించి ఈపాపపునడత గలవాణ్ణి వదలు, ఇతడు విరాటమహారాజుకు దాసు డయ్యాడు" తరువాత సుశర్మతో ఇలా అన్నాడు. 'నీవు దాసుడవు కావు. వెళ్ళు. నిన్ను వదిలివేస్తున్నాము. మళ్ళీ ఎప్పుడూ ఇటువంటి పని చేయకు.'

34. విరాటుడు పాండవులను మెచ్చుకొనుట, నగరములో రాజు విజయమును చాటించుట.

యుధిష్ఠిరు డిలా అన్నాక సుశర్మ సిగ్గుతో తల వంచుకొన్నాడు. బంధనం నుండి విడివడి విరాటరాజు దగ్గరకు వెళ్ళి నమస్కరించి, తన దేశానికి వెళ్ళాడు. సుశర్మను విడిచి, పాండవులు రణరంగ శిరోభాగానికి మధ్య ఆ రాత్రి సుఖంగా నివసించారు. తరువాత విరాటరాజు కుంతీపుత్రులకు ధనమూ, గౌరవమూ ఇచ్చి సత్కరించాడు. విరాటరాజన్నాడు – నాకున్న ధనాలు, రత్నాలు మీవి కూడా అవుతాయి. మీరందరూ ఇక్కడ సుఖంగా ఉండండి. మీకేపని నచ్చితే అదే చేయండి. నేను మీ అందరకు వస్త్రాలంకృత లయిన కన్యలను, రత్నాలను, ధనాన్ని మీరు కోరుకొన్న వస్తువులను ఇస్తాను. నేడు నేను మీపరాక్రమం చేత శత్రువులనుండి క్షేమంగా విముక్తుడ నయి వచ్చాను. కాబట్టి మీరే మత్స్యదేశానికి ప్రభువులు.' ఇలా మాట్లాడే మత్స్యరాజుకు యుధిష్ఠిరాది పాండవులు వేరువేరుగా చేతులు జోడించి ఇలా అన్నారు. 'మహారాజా! మీరన్నది సరియైనది. మేము మీ మాటలన్నిటిని అభినందిస్తున్నాము. కాని మేము నేడు మీరు శత్రువులనుండి విడువబడడంవల్లనే సంతుష్టుల మయ్యాము.'

అపుడు విరాటుడు తన మనస్సులో బాగా సంతోషించి, మళ్ళీ యుధిష్ఠిరునితో అన్నాడు. – "రండి! మీకు పట్టాభిషేకం చేస్తాను. మత్స్యదేశానికి మీరే రాజు. ఈ భూమిపై దుర్లభమూ, ప్రియమూ, మీ మనస్సుకు నచ్చినదీ అయిన పదార్థాన్ని మీకిస్తాను. మీరు మా సర్వాన్నీ పొందడానికి అర్హులు. విప్రశ్రేష్ఠుడా! నా రత్నాలు,గోవులు, బంగారం, మణులు, ముత్యాలు మీకు అర్పణం చేస్తున్నాను. మీకు అన్ని విధాల నమస్కారం. మీకారణంగా నేను నేడు మారాజ్యాన్ని, సంతానం ముఖాన్ని చూస్తున్నాను. శత్రువు నన్ను పట్టుకొన్నపుడు నేను భయపడ్డాను. కాని మీపరాక్రమం వల్ల శత్రువుకు వశం కాలేదు." ఇది విని యుధిష్ఠిరుడు మత్స్యరాజుతో మళ్ళీ చెప్పాడు – రాజా! మీరు చాలా మనోహరమయిన మాట చెప్పారు. నేను మీమాటల నభినందిస్తున్నాను. మీరు నిరంతరం దయాస్వభావంతో, ఎల్లప్పుడూ పరమసుఖంగా ఉండండి.'

(కంకునితో విరాటరాజు మళ్ళీ ఇలా అన్నాడు – 'ద్విజశ్రేష్ఠా! వల్లవుడి వంట చాలా అద్భుతంగా ఉంటుంది. అతడు యుద్ధంలో నన్ను రక్షించాడు. ఇదంతా చేయడం మీకే తగును. మీకు శుభం

కలగాలి. మీరు వరం కోరుకోండి. చెప్పండి, నేను మీకు ఏ సేవ చేయను? నేను మీపట్ల బాగా ప్రసన్నుడ నయ్యాను. మీకు పలురకాలయిన ఉత్తమోత్తమరత్నాలు, పానుపు, ఆసనం, వాహనం, వస్త్రాభరణాలతో అలంకరించబడిన సుందరకన్యలు, ఏనుగులు, గుర్రాలు, రథాల సమూహాలు, వివిధ జనపదాలు కానుకగా ఇస్తాను. వీటిని నా ప్రీతి కోసం గ్రహించండి.'

అపుడలా మాట్లాడే విరాటరాజుకు యుధిష్ఠిరు డిలా జవాబు చెప్పాడు– 'మహారాజా! మీరు శత్రువుల చేతినుండి విడువబడ్డారు. ఇది ఒకటే నాకు మిక్కిలి ప్రీతి కలిగించే విషయం. మీరు నిర్భయంగా, సంతోషంతో మీ నగరంలో ప్రవేశించండి. మీభార్యా పుత్రులను కలిసి సుఖంగా ఉండండి. నాకు సాటిలేనిది ఈ ప్రీతియే.)

ఇపుడు మీనగరంలో స్నేహితులకు ఈ ప్రియ సమాచారం చెప్పడం కోసం తొందరగా దూతలు వెళ్ళాలి. ఆ దూత లక్కడ తమ విజయాన్ని చాటింపు వెయ్యాలి' అపుడు ధర్మరాజు చెప్పినట్లు విరాటుడు దూతల నాదేశించాడు. "దూతలారా! మీరు నగరానికి వెళ్ళి యుద్ధంలో నాకు విజయం లభించిందని తెల్పండి. కన్నెపిల్లలు అలంకరించుకొని స్వాగతం చెప్పడం కోసం నగరానికి బయటకు రావాలి. అన్ని ప్రకారాల వాద్యాలు వాయించాలి. అలంకరించుకొని కన్యకలు తయారవ్వాలి." మత్స్యరాజు ఆజ్ఞను తలదాల్చి దూతలు ప్రసన్న మయిన మనస్సుతో వెళ్ళారు. అక్కడనుండి రాత్రి బయలుదేరిన దూతలు ప్రయాణం చేసి సూర్యోదయం అవుతూంటే విరాటుని రాజధానిని చేరారు. వారక్కడ అన్ని వైపులా విరాటుని విజయాన్ని చాటింపు వేశారు.

35. కౌరవులు ఉత్తరగోగ్రహణము చేయుట.

తనగోవులను విడిపించుకొని రాదలచి విరాటరాజు త్రిగర్తులపై యుద్ధం చేయటానికి వెళ్ళినపుడు, దుర్యోధనుడు తన మంత్రులతో కలిసి విరాటదేశంమీద దండెత్తాడు. భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, కృపాచార్యుడు, అశ్వత్థామ, శకుని, దుశ్శాసనుడు, వివింశతి, వికర్ణుడు, చిత్రసేనుడు, దుర్ముఖుడు, దుష్కర్ణుడు, మహారథు లైన ఇతరవీరులు దుర్యోధనుని వెంట ఉన్నారు. వీరంతా విరాటమహారాజు యొక్క మత్స్య దేశానికి వచ్చి, గొల్లపల్లెలను కల్లోలపరచి, చాలావేగంగా బల ప్రయోగంతో గోసంపదను అపహరించటం మొదలు పెట్టారు. కౌరవవీరులు రథసమూహాలతో చుట్టుముట్టి విరాటునికి చెందిన అరవైవేల గోవులను తోలుకొనిపోతున్నారు. భయంకరమైన ఆ కొట్లాటలో మహారథులైన వీరులచే చావగొట్టబడుతూ గొల్లపల్లెలోని గోపాలురు చేసిన ఆర్తనాదం పెద్దగా చాలాదూరం వినబడింది. భయభ్రాంతుడైన గోపాలుర

నాయకుడు వెంటనే రథం ఎక్కి దీనునివలె బిగ్గరగా ఏడుస్తూ నగరానికి వెళ్ళాడు. అతడు విరాటుని నగరంలో ప్రవేశించి రాజభవనం చేరుకొన్నాడు. వెంటనే రథం దిగి విషయం చెప్పటానికి లోపలకు ప్రవేశించాడు.

మత్స్యరాజు కుమారుడూ, అభిమానవంతుడూ అయిన భూమింజయుని చూసి అతని రాజ్యానికి చెందిన గోసంపద అపహరింపబడుతున్న వృత్తాంతమంతా గోపాధ్యక్షుడు తెలియజెప్పాడు. 'రాకుమారా! కౌరవులు మీ ఆరవైవేల గోవులను తోలుకొనిపోతున్నారు. మీ ఆ గోధనాన్ని తిరిగి జయించి తేవటానికి లెమ్ము. సిద్ధం కమ్ము. రాజకుమారా! రాజ్యహితం కోరి స్వయంగా యుద్ధానికి బయలుదేరుతూ మత్స్యరాజు విరాటుడు తాను ఇక్కడ లేనప్పుడు నిన్ను రక్షకునిగా ఉంచినాడు కదా! నిన్ను ఆ రాజు సభాసదులమధ్య 'నా కుమారుడు నాకు తగినవాడు, శూరుడు. మా యీ వంశపు బరువు బాధ్యతలను నిర్వహించటంలో సమర్థుడు' అంటూ పొగడుతూ ఉంటాడు. నాకుమారుడు అనేకశస్త్రాలను ప్రయోగించే నిపుణుడు, యుద్ధవీరుడు, అని పలుకుతూ ఉంటాడు. ఆ రాజు మాట నేడు నిజమగుగాక! కౌరవులను జయించి పశువులను మళ్ళించు. భయంకరమైన నీబాణాల మంటతో వారిసేనలను తగులబెట్టు. గజరాజు ఏనుగులను తాకినట్లు నీ ధనుస్సు నుండి వెలువడిన బంగారుపిడులుగల బాణాలతో శత్రుసమూహాలను ఛిన్నాభిన్నం చెయ్యి. అల్లెత్రాటిని బిగించటానికి ఉపయోగించే వింటి కొనలే ఉపధానాలుగా, అల్లెత్రాడే తీగెలుగా, విల్లే వీణాదండంగా అందుండి వెలువడే బాణాలే స్వరాలుగా, మహాధ్వనిసహితమైన నీ ధనుస్సు అనే వీణను శత్రువుల నడుమ వాయించు. ప్రభూ! వెండిలా మెరుస్తున్న తెల్లని గుర్రాలను రథానికి పూన్చి సింహపు గుర్తు గల నీ బంగారుధ్వజం ఎగురవెయ్యి. బంగారు పిడులూ, పదునైన అంచులూ గల బాణాలు దృఢమైన నీచేతులనుండి విడువబడి శత్రురాజుల మార్గాన్ని అడ్డగిస్తూ సూర్యుని క్రిమ్మివేయుగాక ! ఇంద్రుడు రాక్షసులను జయించినట్లు, కౌరవులందరినీ యుద్ధంలో జయించి కీర్తిని పొంది మరల నీవు ఈ నగరంలో ప్రవేశించు. అర్జునుడు పాండవులలో ఆశ్రయించ దగినవాడైనట్లుగా, మత్స్యరాజు కుమారుడవైన నీవే ఈ రాజ్యానికి (రాజ్యవాసులందరకు) ఆశ్రయించ దగినవాడవు. ఈ దేశవాసులకు నీవే నిజంగా దిక్కు. ఈ దేశవాసుల మందరమూ నేడు నీవలన ఆశ్రయం కల వార మైనాము.' అంతఃపురస్త్రీలమధ్య ఉన్న అతడు

ఆ గోపాలనాయకుని నిర్భయవాక్యాలు విని తనను తాను పొగడుకొంటూ ఇలా అన్నాడు.

36. ఉత్తరుడు సారథికొఱకు వెదకుట, ద్రౌపది బృహన్నలనుగూర్చి చెప్పుట.

ఉత్తరుడు ఇలా అన్నాడు. 'గుర్రాలను చక్కగా నడిపించే నేర్పు గల సారథి నాకొకడుంటే దృఢమైన ధనుస్సు గల నేను ఇపుడే ఆవులను అనుసరించి వెడతాను. కాని నాకు సారధి కాగల వాడెవరో తెలిసికొన లేకున్నాను. యుద్ధానికి వెళ్లే నాకు తగిన సారథిని వెంటనే చూడండి. గతంలో సుమారు ఇరవై ఎనిమిది - ముప్పై రోజుల పాటు జరిగిన యుద్ధంలో నా సారథి చనిపోయాడు. అలా సారథిని కోల్పోయిన నేను, సారథ్యపు నేర్పు లెరిగిన వేరొకనిని పొంది, వెంటనే ఇపుడే వెళ్ళి, పతాకాలు ఎత్తుకొని, ఏనుగులు, గుర్రాలు, రథాలతో నిండిన శత్రుసైన్యంలో మునిగి, నా ఆయుధాల ప్రతాపంతో బలహీనులైన కౌరవులను జయించి, పశువులను తిరిగి తీసుకొని వస్తాను. ఇంద్రుడు రాక్షసులను బెదరగొట్టినట్లు యుద్ధంలో గొప్పధనుస్సులను ధరించి వచ్చిన దుర్యోధనుని, భీష్ముని, కర్ణుని, కృపాచార్యుని, అశ్వత్థామతో కూడిన ద్రోణాచార్యుని బెదరగొట్టి, క్షణంలో మరల పశువులను తిరిగి తేగలను. రక్షణలేని దనుకొని కౌరవులు గోధనాన్ని తోలుకొనిపోతున్నారు. అచటలేని నేను ఏమి చేయగలుగుతాను? వచ్చిన కౌరవులు నేడు నా పరాక్రమం రుచి చూస్తారు. 'సాక్షాత్తు అర్జునుడా ఇతడు... మనలను మిక్కిలి బాధిస్తున్నాడు.' అని కౌరవులు అనుకోవాలి.'

అలా అంటున్న రాజకుమారుని మాటలు విని అర్జునుడు అజ్ఞాతవాస సమయం ముగిసినందుకు ప్రీతిని పొందాడు. అన్ని ప్రయోజనాలను సిద్ధింపజేసుకొనే నేర్పు గలవాడు కావున ఏకాంతంలో, ద్రౌపదితో ఇలా అన్నాడు - 'శుభాంగీ! నామాటగా వెంటనే ఉత్తరునితో ఇలా చెప్పు. దృఢంగా ఉన్న ఈ బృహన్నల అర్జునునకు రథం తోలేవాడు, ఇష్టుడు. రణ విజయుడు. అట్టివాడు నీకు సారథి అవుతాడు.' ఆ ద్రౌపది స్త్రీల మధ్య మాటిమాటికి అర్జునునితో పోల్చుకొంటూ పలుకుతున్న ఉత్తరుని మాటలను విని ఓర్చుకొనలేక పోయింది. ఎంతో నిబ్బరంగల ఆమె స్త్రీల మధ్యనుండి ఉత్తరుని సమీపించి, సిగ్గుపడుతున్నట్లు మెల్లగా ఇలా అంది. 'పెద్దఏనుగులా ఉన్న

యువకుడు, ప్రియదర్శనుడు అయిన బృహన్నల పూర్వం అర్జునుడికి సారథ్యం చేశాడు. వీరుడా! ఇతడు మహాత్ముడైన ఆ అర్జునుడికి శిష్యుడు. ధనుర్విద్యలో అతనికి తీసిపోడు. పాండవుల దగ్గరున్న నేను పూర్వం చూశాను. ఖాండవ వనాన్ని దావానల (కార్చిచ్చు)మై అగ్ని తగుల బెడుతున్నప్పుడు ఇతడే అర్జునుడి గుర్రాల్ని అదుపు చేశాడు. ఈ సారథివల్లనే అర్జునుడు ఖాండవప్రస్థంలో అన్ని భూతాలనూ జయించాడు. ఇతనికి సాటియైన సారథి మరియొకడు లేడు గదా!' ఉత్తరుడు అపుడు అన్నాడు. 'సైరంధ్రీ! నీవెరిగిన ఈ యువకుడు నపుంసకుడు కానేరడు. శుభరూపిణీ! నేను స్వయంగా బృహన్నలతో నాగుర్రాలను తోలమని చెప్పలేను.' అప్పుడు ద్రౌపది ఇలా సూచించింది. 'వీరా! చక్కని చిన్నది, నీ చెల్లెలున్నది గదా! అతడామె మాటను తప్పక పాటిస్తాడు. సందేహం లేదు. అతడే సారథి అయితే నిస్సందేహంగా కౌరవులందర్నీ జయించి, ఆవుల్ని తీసికొని రావడం తథ్యం.' సైరంధ్రి ఇలా చెప్పాక అతడు సోదరితో 'శోభనాంగీ! నీవు వెళ్ళి ఆ బృహన్నలను తీసికొనిరా' అన్నాడు. ఉత్తర వెంటనే కపటవేషంలో తనను కప్పిపుచ్చుకొన్న బృహన్నల ఉన్న నర్తనశాలకు వెళ్ళింది.

37. ఉత్తరుడు బృహన్నలను సారథిగా చేసుకొని యుద్ధమునకు వెళ్ళుట.

ఆ ఉత్తర బంగారుమాలలు దాల్చింది. అన్న పంపితే బయలుదేరింది. పెద్దల అభిప్రాయము ననుసరించే పేరున్నది. యజ్ఞవేదిక వంటి సన్నని నడుముకల్గి, లక్ష్మిలా మెరిసిపోతోంది. నెమలిపింఛం తలపై ధరించింది. శుభలక్షణాలున్న యువతి. మణులు పొదిగిన ఒడ్డాణం దాల్చిన ఉత్తర, మేఘంలో మెరుపులా ఆ నర్తనశాలవైపు పరుగుతీసింది. దృఢంగా ఉన్న ఆమె తొడలు ఏనుగు తొండాల వలె ఉన్నాయి. లోపమెరుగని సౌందర్యం, చక్కని పలువరుస, చిక్కిన నడుము కల్గి శ్రేష్ఠ హారాలు ధరించి గజరాజును చేరే ఆడుఏనుగులా శోభిల్లుతూ ఉత్తర ఆ అర్జునుని సమీపించింది. స్త్రీలలో రత్నం వంటిది. మనసుకు హాయి గొలుపుతూ (రాజభవనంలో) ఇంద్రుని సామ్రాజ్య లక్ష్మివలె పూజింపబడుతూ, కంటికి చూడముచ్చటైనది. మంచిపేరు, విశాలమైన కన్నులూ గల విరాటకుమారి ఉత్తర సంతోషంతో అర్జునుని పలుకరించింది. చూసి అతడు నవ్వుతూ ఆమె రాకకు కారణమడిగాడు. నరశ్రేష్ఠుడైన అర్జునుని

సమీపించి ఆ రాజకుమార్తె చెలికత్తెలమధ్య ప్రేమ పూర్వకంగా అతనితో ఇలా అంది. 'మనదేశానికి చెందిన ఆవుల్ని కౌరవులు తోలుకొనిపోతున్నారు. వాటిని జయించటానికి ధనుస్సుచేత పట్టి నా అన్న వెళ్తున్నాడు. ఈమధ్యనే యుద్ధంలో అతని రథసారథి చనిపోయాడు. అతనికి సారథ్యం చేయగల ఆ సూతునితో సమాను డెవడూ లేడు. బృహన్నలా! సారథికొరకు ప్రయత్నిస్తున్న అతనికి సైరంధ్రి (ద్రౌపది) గుర్రాల విషయంలో నీ నేర్పును గురించి చెప్పింది. మునుపు నీవు అర్జునుడికి ఇష్టుడవైన సారథివట. పాండవశ్రేష్ఠుడైన అతడు నీ సహాయంతో భూమిని జయించాడట. ఇప్పటికే కౌరవులు మన ఆవుల్ని చాలాదూరం తోలుకొని పోయారు. ఇపుడు నీవు నా అన్నకు చక్కగా సారథ్యం చెయ్యి. ఎంతో ప్రేమతో ఈ మాట చెపుతున్నాను. నీవు నేడు నామాటను పాటింపకపోతే ప్రాణాలు విడిచి పెట్టేస్తాను.' ఆ ఉత్తర అడగ్గానే అర్జునుడు రాజకుమారుడైన ఉత్తరుని వద్దకు వెళ్ళాడు. మదపుటేనుగులా వెడుతున్న ఆ అర్జునుని, ఉత్తర ఆడ ఏనుగు వలె అనుసరించింది.

దూరంనుండే ఆ బృహన్నలను చూసి రాజకుమారుడైన ఉత్తరుడు'నీవు సారథిగా ఉండటంచేత అర్జునుడు ఖాండవవనంలో అగ్నిని తృప్తిపరచాడు. భూమినంతా జయించాడు. సైరంధ్రి నీగురించి చెప్పింది. ఆమెకు పాండవుల గురించి బాగా తెలుసుకదా! బృహన్నలా! అలాగే నీవు గోధనాన్ని తిరిగి తేవాలనే కోరికతో, కౌరవులతో తలపడుతున్న నాగుర్రాల్ని కూడ అదుపుచెయ్యి. పూర్వం నీవు అర్జునుడికి ఇష్టమైన సారథిగా ఉండేవాడివి. పాండవుల్లో శ్రేష్ఠుడైన అర్జునుడు నీ సహాయంతో భూమిని జయించాడు.' ఇలా అన్నాక బృహన్నల రాజకుమారునితో "యుద్ధప్రాంగణంలో సారథ్యం చెయ్యటానికి నాశక్తి ఏపాటిది? పాడటమో, నాట్యం చెయ్యటమో, అనేక రకాలైన వాద్యాలను వాయించటమో చెయ్యగలను కాని నాకు సారథ్యం నేర్పు ఎక్కడిది? నీకు శుభం కలుగుగాక" అన్నాడు. అది విని ఉత్తరుడు "బృహన్నలా! తిరిగి వచ్చిన తర్వాత మళ్ళీ గాయకుడివో, నర్తకుడివో కావచ్చు. ముందు నా రథమెక్కి మేలుజాతి గుర్రాల్ని అదుపుచెయ్యి. అన్నాడు". ఆ అర్జునుడు అంతా తెలిసికూడ ఉత్తర ఎదుట నవ్వు పుట్టేటట్లు ఎన్నోవిధాలుగా తెలియనితనాన్ని ప్రదర్శించాడు. కవచాన్ని పైకెత్తి ఒంటిపై పెట్టుకున్నాడు. ఇది చూసి అక్కడున్న రాకుమార్తెలు కళ్లు పెద్దవి చేసుకొని నవ్వుకొన్నారు. కవచం సరిగా తొడుగుకొనలేకుండా

ఉన్న అతణ్ణి చూసి ఉత్తరుడు తానే స్వయంగా కవచాన్ని బృహన్నలకు తొడిగాడు. ఉత్తరుడు తానుకూడా సూర్యకాంతికల కవచాన్ని ధరించి, సింహధ్వజాన్ని రథంపైకెత్తి బృహన్నలను సారథ్యం చెయ్యటానికి నియమించాడు.

ఎంతో విలువైన ధనుస్సుల్ని, మెరిసే బాణాల్ని తీసుకొని, బృహన్నలను సారథిగా చేసుకొని ఆ వీరుడు (ఉత్తరుడు) యుద్ధానికి బయలుదేరాడు. అప్పుడు ఉత్తర, ఆమె చెలులు 'బృహన్నలా! యుద్ధభూమికి వచ్చిన భీష్మద్రోణుల్ని ఇతర కౌరవుల్ని జయించి, అందమైన చిన్నచిన్న మెత్తని రంగురంగుల వస్త్రాలను ఆటబొమ్మలు చేసుకోవటానికి తెచ్చి పెట్ట' మని అడిగారు. ఇలా అడుగుతున్న ఆ కన్యలందరితో అర్జునుడు నవ్వుతూ మేఘధ్వనిలా, దుందుభి ధ్వనిలా ఉన్న గంభీరస్వరంతో బదులిచ్చాడు. 'ఉత్తరుడు యుద్ధంలో మహారథవీరుల్ని గెలిస్తే తప్పకుండా దివ్యమైన, అందమైన వస్త్రాల్ని తెస్తాను.' ఇలా అంటూ వీరుడైన ఆ అర్జునుడు వెంటనే అనేక విధాలైన ధ్వజపతాకలున్న కౌరవులవైపు గుర్రాల్ని పోనిచ్చాడు. పెద్దరథంపై బృహన్నలతో కలిసి కూర్చున్న ఆ ఉత్తరుణ్ణి చూసి స్త్రీలు, కన్యలు, నియమపరులైన బ్రాహ్మణులు రథానికి ప్రదక్షిణం చేసి ఇలా అన్నారు. 'బృహన్నలా! మునుపు అర్జునుడికి ఖాండవదహన సమయంలో కలిగిన శుభమే ఉత్తరుడితో కలిసి యుద్ధరంగంలో కౌరవుల దగ్గరికి వెళ్తున్న నీకు కలగాలి.'

38. ఉత్తరుడు భయపడుట, అర్జునుడు ధైర్యము చెప్పుట.

ఉత్తరుడు నిర్భయంగా రాజధాని నుండి బయలుదేరి "కౌరవులు వెళ్ళినవైపు రథం పోనియ్యి ! విజయం పొందాలనే కోరికతో చేరిన కౌరవులందర్నీ ఓడించి, వారినుండి ఆవులను తిరిగిపొంది, నేను వెంటనే నగరానికి తిరిగివస్తాను" అని సారథితో అన్నాడు. అర్జునుడు ఆమేలు జాతి గుర్రాల్ని తోలుతున్నాడు. ఆ గుర్రాలు వాయువేగంతో ఆకాశాన్ని గిట్టలతో గీస్తున్నట్లు రథాన్ని లాగుతున్నాయి. ఉత్తర ధనంజయు (అర్జును) లిద్దరూ కొద్దిదూరం వెళ్ళి బలవంతులైన కౌరవుల సైన్యాన్ని చూశారు. శ్మశానంవైపు వెళ్ళి కౌరవుల్ని చేరారు. వాళ్ళిద్దరు ఆ జమ్మిచెట్టు చుట్టూ అన్నివైపులా వ్యూహాలతో నిలిచిన కౌరవ సైనికుల్ని చూస్తున్నారు. కౌరవుల సైన్యం సముద్రంలా అనిపిస్తోంది. కదిలే ఆసైన్యం చాలా చెట్లతో నిండిన వనం ఆకాశంలో

కదులుతున్నట్లుగా భాసిస్తోంది. కదిలే ఆసైన్యం నుండి ఎగసిపడే దుమ్ము ఆకాశాన్నంటుతోంది. ప్రాణు లన్నిటికి కళ్లు కనపడటంలేదు. కర్ణ దుర్యోధన కృప భీష్ములచేతనూ, పుత్రసహితుడైన ద్రోణునిచేతనూ కాపాడబడుతూ, ఏనుగులు, గుర్రాలు, రథాలతో నిండిన కౌరవసైన్యాన్ని చూసి శరీరం భయంతో, గగుర్పొడిచింది ఉత్తరుడికి. వెంటనే అర్జునుడితో ఇలా అంటున్నాడు. 'కౌరవులతో తలపడేంత సాహసం నాకు లేదు. భయంతో నాఒళ్ళు గగుర్పొడిచింది చూడు. అమ్మో! ఈ సైన్యం అనేకవీరులతో భయంకరంగా ఉంది. దేవతలుకూడా దీన్ని సమీపించలేరు. అంతులేని ఈకౌరవసైన్యంతో నేను తలపడలేను సరిగదా భయంకర ధనుస్సులు కల భరతవంశీయుల సైన్యంలో ప్రవేశించలేనుకూడా. రథాలు, ఏనుగులు, గుర్రాలతో నిండి, సైనికులు, ధ్వజాలతో వ్యాపించిన యుద్ధభూమిలో శత్రువుల్ని చూస్తేనే నామనసు వ్యధచెందుతోంది. ద్రోణ, భీష్మ, కృప, కర్ణ, వివింశతి, అశ్వత్థామ, వికర్ణ, సోమదత్త, బాహ్లికులు; దుర్యోధన మహారాజు ఉన్న ఆ యుద్ధభూమిలో అందరూ తేజస్సులు, ధనుర్ధారులు, యుద్ధమందు ఆరితేరినవారు. సైన్యాన్ని వ్యూహాలుగా ఏర్పరచి దెబ్బతీయటానికి కాలు దువ్వుతున్న ఈ కౌరవుల్ని చూస్తుంటేనే నా ఒళ్ళు గగుర్పొడిచి. తెలివి తప్పిపోతోంది. రక్షకులంతా ఖాళీ చేసిన నగరంలో రక్షకునిగా నాతండ్రి నన్ను నియమించి సేననంతా వెంటబెట్టుకుని త్రిగర్తులపై యుద్ధానికి వెళ్ళాడు. నాకా సైనికులు లేరు. బృహన్నలా! అస్త్రవిద్యలో ఆరితేరిన చాలామందిని అస్త్రవిద్యను అభ్యసించని అజ్ఞానిని నేనొక్కణ్ణి ఎదుర్కోలేను. రథాన్ని వెనక్కి మళ్లించు.'

బృహన్నల అన్నాడు. 'భయంవల్ల దీనుడివై శత్రువుల సంతోషాన్ని పెంచుతున్నావు. యుద్ధ రంగంలో ఇంతవరకు శత్రువులు ఏకొద్దిపాటి పరాక్రమాన్నీ ప్రదర్శించలేదు. 'నన్ను కౌరవులదగ్గరికి తీసుకుపో' అని నీవే నన్నడిగావు. కాబట్టి వివిధధ్వజాల వారున్నచోటికి నిన్ను నేను తీసుకు వెళ్తాను. దీర్ఘభుజా! వారు ఆవుల్ని తోలుకెళ్ళటానికి వచ్చినా, భూమికోసం వచ్చినా సరే, కౌరవుల దగ్గరికి నిన్ను తీసికొనిపోతాను. కౌరవులమీద పౌరుషం చూపుతానని స్త్రీ, పురుషుల మధ్య ప్రతిజ్ఞచేసి, నిన్ను నీవే పొగడుకొని, యుద్ధానికి బయలుదేరి, యిపుడు ఎందుకు యుద్ధం చెయ్యాలనుకోవటం లేదు? ఆవుల్ని జయించకుండా ఇళ్ళకు తిరిగి వెళ్లావో వీరులే కాదు, గుమికూడిన స్త్రీ పురుషులంతా కూడా నిన్ను ఎగతాళి చేస్తారు. సైరంధ్రి సారథ్యం చేయటానికి నన్నే

తగినట్లుగా పేర్కొన్నది. ఆవుల్ని గెలుచుకోకుండా నగరానికి నేను తిరిగి రాలేను. సైరంధ్రి ఆవిధంగా పాగడి, నీవు అలా మాట్లాడి నపుడు కౌరవులందరి మీద యుద్ధం చెయ్యకుండాఎలా ఉండగలను? చలించక స్థిరంగా ఉండు.'అన్నాడు. ఉత్తరుడు 'బృహన్నలా! పెద్ద సంఖ్యలో వచ్చిన కౌరవులు తమ ఇష్టానుసారం మత్స్యదేశ సంపదలను తీసుకొనిపోయినా, స్త్రీ పురుషులు నన్ను చూసి నవ్వినాసరే యుద్ధంలో నేను చెయ్యదగిన దేమీ లేదు. నా ఆవుల్ని పోనీ, నా నగరానికి రక్షణలేదు. నగరరక్షణకు నన్ను నియమించి వెళ్ళిన నా తండ్రికి భయపడుతున్నాను.'అన్నాడు. ఇలా అంటూ కుండలాలు ధరించిన ఉత్తరుడు భయంతో అభిమానాన్ని, గర్వాన్ని, ధనుర్బాణాల్ని విడిచిపెట్టి రథంనుండి ఎగిరిదూకి, పరిగెత్తాడు.

బృహన్నల 'శూరులదృష్టిలో పారిపోవటం క్షత్రియధర్మం కాదు. పిరికిగా పారిపోవటం కంటె యుద్ధంలో చావటం మంచిది.' అంటూ కుంతికొడుకు అర్జునుడు ఆ రథం నుండి దిగి పరుగెత్తుతున్న ఆ రాజకుమారుడి వెంట పాడుగైన జుట్టు విదల్చి, ఎర్రనివస్త్రాలు బిగించి పరుగెత్తాడు. విడిపోయిన కొప్పుతో పరుగెత్తుతున్న ఆరూపంలో అర్జునుణ్ణి చూసి గుర్తించని సైనికులు కొందరు నవ్వసాగారు. అలా వేగంగా పరిగెత్తే అతణ్ణి చూసి కౌరవు లిలా అనుకొన్నారు. 'నిజరూపాన్ని కప్పిపుచ్చుకొని నివురుగప్పిన నిప్పులాంటి ఇతడెవరు? ఇతని వ్యవహారం కొంత స్త్రీలాగా, కొంత పురుషుడిలాగా ఉంది. నపుంసకుడి రూపం ధరించిన ఇతడు అర్జునుని పోలిఉన్నాడు. తల, మెడ, ఇనుపకడ్డీల్లాంటి భుజాలు, నడక అతనివి లాగానే ఉన్నాయి. ఇతడు అర్జునుడు తప్ప మరొకడు అయి ఉండడు. దేవతల్లో ఇంద్రుడికున్నంత స్థానం మనుష్యుల్లో అర్జునుడి కుంది. అర్జునుడు తప్ప మరెవ్వడైనా ఈలోకంలో మనతో తలపడటానికి రాగలడా? రక్షకు లెవ్వరూ లేని విరాటుడి నగరంలో రక్షణ కోసం అతని కొడుకొక్కడే ఉండిఉంటాడు. అతడు పౌరుషంతో కాదు..అజ్ఞానంతో మనల నెదుర్కొనటానికి వచ్చి ఉంటాడు. కపటవేషంలో దాగి తిరుగుతున్న కుంతికొడుకు అర్జునుని సారథిగా చేసుకుని ఉత్తరుడు నగరం బయటకు వచ్చాడు. ఇదే నిజం. ఆ ఉత్తరుడు మనల్ని చూసి పారిపోతున్నా డనిపిస్తోంది. పరుగెత్తే అతణ్ణి అర్జునుడు పట్టుకునే ప్రయత్నంలో ఉన్నాడు.' ఇలా కౌరవులంతా తలొకరీతిగా అనుకొంటూ ఉత్తరుని, అలాగే కపటవేషంలో దాగిన అర్జునుని చూసి నిర్ణయానికి రాలేకపోతున్నారు.

పరుగెత్తే ఉత్తరుడి వెంటపడి నూరడుగుల దూరంలోనే అర్జును డతని జుట్టు పట్టుకొన్నాడు. అర్జునుడిచేత పట్టుకోబడ్డ ఆ విరాటరాజు కొడుకు అప్పుడు ఎంతో దీనంగా ఏడ్చాడు. ఉత్తరుడు అన్నాడు. 'బృహన్నలా! నీవు నామాట విను. వెంటనే రథాన్ని వెనక్కు త్రిప్పు. బ్రతికుంటే మానవుడు శుభాల్ని పొందుతాడు. కల్తీ లేని నూరుబంగారు నాణాల్ని, బంగారంలో పొదిగిన కాంతిమంతమైన ఎనిమిది వైడూర్యమణుల్ని నీకు ఇస్తున్నాను. బృహన్నలా! నన్ను విడిచిపెట్టు. మేలైన గుర్రాలతో, బంగారు దండం కల రథాన్ని, పది మదపుటేనుగుల్ని ఇస్తున్నాను.' ఏడుస్తూ తెలివి తప్పుతున్న ఉత్తరుని అర్జునుడు నవ్వుతూ రథం దగ్గరకు తెచ్చాడు.

తరువాత భయంతో తెలివితప్పుతున్న ఉత్తరుడితో అర్జునుడు 'శత్రునాశకా! శత్రువులతో యుద్ధం చెయ్యాలని లేకపోతే శత్రువులతో తలపడాలనుకొనే నాగుర్రాల్ని తోలు. నా భుజబలంతో రక్షింపబడుతూ, ఎదుర్కొనలేని, భయంకరమైన మహారథులైన వీరులచే సురక్షితమైన ఈ రథసైన్యం వైపు కదులు. రాజకుమారోత్తమా! శత్రు సంతాపకా! పురుష సింహమా! నీవు క్షత్రియుడివి. భయపడకు. శత్రువుల మధ్యలో ఉండి క్రుంగిపోతున్నావా? ఈ రథ సైన్యంలో నేను ప్రవేశించి కౌరవులతో యుద్ధం చేస్తాను. నీ పశువుల్ని జయిస్తాను. నరశ్రేష్ఠా! నేను కౌరవులతో పోరాడతాను. నీవు సారథిగా ఉండు.' యోధాగ్రేసరుడైన అర్జునుడు, చేష్టలుడిగి యుద్ధం చేయాలనే కోరికలేక భయంతో బాధపడుతున్న ఉత్తరుని సైమాటలతో కొద్దిసేపు ఓదార్చి రథంమీదకు ఎక్కించాడు. అర్జునుడు మళ్ళీ ఆ జమ్మిచెట్టు వైపు గాండీవాన్ని తీసుకొనటానికి వెళ్ళాడు.

39. ద్రోణాచార్యుడు అర్జునుని ప్రశంసించుట.

అర్జునుడు ఉత్తరుని రథంమీద ఎక్కించుకొని జమ్మిచెట్టు వైపు వెళ్ళటం చూసి, మహారథులైన భీష్మద్రోణాది కౌరవు లందరూ అర్జునుడివల్ల ఏర్పడే భయానికి బెదిరిపోతున్నారు. ద్రోణుడు ఉత్సాహం ఉడిగిపోయిన వాళ్ళనీ, ఉల్కాపాతం లాంటి అద్భుత అపశకునాలనూ చూసి ఇలా అన్నాడు. కఠినమైన వడగళ్ళను కురిపిస్తూ ఈదురు గాలులు వీస్తున్నాయి. బూడిదరంగులో మెరిసే చీకటి ఆకాశమంతా అలుముకొంది. కారుమబ్బులు అద్భుతంగా దర్శనమిస్తున్నాయి. తోకచుక్క మొదలైనవి

పడి, మంటలు చెలరేగిన దిక్కున నక్కలు భయంకరంగా అరుస్తున్నాయి. గుర్రాలు కన్నీళ్ళు విడుస్తున్నాయి. ధ్వజాలు గాలి లేకుండానే కంపిస్తున్నాయి, ఇక్కడ కనబడుతున్న దృశ్యాలు అన్నీ రాగల భయాన్ని సూచిస్తున్నాయి. మీరంతా జాగరూకులై ఉండండి. మిమ్మల్ని మీరు కాపాడుకోండి. సైన్యాన్ని వ్యూహాలతో నడపండి. జననష్టం జరుగబోతుంది. గోధనాన్ని కూడా కాపాడండి. గొప్ప ధనుస్సును ధరించిన ఈ వీరుడు అర్జునుడు నపుంసక వేషంలో వచ్చాడు. ఏమాత్రం సందేహం లేదు. **గాంగేయా! రావణుడి అశోకవనాన్ని ధ్వంసం చేసిన హనుమంతుడు ధ్వజంగా గలవాడు, చెట్టుపేరు (అర్జున-తెల్లమద్ది) కలవాడు, పర్వతాలకు శత్రువైన ఇంద్రుడి కొడుకు అర్జునుడే ఈ స్త్రీవేషధారి. దుర్యోధనుణ్ణి జయించి ఆవుల్ని తీసుకుపోదామనుకొంటున్న ఇతని బారినుండి దుర్యోధనుణ్ణి కాపాడు.*** ఈ అర్జునుడు దేవరాక్షసు లందరితోనైనా సరే యుద్ధం చెయ్యనిదే (యుద్ధభూమినుండి) వెనుదిరగడు. కౌరవులారా! ఈ వీరుడు ఇంద్రునివద్ద అస్త్రవిద్య నేర్చాడు. యుద్ధరంగంలో ఇంద్రునితో సమానంగా పోరాడుతాడు. ఇక్కడ అతనిని ఎదిరించగల వీరుడు కనపడడు. హిమాలయ పర్వతంమీద కిరాత వేషంతో ప్రచ్ఛన్నంగా వచ్చిన మహాదేవునికూడ యుద్ధంలో అర్జునుడు సంతోషపెట్టాడని వింటున్నాం.' అపుడు కర్ణుడు 'నీవెప్పుడూ మాముందు అర్జునుడి గుణాలను పొగడుతూ ఉంటావు. కాని అర్జునుడు నాలోగాని, దుర్యోధనుడిలో గాని పదహారో వంతు కూడా చెయ్యడు.' అన్నాడు. వెంటనే దుర్యోధనుడు ఇలా అన్నాడు. 'రాధాకుమారా! ఇతడే కనుక అర్జునుడైతే నేననుకున్న పని జరిగినట్లే. గుర్తింపబడిన పాండవులు మళ్ళీ పన్నెండు సంవత్సరాలు అడవులు పట్టుకు తిరుగుతారు. లేదా వీడు మరెవడైనా నపుంసకవేషంలో వచ్చి ఉంటే వీణ్ణి నాపదునైన బాణాలతో నేలకూలుస్తాను.' ఇలా దుర్యోధనుడు మాట్లాడుతుండగా అతని ఆ పొరుషాన్ని భీష్మ ద్రోణ కృప అశ్వత్థామలు (వ్యతిరేకమయిన ముఖ కవళికలతో) మెచ్చుకొన్నారు.

---

* వదీజ లంకేశవవారికేతుః వగాహ్యయో నామ వగారిసూనుః ।
ఏషో-ంగనావేషధరః కిరీటీ జిత్వావ యం నేష్యతి చాద్య గావః ॥ 10

40. ఆయుధములను దింపుమని అర్జునుడు ఉత్తరుని ఆదేశించుట.

అర్జునుడు ఆ జమ్మిచెట్టు దగ్గరకు వెళ్ళి ఉత్తరుడితో ఇలా అన్నాడు. 'ఉత్తరా! నా ఆజ్ఞ పాటించి ఈ ధనుస్సులను వెంటనే దింపు. నీ యీ ధనుస్సులు నాబలాన్ని సహించలేవు. గొప్ప బరువు మోయటానికి, ఏనుగు నణచటానికి, శత్రులపై విజయం కోసం యుద్ధం చేసే నా బాహు విన్యాసానికీ ఇవి తగవు.

(మహాబాహూ! శత్రుసంతాపకారక! ఉత్తరా! నీ యీ ఆయుధాలన్నీ చాలా సూక్ష్మంగా, పొట్టిగా అల్పంగా ఉన్నాయి. వీటితో విజయాన్ని సాధించే కార్యక్రమం కుదరదు. కాబట్టి భూమింజయా! (ఉత్తరా!) ఈ జమ్మిచెట్టు ఎక్కు.)

ఈ చెట్టుమీద పాండవుల ధనుస్సులు ఉన్నాయి. ఇక్కడ ఆ శూరుల ధ్వజాలు, బాణాలు, దివ్యకవచాలు ఉన్నాయి. మహాశక్తిమంతమై లక్షధనుస్సులకు సాటియై, దేశాభివృద్ధికి దోహదం చేసేది, ఎక్కు పెట్టేటప్పుడు కలిగే పరిశ్రమకు తట్టుకు నిలబడేది, పెద్ద తాటిచెట్టులా పొడవైనది, అర్జునుడి గాండీవం కూడా ఉంది. ఆ గాండీవం ఆయుధాలన్నింటిలో ప్రధానమైనది. శత్రువులకు చాలా బాధను కలిగించేది. బంగారంతో నిర్మించబడినది. దివ్యమూ, సుందరమూ, పొడవైనది, దెబ్బతిననిది (నిత్య నూతనంగా ఉంటుంది), చాలా బరువును మోయగలది, భయంకరమైనది, చూడముచ్చటైనది ఆ గాండీవం.'

41. ఉత్తరుడు శమీవృక్షము నుండి ఆయుధములను దింపుట.

అప్పుడు ఉత్తరుడు ఇలా అన్నాడు. 'ఈ చెట్టుమీద శవం కట్టబడి ఉందని వింటున్నాం. కాబట్టి రాజకుమారుడి నైన నేనెలా చేత్తో ముట్టుకోను? క్షత్రియుణ్ణి, రాజకుమారుణ్ణి, మంత్రయజ్ఞ వేత్తను అయిన నేను ఇలాంటి దాన్ని ముట్టుకోవటం తగదు. బృహన్నలా! శవాల్ని మోసేవాడిలా యీ శరీరాన్ని తాకి అపవిత్రుడినైన నాతో ఎలా వ్యవహరిస్తావు?' బృహన్నల బదులిచ్చాడు. 'మహారాజా! నీవు పవిత్రుడివి. వ్యవహరింపదగినవాడివే అవుతావు. ఇవి ధనుస్సులు. భయపడకు. ఇక్కడ ఏ శరీరమూ లేదు. అభిమానవంతుల వంశంలో పుట్టిన వాడివి. మత్స్యరాజు కొడుకువి, నీతో నిందింపబడే పని ఎలా చేయిస్తాను.'

అర్జును డిలా అనగానే కుండలాలు ధరించిన ఉత్తరుడు రథంమీదనుండి దూకి ఏమీచేయలేక జమ్మి చెట్టెక్కాడు. అర్జునుడు రథం మీదే ఉండి 'చెట్టు

మీదనుండి ఆ ధనుస్సుల్ని దింపు. ఆలస్యం చెయ్యకు.వెంటనే వీటికి చుట్టిన ఆకుల్ని తొలగించు' అంటూ అతణ్ణి శాసించాడు. ఉత్తరుడు పాండవుల ధనుస్సులను దింపి, వాటికి చుట్టిన ఆకుల్ని తొలగించి తెచ్చాడు. అలాగే వాటి కట్లను విప్పి మిగిలిన నాలుగుధనుస్సులతో కూడిన గాండీవాన్ని చూశాడు. ఉదయించే వేళ గ్రహాల దివ్యకాంతి అంతటా వ్యాపించినట్లు కప్పిన ఆకుల్ని తొలగిస్తుండగా సూర్య కాంతితో వెలుగొందుతున్న ఆ ధనుస్సుల కాంతి అన్ని దిక్కులా వ్యాపించింది. పడగలు విప్పుతూ ఎగసిపడే పాములా కనపడ్డాయి ఆ ధనుస్సులు. అపుడు ఉత్తరుడు ఒళ్ళంతా గగుర్పాటుతో, భయంతో చలించిపోయాడు. చాలా పెద్దవిగా ఉండి వెలుగొందుతున్న ఆ ధనుస్సులను తాకి ఉత్తరుడు అర్జునుడితో ఇలా అన్నాడు.

42. పాండవుల ఆయుధములను చెప్పుమని ఉత్తరుడు కోరుట.

ఉత్తరుడు అడిగాడు. 'నూరు బంగారు బొట్లు, బలమైన బంగారు కొనలు ఉన్న ధనుస్సు ఎవరిది? వెనుకభాగాన బంగారు ఏనుగుబొమ్మలు మెరుస్తున్నాయి. మధ్యభాగం పట్టుకొనటానికి వీలుగా చక్కగా ఉంది. దీనికి రెండు ప్రక్కలూ సుందరంగా ఉన్నాయి. ఈ ధనుస్సు ఎవరిది? వెనుక భాగంలో విడివిడిగా స్వచ్ఛమైన బంగారపు ఇంద్రగోపకాలు పొదిగిన ఈ ధనుస్సు ఎవరిది? మూడు బంగారు సూర్యప్రతిమ లుండి కాంతితో మెరిసే ఈఉత్తమ ధనుస్సు ఎవరిది? బంగారు మిడుత బొమ్మలు అందమైన మణులు పొదగడంతో విచిత్రంగా ఉన్న ఈ ఉత్తమ ధనుస్సు ఎవరిది? బంగారుపొదిలో వేలసంఖ్యలో పదునైన ములుకులతో (కొనలతో), బంగారు నీటితో కడుగబడిన అంచులతో, లావైన దండా (కర్ర) లతో, వెడల్పుగా నుండి, గ్రద్దరెక్కల అమరికతో, రాతిపై సానబెట్టబడిన, పసుపుపచ్చగానున్న, చక్కని చివరలు కలిగి, బంగారు నీటిచే పచ్చగా కనబడుతున్న, పూర్తిగా ఇనుముతో చేయబడిన ఈ బాణాలెవరివి? ఐదు పెద్దపులి గుర్తులున్న యీనల్లని విల్లెవరిది? పందిచెవులవంటి ములుకులతో నున్న పది బాణాలను ఒకేసారి ధరింపగలది. ఇది తగిన పొడుగు వెడల్పులు కలిగి, అర్ధచంద్ర బింబాల్లా కనబడుతూ శత్రువుల రక్తం తాగే ఈ ఏడువందల బాణాలెవ్వరివి? ముందుసగభాగం చిలుకరెక్కల లాగా, మెరిసే వెనుకసగభాగం బంగారంలా పచ్చగాను ఉండి సానబెట్టిన ఈ ఇనుప

బాణా లెవ్వరివి?

ముందువెనుక భాగాలు ఆడకప్పవలె ఉన్నాయి. చాలా బరువు మోయగలిగే టట్లుంది. శత్రుభయంకరంగా ఉన్న ఈ పొడవైన కత్తి ఎవరిది? ఈ కత్తి పులితోలు ఒరలో ఉంది. బంగారు బొమ్మలు చిత్రించారు. సామాన్యులు ఎత్తలే నట్లుంది. రంగుల పిడిఉంది. ఆ పిడికి చిరుగజ్జెలు కూడా ఉన్నాయి. ఈ కత్తి ఎవరిది? ఆవుతోలు ఒరలోఉన్న స్వచ్ఛమైన ఈకత్తి ఎవరిది? దీనికి బంగారుపిడి ఉంది. ఎవరూ ఎత్తలేనట్లుంది. నిషధదేశంలో తయారు చేయబడిన యీ కత్తి ఎంత పనికైనా తగినది. మేకతోలు ఒరలోనున్న కత్తి ఎవరిది? దానికి బంగారు పిడి ఉంది. పెద్దదై ఆకాశంలా పచ్చగా ఉంది. బంగరుపూత పూయబడింది. అగ్నిలా మెరుస్తున్న మేలిమి బంగారు ఒరలోనున్న ఈకత్తి ఎవరిది?ఇది శత్రువుల ఆయుధాలకు లొంగనట్లుంది. (ముప్పది అంగుళాలను మించి ఉన్న) బంగారు బొట్లతో నిండి పామును ముట్టుకున్నట్లుంది. శత్రువుల శరీరాల్ని చీల్చే టట్లుంది. ఎక్కువ బరువును మోయగల్గి దివ్యమై, శత్రుభయంకరమై ఉంది ఈ కత్తి. బృహన్నలా! ఇదంతా చూసి నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. నేనడిగినది ఉన్నదున్నట్లుగా చెప్పు.'

43. బృహన్నల ఉత్తరునికి పాండవుల ఆయుధములను తెలుపుట.

బృహన్నల చెపుతున్నాడు. "ముందు నీవు అడిగినది అర్జునుని గాండీవం. లోకప్రసిద్ధమైన ధనుస్సు అది. శత్రుసైన్యానికి యముడు లాంటిది. ఈగాండీవం అన్ని ఆయుధాలకన్న అధికమైనది. అన్ని ప్రక్కలా బంగారం తాపడం చేయబడింది. లక్ష ధనుస్సులతో సాటియైనది. దేశాభివృద్ధికర మైనది. ఈ గాండీవంతో యుద్ధంలో అర్జునుడు దేవదానవులపై విజయం సాధించాడు. రంగురంగులతో చిత్రంగాఉన్నది. సుకుమారమై దీర్ఘమైనది. శత్రువుల ఆయుధాల తాకిడి గుర్తులు లేని యీగాండీవం దేవదానవగంధర్వులచేత ఎన్నో సంవత్సరాలు పూజ లందుకొంది. పూర్వం బ్రహ్మదేవుడు వెయ్యి సంవత్సరాలు దీన్ని ధరించాడు. తరువాత ప్రజాపతి ఐదువందలమూడు సంవత్సరాలు, ఇంద్రుడు ఎనభై అయిదు సంవత్సరాలు, చంద్రుడు ఐదువందల సంవత్సరాలు, అలాగే వరుణుడు నూరు సంవత్సరాలు, శ్వేతవాహనుడైన పార్థుడు (అర్జునుడు) అరవై ఐదు సంవత్సరాలు ధరించారు. అన్నింటికన్న ఉత్తమమైన యీ

ధనుస్సు చూడటానికి ఎంతో మనోహరంగా ఉంటుంది. ఈ ధనుస్సు ద్వారా పరాక్రమం ప్రకటింపబడుతుంది. దివ్యమైన యీ ధనుస్సు అర్జునునికి వరుణుడినుండి సంక్రమించింది.

దేవమానవుల పూజ లందుకొని, ఉత్కృష్టమైన ఆకారం కలిగి చక్కనైన పార్శ్వాలూ, బంగారు మధ్య భాగము ఉన్న యీ ధనుస్సుతో, భీమసేనుడు తూర్పుదిక్కు నంతా జయించాడు. ఉత్తరా! 'ఇంద్రగోపకములు' చిత్రించి సుందరంగా కనపడే ఉత్తమ ధనుస్సు యుధిష్ఠిర మహారాజుది. మెరిసే బంగారు సూర్యప్రతిమల తేజస్సుతో వెలిగి పోతున్న యీ ఆయుధం నకులుడిది. బంగారు మిడుతలు చిత్రించిన యీ ధనుస్సు మాద్రిపిన్నకొడుకు సహదేవుడిది. ఉత్తరా! చురకత్తుల్లా దృఢమైన పదునైన ములుకులతో (కొనలతో) పాము విషంలాంటి యీ బాణాలు అర్జునుడివి. ఇవి యుద్ధంలో తమతేజస్సుతో మంటలు క్రక్కుతూ వేగంగా శత్రువుని దెబ్బతీస్తాయి. వ్యూహం ప్రకారం యుద్ధంలో శత్రువులపై బాణవర్షం కురిపించే వీరుడికి కూడా యీబాణాల్ని ఖండించడం అసంభవం. లావుగా, పొడుగ్గా, అర్ధచంద్రాకారంతో కనిపిస్తూ బంగారురెక్కలతో పసుపుపచ్చని, ఆ సానబెట్టిన బాణాలు భీమసేనునివి. శత్రువులను నేలకూల్చగలవి. ఐదు పులుల గుర్తులున్న యీ అమ్ముల పొది నకులుడిది. దీనివల్ల అతడు యుద్ధంలో పడమరదిక్కు నంతా జయించాడు. సూర్యుని ఆకారాన్ని పోలి, శత్రువులందర్నీ వశింపజేసే విచిత్రమైన క్రియాశక్తితో కూడిన యీ బాణాలు బుద్ధిమంతుడైన సహదేవుడివి. పదునై, పచ్చగా లావుగానున్న, పొడవైన బంగారు రెక్కలు, మూడు కణుపులుగల యీపెద్ద బాణాలు మహారాజు యుధిష్ఠిరుడివి. ఆడకప్పలా ఉన్న ముందు వెనుక భాగాలతో పొడవుగా ఉన్న యీ కత్తి అర్జునుడిది. యుద్ధంలో ఎంతో బరువును మోయగలిగి దృఢంగా ఉంటుంది. పులితోలు ఒరకల యీ పెద్దకత్తి భీమసేనుడిది. దివ్యమైన యీకత్తి ఎంతో బరువును సహింపగలదు. శత్రువులకు చాలా భయంకరమైనది. అందమైన ముందుభాగంతో చిత్రవర్ణపు ఒరతో బంగారు పిడితో నున్న యీకత్తి మేధావి, కౌరవ శ్రేష్ఠుడైన ధర్మరాజుది. మేకతోలు ఒరలో ఉన్న, బరువు మోయగల దృఢమైన యీ కత్తి నకులుడిది. ఆవుతోలు ఒరలో ఉన్న,ఎంతబరువయినా మోసే, దృఢమై విపులమైన యీ కత్తి సహదేవుడిది."

44. అర్జునుడు ఉత్తరునికి పాండవులను. తెలుపుట.

ఉత్తరుడు అడుగుతున్నాడు. 'యుద్ధంలో చురుకైన మహాత్ములైన పాండవుల యీ బంగారు ఆయుధా లెంతో చక్కగా అందంగా ప్రకాశిస్తున్నాయి. అర్జునుడు, యుధిష్ఠిరుడు, నకులసహదేవులు, భీమసేనుడు ఇప్పుడెక్కడున్నారు? వారంతా పాచికలతో తమరాజ్యాన్ని కోలుపోయి ఎక్క డున్నారో ఏరకంగానూ వినబడటం లేదు. స్త్రీలలో రత్నంలాంటి దని పేరొందిన ద్రౌపది ఎక్కడుందో? అప్పుడు ఆ ద్రౌపది పాచికలతో ఓడిన తన భర్తల వెంట అడవికి వెళ్ళింది" అప్పుడు అర్జునుడు 'నేను కుంతికొడుకు అర్జునుణ్ణి. సభాపూజ్యుడైన కంకుడే యుధిష్ఠిరుడు. నీతండ్రి యొక్క వంటవాడు వల్లవుడు భీమసేనుడు. గుర్రాల్ని కట్టే గ్రంథికుడు నకులుడు. గోశాలాధ్యక్షుడు, తంతిపాలుడు సహదేవుడు. సైరంధ్రి ద్రౌపది. ఆమె కోసమే కీచకులు చంపబడ్డారు. మనసు నిలిపి సావధానంగా అంతా విను. అర్జున, ఫాల్గున, జిష్ణు, కిరీటి, శ్వేతవాహన, బీభత్సు, విజయ, కృష్ణ, సవ్యసాచి, ధనంజయులు అని నాకు పది పేర్లు.' ఉత్తరుడు అడిగాడు. 'ఏకారణంచేత విజయుడని నీకు పేరు వచ్చింది? ఎలా శ్వేతవాహనుడ వయ్యావు? కిరీటి అనే పేరు ఎలా వచ్చింది? నీ వెలా సవ్యసాచి వయ్యావు. ఆ వీరుడి పేర్లకు ప్రధానకారణాలు నేను విన్నాను. అదంతా నీవు చెప్పగలిగితే నీవు చెప్పినదంతా నమ్ముతాను.' అర్జునుడు చెపుతున్నాడు. 'దేశాలన్నీ జయించి ధనం పన్నుగా స్వీకరించి తెచ్చి ఆ ధనం మధ్యలో ఉంటాను. అందుకే నన్ను **ధనంజయు డంటారు.** యుద్ధంలో యుద్ధోన్మత్తులైన వారిని ఎదుర్కొనటానికి వెళ్ళి విజయం పొందకుండా తిరిగిరాను. అందుచే వీరులకు నేను **విజయుడుగా** తెలుసు. యుద్ధానికి సిద్ధమయ్యే నా రథానికి తెల్లని గుర్రాలు కట్టబడతాయి. కాబట్టి నేను **శ్వేతవాహనుణ్ణి.,** హిమాలయ శిఖరం మీద ఉత్తర ఫల్గునీ నక్షత్రం రోజున పగటివేళ పుట్టిన నన్ను **ఫాల్గును** డంటారు. లోగడ నేను రాక్షసవీరులతో తలపడ్డప్పుడు సూర్యకాంతిని విరజిమ్మే కిరీటాన్ని ఇంద్రుడు నా తలపై ఉంచాడు. అందువల్ల నన్ను **కిరీటి** అంటారు. **యుద్ధంచేసే వేళ ఎట్టిపరిస్థితిలోను, ఏవగింపు కలిగించే పని చేయను కాబట్టి నేను దేవమానవు లందరిలో బీభత్సుడుగా ప్రసిద్ధుడ నయ్యాను.***

---

* న కుర్యాం కర్మ బీభత్సం యుధ్యమానః కథంచన ।
తేన దేవమనుష్యేషు బీభత్సురితి విశ్రుతః ॥ 18

గాండీవాన్ని ఎక్కుపెట్టడానికి నా కుడి ఎడమ చేతులు రెండూ సమర్థత కలిగి ఉన్నాయి కాబట్టి దేవ మానవులలో నన్ను **సవ్యసాచి** అని పిలుస్తారు. సముద్రం దాకా నేల నాలుగు చెరగులా నా శరీరకాంతి వేరెవ్వరికీ లేదు. నే నందరి పట్ల సమభావంతో ఉంటాను. పరిశుద్ధమైన పనినే ఆచరిస్తాను. ఈ కారణాలవల్ల నన్ను విజ్ఞులు **అర్జునుడుగా** ఎరుగుదురు. నన్ను పట్టుకోవటం, ఓడించడం చాలా కష్టం. ఇంద్రుడి కొడుకు నైన నేను శత్రువులను అణచి, విజయాన్ని పొందే వీరుణ్ణి కాబట్టి దేవమానవులలో **జిష్ణువుగా** ప్రసిద్ధుడ నయ్యాను. నల్లగా మెరుస్తున్న దేహకాంతి కలిగి పసితనంలో మనసు నాకట్టుకొనే రీతిలో ఉండటం చేత నాతండ్రి **కృష్ణుడు** అని పేరు పెట్టాడు. అది నా పదవ పేరు.'

తరువాత ఆ విరాట రాజు కొడుకు అర్జునుడి దగ్గరకు వెళ్ళి 'నేను భూమింజయుడనే పేరు గలిగి ఉత్తరుడిగా పిలువబడే వాణ్ణి' అని పేరు చెప్పుకొని నమస్కరించాడు. 'కుంతీకుమారా! నాభాగ్యవశంచేత నిన్ను చూస్తున్నాను. ధనంజయా నీకు స్వాగతం. నీకళ్ళు ఎర్రగా ఉన్నాయి. నీబాహువులు గజరాజు తొండంలాగా పొడుగ్గా ఉన్నాయి. తెలియక నీతో నేను మాట్లాడినదానికి మన్నించు. పూర్వం నీవు చేసిన అసాధ్యాలూ, అద్భుతాలూ అయిన పనుల వల్ల నా భయం తొలగింది. నీపట్ల ఎంతో గొప్ప ప్రేమ ఏర్పడింది.

(నేను నీదాసుడ నవుతాను. నన్ను దయతో చూడు. నీ సారథ్యం చెయ్యటానికి మాట ఇచ్చిన నామన సిప్పుడు కుదుటపడింది. నాకు గొప్ప అదృష్టం కలిగింది.' అంటూ ఉత్తరుడు పొంగిపోయాడు.)

45. అర్జునుడు యుద్ధసన్నద్ధుడై, ఉత్తరుని భయమును పోగొట్టుట.

ఉత్తరుడు అన్నాడు.' వీరుడా! సుందరమైన రథాన్నెక్కి ఏ సేనవైపు వెళ్ళ దలచావో సారథియైన నాతో చెప్పు. నీతో కలిసి ఆవైపే నేను వస్తాను.' అర్జునుడు చెపుతున్నాడు. 'పురుషసింహమా! నీకు భయం లేనందుకు సంతోషిస్తున్నాను. యుద్ధంలో నీ శత్రువులందర్నీ పారద్రోలుతాను. నీవు నిశ్చింతగా ఉండు. యుద్ధ రంగంలో భయంకరమైన పరాక్రమాన్ని చూపుతూ శత్రువులతో తలపడే నన్ను చూడు. నా రథంలో ఈ అమ్ములపొది లన్నింటినీ వెంటనే కట్టు. బంగారపు పిడిగల కత్తినొకదానిని తీసుకురా.' అర్జునుడి మాటలను విని ఉత్తరుడు తొందరగా అర్జునుడి ఆయుధాలను

తీసికొని చెట్టు దిగాడు. అర్జునుడు అన్నాడు. 'నేను కౌరవులతో యుద్ధం చేస్తాను. నీ పశువుల్ని జయించి తెస్తాను. గాండీవధనుస్సుతో యుద్ధరంగంలో నేను రథంపై ఉన్నాను. శత్రుసేనలకు నన్ను జయించటం కానిపని. నీభయం తొలగుగాక.' ఉత్తరుడు అన్నాడు. 'యుద్ధభూమిలో కృష్ణునితోనూ, ఇంద్రునితోనూ సమానమైన నీవు యుద్ధానికి సిద్ధమయ్యావు. ఇక నేను ఈసేనలకు భయపడటం లేదు.

కాని ఇది ఆలోచిస్తూనే భ్రాంతికి లోనవుతున్నాను. బుద్ధిచాలక ఏవిధంగానూ ఒక నిశ్చయానికి రాలేక పోతున్నాను. తగిన అవయవాలూ, ఆకారమూ కలిగి మంచి శుభలక్షణాలు కలిగిన నీకు ఏ కర్మవశాత్తు ఈ నపుంసకత్వం ఏర్పడింది? నిన్ను నపుంసక వేషంలో తిరిగే శూలధారి శివుడ వనో, గంధర్వరాజు వంటి వాడివనో, సాక్షాత్ దేవేంద్రుడి వనో భావిస్తున్నాను.'

(అర్జునుడు ఎలా వివరించాడు. ఊర్వశి శాపంవల్ల నాకీ నపుంసకత్వం ఏర్పడింది. పూర్వం నేను మాపెద్దన్న ధర్మరాజు ఆజ్ఞతో దేవలోకానికి వెళ్ళాను. అక్కడ దేవసభ సుధర్మలో ఇంద్రుడి సన్నిధిలో ఊర్వశి నాట్యం చేసింది. మావంశానికి మూలకారణమైన తల్లి ఆమె. రెప్పలు వాల్చకుండా ఆమె నాట్యమాడుతుండగా చూశాను. రాత్రి నేను నిదురించే వేళ నాతో రమించాలని వచ్చింది. నే నామెకు నమస్కరించి తల్లిని గౌరవించినట్లు గౌరవించాను. ఆమె కోపగించి నన్ను నపుంసకుడివి కమ్మని శపించింది. ఇంద్రుడు ఆ శాపం విని, "నపుంసకత్వం వల్ల భయపడకు. నీకు అజ్ఞాతవాసంలో ఇది ఉపకరిస్తుంది' అని నన్ను అనుగ్రహించి పంపాడు. అదే నాకిప్పుడు సంప్రాప్తమైంది. నావ్రతమూ పూర్తయింది.)

నాపెద్దన్న ధర్మరాజు ఆజ్ఞానుసారం సంవత్సర కాలం ఈ వ్రతంలో ఉన్నాను. ఇది వ్రతదీక్ష మాత్రమే. నీకు నిజం చెప్తున్నాను. రాజకుమారా! నేను నపుంసకుణ్ణి కాను. అన్న ఆజ్ఞకు బద్ధుణ్ణి. ధర్మానికి కట్టుబడ్డవాడిని. వ్రతం పూర్తి చేసి నపుంసకభావంనుండి బయటపడ్డానని తెలుసుకో.'

అపుడు ఉత్తరుడు 'నేడు నన్ను గొప్పగా అనుగ్రహించారు. ఇటు వంటి వాళ్ళు నపుంసకులు కాజాలరన్న నా ఊహ వ్యర్థం కాలేదు. ఇప్పుడు సహాయాన్ని పొందాను. ఇక యుద్ధ రంగంలో దేవతలతోనైనా యుద్ధం చేయగలను. నాభయమంతా తొలగిపోయింది. ఏం చెయ్యమంటావో చెప్పు. గురువు దగ్గర సారథ్యం చెయ్యటం నేర్చుకొన్నాను. నీగుర్రాల్ని నేను తగినవిధంగా ప్రవర్తించేలా చేస్తాను. వాసుదేవుడికి దారుకుడివలె, ఇంద్రుడికి మాతలివలె సారథ్యంలో శిక్షణ పొందిన వాణ్ణిగా నన్ను

గుర్తించు. కదులుతున్నప్పుడు నేలపై అడుగు ఎప్పుడు ఉంచుతుందో, ఎప్పుడు అడుగు లేపుతుందో కనుక్కోలేరు. కుడిప్రక్క బరువును మోయ కలిగి ఉంటుంది. అది (శ్రీకృష్ణుడి నాల్గు గుర్రాలలో ఒకటైన) సుగ్రీవ మనబడే గుర్రంతో సమానమైనది. బరువుమోయగలవాటిలో శ్రేష్ఠమై, అందమై, ఎడమప్రక్క బరువును మోయగల గుర్రం వేగంలో మేఘపుష్పమనే గుర్రంతో సాటియైనదని నా అభిప్రాయం. బంగారు జీనుతో అందమైన వెనుకభాగంలో బరువు మోయగల గుర్రాన్ని శైబ్యమనే గుర్రంతో సమానమైనదిగా, వేగంతో చాలా బలమైనదిగా అనుకొంటున్నాను. నాముందుండి, కుడివైపు వెనుక భాగం మోయ గల ఈగుర్రం వేగంలో వలాహకంకంటే చాలా బలం కలదిగా అనిపిస్తోంది. ధనుస్సును ధరించిన నిన్ను యుద్ధంలో భరించటానికి ఈ రథమే తగినది. ఈ రథాన్ని ఎక్కే నీవు యుద్ధం చెయ్య తగుదువని నా అభిప్రాయం' అన్నాడు.

తరువాత అర్జునుడు చేతుల నుండి కంకణాలను తీసివేసి అల్లెత్రాటి దెబ్బలనుండి కాపాడే విచిత్రాలైన బంగారపు తొడుగులను అమర్చుకొన్నాడు. నల్లని ఉంగరాల జుట్టును తెల్లని గుడ్డతో ఎత్తి కట్టి, తూర్పువైపు తిరిగి,పవిత్రుడై ఏకాగ్రమనస్సుతో రథంమీద కూర్చుని అన్ని అస్త్రాలను (అస్త్రాధిదేవతలను) ధ్యానించాడు. ఆ అధిదేవత లందరూ అర్జునునికి అంజలించి 'పాండుకుమారా! మేమందరమూ ఇదిగో నీకు వశమై, ఉదారులమై ఉన్నాము' అన్నారు. తరువాత అర్జునుడు వాటిని చేతితో తాకి ప్రణామం చేసి, 'మీరంతా నామనసులో నివసించండి' అని అడిగాడు. తరువాత అస్త్ర లన్నింటిని స్వీకరించడంతో అతని ముఖం ప్రసన్నమైంది. వెంటనే గాండీవానికి అల్లెత్రాటిని బిగించి ధనుష్టంకారం చెయ్యగా గొప్ప ధ్వని వినిపించింది. ఆ ధ్వని పెద్దకొండ మరో కొండతో ఢీకొన్నప్పుడు వచ్చిన ధ్వనిలా ఉంది. ఆ భయంకరమైన ధ్వని భూమిని బ్రద్దలు చేసేటట్లు ఉంది. అన్ని దిక్కులా ప్రచండమైన గాలులు వీచాయి. పెద్ద తోకచుక్క నేలరాలింది. దిక్కులు చీకటిలో మునిగిపోయాయి. ఆకాశంలో శత్రువుల ధ్వజాలు కారణం లేకుండా కదిలిపోయాయి. పెద్దచెట్లన్నీ ఊగి పోయాయి. అర్జునుడు రథంనుండి తన బాహువులతో గాండీవంతో చేసిన ధనుష్టంకారశబ్దాన్ని కౌరవులు పిడుగుపాటులా తలచారు. అపుడు ఉత్తరుడు ఇలా అడిగాడు. 'అర్జునా! శస్త్రాస్త్ర లన్నింటిలో ఆరితేరిన ఇంతమంది మహారథుల్ని

యుద్ధంలో నీవొక్కడివి ఎలా జయించగలవు? నీకు సహాయకులెవరూ లేరు. కౌరవులా ఎంతోమంది సహాయకులతో ఉన్నారు. అందువల్లే నీముందున్న నాకెంతో భయంగా ఉంది.'

అప్పుడు మేఘగంభీరమైన ధ్వనితో పగలబడి నవ్వి, భయపడకు! అంటూ అర్జునుడిలా అన్నాడు. 'వీరుడా! ఘోషయాత్రలో ఎంతో బలంగల గంధర్వులతో తలపడినప్పుడు నాకే స్నేహితుడు సహాయకుడుగా ఉన్నాడు? అదేవిధంగా దేవదానవులతో నిండిన భయంకరమైన ఖాండవవనంలో నేను యుద్ధం చేసినపుడు నాకే స్నేహితుడు తోడున్నాడు? ఇంద్రునికోసం మహాబలులైన నివాతకవచులతోను, పౌలోములతోను యుద్ధం చేస్తున్నపుడు నాకు సహాయకుడు ఎవరు? ద్రౌపదీస్వయంవరంలో రాజులతో యుద్ధం చేస్తున్నప్పుడు నాకెవ్వడు సహాయకు డయ్యాడు? నాగురువయిన ద్రోణాచార్యుడు, ఇంద్రుడు, కుబేరుడు, యముడు, వరుణుడు, అగ్ని, కృపుడు, కృష్ణుడు, శంకరుడు... వీరందరి అనుగ్రహమూ పొంది, వీళ్లతో యుద్ధం చేయలేకపోవడ మేమిటి ? నీ మానసికోద్వేగం విడిచి త్వరగా రథం తోలు.'

46. అర్జునుడు రథమెక్కి శంఖమునూదుట, ద్రోణాచార్యుడు కౌరవులకు అపశకునముల నెఱిగించుట.

అర్జునుడు ఉత్తరుని సారథిగా చేసికొని, జమ్మిచెట్టుకు ప్రదక్షిణంచేసి ఆయుధాలన్నీ తీసికొని బయలుదేరాడు. అర్జునుడు ఆ రథంనుండి సింహధ్వజాన్ని తీసి, శమీవృక్షమూలంలో ఉంచి, సారథి అయిన ఉత్తరునితో బాటు బయలు దేరాడు. అప్పుడు అర్జునుడు అగ్ని అనుగ్రహం వలన లభించిన తన సువర్ణమయధ్వజాన్ని మనసులో తలచుకొన్నాడు. ఆ ధ్వజం విశ్వకర్మ తయారుచేసిన దైవీమాయ. రథం తోనే కలిసి ఉండేది. వానర లక్షణం కలిగినది. పొడవైన దానితోక సింహంవలె భాసిస్తోంది. అగ్ని దేవుడు కూడా అర్జునుని మనోభావాన్ని గ్రహించి ధ్వజంపై నిలవవలసినదిగ భూతాలను ఆదేశించాడు. అప్పుడు విచిత్రాలయిన అంగాలు కలిగి, పతాకతో కూడి, మహాబలసంపన్నమై, మనోహర మైన దివ్యరూపం గల ఆ ధ్వజం అక్షయతూణీరంతో సహా వెంటనే ఆకాశం నుండి అర్జునుని రథంపై పడింది. రథంపైకి వచ్చిన ఆ ధ్వజాన్ని చూసి అర్జునుడు అప్పుడు ఆ రథానికి ప్రదక్షిణం

చేశాడు. ఆ రథంపై కూర్చొని శ్వేతవాహనుడైన కౌంతేయుడు ఉడుము చర్మంతో చేసిన హస్తకవచాన్ని (చేతి తొడుగు)తొడుగు కొని, ధనుస్సును చేత బట్టి, ఆంజనేయుడు కేతనంగా గల ఆ రథాన్ని ఉత్తరదిక్కుగా నడిపించాడు.

అరిమర్దనుడైన ఆ అర్జునుడు గొప్పగా శబ్దించగల తన మహాశంఖాన్ని బలమంతా వినియోగించి ఊదాడు. ఆ నాదంతో శత్రువుల రోమాలు నిక్క బొడుచుకున్నాయి.

(తీవ్రమైన ఆ శంఖధ్వని వర్షాకాలపుమేఘనాదం వలె వినిపించింది. శంఖధ్వనితోనూ, ధనుష్టంకారంతోనూ ఆంజనేయుని నాదంతోనూ, రథపు టిరుసు చప్పుళ్ళతోనూ ప్రాణులలో ఘోర భయాన్ని కల్గించాడు అర్జునుడు.)

అప్పుడా శంఖధ్వనిచే భయపడినవై రథానికి పూన్చిన జవనాశ్వాలు మోకాళ్ళు నేలకు తాకించి హఠించాయి/నిలిచిపోయాయి. ఉత్తరుడు కూడా భయపడి నొగలిపై చతికిల పడ్డాడు. అప్పుడు అర్జునుడు గుఱ్ఱాలను లేపి, పగ్గాలతో నియంత్రించి, ఉత్తరుని కౌగిలించుకొని నెమ్మదింపజేశాడు.

అర్జునుడిలా అన్నాడు. 'రాజకుమారా! నీవు క్షత్రియుడవు. భయపడవలదు. శత్రువుల సమక్షంలో (కంగారు) భయపడవచ్చా? నీవు శంఖశబ్దాల నెన్నింటినో విని యుంటావు. ఎన్నోమార్లు భేరీశబ్దాలను విని ఉంటావు. శత్రువులు పన్నిన వ్యూహాలమధ్యలో నున్న ఏనుగుల ఘీంకారాలు కూడా విని ఉంటావు. అటువంటి నీవు ఇక్కడ ఈ శంఖధ్వనితో ఎలా భయపడ్డావు? సాధారణమానవుడిలా భయపడి కళతప్పి పోయావు కూడా.' ఉత్తరు డన్నాడు. 'నేను శంఖశబ్దాలు ఎన్నో విన్నాను. ఎన్నోమార్లు భేరీ శబ్దాలనూ విన్నాను. శత్రువులు పన్నిన వ్యూహాలమధ్యలోని ఏనుగుల ఘీంకారాలను సయితం విన్నాను. కానీ ఇటువంటి శంఖధ్వని నే నింతకు మును పెప్పుడూ వినలేదు. అంతేకాదు. ఇటువంటి ధ్వజరూపాన్ని కూడా ఇంతకుముందు ఎప్పుడూ చూడలేదు. ఇటువంటి ధనుష్టంకారాన్ని కూడా ఇంతకు ముందెప్పుడూ వినలేదు. ఈ శంఖధ్వని చేత, ఈ ధనుష్టంకారంచేత, ధ్వజంపై నున్న అమానుషభూతాల నినాదాలచేత, రథగమనధ్వనిచేత నామనస్సు చాలా కలతపడుతోంది. అన్ని దిక్కులూ తిరుగుతున్న ట్లున్నాయి. నా హృదయం కలతపడుతోంది.ఈ ధ్వజం దిక్కులన్నీ క్రమ్మేసింది. నాకు దిక్కు తోచటంలేదు. ఈ గాండీవధనుష్టంకారం వలన నా రెండు చెవులూ వినిపించటంలేదు.'

ఈ విధంగా రెండు క్షణాలు గడిచాక అర్జునుడు ఉత్తరునితో ఇలా అన్నాడు.

'రథంపై స్థిరంగాకూర్చొని, పాదాలతో రథాన్ని త్రొక్కిపట్టుకొని, పగ్గాలను గట్టిగా పట్టుకో. నేను మరో సారి శంఖాన్ని ఊదుతాను.' అప్పుడు పర్వతాలను, పర్వతగుహలను, దిక్కులను, చట్టుబండలను బ్రద్దలు చేస్తూ అర్జునుడు మళ్లీ శంఖాన్ని పూరించాడు. ఉత్తరుడు మళ్లీ నొగలిపై ముడుచుకొని కూర్చున్నాడు. ఆ శంఖధ్వనితో, ఆ రథపుటిరుసుల చప్పుళ్ళతో గాండీవఘోషతో భూమి కంపించింది. అర్జునుడు మళ్లీ ఉత్తరుని కుదుటపరచాడు.

(ఈశంఖాదిధ్వనులను విని కౌరవసేనలో నున్న) ద్రోణాచార్యు డన్నాడు. 'ఈరథ నిర్ఘోషం మేఘగర్జనతో సమానంగా ఉంది. ఈ శబ్దానికి భూమి అదురుతోంది. కాబట్టి ఈ వస్తున్న వ్యక్తి సవ్యసాచికన్న ఇతరుడు కాడు. మన శస్త్రాలు వెలుగులు చిమ్మటం లేదు. మన గుఱ్ఱాలు ప్రసన్నంగా కనిపించటం లేదు. అగ్ని హోత్రమందలి అగ్నులు సయితం ప్రకాశించటం లేదు. ఇది శుభసూచన కాదు. మన పశువులన్నీ సూర్యున కభిముఖంగా నిలిచి భీకరంగా అరుస్తున్నాయి. మన రథధ్వజాలపై కాకులు ఎగురుతున్నాయి. ఇది శుభసూచన కాదు. పక్షులు మన కెడమవైపుగా ఎగురుతూ చాలా భయాన్ని కలిగిస్తున్నాయి. (సూచిస్తున్నాయి.) ఈ నక్క ఎవ్వరూ తరుమకుండానే (కొట్టకున్నా) ఏడుస్తూ మన సేనమధ్యగా పరువులెత్తిపోవడం తీవ్రభయాన్ని సూచిస్తోంది. మీ రోమకూపాలు నిక్కపొడుచుకొనటం నాకు స్పష్టంగా తెలుస్తోంది. తప్పని సరిగ యుద్ధకారణంగా క్షత్రియనాశం జరుగుతుంది. సూర్యుడు మొదలయిన జ్యోతుల వెలుగు మందగిస్తోంది. భీకరమైన మృగాలూ, పక్షులూ ఎదుట పడుతున్నాయి. క్షత్రియనాశనాన్ని సూచించే రకరకాల ఉత్పాతాలు కనిపిస్తున్నాయి. మహారాజా! ప్రత్యేకించి ఈ అపశకునాలు మన వినాశనాన్నే ఎక్కువగా సూచిస్తున్నాయి. నీసేనపై మండుతున్న ఉల్కలు పడి సేనను బాధిస్తున్నాయి. నీవాహనాలైన అశ్వగజాదులు అప్రసన్నంగా రోదిస్తున్నట్లు కనిపిస్తున్నాయి. నీసేనకు నలుదిక్కులా గ్రద్దలు చుట్టుముట్టి కూర్చొని ఉన్నాయి. అర్జునుని బాణాలచే పీడింపబడిన నీ సేనను చూచి నీవు బాధపడవలసి వస్తుంది. నీసేన ఇప్పటికే ఓడిపోయినట్లు ఉంది. ఎందుకంటే యుద్ధం చెయ్యాలన్న దృష్టి ఒకరిలోనూ కానరావటంలేదు. మన యోధులంతా వివర్ణవదనాలతో నిరుత్సాహంగా కనిపిస్తున్నారు. గోవులను హస్తినకు పంపి మనం వ్యూహాన్ని పన్ని శత్రువుల నెదిరించుదాం.'

47. దుర్యోధనుడు యుద్ధము చేయుటకు నిశ్చయించుట.

ఆ తర్వాత దుర్యోధనుడు రణరంగంలో భీష్మునితో, రథికశ్రేష్ఠుడైన ద్రోణునితో, మహారథుడైన కృపునితో ఇలా అన్నాడు. 'గురువర్యులారా! నేనూ, కర్ణుడూ ఈ విషయాన్ని తమకు చాలాసార్లు చెప్పిఉన్నాము. మరలా అదే మాటను చెప్తున్నాను. ఆ విషయాన్ని ఎన్ని మార్లు చెప్పినా నాకు తృప్తి లేదు. జూదంలో ఓడిపోయినవారు పండ్రెండు సంవత్సరాలు వనంలో, ఒక సంవత్సరం అజ్ఞాతంగా జనపదంలో నివసించాలన్నది కదా మనం పెట్టుకొన్న పందెం. అజ్ఞాతవాసంలో గుర్తింపబడినా ఇదే పందెం. ఇప్పటికింకా వారి పదమూడవ సంవత్సరం పూర్తి కాలేదు. అజ్ఞాతవాసం ముగియకమునుపే అర్జునుడు బయటకు వచ్చాడు. కాబట్టి పాండవులు మరల పండ్రెండు సంవత్సరాలు అరణ్యంలో నివసించాలి. రాజ్యకాంక్షతో పాండవులే ఆనాటి ఒప్పందాన్ని మరిచిపోయారా? లేక మనమే పొరపాటుపడుతున్నామా? ఈపదమూడు సంవత్సరాలు గడపటంలోని తక్కువ ఎక్కువలు భీష్మునికే తెలుస్తాయి. అర్థాలలో ఏకీభావం లేనప్పుడు (ఇదమిత్థమని నిర్ణయించటంలో ఒకే పద్ధతి లేనప్పుడు) ఎప్పుడూ అనుమానాస్పదంగానే ఉంటుంది. ఒక విధంగా ఒకప్పుడు తోచిన విషయం మరొకప్పుడు మరోవిధంగా కనిపిస్తుంది. మనం మత్స్యదేశంయొక్క ఉత్తరదిక్కునందు గోగ్రహణం చేస్తూ, మత్స్యదేశసైనికులతో యుద్ధం చేయటాన్ని కోరుకొంటున్నాం. అటువంటప్పుడు అర్జునుడు యుద్ధానికి వస్తున్నాడంటే మనం ఎవరికి అపకారం చేసినట్లు? మనం మత్స్యదేశస్థులతో పోరాడటానికి కూడా కారణం త్రిగర్తులు. వారికోసమే మన యుద్ధం. మత్స్యదేశ సైనికులు తమను పెట్టిన బాధలెన్నింటినో త్రిగర్తులు మనకు వినిపించారు. త్రిగర్తులు భయానికి లోనయ్యారు. అట్టి వారికి మేము సహకరించటానికి మాట ఇచ్చాము. ముందుగా విరాటుని గోధనాన్ని వారే ఆక్రమించాలని నిర్ణయించాము. ఆ మేరకు సప్తమినాటి అపరాహ్ణకాలంలో వారు విరాటుని (దక్షిణ) గోసంపదను స్వాయత్తం చేసికొన్నారు. ఆ సమయంలో విరాటుడు సుశర్మ (త్రిగర్తులు) ఆక్రమించిన గోవుల వెన్నంటి వెడతాడు కాబట్టి అష్టమినాడు సూర్యోదయానికి ఉత్తరదిక్కునందున్న ఈ గోవులను ఆక్రమించవలసి వచ్చింది. ఆ త్రిగర్తసేనలు గోవుల నిక్కడకు తోలుకొని వస్తాయి. ఒక వేళ ఓడిపోతే మనతో కలిసి ఇక్కడ మత్స్యరాజుతో యుద్ధం చేస్తాయి. కాకుంటే మత్స్యరాజు త్రిగర్తులను తరిమికొట్టి తనపౌరులతో,

భయంకరరూపంగల తన సర్వసేనలతో కలిసి ఈ రాత్రియే మనతో యుద్ధం చేయాలన్న తలపుతో ఇక్కడకు వచ్చియుండవచ్చు. ఆ సైనికులలోని మహాపరాక్రమశాలి అయిన ఒకానొకడు ముందు నడుస్తూ మనలను జయించాలని ఇక్కడకు వచ్చియుండవచ్చు. లేదా స్వయంగా విరాట మహారాజే ముందుకు వచ్చి యుండవచ్చు. ఒకవేళ మత్స్యరాజో, అర్జునుడో ఆ పక్షాన వచ్చినా మనందరం కలిసికట్టుగా యుద్ధం చేయాలి. ఆమేరకు మనమంతా ప్రతిజ్ఞ చేసి ఉన్నాం. కానీ రథశ్రేష్ఠులు, మహారథులైన భీష్మ, ద్రోణ, కృప, వికర్ణ, అశ్వత్థామలు సరిగా ఈ సమయంలోనే భ్రాంతచిత్తులై రథాలపై నిలబడిపోయారు. ఇప్పుడు యుద్ధం కన్నా మరో మంచి దారి లేదు. కాబట్టి అందరూ స్వయం సన్నద్ధులు కావలసినది. ఒకవేళ వజ్రధారియైన ఇంద్రుడు కాని, యముడు కాని వచ్చి యుద్ధం చేసినా గోధనాన్ని గ్రహించకుండా హస్తినకు ఎప్పడూ వెళ్ళడు. సైనికులలో ఎవడయినా పారిపోయి దుర్గమారణ్యాలను చేరినా నా ఈ బాణాలకు గురి అయి మరణించక తప్పదు. సైనికులను తీసికొనిపోయే గుఱ్ఱాలు బ్రతికితే బ్రతకవచ్చునేమో కాని పారిపోతున్న వారు జీవించే అవకాశమే లేదు.'

దుర్యోధనుని మాటలు విని కర్ణుడిలా అన్నాడు. "ద్రోణాచార్యుని వెనుక నిలిపి యుద్ధానికి తగిన నడకను (రీతిని) ఏర్పాటుచేయి. ఆచార్యునకు పాండవుల అభిప్రాయం బాగా తెలుసు. అందుకే మనల నిప్పుడు భయపెడుతున్నాడు. అంతే కాదు. అర్జునునిపై ఆచార్యునకు మక్కువ ఎక్కువ అని కూడా నేను గమనించాను. అందుకే అర్జునుని రాకను గమనించగానే ఆయనను ప్రశంసిస్తున్నారు. కాబట్టి సేన ककావికలు కాకుండేటట్లు యుద్ధనీతిని నిర్ణయించు. ద్రోణాచార్యుడు ముందుంటే అర్జునుని గుఱ్ఱాల సకిలింతలు విన్నంతనే బెదురుతాడు. సేన అంతా చెదిరిపోతుంది. ఇప్పుడు ఊరుకాని ఊరిలో, మహారణ్యంలో, గ్రీష్మకాలంలో శత్రువుల చేతికి చిక్కినట్టయింది. మనసేన భయపడని రీతిలో యుద్ధనీతిని నిర్ణయించు. ద్రోణాచార్యునకు ఎప్పుడూ పాండవులే ప్రత్యేకించి ఇష్టమయినవారు. వారు తమపని సానుకూలం కావటం కోసమే ఆచార్యుని నీదగ్గర నిలిపారు. ఈ ద్రోణాచార్యుడు తనంతతానుగా ఆ రీతిగా చెప్తుంటాడు కూడా. గుఱ్ఱాల సకిలింతలు విన్నంతమాత్రాన ఎవరైనా ఎవరినైనా ప్రశంసించవచ్చా? గుఱ్ఱాలు నిలిచిఉన్నా, ప్రయాణిస్తున్నా ఎప్పుడూ

సకిలిస్తూనే ఉంటాయి. గాలులు ఎప్పుడూ ప్రసరిస్తూనే ఉంటాయి. ఇంద్రు డెప్పుడూ వర్షిస్తూనే ఉంటాడు. మేఘగర్జనలూ ఎన్నోమార్లు వినిపించేవే. అర్జునునకు ఇక్క డేమిపని? అతనిని అంతగా ప్రశంసించవలసిన అవసరం ఆచార్యున కేమిటి? కేవలం పాండవులపై ప్రేమయో, లేకపోతే మనపై ద్వేషమో, రోషమో తప్ప మరే కారణమూ లేదు.

గురువులు సహజంగా దయామయులూ, బుద్ధిమంతులు. పాపకృత్యాలపై వైముఖ్యం గలవారు. కాబట్టి భయం గొల్పే సంకటస్థితి ఏర్పడినపుడు ఎట్టి పరిస్థితిలోనూ వారిని సలహాలు అడగరాదు. పండితులు సుందరమందిరాలలో, పండిత గోష్ఠులలో, ఉద్యానవనాల్లో కూర్చొని విచిత్రకథలను వినిపిస్తుంటే అది అందంగా ఉంటుంది. పండితులు జనసముదాయం మధ్యలో ఆశ్చర్యకరాలైన పనులు చేస్తున్నా, యాగం చేయటానికి ఆయుధాలైన స్రుక్స్రువాదులను సిద్ధం చేసుకొంటున్నా అప్పుడు అందంగా ఉంటుంది. పండితులు పరులలో దోషాలను ఎన్నేటప్పుడూ; మనుష్యుల చరిత్రలను వర్ణించేటప్పుడూ; గజయాత్ర, అశ్వయాత్ర, రథ యాత్రలకు ముహూర్తాలు నిర్ణయించే టప్పుడూ; గాడిద, ఒంటె, మేక, గొఱ్ఱెలకు సంబంధించిన గుణదోషాది విమర్శలు చేసేటప్పుడూ; గోధన సంగ్రహ విషయంలో, వీథుల్లోనూ, ఇంటిగుమ్మాల దగ్గరను మంగళకృత్యాలు చేసేటప్పుడూ; అన్నసంస్కార దోషాలను పరిశీలించేటప్పుడూ అందగిస్తారు. శత్రువుల గుణాలను ప్రశంసిస్తున్న పండితులను వెనక్కు నెట్టి శత్రువులను సంహరించడానికి అవసరమైన నీతిని ప్రయోగించు. గోవులను, మిమ్ములను కూడా పదిలపరచుకొని, అన్ని వైపులా సేనలను మోహరించి, శత్రువులతోయుద్ధం చేయటానికి అనుగుణంగా రక్షకులను నియమించుకోవాలి.'

48. కర్ణుని అహంకారపుమాటలు.

కర్ణుడింకా ఇలా అంటున్నాడు. 'ఈ దీర్ఘాయువులందరూ భయపడిన వారిలా, యుద్ధంమీద ఆసక్తి లేనివారిలా, నిలకడ కోల్పోయిన వారిలా కనిపిస్తున్నారు. ఈ వచ్చినవాడు విరాటరాజే అయినా, అర్జునుడే అయినా సముద్రాన్ని చెలియలికట్ట నిలువరించినట్లు నేను నిలువరిస్తాను. నావింటినుండి ప్రయోగింపబడిన బాణాలు వంగిన కణుపులు గలవై చరచరా వ్రాకే పాములవంటివి. గురి తప్పటం అసంభవం.

నా బాణాలు స్వర్ణపుంఖాలు, వాడియైన అగ్రభాగాలు కలవి. అటువంటి వాటిని చేయి తిరిగిన నేను ప్రయోగిస్తే చెట్టును క్రమ్మకొన్న మిడతలవలె అర్జునుని క్రమ్మివేస్తాయి. దృఢంగా నా నారినుండి శరపరంపరలు విడుస్తున్నపుడు నా చేతితొడుగుల శబ్దం భేరీలు మ్రోగిస్తున్నట్లు ఉంటుంది. వినండి. ఈ అర్జునుడు పదమూడు సంవత్సరాలు నిశ్చల భావనతో నిలిచియున్నాడు. ఇప్పుడు యుద్ధంపై మక్కువతో వచ్చి నాపై బాణప్రహారం చేస్తాడట. కుంతీకుమారుడైన ఆ అర్జునుడు గుణవంతుడైన బ్రాహ్మణునివలె నేను వేలకొలదిగ గుప్పించే బాణాల ప్రవాహాన్ని ప్రతిగ్రహిస్తాడు. ఈ అర్జునుడు గొప్ప విలుకాడుగా మూడు లోకాలలో ప్రసిద్ధికెక్కినవాడు. నరశ్రేష్ఠుడైన ఆ అర్జునుని కంటె నేనే విషయంలోనూ తీసిపోను. ఇప్పుడు గ్రద్దయీకలతో వేగవంతాలైన నా బంగారు బాణాలు వింటినుండి విడువబడి, ఎడాపెడా మింటికెగిరితే ఆకసం మిణుగురులతో నిండినట్లు కనిపిస్తుంది. ఇంతకుముందు నేను మాట ఇచ్చిన ప్రకారం ఈనాటి యుద్ధంలో అర్జునుని సంహరించి మరోవిధంగా తీర్చలేని సుయోధనుని అప్పు తీర్చి వేస్తాను. మధ్యలోనే విరిగి జారిపడుతున్న రెక్కలుగల బాణాల గమనం ఆకాశంలో సంచరించే మిడతల గమనంవలె స్పష్టంగా కనిపిస్తుంది.

అర్జునుడు దేవేంద్రునితో సమానమైన తేజస్సు గలవాడు. అయినా వజ్రాయుధంతో సమానమైన తాకిడి గల నా బాణాలతో ఉల్కలు ఏనుగును పీడించినట్లు పీడిస్తాను. అర్జునుడు అతిరథుడు. విలుకాండ్రలో మేటి, వీరుడును. అటువంటి పార్థుని నేడు యుద్ధంలో మూర్ఛిల్లజేసి గరుత్మంతుడు పామును పట్టుకొని వచ్చినట్లు రథం నుండి పట్టి తెస్తాను. అర్జునుడు అగ్నివంటివాడు. కత్తులు, శక్తులు, బాణాలు ఆ అగ్నికి ఇంధనాలు. శత్రువులను బూడిద చేసేటట్లు అది మండుతూ ఉంటుంది. కానీ నేను ఒక కాలమేఘాన్ని. నా అశ్వాల వేగమే అనుకూల మారుతం. రథసమూహమే ఉరుములు. శరధారలే వర్షం. ఆ అర్జునాగ్నిని నేనే ఆర్పివేస్తాను. నా ధనుస్సు నుండి వెలువడిన బాణాలు త్రాచుపాములవంటివి. త్రాచుపాములు అన్ని వైపుల నుండి పుట్టలో దూరినట్టు అవి అర్జునునిలోనికి చొచ్చుకొనిపోతాయి. గొప్పతేజస్సు, సువర్ణపక్షాలు, గలిగి ప్రకాశిస్తున్న నా బాణాలు కొండగోగులు పర్వతాన్ని కప్పివేసినట్టు అర్జునుని ముంచెత్తటం నీవు చూస్తావు. మునిసత్తముడైన పరశురాముని నుండి పొందిన అస్త్రాలను నా పరాక్రమాన్ని మేళవించి

నేను ఇంద్రునితో నయినా యుద్ధం చేయగలను. అర్జునుని ధ్వజాగ్రంపై నిలిచిఉన్న కోతి నేడు నా బల్లెపు దెబ్బ తగిలి, పెడబొబ్బలు పెడుతూ భూమి కొరిగిపోవును గాక! మన శత్రువైన అర్జునుని ధ్వజాన్ని ఆశ్రయించి యున్న భూతాలు నాదెబ్బ తగిలి అన్ని దిక్కులకూ పారిపోతూ చేస్తున్న ఆక్రోశధ్వని స్వర్గలోకం వరకు వినిపించును గాక! అర్జునుని రథంమీదనుండి పడద్రోసి ఎప్పటి నుండియో సుయోధనుని గుండెలో గ్రుచ్చు కొనియున్న శల్యాన్ని (ముల్లు)-ఈనాడు సమూలంగా పెకలించి వేస్తాను. పౌరుషంతో పోరాడుతున్న అర్జునుని గుఱ్ఱాలు చచ్చి, రథం విరిగిపోగా పాములవలె కేవలం బుసలు కొడుతున్న అర్జునుని కౌరవు లీనాడు చూస్తారు. కౌరవులకు గోధనమే ముఖ్యమయితే దానినే తీసికొని స్వేచ్ఛగా వెళ్ళవచ్చు. కాదంటే రథాలపై నిలిచి నా యుద్ధాన్ని ప్రత్యక్షంగా చూడవచ్చు.

49. కృపాచార్యుడు కర్ణుని అధిక్షేపించుట.

కృపుడు ఇట్లా అన్నాడు. 'రాధేయా! యుద్ధ విషయంలో నీ ఆలోచన ఎప్పుడూ క్రూరంగానే ఉంటుంది. అర్థస్వభావాన్ని కానీ, దాని పర్యవసానాన్ని కానీ నీవు గమనించవు. రాజనీతిశాస్త్రాన్ని బట్టి ఆలోచిస్తే రాజకీయ తంత్రాలు చాలా ఉన్నాయి. వాటి అన్నింటిలో యుద్ధం పాపభూయిష్ఠ మని పెద్దలు చెప్పుతూ ఉంటారు. దేశకాలాల ననుసరించి చేసిన యుద్ధం గెలుపు నిస్తుంది. తగని కాలంలో యుద్ధం చేస్తే ఫలిత ముండదు. అదేవిధంగా తగినచోట, తగినవేళ ప్రదర్శింపబడిన పరాక్రమం శుభప్రద మవుతుంది. దేశకాలాల ఆనుకూల్యం వలననే కార్యసిద్ధి జరుగుతుంది. రథం చేసిన వానిపై భారముంచి జ్ఞానులెవ్వరూ యుద్ధసన్నద్ధులు కారు.

సరిగా ఆలోచిస్తే ప్రస్తుతం మనం అర్జునునితో యుద్ధం చేయటం తగనిపని. తానొక్కడే కౌరవుల నెదిరింపగలడు. గతంలో ఒంటరిగానే అగ్నిని తృప్తి పరిచాడు గదా! అర్జునుడు ఒంటరిగానే అయిదు సంవత్సరాలు బ్రహ్మచర్యవ్రతాన్ని పాలించాడు. ఒంటరిగానే సుభద్రను అపహరించుకొనిపోతూ శ్రీకృష్ణునితోకూడా ద్వంద్వ యుద్ధానికి సిద్ధమయ్యాడు. అర్జునుడు ఒంటరిగానే కిరాతరూపంలో ఉన్న పరమేశ్వరునితో యుద్ధం చేశాడు. ఈ వనంలోనే సైంధవుడు ద్రౌపదిని అపహరించినప్పుడు ఒంటరిగానే సైంధవుని ఓడించి, ద్రౌపదిని విడిపించుకొన్నాడు. అర్జునుడు ఒంటరిగానే అయిదు

సంవత్సరాలు ఇంద్రుని దగ్గర అస్త్రవిద్య నభ్యసించాడు. ఒంటరిగానే శత్రువును జయించి కురువంశస్థులకు కీర్తి కల్గించాడు. జయింపశక్యం కాని సేనగల చిత్రసేనుని ఒంటరిగానే ఎదిరించి ఆ గంధర్వ రాజును చిటికెలో యుద్ధంలో ఓడించాడు. అట్లే దేవతలకు కూడా వధింపశక్యం కాని నివాతకవచులు, కాలఖంజులు మొదలయిన రాక్షసులను ఒంటరిగానే యుద్ధంలో పడగొట్టాడు. కర్ణా! ఇంతవరకు నీవు ఒంటరిగా సాధించిన గొప్ప పని ఏదయినా ఉందా? చెప్పు. పాండవులు ఒక్కొక్కరుగానే దిగ్విజయం చేసి రాజులను వశం చేసికొన్నారు. ఇంద్రుడైనా అర్జునునితో యుద్ధంచేయలేడు. అర్జునునితో ఒంటరిగా పోరాడాలని ఎవడయినా ముచ్చటపడితే అతనికి ఔషధాన్ని (చికిత్సను) ఏర్పాటు చేయకతప్పదు. సూతపుత్రా! అర్జునునితో ఒంటరిగా పోరాడటమంటే కోపించిన పామునోటిని కుడిచేతితో తెరిచి, చూపుడు వ్రేలితో దాని దంతాలను లెక్కించడమే. లేదా అరణ్యంలో ఒంటరిగా తిరుగుతూ అంకుశం కూడా లేకుండా మదపుటేనుగుపై కూర్చొని నగరానికి ప్రయాణించటం వంటిది. నేతిలో మునిగి, నారచీరలు కట్టిన నీవు నెయ్యి, మేదస్సు, వసలచే ప్రజ్వలించే అగ్నిమధ్యలో నిలిచి బయటకు రావాలనుకోవడం వంటిది. తనను తాను బంధించుకొని, మెడలో గండ శిలను కట్టుకొని చేతులతో ఈదుతూ ఎవడు సముద్రాన్ని దాటగలడు? దానివలన సాధించేది మాత్ర మేముంటుంది? కర్ణా! విలువిద్య నేర్వనివాడు విలువిద్యలో నిష్ణాతుడైనవానినీ, పరమదుర్బలుడు బలవంతునీ ఎదిరించటం ఎటువంటిదో అర్జునునితో యుద్ధంచేయా లనుకోవటం అటువంటిదే. అటువంటి ఆలోచన చేసినవాడు బుద్ధిహీనుడు.

మనం పదమూడుసంవత్సరాలు వనవాస, అజ్ఞాతవాసాల పేరుతో అర్జునుని విషయంలో కపటంగా వ్యవహరించాము. బంధనంనుండి విడిపించుకొన్న సింహంలాగా అర్జునుడు మనలను మిగులుస్తాడా? బావిలో కప్పబడియున్న అగ్నిని ఎగదోసినట్లు ఏకాంతవాసంలోనున్న అర్జునుని మన అజ్ఞానంతో ఉసి కొల్పాము. పెద్ద భయాన్ని కొని తెచ్చుకొన్నాం. కాబట్టి మనమంతా కలసి యుద్ధోన్మాదం గల ఈ అర్జునుని ఎదిరిద్దాం. మన సేన కవచాలు ధరించి, వ్యూహంగా ఏర్పడి ఎదురుకోలుకు సిద్ధమవుతుంది. ద్రోణుడు, దుర్యోధనుడు, భీష్ముడు, అశ్వత్థామ, నీవు, నేను కలిసి అర్జునునితో పోరాడుదాం. కర్ణా! తొందరపాటు తగదు. దృఢనిశ్చయంతో వజ్రపాణి

అయిన దేవేంద్రునివలె ఎత్తివస్తున్న అర్జునుని మనం ఆరుగురం కలిసి పోరాడితేనే నిలువరించగలం. మోహరించిన సేనలు, సంసిద్ధులయిన గొప్ప విలుకాండ్రూ, మనమూ కలిసి దానవులు దేవేంద్రుని ఎదిరించినట్లు అర్జునుని యుద్ధంలో ఎదిరిద్దాం.'

50. అశ్వత్థామ కోపము.

అశ్వత్థామ ఇలా అన్నాడు. 'కర్ణా! మనమింత వరకు గోవులను గెలుచుకొనలేదు. హస్తినకు చేరలేదు. కనీసం మత్స్యదేశపు సరిహద్దులనుండి బయట పడలేదు. అపుడే నీవు వ్యర్థప్రలాపాలు పలుకుతూ ఉన్నావు. ఎన్ని యుద్ధాలలో గెలిచినా, ఎంత ధనరాశిని పొందినా, శత్రుసేనలను జయించినా జ్ఞానులు పౌరుషాన్ని గూర్చి ప్రగల్భాలు పలుకరు. అగ్ని మాటాడ కుండానే దహించి వేస్తాడు. సూర్యుడు మౌనంగానే ప్రకాశిస్తున్నాడు. ఈ భూమి మౌనంగానే సమస్తచరాచర లోకాలను భరిస్తూ ఉంది. ఏ ఏ పని చేసి జీవితానికి అవసరమైన ధనాన్ని పొందవచ్చునో, ఏ పని చేత నిందలకు లోనుకాడో అటువంటి పనులను బ్రహ్మ నాల్గువర్ణాల వారికీ విధించాడు. బ్రాహ్మణుడు వేదాల నధ్యయనంచేసి యాగాలు చేయించవచ్చు లేదా తానే స్వయంగా చేయవచ్చు. క్షత్రియుడు ధనుస్సును చేబూని ధనం సంపాదించి యాగాలు చేయవచ్చును గాని చేయించరాదు. వైశ్యుడు కృషివ్యాపారాల ద్వారా ధనాన్ని సంపాదించి బ్రాహ్మణులద్వారా వేదోక్తకర్మలను చేయించాలి. శూద్రుడు వైతసీవృత్తి నాశ్రయించి నమస్కరించటం, ఆజ్ఞాపాలన చేయటం మొదలయిన పనులద్వారా ఎప్పుడూ త్రివర్ణాలవారిని సేవించాలి. మహనీయులెప్పుడూ శాస్త్రవిధుల ననుసరించి ప్రవర్తిస్తూ, ధర్మబద్ధంగా ఈ వసుధ నంతటినీ పొందినా గురువులను, వారు గుణహీనులైనా సత్కరిస్తారు.

క్షత్రియు డెవడైనా మాయజూదంలో రాజ్యాన్ని పొంది ఆనందిస్తాడా? కానీ ఈ ధృతరాష్ట్రకుమారుడు ఆ రాజ్యంతోనే ఆనందిస్తున్నాడు. తాను క్రూరుడు, దయలేనివాడు కాబట్టి అది చెల్లింది. బోయవాడు వంచనతో కపటమైన ఉపాయాలతో తన జీవనాన్ని నిర్వహించుకొన్నట్లు, కపటంగా డబ్బు సంపాదించిన వాడెవ్వడూ ఏ పాటి బుద్ధిమంతు డైనా తనను తాను గొప్పగా భావించడు. సుయోధన మహారాజా! నీవు మాయాద్యూతంలో పాండవుల ధనాన్ని అపహరించావు కానీ అర్జునుని అయినా,

నకులుని అయినా సహదేవుని అయినా యుద్ధంలో జయించావా? నీవు వారిని ఓడించిన ద్వంద్వ యుద్ధ మేదయినా ఉందా? ధర్మరాజునయినా, బలవంతులలో శ్రేష్ఠుడైన భీమసేనుని అయినా నీవు ఏ యుద్ధంలో గెలిచావు? ఇప్పుడు నీ ఏలుబడిలో నున్న ఇంద్రప్రస్థాన్ని నీవు ఎప్పుడు ఏ యుద్ధంలో గెలుచుకొన్నావు? చెడ్డపనులు చేసే సుయోధనా! నీవు ద్రౌపదిని ఏ యుద్ధంలో గెలిచావు? రజస్వలయై, ఏకవస్త్ర ధారిణియై ఉన్న ద్రౌపదిని నిండుకొలువులోనికి ఈడ్పించావు గదా! సూతపుత్రా! డబ్బుకోసం మంచిగంధపు చెట్టును నరికినట్టు నీవూ, దుర్యోధనుడూ కలిసి కపటద్యూతమూ, ద్రౌపదీపరాభవమూ కారణంగా పాండవులను మొదలంటా కూల్చారు. పాండవులను మీరు దాసులను చేసినప్పుడు మహానుభావుడైన విదురు డేమన్నాడు? గుర్తులేదా? మనుష్యులకైనా, జంతువులకైనా, కీటకాలు, చీమలు వంటి వాటికైనా వాటివాటి స్థాయిని బట్టి (శక్తినిబట్టి) సహనానికి హద్దుంటుంది. మీరు ద్రౌపదిని పెట్టిన బాధలకు పాండవుత్రు లెప్పుడూ మిమ్ములను క్షమించరు. ధార్తరాష్ట్రులను సంహరించటంకోసమే అర్జునుడు పుట్టాడు. నీవు మాత్రం పండితుణ్ణి అనుకొని పెద్దపెద్ద మాటలు మాటాడుతున్నావు.

పగను అడగించగల అర్జునుడు - జయశీలి - మనలను మిగలనిస్తాడా? అర్జునుడు దేవతలతో అయినా, గంధర్వులతో నయినా, అసురులతో నయినా, రాక్షసులతో అయినా భయపడి యుద్ధం మానటం మాత్రం ఎప్పటికీ జరగదు. గరుత్మంతుడు ఏచెట్టు మీదనయినా కాలూనితే చాలు. ఆ వేగానికి ఆ చెట్టు కూలిపోతుంది. అట్లే అర్జునుడు రణభూమిలో ఆగ్రహంతో ఏమహారథి నయినా ఆక్రమిస్తే, అతన్ని పడగొట్టి మరీ ముందుకు సాగుతాడు. కర్ణా! అర్జునుడు పరాక్రమంలో నిన్ను మించినవాడు. ధనుర్విద్యలో దేవేంద్రునితో సమానుడు. రణరంగంలో వాసుదేవునితో సమానుడు. అటువంటి అర్జునుని ఎవరు ప్రశంసించరు? అర్జునుడు దేవతలతో దివ్యంగా, మనుష్యులతో మానుషంగా యుద్ధం చేయగలడు. ఏ అస్త్రాన్ని అయినా ప్రతిస్పర్ధి అయిన అస్త్రంతో శాంతింపజేయగలడు. అటువంటి అర్జునునితో ఎవడు సరిపోలగలడు? గురువులకు తమ పుత్రుల తర్వాత శిష్యులే ప్రియమైన వారని ధర్మవేత్తలు అంటారు. ఆ కారణం చేత కూడా ద్రోణాచార్యునకు అర్జునునిపై మక్కువ. దుర్యోధనా! ఏ రీతిగా నీవు జూదమాడావో, ఏరీతిగా ఇంద్రప్రస్థాన్ని

అపహరించావో, ఏ విధంగా ద్రౌపదిని సభలోని కీడ్పించావో ఆ విధంగానే ఇప్పుడు అర్జునునితో యుద్ధం చెయ్యి. మీ మేనమామ శకుని బలే బుద్ధిమంతుడు. క్షాత్రధర్మంలో పండితుడు. మాయాద్యూతాన్ని ఆడగల ఆ గాంధారరాజు శకుని కూడా ఇక్కడ యుద్ధమే చేయాలి. గాండీవధనుస్సు కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం పేర పాచికలను విసరదు. కానీ వాడియై, మండిపడుతున్న రకరకాల బాణాలను వర్షిస్తుంది. అర్జునుని వాడి బాణాలు పర్వతాలను కూడా బ్రద్దలు చేస్తాయి. అవి శత్రువుల గుండెల్లో తప్ప మధ్యలో ఆగవు. యమధర్మరాజు, వాయుదేవుడు, మృత్యువు, బడబాగ్ని సమూలంగా నశింపజేయక కొంత మిగిల్చే అవకాశం ఉంటుందేమో కానీ అర్జునుడు కోపిస్తే దేనినీ వదలడు. రాజా! రాజసభలో మేనమామతో కలిసి జూదమాడావు గదా! ఆ విధంగానే ఈ రణరంగంలో కూడా శకుని రక్షణలో నిలిచి యుద్ధం చేయి. ఇతరయోధులు ఇష్టమయితే యుద్ధం చేయవచ్చు. కానీ నేను అర్జునునితో పోరాడను. మనం విరాటరాజుతోనే యుద్ధం చేయాలి. ఉత్తర గోస్థానానికి విరాటుడు వస్తే నేను ఆయనతో యుద్ధం చేస్తాను.'

51. భీష్ముడు అందరిని శాంతింపజేయుట, ద్రోణుడు దుర్యోధనుని రక్షింపవలెనని చెప్పుట.

భీష్ముడు ఇలా అన్నాడు. 'దుర్యోధనా! అశ్వత్థామ చక్కగా ఆలోచిస్తున్నాడు. కృపాచార్యుడూ సరిగానే గమనిస్తున్నాడు. కర్ణుడు మాత్రం కేవలం క్షత్రియధర్మంతో యుద్ధం చేయగోరుతున్నాడు. యుక్తాయుక్తాలు తెలిసిన వాడెవ్వడూ గురునింద చేయరాదు. దేశకాలాలను గమనించియే యుద్ధానికి సిద్ధం కావాలన్నదే నా అభిప్రాయం. దుర్యోధనునకు సూర్యతేజస్సు కలిగి పోటుగాండ్రయిన అయిదుగురు శత్రువులు, పాండవులు ఉన్నారు. ఆ శత్రువుల అభ్యుదయాన్ని చూచినపుడు పండితుడైనా మోహంలో పడకుండా ఎలా ఉంటాడు. ధర్మవేత్తలు సైతం తమ విషయాలను ఆలోచించే సమయంలో పొరపాటుపడుతుంటారు. కాబట్టి రాజా! నీకిష్టమయితే నా సలహాను కూడా ఇవ్వగలను. కర్ణుని మాటలు పరాక్రమాన్నీ, ఉత్సాహాన్నీ రగిలించటానికి చెప్పినవే. అశ్వత్థామ ఆ మాటలను క్షమించాలి. ఇక్కడ, ఇప్పుడు పెద్దపని వచ్చిపడింది. కౌంతేయుడైన అర్జునుడే ఎత్తివచ్చిన ఈ సమయం విరోధాలకు, అంతఃకలహాలకు

తగినది కాదు. నీవూ, ద్రోణాచార్యుడూ, కృపాచార్యుడూ జరిగిన దానిని క్షమించాలి. సూర్యునిలోని తేజస్సు, చంద్రునిలోని శోభ ఎప్పుడూ తగ్గనట్లు మీలోని ధనుర్విద్యాపాండిత్యం ఎన్నడూ తక్కువ గాదు (లోటుకాదు). ఈ తీరున మీలో బ్రాహ్మణత్వం, బ్రహ్మాస్త్రం రెండూ ప్రతిష్ఠింపబడి ఉన్నాయి. ఒకవైపు చతుర్వేద విజ్ఞానం, మరొకవైపు క్షాత్రధర్మం. ఈ రెండూనూ - వేదమూ, ధనుర్వేదమూ- సంపూర్ణంగా ఒకే వ్యక్తి యందున్నట్టు ఇంతకు ముందెప్పుడూ వినలేదు. భరతవంశస్థులకు ఆచార్యులయిన కృప, ద్రోణ, అశ్వత్థామలయందు మాత్రమే ఈ రెండు శక్తులూ కలిసి యున్నట్టు నా విశ్వాసం. రాజా! వేదాంతమైనా, పురాణమైనా, ప్రాచీనేతిహాసమైనా సరే! వీటి విజ్ఞానంలో ఆనాటి పరశురాముడు తప్ప మరెవ్వరు ద్రోణుని మించిపోగలరు? వేదవిజ్ఞానం, బ్రహ్మాస్త్రం -ఈరెండూ మన ఈ ఆచార్యులలో తప్ప మరెక్కడా కనిపించవు. అశ్వత్థామ క్షమించాలి. ఇది అభిప్రాయభేదాలకు అదనుకాదు. అందరమూ కలిసి ఎత్తివచ్చిన అర్జునుని ఎదిరిద్దాం. మహనీయులు సేనావినాశహేతువులుగా చెప్పిన ఇబ్బందులలో ప్రధానమైనది భేదం. విద్వాంసులు దీనిని మహాపాపంగా భావిస్తారు.'

అశ్వత్థామ ఇలా అన్నాడు.' మహాత్మా! న్యాయోచితాలయిన మా మాటలను నిందింపదగదు. ఇంతకుముందు పాండవులకు జరిగిన అన్యాయాలను తలచుకొని కోపంతో ద్రోణాచార్యుడు అర్జునుని గుణాలను ప్రస్తావించాడు. అంతే. గురువు గారి వయినా దోషాలు చెప్పాలి. శత్రువుల నుండి అయినా గుణాలను గ్రహించాలి. గురువు సర్వవిధాలుగా సమస్త ప్రయత్నాలతో పుత్రులకూ, శిష్యులకూ కూడా హితబోధ చేయాలి.' వెంటనే దుర్యోధనుడు 'ఆచార్యా! క్షమించండి. ఇప్పుడు శాంతాన్ని వహించాలి. ద్రోణాచార్యుల మనస్సులో భేదబుద్ధి లేదు. ఇంతకుముందు పలికిన పలుకులు రోషం వలన పుట్టినవే' అన్నాడు.

వెంటనే దుర్యోధనుడు కర్ణునితోను, భీష్మునితోను, మహత్ముడైన కృపునితోను కలిసి ద్రోణుని శాంతపరిచాడు. అపుడు ద్రోణుడు ఇట్లన్నాడు. 'శంతనుకుమారుడైన భీష్ముడు పలికిన తొలిమాటతోనే నేను చల్లబడ్డాను. ఇక యుద్ధరీతిని గురించి ఆలోచించండి. యుద్ధంలో అర్జునుడు సాహసం వల్ల గానీ, పొరపాటుగా గానీ దుర్యోధనుని సమీపించి ఆక్రమించకుండా ఉండేటట్లు యుద్ధనీతిని (నడకను)

నిర్ణయించండి. వనవాసం (అజ్ఞాతవాసంతోసహా) ముగియనట్లైతే అర్జునుడు బయటపడి ఉండేవాడు కాదు. ఈనాడు గోవులను స్వాధీనం చేసికొనక మనలను క్షమించే ప్రసక్తికూడాలేదు. అర్జునుడు ఎట్టి పరిస్థితిలోనూ ధృతరాష్ట్ర కుమారుల మీదికి రాకుండేటట్లు, కౌరవసేనను ఓడింపకుండేటట్లు రణవ్యూహాన్ని నిర్ణయించండి. దుర్యోధనుడు కూడా పాండవుల అజ్ఞాతవాస పరిసమాప్తి విషయంలో ముందే సందేహించాడు. కాబట్టి గాంగేయా! అజ్ఞాతవిషయంలో ఉన్నదున్నట్లు చెప్పగల వాడవు నీవే." అన్నాడు.

52. భీష్ముని అంగీకారము.

భీష్ముడిలా చెప్పాడు. 'కాష్ఠలు (18 రెప్పపాట్ల కాలం), కళలు (ముప్పది రెప్పపాట్లకాలం), ముహూర్తాలు (48 నిమేషాలు), దినాలు, పక్షాలు, మాసాలు, నక్షత్రాలు, గ్రహాలు, ఋతువులు, సంవత్సరాలు- ఈవిధమైన విభాగంతో కాలచక్రం నడుస్తుంది. ఈ పక్షమాసాదుల కాలప్రమాణం పెరగటం వలన, నక్షత్రాల నడకలలోని హెచ్చు తగ్గుల వలన ప్రతి అయిదు సంవత్సరాలకూ రెండు మాసాలు అధికంగా వస్తాయి. ఈ లెక్కన పదమూడు సంవత్సరాలపై ఐదునెలల పండ్రెండు రోజులు ఎక్కువగానే గడిపారని, అధికంగా వస్తాయని నా అభిప్రాయం. ఈ పాండవులు చేసిన ప్రతిజ్ఞలన్నీ యథాతథంగా పూర్తి చేశారు. ఈ విషయాన్ని స్పష్టంగా గ్రహించాకే అర్జునుడు ఇక్కడ బయటకు వచ్చాడు.

పాండవులందరూ మహాత్ములే. అందరూ ధర్మవేత్తలే. వారి ప్రభువు ధర్మరాజు. కాబట్టి ధర్మవిషయంలో వారు పొరపాటుపడే అవకాశమే లేదు. పాండవులు పేరాస గలవారు కాదు. తపస్సు మొదలయిన కఠినకర్మలను సైతం ఆచరించినవారు. అటువంటివారు అధర్మమో, అనుచితమో అయిన పద్ధతి ద్వారా రాజ్యాన్ని కోరే వారుకాదు. కురువంశాన్ని ఆనందింపజేసే ఆ పాండవులు ఆనాడే విక్రమింపగలవారు. కానీ ధర్మపాశబద్ధులై క్షత్రియవ్రతాన్ని విడువలేదు. అర్జునుని అసత్యవాది అన్నవాడు తప్పనిసరిగ పరాభవాన్ని పొందుతాడు. పాండవులు మరణాన్ని అయినా వరిస్తారు కానీ అసత్యమాడరు. నరశ్రేష్ఠులైన పాండవులు తగిన సమయం ఆసన్న మైనపుడు తమకు రావలసిన దానిని- ఇంద్రుడే దానిని దాచివుంచినా సరే- అణువంతయినా

విడువరు. వారి పరాక్రమం అటువంటిది. ఇప్పుడు రణభూమిలో సర్వధనుర్ధరులలో మేటియైన అర్జునునితో పోరాడాలి. కాబట్టి లోకంలో సజ్జనులు పాటించిన శుభప్రదమయిన ఉపాయాన్ని ఆలోచించి దానిని ఆచరించాలి. మీ గోధనం శత్రువుల పాలు కాకూడదు. కురురాజా! యుద్ధంలో ఏదో ఒక నిర్దిష్టపక్షమే తప్పని సరిగా గెలవటం నేనింతవరకు చూడలేదు. అదిగో! మరి అర్జునుడు రానేవచ్చాడు. యుద్ధం జరిగితే లాభమో, నష్టమో, గెలుపో, ఓటమో ఎవరికో ఒకరికి తప్పదు. అది కళ్ళకు కట్టిన సత్యం. అనుమానానికి అవకాశమే లేదు. **కాబట్టి రాజేంద్రా! యుద్ధానికి తగిన కర్తవ్యాన్ని పాటించు. లేదా ధర్మానుసారంగా ప్రవర్తించు. యుద్ధం లేకుండానే రాజ్యాన్ని తిరిగి యిచ్చి సంధిచేసుకో. ఏదైనా వెంటనే జరగాలి. అర్జునుడు వచ్చేశాడు.***

(కురుశ్రేష్ఠా! అర్జునుడు ఒంటరిగానైనా తన బాణాలతో భూమిని తగులబెట్టగలడు. ఇక సోదరులతో కూడా కలిస్తే కౌరవులను యుద్ధంలో సంహరించటం ఎంత పని? కాబట్టి నీకిష్టమైతే సంధి చేసికొనవచ్చు')

దుర్యోధనుడిలా అన్నాడు. 'పితామహా! నేను పాండవులకు రాజ్యమివ్వను. కాబట్టి యుద్ధానికి తగిన ఏర్పాట్లను వెంటనే చేయించాలి.' భీష్ముడిలా అన్నాడు. 'కురునందనా! నీకు నచ్చే టట్లయితే ఈ విషయంలో నా అభిప్రాయాన్ని చెబుతా విను. నేనెప్పుడైనా శ్రేయోమార్గాన్నే సూచిస్తాను. నీవు వెంటనే సేనలోని నాలుగవభాగాన్ని తీసికొని హస్తినకు బయలుదేరు. మరొక పావుభాగం సేన గోవులను తీసికొని బయలుదేరుతుంది. మిగిలిన సగభాగం సైన్యంతో మేము అర్జునుని ఎదిరిస్తాం. నేను, ద్రోణుడు, కర్ణుడు, అశ్వత్థామ, కృపుడూ కలిసి యుద్ధంచేసి తీరాలని వచ్చిన అర్జునునితో పోరాడుతాం. మరలా మత్స్యరాజు విరాటుడే వచ్చినా, ఇంద్రుడే ఎత్తివచ్చినా చెలియలికట్ట సముద్రాన్ని ఆపినట్లు నేను నివారిస్తాను.'

మహానుభావుడైన భీష్ముడు పలికిన మాటలు అందరికీ రుచించాయి. వెంటనే కౌరవరాజు ఆ రీతిగానే చేశాడు. భీష్ముడు ముందు దుర్యోధనుని, ఆ తర్వాత గోధనాన్ని పంపి సేనాపతులను నియమించి వ్యూహం పన్నటానికి ఉపక్రమించాడు.

---

* తస్మాద్ యుద్ధోచితం కర్మ కర్మ వా ధర్మసంహితమ్ ।
క్రియతామాశు రాజేంద్ర సంప్రాప్తశ్చ ధనంజయ: ॥ 14

భీష్ముడిలా అంటున్నాడు. 'ఆచార్యా! మీరు మధ్యలో నిలవండి. అశ్వత్థామ ఎడమవైపు నిలుస్తాడు. కృపుడు దక్షిణభాగానికి రక్షణగా నిలుస్తాడు. సూతపుత్రుడైన కర్ణుడు కవచాన్ని ధరించి ముందు నిలుస్తాడు. నేను సమస్తసైన్యానికీ వెనుకగా నిలిచి రక్షణగా ఉంటాను.

(మహాబలసంపన్నులు, మేటి విలుకాండ్రు, శూరులు, మహారథులంతా రణరంగానికి వచ్చిన అర్జునుని ప్రయత్నపూర్వకంగా నిలువరించాలి.' ఆ తర్వాత భీష్ముడు సర్వసేనలతో అభేద్యవ్యూహాలను భావించి, వాటిని వజ్రగర్భ, వ్రీహిముఖ, అర్ధచక్రాంత మండలరూపంగా తీర్చాడు. వెనుక స్వర్ణమయమైన తాళధ్వజం ప్రకాశించే రథంపై ఆయుధాలు ధరించి తాను నిలిచాడు.)

53. అర్జునుడు కౌరవసైన్యమును ఆక్రమించి గోవులను మరల్చుట.

కౌరవ సేనల వ్యూహరచన ఆ రీతిగా జరిగిన తరువాత రథఘోషతో దిక్కులను మారుమ్రోగిస్తూ అర్జునుడు సమీపించాడు. సేనలు అర్జునుని పతాకాన్ని చూశాయి. రథఘోషను విన్నాయి. మిక్కిలిగా ధ్వనిస్తున్న గాండీవ ధనుష్టంకారాన్ని కూడా విన్నాయి. ఆపై ద్రోణుడు అంతా గమనించి, గాండీవ ధనుర్ధారియై సమీపించిన మహారథుడైన అర్జునుని చూసి ఇలా అన్నాడు. 'ఇదిగో! అర్జునుని పతాకపు అంచు దూరంనుండే ప్రకాశిస్తోంది. ఇప్పుడు వినిపిస్తున్నది అర్జునుని రథఘోషయే. ధ్వజంపై నున్న ఆంజనేయుడు కూడా గర్జిస్తున్నాడు. ఇదిగో! రథిశ్రేష్ఠుడైన అర్జునుడు ఉత్తమరథంపై నిలిచి ఉత్తమధనుస్సు అయిన గాండీవాన్ని లాగుతున్నాడు. ఆ ధ్వని పిడుగుపాటు శబ్దంలా వినిపిస్తోంది. ఇవిగో! ఈ రెండుబాణాలూ కలిసి నాపాదాలపై పడ్డాయి. మరో రెండు బాణాలు నాచెవుల ప్రక్కగా దూసికొనిపోయాయి. అర్జునుడు వనవాసం పూర్తి చేసి, అక్కడ అమానుష పరాక్రమాన్ని ప్రదర్శించి నేడు బయటపడ్డాడు. నాపాదాలకు నమస్కరించి, నన్ను కుశలప్రశ్న వేస్తున్నాడు. బంధుజనప్రియుడు, ప్రజ్ఞావంతుడు అయిన అర్జునుడు చాలాకాలానికి కనిపించాడు. ఇప్పుడు తన దివ్యకాంతితో ఎంతో వెలిగిపోతున్నాడు. అర్జునుడు రథంపై బాణాలు, అందమైన చేతి తొడుగులు, అమ్ములపొదులు, శంఖం, పతాక, కవచం, కిరీటం, కత్తి, ధనుస్సులు ధరించి చక్కగా ప్రకాశిస్తున్నాడు. కిరీటి ఇపుడు యజ్ఞసామగ్రితో చుట్టబడి, నేతితో ప్రజ్వలించే అగ్నివలె వెలిగిపోతున్నాడు.'

(జ్వలిస్తున్న సూర్యుడిలా అర్జునుడు సమీపించటాన్ని గమనించిన శత్రువులు అతనివైపు

తేరిపారచూడలేక పోయారు. ఎదురుగానున్న శత్రుసేనల రథాలను పరిశీలించి అర్జునుడు సారథి ఉత్తరునితో ఇలా అన్నాడు.)

'సారథీ! కౌరవసేనకు అమ్ముపాటు దూరంలో గుఱ్ఱాలను నియంత్రించి రథాన్ని నిలుపు. దానితో కురుకులాధముడైన ఆ దుర్యోధను డెక్కడున్నాడో నేను గమనిస్తాను. ఆ దురభిమాని కనిపించగానే మిగిలిన ఈ యోధుల నందరినీ విడిచి అతని తలపై పడతాను. సుయోధనుడు ఓడిపోతే వీరంతా ఓడిపోయినట్లే. అడుగో! ముందున్న వాడు ద్రోణాచార్యుడు. వారి తర్వాత అశ్వత్థామ. అటువైపు పితామహుడైన భీష్ముడు, కృపాచార్యుడు, కర్ణుడు కనిపిస్తున్నారు. సమర్థులైన విలుకాండ్రు సన్నద్ధులై వచ్చారు. ఇక్కడ దుర్యోధనుడు కనపడటంలేదు. గోవులను తీసికొని దక్షిణదిక్కుగా ప్రయాణిస్తూ ఉండవచ్చు. ప్రాణాలపై ప్రీతితో పారిపోతున్నా డనిపిస్తోంది నాకు. ఉత్తరా! అందువలన ఈ రథాలనన్నింటినీ వదిలి సుయోధను డెక్కడున్నాడో అక్కడికే రథాన్ని నడుపు. అక్కడే యుద్ధం చేద్దాం. మిగిలినవారితో యుద్ధం చేయటం నిష్ప్రయోజనం. సుయోధనుని ఓడించి గోవులను తీసికొని మరలివద్దాం.' అర్జునుడు ఆ రీతిగా ఆదేశించగానే ఉత్తరుడు ప్రయత్నపూర్వకంగా నిలిపి, పగ్గాలు బిగించి, కురుపుంగవులున్న దిక్కునుండి రథాన్ని మరలించి, దుర్యోధనుడు పోయిన దారివైపు గుఱ్ఱాలను నడిపించాడు.

ఎదురుగానున్న రథసేనను వదిలి, అర్జునుడు మరోదారి పట్టడం చూసి, అర్జునుని అభిప్రాయాన్ని గుర్తించిన కృపాచార్యుడు ఇలా అన్నాడు. 'అర్జునుడు దుర్యోధనుని వీడి మరెక్కడా నిలవాలను కోవటం లేదు. కాబట్టి మనం కూడా వేగంగా అర్జునుని వెంబడించాలి. అర్జును డీ సమయంలో తీవ్రకోపంతో ఉన్నాడు. ఇప్పుడితనిని ఒంటరిగా ఎదిరించడం సహస్రాక్షుడైన ఇంద్రునకో, కృష్ణునకో, ద్రోణునకో తప్ప మరొకరికి సాధ్యం కాదు. ఆచార్యునకైనా అశ్వత్థామ తోడు కూడినప్పుడే. ఈ గోవులూ, విస్తారమైన ఈ ధనమూ మనకు ఏం సాధించి పెట్టగలవు. అర్జును డనే నీటిలో దుర్యోధనుడు పాత ఓడలా మునిగిపోబోతున్నాడు.'

అలా అర్జునుడు దుర్యోధనుని సమీపించి, తన పేరు వినిపించి, వెంటనే ఆ సేనపై మిడతలదండులా బాణవర్షాన్ని కురిపించాడు. అర్జునుడు కురిపించిన ఆ బాణసమూహాలలో కౌరవసేనలు మునిగిపోయాయి. బాణాలతో కప్పబడని భూప్రదేశం

కానీ, గగనతలం కానీ వారికి కనిపించలేదు. కౌరవసేనలు రణరంగంలో కూలిపోతున్నాయి. అయినా వారికి పారిపోవాలన్న ఆలోచన కూడా కలగటం లేదు. కేవలం అర్జునుని చేతివేగాన్ని మాత్రమే మనసా అభినందిస్తున్నారు. ఆ తర్వాత అర్జునుడు శత్రువుల రోమాలు నిక్కబొడుచుకొనేటట్లు తన శంఖాన్ని పూరించాడు. ధనుష్టంకారం చేసి ధ్వజాన్ని అధివసించియున్న భూతాలను ప్రేరేపించాడు. అర్జునుని శంఖనాదంతో, రథఘోషతో, గాండీవ టంకారంతో, ధ్వజంపై నున్న భూతాల కోలాహలంతో భూమి కంపించింది. గోవులు తోకలను పైకెత్తికొని అంబారవాలు చేస్తూ దక్షిణదిక్కుగా మరలసాగాయి.

54. కర్ణార్జునులయుద్ధము - కర్ణుడు ఓడి పారిపోవుట.

అర్జునుడు తీవ్రవేగంతో శత్రుసేనను పారద్రోలి గోవులను స్వాధీనం చేసికొన్నాడు. కానీ మరలా యుద్ధం చేయాలనే కోరికతో దుర్యోధనునికి ఎదురుపోయాడు. గోవులు వేగంగా మత్స్యరాజధాని వైపు ప్రయాణించటాన్ని చూసిన కురువీరులు అర్జునుడు గోవులను మరలించి, దుర్యోధనుని కెదురుపోతున్నాడని గ్రహించి, వెంటనే అక్కడకు వచ్చిపడ్డారు. దట్టంగా మోహరించి, ధ్వజపతాకాలతో ప్రకాశిస్తున్న కౌరవుల సేనాసమూహాలను చూసి శత్రుసంహర్త అయిన అర్జునుడు ఉత్తరునితో 'రాజకుమారా! బంగారుపగ్గాలు కూర్చిన ఈ నా తెల్లగుఱ్ఱాలను నీవు వెంటనే ఇక్కడ నుండి దారి మళ్ళించు. సంపూర్ణ వేగంతో దుర్యోధనునిసేనలను సమీపించేటట్లు ప్రయత్నం చేయి. ఇటు చూడు. ఏనుగు ఏనుగుతో తలపడటానికి సిద్ధపడినట్లు దురాత్మకు డైన కర్ణుడు నాతో తలపడటానికి సిద్ధపడుతున్నాడు. దుర్యోధనుని చెడుప్రాపుతో అహంకరిస్తున్న ఆ కర్ణుని వైపే రథాన్ని నడిపించు' అన్నాడు. అర్జునుని గుఱ్ఱాలు వాయువేగం కలవి, పెద్దవి. వాటి జీనుల అంచులలో బంగారుకుచ్చులున్నాయి. అటువంటి గుఱ్ఱాలతో ఉత్తరుడు ఆ రథికుల సేనను చీల్చి అర్జునుని రణభూమిమధ్యకు చేర్చాడు. అంతలో మహారథులైన చిత్రసేనుడు, సంగ్రామజిత్తు, శత్రుసహుడు, జయుడు ఒక్కటై విపారాలనే పేరుగల బాణాలను వర్షిస్తూ కర్ణునకు తోడుగా అర్జునుని ఎదుట నిలిచారు. అప్పుడు కురుశ్రేష్ఠ డైన అర్జునుడు ధనుస్సే అగ్నిగా, శరవేగమే మంటగా దావాగ్ని వనాన్ని తగులబెట్టినట్లు ఆ కురుపుంగవుల రథాలను

తగులబెట్టాడు. అలా ఘోరమైన యుద్ధం జరుగుతుండగా కురువీరుడైన వికర్ణుడు ఉగ్రమైన విషతబాణవర్షాన్ని కురిపిస్తూ రథంతో అతిరథుడైన అర్జునుని ఆక్రమించాడు. అప్పుడు అర్జునుడు బంగారు అంచులతో మెరుగు దిద్దబడి గట్టి అల్లెత్రాడు గలిగిన వికర్ణుని ధనుస్సును విరిచి, అతని ధ్వజాన్ని ముక్కలు చేసి పడగొట్టాడు. రథధ్వజం విరిగిపోగానే వికర్ణుడు వేగంగా పారిపోయాడు.

శత్రుసేనాసమూహాలను పీడిస్తూ అమానుష పరాక్రమాన్ని ప్రదర్శిస్తున్న అర్జునుని చూసి, దాన్ని సహింపక బాణవర్షంతో అర్జునుని ముంచెత్తుతూ శత్రుంతపుడు ఎదిరించాడు. కౌరవసేనలోనికి చొచ్చుకొనిపోయి విహరిస్తున్న అర్జునుడు అతిరథుడైన శత్రుంతపుని బాణాల తాకిడికి గాయపడి అయిదుబాణాలతో అతనిని, పదిబాణాలతో అతని సారథిని కొట్టాడు. అప్పుడు భరతశ్రేష్ఠుడైన అర్జునుని బాణం శత్రుంతపుని కవచాన్ని చీల్చి, శరీరాన్ని తాకింది. ఆ దెబ్బతో ప్రాణాలు కోల్పోయిన శత్రుంతపుడు గాలిచే పెకలింపబడి కొండశిఖరంనుండి కూలిన చెట్టువలె యుద్ధభూమిలో పడిపోయాడు. నరశ్రేష్ఠుడు, వీరవరుడు అయిన అర్జునునిచే దెబ్బతిన్న కౌరవసేనలలోని వీరులు ప్రళయకాలంలో ప్రచండవేగంగల గాలికి మహావనాలు కదలిపోయినట్లు కంపించి పోయారు. సుందరమైన వేషాలు గలిగిన ఎందరో వీరశ్రేష్ఠులు అర్జునుని దెబ్బతిని, ప్రాణాలు కోల్పోయి, రణభూమిలో దీర్ఘనిద్రపోయారు. (ఇంద్రసమానమైన పరాక్రమం, దానశీలమూ గల మరెందరో వీరులు ఇంద్రసుతుడైన అర్జునునిచే యుద్ధంలో ఓడింపబడ్డారు. ఆ కౌరవసేనలో కొందరు బంగారు కవచాలను, మరికొందరు ఇనుపకవచాలను ధరించిన వారు. వారు రణభూమిపైబడి హిమాలయ ప్రదేశంలోని పెద్ద ఏనుగులవలె కన్పడ్డారు. ఆ రీతిగా శత్రుసంహారం చేస్తున్న మహాపురుషుడు గాండీవి గ్రీష్మర్తువులో అగ్ని మొత్తం అరణ్యాన్ని దహిస్తున్నట్లు యుద్ధభూమిలో అన్ని దిక్కులా, అన్ని మూలలా విహరించాడు. వసంతర్తువులో రాలిపడిన ఆకులను, మేఘాలను గాలి చెదరగొట్టినట్టు అతిరథుడైన అర్జునుడు రణరంగంలో శత్రువులను చెదరగొట్టుతూ విహరించాడు. కర్ణసోదరుడైన సంగ్రామజిత్తు యొక్క ఎట్టని గుఱ్ఱాలను చంపి స్థిరచిత్తంతో అర్జునుడు మరొక్క బాణంతో వాని తలను కూడా త్రుంచాడు. తనసోదరుడు సంగ్రామజిత్తు మరణించగానే సూత పుత్రుడు కర్ణుడు రెచ్చిపోయి రెండు కొండశిఖరాలను ఢీకొన్న ఏనుగులాగా, ఆబోతుపై దూకిన పులిలాగా

ఉత్తరార్జునులపై కురికాడు.

ఆ కర్ణుడు పండ్రెండు వాడిబాణాలతో వేగంగా అర్జునుని గాయపరిచాడు. అన్నిగుఱ్ఱాల శరీరాలకు గాయాలు చేశాడు. ఉత్తరుని చేతిని కూడా గాయపరిచాడు. వేగంగా మీదికి వస్తున్న కర్ణుని చూసి అర్జునుడు కూడా వేగంగా ఎదురునిలిచి, చిత్రమైన రెక్కలుగల గరుత్మంతుడు పామును పట్టుకొన్నట్లు ఒక్క ఊపున కర్ణునిపై పడ్డాడు. కర్ణార్జును లిరువురూ విలుకాండ్రలో శ్రేష్ఠులు. మహాబలులు. శత్రువుల నెందరినైనా ఎదిరించి నిలువ గలవారు. ఆ ఇరువురి పోరును గురించి విని, దాన్ని చూడగోరి, కౌరవులంతా స్తబ్దంగా నిలిచారు. అప్పుడు అర్జునుడు కోపం పెచ్చరిల్లి, తమపట్ల తప్పుచేసియున్న కర్ణుని చూసి ఆనందించి, క్షణంలో తీవ్రబాణవృష్టితో అశ్వరథసారథులతో సహా కర్ణుని ముంచెత్తాడు. ఆ తరువాత కౌరవసేనలు రథగజాలతో పాటు దెబ్బతిని ఆక్రోశింపసాగాయి. అర్జునుని బాణాలలో మునిగిపోయి రథాశ్వాలతో సహా భీష్మాది యోధులు కూడా కనబడటం లేదు. అప్పుడు మహాత్ముడైన ఆ కర్ణుడు అర్జునుని బాహువుల నుండి వెలువడిన బాణాలను బాణ సమూహాలతో ఖండించి, బాణధనుర్ధారియై నిలిచి, నిప్పుతోకూడిన అగ్నిలాగా ప్రకాశించాడు. ఆ తరువాత కర్ణుడు తన అల్లెత్రాటిని పునఃపునః లాగి ధ్వనింపజేశాడు. దానితో కర్ణుని ప్రశంసిస్తూ కౌరవులు చేసిన కరతాళధ్వనులు శంఖ, భేరీ, పణవ నాదాలతోపాటు విస్తరించాయి.

అర్జునుని రథధ్వజంపైనున్న ఆంజనేయుని తోక పతాకంలా ప్రకాశిస్తోంది. ధ్వజాగ్రంలోని భూతాలు భయంకరంగా నినదిస్తున్నాయి. ఆ ధ్వనికి తోడు గాండీవ ధనుష్టంకారం పిడుగుపాటులా వినిపిస్తోంది. అటువంటి కిరీటిని చూచి కర్ణుడు సింహనాదం చేశాడు. అర్జునుడు కూడా అశ్వ సూత రథాలతోపాటు కర్ణుని బాణాలతో పీడించి; భీష్మపితామహునీ, ద్రోణకృపులనూ చూస్తూ కర్ణునిపై బాణ వర్షం కురిపించాడు. ఆ కర్ణుడూ మేఘంలాగా అర్జునునిపై బాణవృష్టిని కురిపించాడు. అదే విధంగా అర్జునుడూ వాడియైన బాణాలతో కర్ణుని కప్పివేశాడు. ఆ విధంగా కర్ణార్జునులు మిక్కిలి వాడియైన శరసమూహాలను ఒకరిపై ఒకరు గుప్పించుకొంటూ శరప్రవాహాలతో యుద్ధాన్ని పెంచసాగారు. తమతమ రథాలపై నున్నవారిద్దరూ మేఘాలమాటున ప్రకాశించే సూర్యచంద్రుల్లా కనిపించారు. కర్ణుడు అర్జునుని పరాక్రమాన్ని

సహించలేక పోయాడు. అతడు వేగంగా బాణాలు ప్రయోగించ గల తన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ అర్జునుని గుఱ్ఱాలను నాలుగింటిని గాయపరిచాడు. మూడు బాణాలతో సారథిని గాయపరిచాడు. వెంటనే మరో మూడు బాణాలతో ధ్వజాన్ని ధ్వంసంచేశాడు. కురుశ్రేష్ఠుడు, గాండీవధారి, జయశీలుడు, శత్రుపీడాకరుడు నైన అర్జునుని కర్ణుడు గాయపరిచాడు. అది నిదురిస్తున్న సింహాన్ని లేపినట్లు అయింది. దానితో అర్జునుడు సూటిగా శత్రువులను తాకే బాణాలతో కర్ణుని సమీపించాడు. కర్ణుని బాణాస్త్రవృష్టిచే దెబ్బతిన్న అర్జునుడు అమానుష పరాక్రమాన్ని ప్రదర్శించాడు. సూర్యుడు తన కిరణాలతో లోకాలను కప్పివేసినట్లు అర్జునుడు బాణాలతో కర్ణరథాన్ని కప్పివేశాడు. అప్పుడు అర్జునుడు దెబ్బతిన్న ఏనుగువలె విజృంభించి తన అమ్ములపొదినుండి వాడియైన బాణాలను తీసి, ఆకర్ణాంతం వింటినారిని లాగి సూతపుత్రుని శరీరాన్ని గాయపరిచాడు. యుద్ధంలో శత్రువుల పీచమణచగల అర్జునుడు గాండీవం నుండి వెలువడి వజ్రాయుధంలా ప్రకాశించే బాణాలతో ఆ కర్ణుని బాహువులను, తొడలను, శిరస్సును నుదుటిని, మెడను గాయపరిచాడు. అర్జునుడు విడిచిన బాణాలచే గాయపడిన ఆ కర్ణుడు ఏనుగుచేత ఓడింపబడిన మరొక ఏనుగులాగా రణరంగాన్ని వీడి పారిపోయాడు.

55. అర్జునుడు కృపాచార్యునితో యుద్ధము చేయుట.

కర్ణుడు పారిపోగా దుర్యోధనాది కౌరవయోధులు తమతమ సేనలతో మెల్లగా అర్జునునివైపు నడవసాగారు. మహాసముద్రవేగాన్ని చెలియలికట్ట అడ్డగించినట్లు, వ్యూహాత్మకంగా అనేక భాగాలుగా, బాణవర్షం కురిపిస్తూ మీదికి వస్తున్న కౌరవసేన వేగాన్ని అర్జునుడు ఆపగలిగాడు. అప్పుడు శ్వేతవాహనుడైన అర్జునుడు నవ్వి, దివ్యాస్త్రాలను ప్రయోగిస్తూ కౌరవసేనను సమీపించాడు. సూర్యుడు కిరణాలతో భూమిని కప్పివేసినట్లు అర్జునుడు గాండీవంనుండి వెలువడిన బాణాలతో పది దిక్కులనూ కప్పివేశాడు. కౌరవసేనలోని రథాలు, గుఱ్ఱాలు, ఏనుగులు, వాటి నధిరోహించిన సైనికులు, వారి కవచాలు- అన్నింటిలో అర్జునుని వాడిబాణాలు నాటని చోటు రెండు అంగుళాలు కూడా లేదు. అర్జునుని దివ్యాస్త్రప్రయోగాన్నీ, ప్రయోగ క్రమాన్నీ, పరాక్రమాన్నీ, వేగాన్నీ, దూసుకొనిపోయే స్వభావాన్నీ, ఉత్తరుని

అశ్వశిక్షణ, రథసంచాలనాలలోని కౌశలాన్నీ చూసి శత్రువులు సైతం కొనియాడారు.

అర్జునుడు సమస్తలోకాలను దహించివేసే ప్రళయ కాలాగ్ని వలె శత్రువులను దహించసాగాడు. మండిపడే నిప్పులా కనిపిస్తున్న ఆ అర్జునుని శత్రువులు కనీసం చూడలేకపోయారు. అర్జునుని బాణాలచే కప్పివేయబడిన ఆ కౌరవ సేనలు కొండదగ్గర సూర్యకిరణాలు సోకిన మేఘ సమూహంలా ప్రకాశించాయి. అర్జునుని బాణాలచే గాయపరచబడిన ఆ కౌరవసేనలు వివిధపుష్పాలతో ఆవరింపబడిన అశోకవనాలవలె ప్రకాశించాయి. అర్జునుని బాణాల తాకిడిచే ఛిన్నభిన్నాలైన మాలలనుండి రాలిపడుతున్న బంగారు సంపెంగ పూలను, గొడుగులను, పతాకలను గాలి ఆకాశమందే పట్టి నిలిపింది.

అర్జునుడు శత్రురథాలను ఖండిస్తే, తమరథికులు భయపడటంతో తామూ భయపడిన గుఱ్ఱాలు కాడి విరిగిపోగా మిగిలిన రథ భాగాలను మీదికెత్తికొని పారిపోయాయి. అప్పుడు అర్జునుడు యుద్ధంలో ఏనుగులను చెవులలో, కాళ్ళ సందుల్లో, దంతాల్లో, దౌడలపై, మర్మస్థానాల్లో కొట్టి నేలపై పడగొట్టాడు. కౌరవసేనాముఖమందలి ఏనుగులు ప్రాణాలు కోల్పోయి పడిపోయాయి. మేఘాలు ఆకాశాన్ని కప్పినట్టు క్షణకాలంలోనే భూమి ఏనుగుల శరీరాలతో కప్పబడింది. ప్రళయకాలంలో జ్వలిస్తున్న అగ్ని స్థావరజంగమరూపమైన ఈ సమస్త ప్రపంచాన్నీ దహించినట్టు అర్జునుడు యుద్ధంలో శత్రువులను దహించివేశాడు!

ఆ తర్వాత అర్జునుడు తన సమస్త్రాస్త్రాల తేజస్సుచేత, ధనుష్టంకారం చేత, ధ్వజాన్ని అధిష్ఠించి ఉన్న భూతాలు చేస్తున్న అమానుషధ్వనుల చేత, భయంకరంగా బొబ్బలుపెడుతున్న వానరధ్వనిచేత, శంఖధ్వనిచేత అడవిలాంటి దుర్యోధనసేనలో తీవ్రభయాన్ని కల్గించాడు. అర్జునుడు శత్రువుల రథబలాన్ని ముందే నేల గూల్చాడు. అసమర్థులైన వారిని సంహరించటం తగదన్న భావంతో అక్కడనుండి బయటపడ్డాడు. కాని వారు మరలా యుద్ధసన్నద్ధులు కావటంతో మరల వేగంగా వారిని సమీపించాడు. అర్జునుని ధనుస్సునుండి వెలువడిన మిక్కిలి వాడియైన బాణాలు రక్తపానం చేసే పక్షులవలె గగనతలమంతా ఆక్రమించాయి. రాజా ! వాడియైన తేజస్సుగల సూర్యకిరణాలు ఒక పాత్రలో ఇమడనట్లు లెక్కకు మిక్కిలి అయిన అర్జున బాణాలు దిక్కులు పట్టకున్నాయి. శత్రుసేనలు తమవైపు వస్తూ అర్జునుని రథాన్ని ఒక్కసారి

మాత్రమే చూడగలిగాయి. రెండవ మారు వారికి ఆ అవకాశం లభించటం లేదు. అంతలోనే గుట్టలతోపాటు వారిని అర్జునుడు అక్కడనుండి పరలోకానికి పంపుతున్నాడు. అర్జునుడు ప్రయోగించిన బాణాలు శత్రువుల శరీరాలలో ఇమడలేదు. శరీరాలను ఛేదించుకొని బయటకు వచ్చాయి. అదే విధంగా అర్జునునిరథం శత్రుసేనలలో ఇమడలేదు. శత్రుసేనను చీల్చి దూసుకొని పోయింది. లెక్కకు మించిన పడగలు గల నాగరాజు మహా సముద్రంలో ఆడుతూ సముద్రం కలచివేసినట్లు అర్జునుడు శత్రుబలాన్ని అలవోకగా కలచివేశాడు. అర్జునుడు బాణప్రయోగం చేస్తూ ఉండగా గాండీవ ధనుస్సు నుండి తీవ్రంగా ధనుష్టంకారం వినవస్తోంది. ప్రాణులు పూర్వం ఎప్పుడూ వినని ఆ ధ్వని ఇతరశబ్దాల నన్నింటినీ మించి ఉంది. అర్జునుని బాణాలు శత్రువుల ఏనుగుల శరీరాలపై అణువణువునా గ్రుచ్చుకొన్నాయి. దానితో అవి సూర్యకిరణాలు ఆవరించిన మేఘాల మాదిరిగా కనిపించాయి.

అర్జునుడు(కవ్వడి కాబట్టి)కుడి ఎడమ చేతులతో అన్ని దిక్కులకు బాణాలను గుప్పిస్తున్నాడు. దానితో రణరంగంలో అర్జునుని ధనుస్సు ఎప్పుడూ చక్రాకారంలో కనిపించింది. కంటిచూపు రూపరహిత పదార్థాలపై ఎప్పుడూ పడదు. అట్లే అర్జునుని బాణాలు కూడా తాను గురిపెట్టని ఎవ్వరిమీదనూ పడటం లేదు. గుంపుగా అడవిలో నడుస్తున్న వేల ఏనుగుల మార్గం ఏరీతిగా ఉంటుందో అదే విధంగా అర్జునుని రథమార్గం కన్పట్టింది. అర్జునుని గెలుపు కోరుతున్న ఇంద్రుడే దేవతలందరి సహకారంతో తమను చంపుతున్నట్లుగా అర్జునునిచే పడిన శత్రువులు భావించారు. శత్రువులను లెక్కకు మిక్కిలిగా చంపివేస్తున్న అర్జునుని చూసి సాక్షాత్తు యమధర్మరాజే అర్జునరూపంలో తమను చంపుతున్నట్లు ప్రజలు భావించారు. ధాన్యపుకంకులను త్రుంచినట్టు అర్జునుడు శత్రువుల తలలు త్రుంచసాగాడు. వారి పరాక్రమాలు అర్జున భయంతో వ్రాలిపోసాగాయి. అర్జునశత్రువు లనే అడవులు అర్జునుడనే గాలికి విరిగి, నెత్తుటిధారలతో నేలకొరిగి భూమిని ఎఱ్ఱ బరిచాయి. నెత్తుటితో తడిసి గాలికి పైకెగసిన దుమ్ములన గగనతలంలో సూర్యకిరణాలు మరీ ఎఱ్ఱబడ్డాయి. సూర్యుడు ఉండగానే సంధ్యాకాలంలో వలె ఆకాశం ఎఱ్ఱబారింది. అస్తమించిన సూర్యుడైనా తన కర్తవ్యానికి దూర మవుతాడేమో కానీ అర్జునుడు మాత్రం శత్రుపీడన నుండి వెనుకకు మరల లేడు. ఊహింపవీలుగాని స్వభావంకలిగి, శూరుడయిన

అర్జునుడు పౌరుషంతో రణరంగంలో నిలిచిన ఆ విలుకాండ్రందరిని తన దివ్యాస్త్రాలతో ఆక్రమించాడు. అర్జునుడు వాడియైన బాణాలు డెబ్బది మూడింటితో ద్రోణుని, పదింటితో దుస్సహుని, ఎనిమిదింటితో అశ్వత్థామను, పండ్రెండింటితో దుశ్శాసనుని, మూడింటితో కృపుని, అరువదింటితో భీష్ముని, నూరింటితో దుర్యోధనుని కొట్టాడు. శత్రు సంహారకుడైన ఆ అర్జునుడు ఒక బాణంతో కర్ణుని గూబమీద కొట్టాడు. సర్వాస్త్రకోవిదుడై గొప్పవిలుకాడైన ఆ కర్ణుడు సూతుడూ, గుఱ్ఱాలూ చనిపోగా, విరథుడై దెబ్బతిని యుండగా సేన అంతా చెదరిపోయింది.

అలా చెదరిపోయిన కౌరవసేననూ, ఇంకా రణరంగ మందే నిలిచియున్న అర్జునునీ చూసి అభిప్రాయ మెరిగిన ఉత్తరుడు "జయశీలీ ! నా సారథ్యంలో అందమైన రథంపై నిలిచిన నీవు ఏ వీరునినైపు వెళ్లా లనుకొంటున్నావు? ఆదేశిస్తే అటే రథాన్ని నడుపుతాను" అన్నాడు. అర్జునుడిలా అన్నాడు. 'ఉత్తరా ! ఎఱ్ఱని గుఱ్ఱాలు, నల్లని పతాకగల రథంపై పులితోలు కప్పుకొని సుఖంగా కూర్చొనియున్న మహాపురుషుని చూస్తున్నావు గదా! ఆయన కృపాచార్యుడు. శ్రేష్ఠమైన సేనను నడుపుతున్నాడు. అటువైపు మన రథాన్ని నడిపించు. విలుకాడైన ఆయనకు నా బాణవేగాన్ని చూపిస్తాను. ధ్వజంపై అందమైన బంగారు కమండలువు గల ఆయనే శస్త్రధరులలో మేటి అయిన ద్రోణాచార్యుడు. ఆ ద్రోణాచార్యుడు నాకే గాదు శస్త్రధారు లందరకూ పూజనీయుడు. ప్రసన్నుడైన ఆ మహావీరునకు ప్రదక్షిణంగా మన రథాన్ని నడుపు. ఇప్పుడే ఈయనను పూజించి యుద్ధసన్నద్ధుడవై రథంపై నిలు. ఇది సనాతన ధర్మం. ద్రోణుడు నా శరీరాన్ని కొట్టినతరువాత నేను ఆయనను కొడతాను, అప్పుడది ఆయనకు కోపకారణంకాదు. ఆ ద్రోణాచార్యునకు అల్లంతదూరంలో రథ పతాకపై విల్లున్నవాడే మహారథుడైన అశ్వత్థామ, ద్రోణుని కుమారుడు. ఆయన సదా నాకూ, శస్త్రధారు లందరకూ పూజనీయుడు. ఆయన రథాన్ని సమీపిస్తే నీవు మరల మరల వెనుదిరుగవలసి ఉంటుంది. రథసేనమధ్యలో బంగారు కవచం ధరించి యుద్ధ సన్నద్ధమై అలుపెరుగని సేనతో నిలిచియున్న వాడు అడుగో సువర్ణమయకేతనంగల ధ్వజంపై నాగచిహ్నం గలవాడు ఆయనే ధృతరాష్ట్రసుతుడు, శ్రీమంతుడు అయిన సుయోధనమహారాజు.

వీరా! శత్రురథాలను ముక్కలు చేయగల ఈ నీ రథాన్ని సుయోధనునకు

అభిముఖంగా నడిపించు. ఈ రాజు శత్రువులను మథించే యుద్ధోన్మాదం గలవాడు. వేగంగా అస్త్రాలను ప్రయోగించటంలో సుయోధనుడు ద్రోణశిష్యులలో అగ్రగణ్యుడు. ఈ నాటి యుద్ధంలో వేగంగా అస్త్రప్రయోగం చేసే కళను ఈయనకు రుచిచూపిస్తాను. ధ్వజాగ్రంపై అందమైన నాగకక్ష గుర్తు గలవాడు కర్ణుడని నీకు ముందే తెలుసునుగదా! దురాత్మకుడైన ఈ కర్ణుని రథాన్ని సమీపించి సావధానంగా నిలు. ఇతడెప్పుడూ యుద్ధంలో నాతో పోటీపడుతుంటాడు. నల్లనిరంగుతో అయిదు నక్షత్రాల గుర్తుతో ప్రకాశిస్తున్న ధ్వజం, చేతితొడుగులు, పెద్దధనుస్సు గలిగి రథంపై నిలిచియున్నవాడు; నక్షత్ర సూర్య చిహ్నాలతో చిత్రితమైన ధ్వజం, తలపై తెల్లని గొడుగులతో రథంపై నిలిచి యున్నవాడు; నానావిధ ధ్వజపతాకలు గల రథ సమూహంలో మేఘాలముందు సూర్యునివలె అగ్రభాగాన నిలిచి, సూర్య చంద్ర సమాన మైన బంగారు కవచం, బంగారు శిరస్త్రాణం ధరించి నామనస్సును తపింపజేస్తున్న వాడు అడుగో ఆయనే శంతనుకుమారుడు భీష్ముడు. మాకందరకును పితామహుడు. రాజాశ్రయంలో నున్నవాడు, సుయోధనుని మాట మేరకు నడుచుకొనేవాడు. ఈయన నా మార్గానికి అడ్డురాడు. కాబట్టి తర్వాత ఈయనకు ఎదురేగవచ్చు. ఈయనతో యుద్ధం చేస్తున్న సమయంలో సావధానంగా గుఱ్ఱాలను అదుపు చేసుకోవాలి.' ఆ మాటలు విన్న ఉత్తరుడు సావధానుడై యుద్ధసన్నద్ధుడై యున్న కృపుని దగ్గరకు అర్జునుని కొనిపోయాడు.

56. కృపార్జునుల యుద్ధమును చూచుటకు దేవతలు వచ్చుట.

కౌరవసేనలు వేసవికాలం చివరలో చల్లనిగాలులతో కూడిన మేఘాలవలె మెల్లమెల్లగా ముందుకుసాగాయి. ఆశ్వికసేన సన్నద్ధమై దగ్గరగా వచ్చి నిలిచింది. మావటివాండ్రు తోమరాంకుశాలతో నడుపుతున్న ఏనుగులు విచిత్రమైన కవచాలతో భయంకరంగా ప్రకాశించాయి. అప్పుడు దేవేంద్రుడు విశ్వేదేవుల, అశ్వినుల, మరుత్తుల సముదాయంతో ఇతరదేవతలతో సహా విమానమెక్కి శత్రుసేనలు మోహరించియున్న ఆ చోటికి వచ్చాడు. దేవతలతో, యక్షులతో, గంధర్వులతో నాగులతో గూడిన ఆ సముదాయం గగనం వీడి పడిన గ్రహమండలం వలె ప్రకాశించింది. కృపార్జునులు ఎదురెదురు నిలిచి, భయంకరంగా యుద్ధంచేస్తూ సేనలపై ప్రయోగిస్తున్న తమతమ పేరగల అస్త్రాల బలాలను చూడాలన్న కోరికతో దేవతలు తమతమ విమానాలతో

విడివిడిగా వచ్చారు. ఆ విమానాలన్నింటిలో దేవేంద్రుని విమానం సర్వోన్నతంగా ప్రకాశిస్తోంది. స్వేచ్ఛానుసారంగా ప్రయాణించే ఆ విమానం సర్వరత్నాలతో విరాజిల్లుతోంది. ఒకకోటి స్తంభాలు ఆ విమానాన్ని మోస్తున్నాయి. వాటిలో కొన్ని సువర్ణమయాలు, మరికొన్ని మణిరత్నమయాలు. ఆ విమానంలో ఇంద్రునితో పాటు ముప్పది ముగ్గురు దేవతలు, గంధర్వులు, రాక్షసులు, నాగులు, పితరులు, మహర్షులు; తేజస్సంపన్నులయిన రాజులు వసుమనుడు, బలాక్షుడు, సుప్రతర్దనుడు, అష్టకుడు, శిబి, యయాతి, నహుషుడు, గయుడు, మనువు, పురువు, రఘువు, భానుడు, కృశాశ్వుడు, సాగరుడు, నలుడు, కనిపించారు. అగ్ని, ఈశుడు, సోముడు, వరుణుడు, ప్రజాపతి, ధాత, విధాత, కుబేరుడు, యముడు, అలంబుషుడు, ఉగ్రసేనుడు మొదలయిన గంధర్వులు, గంధర్వరాజైన తుంబురుడు వారివారి ప్రమాణాలకు - స్థాయికి - తగినట్లుగా విమానాలలో ఆయా తావులలో ప్రకాశించారు. అర్జునునకు, కౌరవసేనకు మధ్య జరుగుతున్న యుద్ధాన్ని చూడాలని సమస్తదేవతలూ, సిద్ధులూ, మహర్షులూ వచ్చి చేరారు.

జనమేజయా! వసంతఋతుప్రారంభంలో పూలతోటల పరిమళం అన్ని దిక్కులలో వ్యాపించినట్లు దేవతల పూలమాలల పుణ్యగంధం అన్ని వైపులా ప్రసరించింది. ఆ విమానాలలో కూర్చొనియున్న దేవతల రత్నాలు, గొడుగులు, వస్త్రాలు, మాలలు, వింజామరలు చక్కగా కనిపిస్తున్నాయి. భూమిపై ధూళి అణగిపోయింది. సమస్త వస్తువుల పైనా కాంతి ప్రసరించింది. దివ్యపరిమళాలను కలుపుకొని వాయువు వీరులను సేవించింది. దేవతలను తీసికొని వచ్చిన విమానాలు కొన్ని నిలిచి ఉన్నాయి. మరికొన్ని ఎగురుతున్నాయి. అనేక రత్నాల కాంతులతో ప్రకాశిస్తున్న వాటివలన ఆకాశం విచిత్రంగా అలంకరింపబడినట్లు కనిపించింది. ఆ విమానాలలోని దేవతలతో కూడి మహేంద్రుడు ప్రకాశిస్తున్నాడు. తామరల, కలువల దండలు దాల్చిన ఆ మహేంద్రుడు ఆ మహాసంగ్రామాన్ని ఎన్ని కళ్లతో, ఎంత చూచినా తృప్తి పొందటంలేదు.

57. కృపాచార్యుడు యుద్ధభూమినుండి తొలగుట.

మోహరించియున్న కౌరవసేనను చూసి అర్జునుడు ఉత్తరునితో ఇలా అన్నాడు. 'ఉత్తరా! కాంచనమయవేదిక ధ్వజపతాకపై ప్రకాశిస్తున్న వాడు శరద్వంతుని కొడుకు

కృపుడు. ఆయనకు దక్షిణంగా రథాన్ని నడిపించు.'

అర్జునుని మాటలు విని ఉత్తరుడు స్వర్ణాభరణాలు కలిగి వెండిలా ప్రకాశిస్తున్న ఆ గుఱ్ఱాలను అక్కడనుండి కదిలించాడు. గుఱ్ఱాలను వేగంగా నడపటంలోని పద్ధతిని మొత్తాన్ని క్రమంగా అనుసరించి ఉత్తరుడు కోపించినట్లు కనిపిస్తూ చంద్రునిలా ప్రకాశిస్తున్న గుఱ్ఱాలను అదిలించాడు. గుఱ్ఱాలను నడపటంలో నేర్పుగల ఆ ఉత్తరుడు వాయువేగంతో కురుసేనను సమీపించి మరలా వెనుకకు మరలించాడు. ప్రదక్షిణంగా మండలాకారంగా రథాన్ని త్రిప్పి, ఎడమవైపు నుండి చుట్టి వచ్చాడు. అశ్వగమనరహస్యాలు తెలిసిన ఉత్తరకుమారుడు తన రథగమనంతో కౌరవసేనను భ్రమకు లోనుజేశాడు. బలిష్ఠుడైన ఉత్తరుడు నిర్భయంగా కృపుని రథాన్ని సమీపించి, దానికి ప్రదక్షిణం చేసి,కృపున కెదురుగా నిలిచాడు. తరువాత అర్జునుడు భీకరధ్వనితో, శంఖాలలో ఉత్తమమయిన దేవదత్తాన్ని బలమంతా ఉపయోగించి పూరిస్తూ, ముందు తనపేరు వినిపించాడు. ఆ రణభూమిలో జయశీలి, పరాక్రమశాలి అయిన అర్జునుడు పూరించిన దేవదత్తధ్వని బ్రద్దలవుతున్న పర్వతధ్వని వలె భీకరంగా వినిపించింది. అర్జునుడు అంతగా పూరించినా నూరుముక్కలు కాకుండా నిలిచిన ఆ శంఖం గొప్పతనాన్ని కౌరవులు, వారిసైనికులు కూడా ప్రశంసించారు. స్వర్గలోకం దాకా వ్యాపించి తిరిగివచ్చి వినిపించిన ఆ శంఖధ్వని ఇంద్రుడు వదిలిన వజ్రాయుధం పర్వతం మీద పడినప్పుడు వినిపించే శబ్దంలా అనిపించింది.

కృపాచార్యుడు వీరుడు, బలపరాక్రమ సమన్వితుడు. ఆయనను ఓడించడం చాలా కష్టం. అర్జునుడు శంఖం పూరించిన తర్వాత కుపితు డయిన కృపాచార్యుడు అర్జునుని శంఖనాదాన్ని సహించలేకపోయాడు. అందుకే ఆ మహారథుడు యుద్ధం చేయాలన్న అభిలాషతో తన శంఖాన్ని వేగంగా పూరించాడు. రథిశ్రేష్ఠుడైన ఆ కృపాచార్యుడు తన శంఖనాదంతో మూడు లోకాలను చుట్టి వచ్చి, వింటిని తీసికొని, అల్లెత్రాటిని మీటి, గొప్పగా టంకారధ్వని చేశాడు. ఆ మహారథులిద్దరూ- అర్జున కృపాచార్యులు - మహాబలులు, సూర్యతేజస్సుకలవారు. యుద్ధసన్నద్ధులై ఇద్దరూ శరత్కాల మేఘాలవలె ప్రకాశించారు. అపుడు కృపాచార్యుడు మర్మభేదకాలైన పది వాడి బాణాలతో శత్రుసంహారకుడైన అర్జునుని తీవ్రంగా కొట్టాడు. అర్జునుడు కూడా లోకవిఖ్యాతమై తన పరమాయుధమైన గాండీవాన్ని లాగి మర్మభేదకాలైన

అనేకశరాలను ప్రయోగించాడు. కానీ అర్జునుడు ప్రయోగించిన నెత్తురు త్రాగే ఆ వాడిబాణాలను కృపాచార్యుడు వందలు, వేలు ముక్కలుగా నరికివేశాడు. అప్పుడు మహారథుడూ, సమర్థుడూ అయిన ఆ అర్జునుడు కోపించి బాణప్రయోగంలో చిత్ర పద్ధతులను ప్రదర్శిస్తూ, బాణాలతో దిక్కులనూ, విదిక్కులనూ (మూలలనూ) కప్పుతూ, ఆకాశమంతా ఒకే నీడ వ్యాపించినట్లు అంధకారబంధురం చేశాడు. లెక్కకందని బుద్ధిబలం కల ఆ అర్జునుడు వందల బాణాలతో కృపాచార్యుని ముంచెత్తాడు. అగ్నిజ్వాలల వంటి వాడిబాణాలతో పీడింపబడి కృపుడు క్రుద్ధు డయ్యాడు. సాటిలేని పరాక్రమంతో మహోత్ముడైన ఆ అర్జునుని కృపాచార్యుడు పది వేల బాణాలతో పీడించి వెంటనే సింహగర్జనం చేశాడు. అప్పుడు వీరుడైన అర్జునుడు నేర్పుగా, వేగంగా వంగిన కణుపులు, బంగారు పిడులు గల నాలుగుబాణాలను గాండీవం నుండి వెలువరించి, కృపాచార్యుని నాలుగు గుఱ్ఱాలనూ బాధించాడు. మండిపడుతున్న పాములవలె ఆ వాడి బాణాలు తాకి కృపుని గుఱ్ఱాలు ఒక్కసారిగా ఎగిరిపడ్డాయి. కృపుడు తన స్థానం నుండి జారిపోయాడు. తన స్థానం నుండి జారిన కృపాచార్యుని చూసి, ఆయన గౌరవాన్ని కాపాడే ఉద్దేశ్యంతో శత్రుసంహారకు డయిన అర్జునుడు బాణప్రయోగం చేయలేదు.

ఆ కృపాచార్యుడు మరల తన స్థానంలో కుదురుకొని పక్షి ఈకలు గల పది బాణాలతో సవ్యసాచిని వేగంగా కొట్టాడు. తరువాత అర్జునుడు ఒక వాడి భల్లంతో కృపాచార్యుని ధనుస్సును విరగగొట్టాడు. మరొక బాణంతో కృపుని చేతితొడుగును లాగివేశాడు. ఆపై అర్జునుడు మర్మభేదకాలైన వాడిబాణాలతో కృపాచార్యుని కవచాన్ని చీల్చివేశాడు. కానీ శరీరానికి దెబ్బ తగులనీయ లేదు. కవచం నుండి విడివడుతున్న ఆ కృపాచార్యుని శరీరం తగిన కాలంలో కుబుసాన్ని విడుస్తున్న పాము శరీరంలా ప్రకాశించింది. అర్జునుడు వింటిని విరిస్తే కృపుడు మరో వింటిని తీసికొని ఎక్కుపెట్టాడు. ఆ దృశ్యం అద్భుతంగా కనిపించింది. కౌంతేయుడు ఆ వింటిని కూడా వంగిన కణుపులు గల బాణంతో విరగగొట్టాడు. ఇలా శత్రుసంహారకుడైన అర్జునుడు ఎన్నో చాపాలను కృపాచార్యుడు అందుకొన్నదే తడవుగా విరిచివేశాడు. ఇలా విండ్లన్నీ విరిగిపోగా పరాక్రమశాలి అయిన కృపాచార్యుడు రథశక్తిని చేబట్టి మండుతున్న పిడుగులాగా అర్జునుని పైకి విసిరాడు. అంతట అర్జునుడు బంగారు అలంకరణతో

పెద్ద ఉల్కలా మీదికి వస్తున్న ఆ శక్తిని పది బాణాలతో ఆకాశమందే నరికివేశాడు. తెలివిగా ఆ అర్జునుడు వేసిన బాణాలతో అది పదిముక్కలై నేలగూలింది. కృపాచార్యుడు మరల వింటినెక్కు పెట్టి ఒక్క పెట్టుగా పది వాడిబాణాలతో అర్జునుని వేగంగా కొట్టాడు.

అంతట మహాతేజస్వి అయిన అర్జునుడు రణరంగంలో కోపించి ఉలులవలె వాడియై, అగ్నిలా మండుతున్న పదమూడు బాణాలను కృపాచార్యునిపై ప్రయోగించాడు. ఆపై అర్జునుడు ఒక బాణంతో కృపాచార్యుని కాడిని, నాల్గు బాణాలతో నాలుగు గుఱ్ఱాలనూ కొట్టాడు. ఆరవ బాణంతో సారథితలను దేహంనుండి వేరు చేశాడు. మూడు బాణాలతో రథంపైనున్న వెదురు బొంగులను, రెండు బాణాలతో ఇరుసును, మరొక బాణంతో కృపాచార్యుని ధ్వజాన్ని మహారథుడు ఖండించాడు. తరువాత దేవేంద్ర సమానుడైన ఆ ఫాల్గునుడు వజ్రంతో సమానమైన పదమూడవ బాణంతో అవలీలగా కృపాచార్యుని రొమ్ముపై కొట్టాడు.

ఇలా వింటినీ, రథాన్నీ, గుఱ్ఱాలనూ, సారథిని నష్టపోయిన కృపాచార్యుడు గదను చేపట్టి రథంపై నుండి దుమికి అర్జునునిపైకి గదను విసిరాడు. చక్కగా అలంకరింపబడిన ఆ పెద్ద గదను కృపాచార్యుడు విసరగా అర్జునుడు దానిని బాణాలతో త్రోసివేశాడు. అది వెనుదిరిగి వెళ్ళింది. కృపుడు క్రోధంతో నిండిపోయాడు. ఆయనను రక్షింపగోరిన కౌరవయోధులు రణభూమిలో అన్నివైపుల నుండి అర్జునునిపై బాణవర్షాన్ని కురిపించారు. ఉత్తరుడు గుఱ్ఱాలను అప్రదక్షిణంగా, యమక మండలంతో రథాన్ని నడుపుతూ కౌరవసేనను నిలువరించాడు. విరథుడైన కృపాచార్యుని ఆ నరవరు లంతా అర్జునునినుండి దూరంగా, వేగంగా కొనిపోయారు.

58. అర్జునుడు ద్రోణునితో యుద్ధము చేయుట.

కృపాచార్యుడు రణభూమినుండి తొలగింపబడిన తరువాత ఎట్టిని గుఱ్ఱాలతో, ఎదురులేని ద్రోణుడు ధనుర్బాణాలు చేత బట్టి, శ్వేతవాహనుడైన అర్జునుని మీదికి వచ్చాడు. బంగారురథాన్ని ఎక్కి, తన దగ్గరకే వస్తున్న ద్రోణాచార్యుని చూసి అర్జునుడు ఉత్తరునితో ఇలా అన్నాడు. 'సారథీ! నీకు శుభం కలుగుతుంది. రథధ్వజంపై ఎత్తయిన పతాకలపై ప్రకాశిస్తున్న కాంచనమయవేది గల రథమే ద్రోణాచార్యునిది.

ఆ సేనవైపు నన్ను నడుపు. సమస్త శిక్షణలలో నైపుణ్యం కలిగి, నిగనిగలాడే పగడాలవలె ఎఱ్ఱని ముఖాలు గలవి, అందమై,చక్కగా రథాన్ని లాగే, పెద్ద, ఎఱ్ఱని గుఱ్ఱాలు గల ఆ శ్రేష్ఠరథంపై నున్నవాడు ద్రోణాచార్యుడు. ఆయన దీర్ఘబాహువు, తేజస్వి, బలరూప సంపన్నుడు, పరాక్రమశాలి, లోకప్రసిద్ధుడుకూడా. ఆయన బుద్ధిలో శుక్రాచార్యుడు. నీతిలో బృహస్పతి. నాలుగు వేదాలు, బ్రహ్మచర్యం, ఉపసంహారవిధానంతో కూడ అన్ని దివ్యాస్త్రాలు, సమస్త ధనుర్వేద విద్య ఆయనలో స్థిరంగా ఉంటాయి. ఆ బ్రాహ్మణునిలో క్షమ, నిగ్రహం, సత్యం, కోమలత్వం, ఋజుత్వం - ఇంకా చాలా సుగుణాలు ఎప్పుడూ ప్రకాశిస్తూ ఉంటాయి. ఈ రణభూమిలో ఆ మహానుభావునితో యుద్ధం చేయాలని ఉంది. కాబట్టి ఉత్తరా ! రథాన్ని నడుపు. నన్ను వెంటనే ఆయన దగ్గరకు చేర్చు.' అర్జునుడు అలా అనగానే ఉత్తరుడు సువర్ణాభరణాలు గల ఆ అశ్వాలను ద్రోణుని వైపు నడిపించాడు.

వేగంగా తన మీదకు వస్తున్న రథికశ్రేష్ఠుడైన ఆ అర్జునుని చూసి మదపుటేనుగు మదపుటేనుగును డీకొన్నట్టు ద్రోణుడు ఎదిరించాడు. ఆ తరువాత వందల నగారాల ధ్వనితో సమాన మైన ధ్వని చేసే శంఖాన్ని ద్రోణుడు పూరించాడు. అది విని సేన మొత్తం పోటెత్తిన సముద్రంలా కలత పడింది. మనోవేగంగల అర్జునుని తెల్లనిగుఱ్ఱాలను ద్రోణుని ఎఱ్ఱని మేలిజాతి గుఱ్ఱాలు సమీపిస్తే రణభూమిలో నున్నవారంతా ఆశ్చర్యపోయారు. గురుశిష్యులయిన ద్రోణార్జునులు ఇరువురూ మహారథులు, పరాక్రమసంపన్నులు, అభిమానవంతులు, విలువిద్యలో నిష్ణాతులు కూడా. రణరంగంలో ఓటమినెరుగని వారిద్దరు ఎవరి రథంపై వారుండియే ఒకరినొకరు కొగిలించుకొన్నారు. ఆదృశ్యాన్ని చూసి కౌరవుల ఆ మేటిసేన పదే పదే వణికిపోయింది. తరువాత అర్జునుడు పరమానందపడి తన రథాన్ని ద్రోణాచార్యుని రథానికి దగ్గరగా తీసికొనిపోయి, నమస్కరించి, నవ్వుతూ సౌమ్యంగా, మధురంగా ఇలా అన్నాడు. 'అనఘా ! యుద్ధంలో తమరు ఎప్పుడూ దుర్జయులే. ప్రతీకారదృష్టితోనే మేము వనవాసం చేశాము. ఇప్పుడు యుద్ధానికి సిద్ధపడ్డాము. తమరు మాపై కోపింపవలదు. ముందుగా తమరు నన్ను కొట్టితే తరువాత తమరిని కొట్టాలని నా అభిమతం. కాబట్టి తమరే ముందు నన్ను కొట్టండి'. తరువాత ద్రోణాచార్యుడు అర్జునునిపై ఇరువది యొక్క బాణాలను ప్రయోగించాడు. కానీ అర్జునుడు వాటినన్నింటినీ ఎంతో నేర్పుగల వానివలె తన

దగ్గరకు చేరకముందే ఖండించాడు. అపుడు పరాక్రమశాలి అయిన ద్రోణుడు తన అస్త్రవిద్యానైపుణ్యాన్నీ, వేగాన్నీ ప్రదర్శిస్తూ అర్జునుని రథంపై వేయిబాణాలను కురిపించాడు. లెక్కలేని ఆత్మబలంగల ఆ ద్రోణుడు సాన పెట్టబడి, పక్షి ఈకలు గల బాణాలను వెండిలా మెరిసి పోతున్న అర్జునుని గుఱ్ఱాలపై అర్జునునిలో కోపం రగుల్కొల్పుతున్నట్టు ప్రయోగించాడు. ఈ విధంగా రణభూమిలో సమానస్థాయిలో ఒకరినొకరు మెరిసిపోతున్న బాణాలు ప్రయోగిస్తున్న ద్రోణార్జునుల మధ్య యుద్ధం జరిగింది. ద్రోణార్జును లిద్దరూ ప్రసిద్ధపరాక్రమవంతులు. ఇద్దరూ వాయువేగం గలవారు. ఇద్దరూ దివ్యాస్త్ర సంపన్నులు. ఇద్దరూ ఉత్తమ తేజస్సు గలవారు. ఆ ఇరువురూ బాణసమూహాలను ప్రయోగిస్తూ రాజులను మోహింప జేశారు. అక్కడ చేరిన యోధులంతా ఆశ్చర్యపడుతూ, వేగంగా బాణాలను వదలుతున్న ఆ ఇద్దరినీ 'భళీ భళీ' అని ప్రశంసించారు.

అనిమొనలో నున్న జనులందరూ "ద్రోణాచార్యునితో పోరాడటం అర్జునునకే చెల్లింది. క్షత్రియధర్మం చాలా క్రూరమైనది.అందుకే గురువుతో కూడా యుద్ధం చేయవలసిన పరిస్థితి ఏర్పడింది" అని అనుకొన్నారు. మహాభుజులైన ద్రోణార్జునులు కోపంతో దగ్గరై ఒకరినొకరు బాణసమూహాలతో కప్పి వేశారు. ఇద్దరిలో ఏ ఒక్కరూ ఓటమి నంగీకరించే వారు కాదు. ఆపై ద్రోణాచార్యుడు మిక్కిలి కోపించి బంగారు తొడుగుతో, ఇతరులకు పొందశక్యం కాని ధనుస్సు నెక్కుపెట్టి అర్జునుని గాయపరిచాడు. ద్రోణాచార్యుడు అర్జునుని రథంపై బాణాల వలను కప్పివేశాడు. అంతేగాక సానపెట్టబడి తేజస్సు గల బాణాలతో సూర్యకాంతిని సైతం కప్పివేశాడు. మేఘం పర్వతంపై కురిసిన రీతిగా మహారథుడు అయిన ద్రోణుడు వాడియై తీవ్ర వేగంగల బాణాలతో అర్జునుని గాయపరిచాడు. అదే విధంగా వేగశాలి అయిన అర్జునుడు పట్టరాని సంతోషంతో దివ్యమయిన గాండీవాన్ని ధరించి, స్వర్ణభూషితాలైన అనేక విచిత్రబాణాల వర్షాన్ని కురిపించాడు. పార్థుడు తన వింటి నుండి వెలువడిన శరవర్షంతో ద్రోణాచార్యుడు కురిపించిన బాణవర్షాన్ని నశింప జేశాడు. అది అద్భుతదృశ్యమైంది. రథంపై విహరిస్తున్న ధనంజయుడు అందరికీ చూడదగిన వాడయ్యాడు. అన్ని దిక్కులా ఒక్క మారుగా బాణవర్షాన్ని కురిపించి ఆకాశాన్ని అంతటా ఆవరించి అంధకారనిమగ్నం చేశాడు. ఆ సమయంలో మంచు కప్పినట్లై ద్రోణుడు కూడా కనిపించలేదు. బాణాలతో

కప్పబడిన అప్పటి ద్రోణుని శరీరం అన్ని వైపుల మండుతున్న పర్వతం వలె కనిపించింది.

రణరంగంలో రాణింపుగల ద్రోణుడు అర్జునుని బాణాలచే కప్పబడిన తనరథాన్ని చూసి, ఉఱుములా ధ్వనించే తనపరమాయుధాన్ని – శ్రేష్ఠధనుస్సును – అగ్నిచక్రంలాగా భయంకరంగా లాగాడు. అర్జునుడు ప్రయోగించిన బాణాలను దానితో రూపుమాపాడు. అప్పుడు తగులబడుతున్న వెదురుబొంగులేమో అన్నట్లు పెద్ద ధ్వని కలిగింది. ద్రోణుడు తన ధనుస్సునుండి వెలువడిన బంగారుబాణాలతో దిక్కులను, సూర్యకాంతిని కూడా కప్పివేశాడు. అప్పుడు బంగారుపిడులు, వంగిన కణుపులు గల బాణసమూహాలు ఆకాశంలో ఎన్నో కనిపించాయి. ద్రోణుని వింటినుండి పుంఖానుపుంఖంగా వెలువడుతున్న బాణాలు కలిసి ఆకాశంలో ఒకే పొడవైన బాణంలా కనిపించాయి. ఇలా ఆ ఇరువురు వీరులూ గొప్పవైన బంగారు బాణాలను విడువగా ఆకాశాన్ని ఉల్కలతో నింపిన ట్లయింది. గ్రద్ద ఈకలు, నెమలి ఈకలు గల ఆ ద్రోణార్జునుల బాణాలు శరత్కాలంలో నెమ్మదిగా సంచరిస్తున్న హంసల పంక్తులవలె శోభించాయి. మహానుభావులైన ఆ ద్రోణార్జునుల రోషపూర్ణమైన యుద్ధం ఇంద్ర వృత్రాసురుల సంగ్రామంలా భయంకరంగా కనిపించింది. రెండు ఏనుగులు ఎదురుపడి ఒకదానినొకటి దంతాల కొనలతో కొట్టుకొన్నట్టు ఆ ద్రోణార్జునులు వింటిని బాగుగా లాగి, విడిచిన బాణాలతో ఒకరినొకరు గాయపరచుకొన్నారు. క్రోధంతో నిండిన ఆ ద్రోణార్జునులు రణ రంగంలో మిక్కిలిగా శోభిస్తున్నారు. వారిరువురూ ఏరి, ఏరి వారి వారి దివ్యాస్త్రాలను ప్రయోగిస్తూ ధర్మబద్ధంగా యుద్ధం చేశారు.

తరువాత అర్జునుడు తన వాడిబాణాలతో ద్రోణుడు ప్రయోగించిన సానబట్టిన బాణాలను నివారించాడు. అర్జునుడు ప్రేక్షకులకు ధనుర్విద్యా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ అనేకబాణాలతో వెంటనే ఆకాశాన్ని కప్పివేశాడు. అర్జునుడు ఎదిరిని మట్టుపెట్టాలని కోరుతున్నప్పటికీ మేటి విలుకాడు, ఉత్తమగురువు అయిన ద్రోణుడు అర్జునుని నిలువరించి వంపుగల బాణాలతో అర్జునునితో ఆడుకొన్నాడు. ఆ సంకులసమరంలో దివ్యాస్త్రాలు కురిపిస్తున్న అర్జునుని అస్త్రాలను తన అస్త్రాలతో నివారిస్తూ, ద్రోణుడు యుద్ధం చేయసాగాడు. కోపించిన ఆ నరశ్రేష్ఠుల యుద్ధం పరస్పరం పోటీపడే దేవదానవుల యుద్ధంలా జరిగింది. ద్రోణుడు ఇంద్ర, వాయు, అగ్ని దేవతా సంబంధాలైన అస్త్రాలను ప్రయోగిస్తే అర్జునుడు వాటిని వదిలీ వదలకముందే తన అస్త్రాలతో

మాటిమాటికి అణిచి వేయసాగాడు. ఆ ద్రోణార్జునులు బాణవర్షంతో ఆకాశాన్ని అంధకారబంధురం చేశారు. అర్జునుడు విడిచిన బాణాలు దేహధారులపై పడుతూ పర్వతాలపై పడుతున్న వజ్రాయుధం వలె శబ్దం చేశాయి. అప్పుడు ఏనుగులు, రథికులు, గుఱ్ఱాలు నెత్తుటితో తడిసి, పుష్పించిన మోదుగు చెట్లవలె కనిపించాయి. ద్రోణార్జునుల ఆ యుద్ధంలో అర్జునుని బాణాల తాకిడిచే ఎందరో యోధులు మరణించారు. భుజకీర్తులు గల భుజాలెన్నో తెగి పడిపోయాయి. విచిత్ర వేషభూషలుగల మహారథులు పడిపోయారు. సువర్ణ ఖచితమైన కవచాలు, ధ్వజాలు నేలగూలాయి. ఇదంతా చూసి సైన్యమంతా భయంతో నిశ్చేష్టమై పోయింది. అక్కడ ద్రోణార్జునులు దృఢమైన ధనుస్సులను విదిలిస్తూ, ఒకరి నొకరు క్షీణింప జేస్తూ, బాణాలతో క్రమ్మి వేశారు. ద్రోణార్జునుల మధ్య సంకులసమరం జరిగింది. అది బలిచక్రవర్తి, ఇంద్రుల మధ్య జరిగిన సంగ్రామాన్ని తలపింప జేసింది. అంత ద్రోణార్జునులు ఇరువురూ ప్రాణాలను పణంగా పెట్టి జూదమాడినట్లు విండ్లను పూర్తిగా లాగి, వంగిన కణుపులు గల బాణాలతో ఒకరినొకరు చీల్చుకొన సాగారు.

అప్పుడు ద్రోణుని ప్రశంసిస్తున్న దేవతల పలుకులు ఆకాశం నుండి వినిపించాయి. "ద్రోణుడు ఇంతవరకూ అర్జునుని నిలువరించటమంటే దుష్కర కార్యాన్ని సాధించినట్లే. అర్జునుడు శత్రుమర్దనుడు, పరాక్రమశాలి, గట్టి పిడికిలి గలవాడు, ఎదిరింపరానివాడు. దేవ దానవులనూ, సమస్త మహారథులను సయితం ఓడించిన వాడు గదా!" ఆ రణరంగంలో అర్జునుని స్థైర్యాన్నీ, అస్త్రవిద్యా నైపుణ్యాన్నీ, హస్తలాఘవాన్నీ, దూరానికి బాణాలు విసిరే నేర్పరితనాన్నీ చూసి ద్రోణుడు కూడా ఆశ్చర్యపోయాడు. తరువాత ఆ రణభూమిలో కోపించిన అర్జునుడు తన దివ్యధనువైన గాండీవాన్ని ఎత్తి రెండు చేతులతో ఆకర్షించసాగాడు. మిడతల దండువలె మీద పడుతున్న ఆ అర్జునుని బాణవర్షాన్ని చూసి ఆశ్చర్య పోయిన సైనికులంతా "భళా,భళా" అని అర్జునుని అభినందించారు. అర్జునుని బాణాల మధ్య ప్రవేశించటానికి గాలికి కూడా వీలు కావటం లేదు. ఎప్పుడూ చేతిలో బాణాలు, ఎప్పుడూ శరసంధానాలు, ఎప్పుడూ బాణప్రయోగాలు. అర్జునుని ఆ కార్యక్రమంలో క్షణం కూడా అంతరం (వ్యవధానం) కనిపించలేదు. ఈ రీతిగా వేగంతో కూడిన అస్త్ర ప్రయోగాలతో కూడిన దారుణయుద్ధం జరుగుతుంటే అర్జునుడు, మరీ వేగంగా వివిధాస్త్రాలను ప్రకటింప జేయసాగాడు.

తరువాత వంగిన కణుపులు గల లక్ష బాణాలు ద్రోణాచార్యుని రథానికి దగ్గరగా ఒక్కసారిగా పడ్డాయి. ఆ విధంగా అర్జునుడు ద్రోణుని బాణాలతో ఆవరిస్తే సైన్యంలో గొప్ప కలకలం బయలు దేరింది. అర్జునుని శీఘ్రాస్త్రప్రయోగాన్ని ఇంద్రుడు అభినందించాడు. అక్కడకు వచ్చిన గంధర్వులు, అప్సరలు కూడా అర్జునుని ప్రశంసించారు. అప్పుడు అశ్వత్థామ పెద్ద రథికబృందంతో వెంటనే అర్జునుని చుట్టు ముట్టాడు. అశ్వత్థామ మహోత్సాహైన ఆ అర్జునుని పరాక్రమాన్ని మనసారా అభినందించాడు, తీవ్ర కోపాన్ని ప్రదర్శించాడు. అశ్వత్థామ కోపవశుడై, కురుస్తున్న మేఘంలాగా అర్జునునిపై వేలకొలదీ బాణాలను విడుస్తూ యుద్ధంలో అర్జునునికి ఎదురు నిలిచాడు. అప్పుడు అర్జునుడు తన రథాన్ని అశ్వత్థామ వైపుకు నడిపించి ద్రోణుడు తప్పుకొనటానికి అవకాశమిచ్చాడు. అర్జునుని దివ్య బాణాల తాకిడిచే బ్రద్దలైన కవచం, ధనుస్సు గల ఆ శూరుడు గాయపడి, అవకాశం దొరకగానే వెంటనే అక్కడనుండి జవనాశ్వాల రథంతో తొలగిపోయాడు.

59. అశ్వత్థామతో అర్జునుడు యుద్ధము చేయుట.

అటు తర్వాత అశ్వత్థామ రణంలో అర్జునుని ఎదిరించాడు. అర్జునుడు వర్షించే మేఘంలాగా ఘనమైన బాణ సమూహంతో వాయువేగంతో, తీవ్రరూపంతో వస్తున్న అశ్వత్థామను నిరోధించాడు. ఆ ఇద్దరి మధ్య దేవాసురసంగ్రామంలాగా ఘోర యుద్ధం జరిగింది. ఒకరిపై ఒకరు బాణసమూహాలను విసురుతూ ఆ ఇద్దరూ వృత్రాసుర దేవేంద్రులవలె కనిపించారు. వారి బాణసమూహంతో కప్పబడిన ఆకాశం అంతటా అంధకారబంధురమైంది. అప్పుడు సూర్యుడూ ప్రకాశించలేదు, గాలీ ప్రసరించలేదు. వెదురు బొంగులు మండుతున్న శబ్దం మిక్కుటమైంది. అర్జునుడు అశ్వత్థామగుఱ్ఱాలను గాయపరచి అల్పాయుర్దాయం గల వాటినిగా చేశాడు. మూర్ఛిల్లిన ఆ గుఱ్ఱాలకు దిక్కులుతోచడం లేదు. అప్పుడు మహాపరాక్రమశాలి అయిన అశ్వత్థామ రణరంగంలో విహరిస్తున్న అర్జునునిలోని చిన్న ఏమరుపాటును పసికట్టి చాకువంటి బాణంతో అర్జునుని వింటినారిని త్రెంచాడు. అమానుషమైన ఆయన చేష్టను చూసి దేవతలు అభినందించారు. మహారథులు ద్రోణ, భీష్మ, కర్ణ, కృపులు అశ్వత్థామ చేసిన పనిని 'భళా! భళా!' అని ప్రశంసించారు. ఆ తరువాత అశ్వత్థామ తన

వింటిని ఎక్కుపెట్టి కంక పత్రాలు గల బాణాలతో మరల అర్జునుని వక్షఃస్థలాన్ని గాయపరిచాడు. అపుడు బలశాలి అయిన అర్జునుడు పెద్దగా నవ్వి, కొత్తనారిని బలంగా గాండీవానికి తగిలించాడు.

ఆ తరువాత అర్జునుడు నుదుటిపైనున్న చెమటను తుడుచుకొని మదించిన గజరాజు మదించిన మరో గజంతో తలపడినట్లు అశ్వత్థామతో తలపడ్డాడు. లోకంలో అద్వితీయ వీరులయిన ఆ అర్జున అశ్వత్థామల మధ్య (ప్రేక్షకులకు) గగుర్పాటు కల్గేటట్లు భీకరయుద్ధం జరిగింది. తలపడిన గజరాజులవలె పోరాడుతున్న ఆ వీరులను కౌరవులంతా ఆశ్చర్యంతో చూశారు. పురుషశ్రేష్ఠులూ, మహావీరులూ అయిన ఇద్దరు సర్పాకృతితో మండిపడుతున్న బాణాలతో ఒకరినొకరు కొట్టుకొన్నారు. మహాత్ముడయిన అర్జునుని తూణీరాలు దివ్యాలు, తరిగిపోనివికూడా. అందువలన అర్జునుడు రణభూమిలో కదలని కొండలా నిలిచాడు. అశ్వత్థామ వేగంగా యుద్ధంలో బాణాలను గుప్పించటం వలన అవి త్వరగా తరిగిపోయాయి. దానితో అర్జునునిది పైచేయి అయినది. అప్పుడు కర్ణుడు తన మహాచాపాన్ని ఎక్కుపెట్టి టంకారం చేశాడు. దానితో అక్కడ హాహాకారాల ధ్వని పెద్దదయింది. వెంటనే అర్జునుడు ధనుష్టంకారం విన వచ్చిన వైపు దృష్టి సారించాడు. అక్కడ కర్ణుని చూడగానే అర్జునునికి కోపం అతిశయించింది. అర్జునుడు కోపించి, కర్ణుని చంపాలని కన్నులు విప్పార్చి కర్ణుని వైపు చూశాడు. అలా అర్జునుడు దృష్టి మరల్చి, అశ్వత్థామ బాణాలకు విముఖుడు కాగా కౌరవసేనలు వచ్చి అశ్వత్థామను అక్కడనుండి కొనిపోయాయి. ఆజానుబాహువూ, శత్రుంజయుడూ అయిన అర్జునుడు అశ్వత్థామను విడిచి, వెంటనే కర్ణుని మీదకే దూకాడు. అర్జునుడు కర్ణుని సమీపించి, అతనితో ద్వైరథయుద్ధం చేయగోరి, కోపంతో ఎర్రబడ్డ కళ్ళతో ఇలా పలికాడు.

60. కర్ణార్జునుల సంవాదము - కర్ణుడు పారిపోవుట.

'కర్ణా ! యుద్ధంలో నా అంతటివాడు లేడని కౌరవసభామధ్యంలో ఎన్నో ప్రగల్భాలు పలికి, నిన్ను నీవు పొగడుకొన్నావు. ఇదిగో ఇప్పుడు దానికి సరియైన పరీక్షాకాలం వచ్చింది. కర్ణా ! అలా ప్రగల్భాలు పలికిన నీవు ఈరోజు ఈమహాసంగ్రామంలో నాతో యుద్ధం చేసి, నీ బలహీనతను నీవే తెలిసికొంటావు.

అంతేగాదు. ఇక మీదట ఇతరులను పరాభవించవు. ఇంతకు మునుపు నీవు ధర్మాన్ని వీడి, పరుషంగా మాటాడావు. అయితే నీవు చేయదలచుకొన్న ఆ పని నీకు అసాధ్యమని నేను భావిస్తున్నాను. రాధేయా ! నాతో తలపడకముందే కౌరవసభలో నీవు ఏవేవో మాటాడావు. ఇప్పుడు ఈ కౌరవులమధ్య నాతో యుద్ధం చేసి, వాటిని నిరూపించుకో. కౌరవసభలో దురాత్ములయిన కౌరవులచే బాధింప బడుతున్న పాంచాలిని చూస్తూ మిన్నకున్నావు? దానికి తగిన ఫలితాన్నే నీ వీనాడు అనుభవించు. ధర్మపాశానికి కట్టుబడి నాడు నేను అన్నీ సహించాను. కర్ణా! ఆ కోపానికి తగిన ఫలితాన్ని నాగెలుపు రూపంలో నేటి యుద్ధంలో చూస్తావు. దుర్బుద్ధీ! పండ్రెండు సంవత్సరాలు అరణ్యంలో మేము భరించిన కష్టాలకు ప్రతీకారంగా ఈ యుద్ధంలో ఆ కోపఫలితాన్ని అనుభవిస్తావు. కర్ణా ! రా ! యుద్ధంలో నన్నెదిరించు. అందరు కౌరవులు, నీ సైనికులు ప్రేక్షకులై మన యుద్ధాన్ని తిలకిస్తారు.'

కర్ణుడిలా అన్నాడు.' పార్థా ! నీ మాటల నన్నింటినీ క్రియలో చూపించు. నీ మాట పనిని మించి పోతుంది. ఇది లోకంలో అందరికీ తెలిసిందే. పార్థా! ఇంతకు ముందు నీవు సహించినవన్నీ నీ చేతకానితనం వలన సహించినవే. ఇప్పుడు నీ పరాక్రమాన్ని ప్రదర్శిస్తే చూసి, దాని నంగీకరిస్తాము. ధర్మానికి కట్టుబడి గతంలో అన్నీ సహించావు నీవు. నిజమే ఇప్పుడుకూడా నీవు బద్ధుడవే. కానీ బంధవిముక్తుడ నని నీవు అనుకొంటున్నావు. మాటమేరకు నీవు వనవాసాన్ని పూర్తి చేశావు. ధర్మార్థాలు తెలిసిన వాడవు కాబట్టి కష్టపడ్డావు పాపం! అటువంటి వాడవు ఇప్పుడు నాతో యుద్ధం చేయగోరుతున్నావు. పార్థా ! ఒకవేళ ఇంద్రుడే వచ్చి నీ కోసం యుద్ధం చేసినా పరాక్రమించగల నాకు ఇసుమంత కూడా బాధ కలుగదు. కౌంతేయా ! నాతో యుద్ధం చేయాలన్న నీ కోరిక ఇదిగో ఇప్పుడే సమకూరింది. నాతో యుద్ధం చేసి ఈ నాడు నా బలాన్ని చూస్తావు.' అనగానే అర్జును డన్నాడు.'రాధేయా! ఇప్పుడే గదా నీవు నాతో యుద్ధం చేస్తూ పారిపోయింది. పారిపోయావు కాబట్టే ఇంకా బ్రతికి ఉన్నావు. కానీ నీ తమ్ముడు మరణించాడు. తమ్ముణ్ణి చంపించి, యుద్ధంనుండి పారిపోయి పెద్దలమధ్యలో నిలిచి ఈ విధంగా మాటాడగలవాడు నీవు తప్ప మరెవ్వడూ ఉండడు.' అలా కర్ణునితో మాటాడుతూనే ఓటమినెరుగని అర్జునుడు కవచాన్ని కూడా భేదించగల బాణాలను వదులుతూ కర్ణునివైపు దూసుకొని పోయాడు. మహారథుడైన

కర్ణుడు ఆనందించి, వర్షించే మేఘంలాగా గొప్పగా బాణవర్షాన్ని కురిపిస్తూ అర్జునుని ఎదుర్కొన్నాడు.

ఆకాశమంతా భయంకర శరసమూహం ఎగిసి పడుతోంది. దీనిని సహించలేని అర్జునుడు కర్ణుని గుఱ్ఱాలను, చేతితొడుగులను కొట్టటంతో పాటు భుజాలపై గాయపరిచాడు. వంపుగలిగి కణుపులున్న వాడి బాణంతో కర్ణుని అంపపొదిత్రాటిని కూడా తెగనరికాడు. అప్పుడు కర్ణుడు విడిగా, దగ్గరగా ఉన్న అంపపొది నుండి వేరు బాణాలను తీసి అర్జునుని చేతిపై కొట్టాడు. అర్జునుని పిడికిలి శిథిలమైంది. అప్పుడు మహాబాహువైన అర్జునుడు కర్ణుని ధనుస్సును విరగ గొట్టాడు. కర్ణుడు శక్తిని ప్రయోగించాడు. అర్జునుడు దానిని బాణాలతో నశింపజేశాడు. అంతలో కర్ణుని సైనికులు చాలా మంది అక్కడకు వచ్చి పడ్డారు. అర్జునుడు గాండీవంనుండి వెలువడిన బాణాలతో వారిని యమలోకానికి పంపాడు. అప్పుడు అర్జునుడు శత్రువుల దెబ్బను కాచుకొనగల తీక్ష్ణబాణాలతో నారిని చెవివరకు లాగి, సంధించి, కర్ణుని గుఱ్ఱాలను కొట్టాడు. అవి చచ్చి నేల కూలాయి. అర్జునుడు కాంతితో జ్వలిస్తున్న మరో వాడిబాణంతో కర్ణుని వక్షస్థలంపై కొట్టాడు. ఆ బాణం కర్ణుని కవచాన్ని చీల్చి, శరీరాన్ని తాకింది. కర్ణుడు మూర్ఛిల్లి నిశ్చేతను డయ్యాడు. ఆ బాధను భరించలేని కర్ణుడు వెన్ను చూపి, రణ భూమి నుండి నిష్క్రమించాడు. అపుడు అర్జునుడు, ఉత్తరుడు సింహనాదాలు చేశారు.

61. అర్జునుడు దుశ్శాసనాదులను ఓడించుట.

అర్జునుడు కర్ణుని ఓడించి "ఆ రథంమీద మా కందరకు పితామహుడైన భీష్ముడు నాతో యుద్ధం చేయాలన్న కోరికతో నిలిచి యున్నాడు. ఆయన దర్శనం దేవదర్శనమే. భీష్మునివైపు నన్ను నడిపించు" అని ఉత్తరునితో అన్నాడు. ఆ మాటలు విని అప్పటికే బాణాలతో తీవ్రంగా గాయపడిన ఉత్తరుడు రథాలతో, ఏనుగులతో, గుఱ్ఱాలతో నిండిఉన్న ఆ మహాసేనను చూసి "వీరా! ఈ రణరంగంలో నీ గుఱ్ఱాలను నేనిక నియంత్రించలేను. నా ప్రాణాలు కడంటాయి. నామనస్సు కలత పడుతోంది. నీవూ, కౌరవులూ ప్రయోగిస్తున్న దివ్యాస్త్రాల ప్రభావం పదిదిక్కులనూ తరుముతున్నట్లు నా కనిపిస్తోంది. వస, నెత్తురు, మేదస్సుల వాసనతో నాకు మూర్ఛవస్తోంది. నిన్ను

చూస్తుంటే నా మనస్సు డోలాయమాన మవుతోంది. యుద్ధంలో ఇటువంటి శూరుల కలయికను నేనింతకు ముందెప్పుడూ చూడలేదు. గదల పెనుదెబ్బలతో, శంఖ ధ్వనులతో,వీరుల సింహనాదాలతో పిడుగుపాటు వంటి నీగాండీవధ్వనితో నామనస్సు మూఢతకు లోనైంది. నా శ్రవణశక్తి, స్మరణశక్తి కూడా నశించాయి. రణభూమిలో అదేపనిగా నీవు గాండీవాన్ని టంకారం చేస్తూ లాగుతుంటే కొఱవిని చక్రంగా త్రిప్పినట్లు నాకనిపిస్తోంది. నాకళ్ళు బైర్లు క్రమ్ముతున్నాయి. నా హృదయం బ్రద్దలవుతున్నట్లుంది. యుద్ధసమయంలో నీ శరీరం కోపించిన రుద్రుని శరీరంవలె భయానకంగా ఉంది. నీవు వింటినారిని లాగుతూ భుజాలను విశాలం చేస్తుంటే చూస్తున్న నాకు భయం కలుగుతోంది. ఆ బాణాలను నీవు ఎప్పుడు తీస్తున్నావో, ఎప్పుడు సంధిస్తున్నావో, ఎప్పుడు వదులుతున్నావో నాకు కనిపించటం లేదు. ఒకవేళ కన్పించినా నేను గ్రహించలేకపోతున్నాను నా ప్రాణాలు కడంటుతున్నాయి. ఈభూమి కదులుతున్నట్లు అనిపిస్తోంది. గుఱ్ఱాల పగ్గాలను కానీ కొరడాను కానీ పట్టుకొనే శక్తికూడా నాకు లేదు" అని దీనంగా పలికాడు.

అపుడు అర్జునుడిలా అన్నాడు"నరశ్రేష్ఠా! భయపడవద్దు. నిన్ను నీవు కుదుటపరచుకో. రణరంగంలో నీవు కూడా అద్భుత కార్యాలను చేశావు. నీవు రాజకుమారుడవు. నీకు మేలే జరుగుతుంది. ప్రసిద్ధికెక్కిన మత్స్యవంశంలో పుట్టినవాడవు. శత్రు సంహార సమయంలో చెదిరిపోకూడదు. శత్రువులను చంపగలవాడవు. ధైర్యం తెచ్చుకొని నా రథంపై కూర్చొని నేను యుద్ధం చేస్తుంటే గుఱ్ఱాలను నియంత్రించు వెంటనే నన్ను, నా రథాన్నీ భీష్ముని సేనాముఖం దగ్గరకు నడిపించు. ఈ యుద్ధంలో ఆయన వింటిని, వింటినారిని కూడా ఛేదిస్తాను. నేడు విచిత్రంగా దివ్యాస్త్రాలను ప్రయోగిస్తున్న నన్ను నీవు చూస్తావు. సువర్ణపృష్ఠం గల గాండీవం నుండి బాణాలు వెలువడుతుంటే గగనతలంలో మేఘం నుండి వెలువడిన మెరుపుతీగను చూసినట్టు కౌరవులు చూస్తారు. శత్రువులందరూ ఒక్కటై కూడి నేను బాణాలను ఎడమచేతితో వదలుతున్నానో, కుడిచేతితో వదలుతున్నానో అర్థంగాక తర్కించుకొంటారు. నెత్తురే నీరుగా, రథాలే సుడులుగా, ఏనుగులే మొసళ్ళుగా దాటవీలుగాని రక్తనదిని ప్రవహింప జేస్తాను. ఆ నది పరలోకానికి ప్రవహిస్తుంది నాబాణాలతో ఈ రోజు కాళ్ళు, చేతులు, తలలు, వీపులు, బాహువులు - కొమ్ములు గాగల దట్టమైన ఈ కౌరవవనాన్ని

నరికేస్తాను అరణ్యంలో పుట్టిన దావాగ్నికి అన్ని వైపులా దారులే అన్నట్లు అద్వితీయంగా కౌరవసేనను జయిస్తున్న ఈ విలుకానికి (అర్జునునకు) వందలదార్లు ఏర్పడుతాయి. నాబాణాలచే గాయపరచబడి చక్రంలా గిరగిర తిరిగే సైన్యాన్ని నీవు చూస్తావు. నీవు నేర్చిన విలువిద్యలోని విచిత్రాల నన్నింటినీ నీకు చూపిస్తాను. నీవు ఎగుడుదిగుడైనా సరే బెదిరిపోక రథం మీదనే నిలు. నా బాణాలతో ఆకాశాన్ని ఆవరించి ఉన్న పర్వతాన్ని అయినా ఈరోజు బ్రద్దలు కొడతాను.

నేను గతంలో ఇంద్రుని మాటమేరకు పౌలోమ కాలఖంజాది రాక్షసులను లక్షలకొలదిగ యుద్ధంలో సంహరించాను. నేను వింటిని పట్టేటప్పుడు పిడికిలి బిగించటాన్ని ఇంద్రుని దగ్గరనుండి, బాణాలను ప్రయోగించేటప్పుడు చేతి నేర్పును బ్రహ్మనుండి, సంకటస్థితిలో విచిత్రంగా యుద్ధం చేయటాన్ని ప్రజాపతి నుండి నేర్చుకొన్నానని తెలుసుకో. నేను సాగరతీరంలోని హిరణ్యపురంలో నివసిస్తున్న అరువదివేలమందిని ఓడించాను. వారు గొప్ప విలుకాండ్రు, మహారథికులు. జలప్రవాహం వరదగా మారి, ఒడ్డులను కోసి, కూలద్రోసినట్టు కౌరవబృందాలను నేను పడగొడుతుంటే నీవు చూడు. ధ్వజాలే చెట్లుగా, సైనికులే తృణప్రాయంగా, రథాలే సింహసమూహాలుగా ఉన్న కౌరవవనాన్ని నా శస్త్రాస్త్ర రూపమైన అగ్నితో తగులబెడతాను. నా బాణాలతో కౌరవులను రథా లనే గూళ్ళనుండి క్రిందకు పడగొడతాను. ఇంద్రుడు రాక్షసులను సంహరించినట్లు నేనొక్కడనే యుద్ధసన్నద్ధుడై నిలిచిన వీరుల నందరనూ నశింపజేస్తాను. నేను రుద్రునినుండి రౌద్రాస్త్రాన్ని, వరుణుని నుండి వారుణాస్త్రాన్ని, అగ్నినుండి ఆగ్నేయాస్త్రాన్ని, వాయువు నుండి వాయవ్యాస్త్రాన్ని, ఇంద్రునినుండి వజ్రాస్త్రం మొదలయి అస్త్రాలనూ పొంది ఉన్నాను. వీరనర సింహాలచేత రక్షింపబడుతున్న ఘోరమైన ధార్తరాష్ట్రవనాన్ని నేను పెలికించివేస్తాను. ఉత్తరకుమారా! నీవు భయపడ నవసరంలేదు". అర్జునుడు అలా అనునయిస్తే ఉత్తరకుమారుడు భీష్మునిచే రక్షింపబడి ఉన్న ఆ రథసమూహంలోనికి చొచ్చుకుపోయాడు.

యుద్ధంలో కౌరవులను జయించాలన్న కోరికతో వస్తున్న ఆ మహాబాహువైన అర్జునుని భీష్ముడు తొట్రుపడకుండా నివారించాడు. అప్పుడు జయశీలుడైన అర్జునుడు భీష్మునివైపు తిరిగి, బంగారు మొనలుగల వాడి బాణాలతో ఆ భీష్ముని ధ్వజాన్ని మూలం నుండి పెల్లగించాడు. ఆ దెబ్బ తిని అది నేలకూలింది. అంతలో విచిత్రమైన

మాలలు, ఆభరణాలు ధరించి, విలువిద్యలో నేర్పుగల, అభిమానవంతులు, మహాబలులు అయిన నలుగురు వీరులు – దుశ్శాసన, వికర్ణ, దుస్సహ, వివింశతులు భయంకరమైన ధనుస్సుగల అర్జునుని చుట్టుముట్టారు. దుశ్శాసనుడు ఒక బాణంతో విరాటకుమారుడైన ఉత్తరుని గాయపరచి, మరొక బాణంతో అర్జునుని రొమ్ముపై కొట్టాడు. అప్పుడు అర్జునుడు అతనివైపు తిరిగి విశాలమైన వాదర, గ్రద్ద-ఈకలు గల బాణంతో స్వర్ణమయమైన దుశ్శాసనుని ధనుస్సును ఖండించాడు. తరువాత అయిదు బాణాలతో దుశ్శాసనుని రొమ్ముపై కొట్టాడు. అర్జునుని బాణాల బాధను తట్టుకోలేక దుశ్శాసనుడు యుద్ధం విడిచి పారిపోయాడు. అలా శత్రుసంహారం చేస్తున్న ఆ అర్జునుని వాడియైన సూటిబాణాలతో ధృతరాష్ట్రకుమారుడు వికర్ణుడు బాధించాడు. అంతట అర్జునుడు ఒక బాణంతో వికర్ణుని నుదుటిపై కొట్టాడు. గాయపడిన వికర్ణుడు వెంటనే రథం మీదనుండి పడ్డాడు. తరువాత యుద్ధంలో దుస్సహుడు, వివింశతి అర్జునునిమీదికురికి సోదరునిపాటునకు ప్రతీకారంగా ఆయనపై వాడియైన బాణాలను కురిపించారు. వాడిబాణాలతో అర్జునుడు దుస్సహ వివింశతుల నిద్దరినీ ఒక్కసారిగా గాయపరచి స్తిమితంగా వారి గుఱ్ఱాలను సంహరించాడు. గుఱ్ఱాలను కోల్పోయి గాయపడిన, ఆ ధృతరాష్ట్రకుమారుల నిద్దరినీ సైనికులు వచ్చి ఇతరరథాలమీద తొలగించుకొనిపోయారు. ఓటమినెరుగని అర్జునుడు గురితప్పకుండా సేనలో అన్ని దిక్కులా సంచరింప సాగాడు.

62. అర్జునుడు కౌరవయోధులందరితో యుద్ధముచేయుట.

ఆపై కౌరవసేనలోని మహారథులందరు ఒక్కటై సావధానులై అర్జునుని ఎదిరించారు. అయితే అంతులేని ఆత్మబలంగల అర్జునుడు మంచు కొండలను కప్పినట్లు అన్నివైపులా బాణాలతో ఆ మహారథులందరిని క్రమ్మేశాడు. మదపుటేనుగుల ఘీంకారాలు, గుఱ్ఱాల సకిలింతలు, భేరీశంఖనినాదాలు కలిసి రణభూమిలో కోలాహలం ఎక్కువయింది. అర్జునుని బాణాలు సైనికుల శరీరాలనూ, గుఱ్ఱాల శరీరాలను భేదించి, లోహమయకవచాలను చీల్చుకొని, వేలకు వేలుగా నేలపై పడసాగాయి. శరత్కాలంలో మధ్యందినమార్తాండుడు మండినట్లు రణభూమిలో వేగంగా బాణాలను ప్రయోగిస్తూ అర్జునుడు వెలిగిపోయాడు. ఆ రణభూమిలో బెదిరిపోయిన రథికులు

రథాలనుండీ, ఆశ్వికులు గుఱ్ఱాలమీదనుండీ జారి పడ్డారు. సైనికులు క్రిందపడ్డారు. అందరూ పారిపోసాగారు. మహానుభావు లయిన వీరుల శరీరాలపై నున్న రాగి, వెండి, ఇనుప కవచాలను అర్జునుడు బాణాలతో చీల్చివేస్తుంటే పెద్ద ధ్వని ఏర్పడింది. రణభూమి అంతా మృతవీరుల శరీరాలతో నిండిపోయింది. వాడిబాణాలవలన ప్రాణాలు కోల్పోయిన గజబల, అశ్వబల, రథికుల శరీరాలతో భూమి కప్పివేయబడింది. ధనుష్పాణి అయిన అర్జునుడు రణరంగంలో నృత్యం చేస్తున్నట్లు అనిపించింది. పిడుగుపాటు వంటి గాండీవధ్వని విని భయపడి సర్వసేనలూ ఆ మహాయుద్ధంనుండి తొలగిపోయాయి. కుండలాలు, తలపాగాలు ధరించియున్న తలలు రణభూమిలో పడి కనిపిస్తున్నాయి. బంగారు హారాలు కూడా చెల్లాచెదరుగా పడి ఉన్నాయి.

అర్జునుని బాణాలచే కలచివేయబడిన శరీరాలు, ధనుస్సులు ధరించియున్న బాహువులు, హస్తాభరణాలు వీడిపోని బాహువులు ఆ రణభూమిని కప్పివేశాయి. వాటితో అది వింతగా ప్రకాశిస్తోంది. అర్జునుని వాడిబాణాలకు తెగిపడుతున్న సైనికుల శిరస్సుల వరున ఆకాశంనుండి కురుస్తున్న రాళ్ళవానలా కనిపిస్తోంది. భయంకరమైన తన పరాక్రమాన్ని నిరోధించికొని అర్జునుడు పదమూడు సంవత్సరాలు అరణ్యంలో సంచరించాడు. ఇప్పుడు యుద్ధసమయంలో కౌరవులపై తన క్రోధాన్ని వెడలగ్రక్కుతూ రుద్రరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు. సైన్యాన్ని దహించివేస్తున్న ఆ అర్జునుని పరాక్రమాన్ని గమనించి సుయోధనుని సేనలు ఆయన చూస్తుండగానే చల్లబడి నిలిచిపోయాయి. అర్జునుడు సైన్యాన్ని భయపెట్టి, మహారథులను పారద్రోలి, రణరంగంలో విహరించసాగాడు. అర్జునుడు భయానకమైన నెత్తుటేరును అక్కడ పారించాడు. ఆ ఏటిలో నెత్తురే నీరు. ఎముకలే నాచు. ప్రళయకాలంలో యముడు నిర్మించిన ఏరులా అది కనిపిస్తోంది. ఆ నెత్తుటేటిలో విండ్లు, బాణాలే తిప్పలు. వెంట్రుకలే నాచు, గడ్డి. దానిలో కవచాలూ, తలపాగాలు నిండిఉన్నాయి. అక్కడి ఏనుగులే తాబేళ్ళుగా, నీటి ఏనుగులుగా కనిపిస్తున్నాయి. ఆ నెత్తుటేరు మెదడు, వస, నెత్తురు కలిసి ప్రవహిస్తోంది. మహాభయంకరంగా రౌద్రరూపంతో కనిపిస్తోంది. క్రూరజంతువులు అక్కడ కోలాహలధ్వని చేస్తున్నాయి. ఆ నెత్తుటేటిలో బాణసమూహాలే పెద్దసుడులు. ఏనుగులే మొసళ్ళు. మహారథాలే పెద్దద్వీపాలు. అది దాటశక్యం కానిది. శంఖాలు, దుందుభులు అక్కడ మార్మ్రోగుతున్నాయి. అటువంటి నెత్తుటేటిని

అర్జునుడు ప్రవహింపజేశాడు. అర్జునుడు బాణాలను తీయటం, వింటితో కూర్చటం, వదలటం, గాండీవాన్ని ఆకర్షించటం ఎవ్వరికీ తెలియటం లేదు.

63. కౌరవులు యుద్ధమునందు వెన్నుచూపుట.

దుర్యోధనుడు, కర్ణుడు, దుశ్శాసనుడు, వివింశతి, ద్రోణుడు, అశ్వత్థామ, మహారథుడైన కృపాచార్యుడు, అందరూ కోపంతో అర్జునుని సంహరించాలన్న కోరికతో దృఢమయిన తమ విండ్లను ఆకర్షిస్తూ మరల అర్జునునిపైకి వెళ్ళారు. మహారాజ! సూర్యతేజస్సుగల అర్జునుడు వానరధ్వజ పతాకం రెపరెపలాడుతుంటే అన్ని వైపుల నుండీ రథంతో ముందుకు దూసుకొనిపోయాడు. అంతట కృపుడు, కర్ణుడు, రథికశ్రేష్ఠుడైన ద్రోణుడూ పరాక్రమశాలి అయిన అర్జునుని చుట్టుముట్టి, ఆయనను పడగొట్టాలన్న సంకల్పంతో వర్షాకాలపు మేఘాలవలె తమ మహాస్త్రాలతో అర్జునునిపై బాణవృష్టిని కురిపించారు. వారు రణభూమిలో కొద్దిమేర అర్జునుని నిలువరించి దూసుకొనిపోయే అనేకబాణాలతో ముంచేశారు. దివ్యాస్త్రాలతో వారు ఆవిధంగా అర్జునుని చుట్టుముట్టగా అర్జునుని శరీరంలో రెండు అంగుళాల మేర కూడా బాణాలు లేకుండా ఖాళీగా కనిపించలేదు.

అపుడు మహారథుడైన అర్జునుడు నవ్వి, సూర్య తేజస్సుతో ఉన్న దివ్యమైన ఇంద్రాస్త్రాన్ని గాండీవంపై ఎక్కుపెట్టాడు. ఆ అర్జునుడు బాణాలే కిరణాలుగా సూర్యునివలె ఆ రణభూమిలో కౌరవులనందరినీ కప్పివేశాడు. అర్జునుడెక్కుపెట్టిన ఆ గాండీవం మేఘంలో మెరుపులా, పర్వతంపై నిప్పులా ప్రకాశిస్తూ వంగిన ఇంద్రధనుస్సులా కనిపించింది. మేఘం వర్షిస్తున్నవేళ ఆకాశంలో మెరుపు మెరుస్తూ అన్నిదిక్కులనూ, భూమినీ ప్రకాశింపజేసినట్లు శరవర్షాన్ని కురిపిస్తూ గాండీవం పది దిక్కులను కప్పివేసింది. అప్పుడు గజబలం, రథబలం మొత్తం మూర్ఛపోయింది. సైనికు లందరూ శాంతించారు. ఎవ్వరికీ స్వస్థత లేదు. వారందరూ చైతన్యహీనులయి యుద్ధ విముఖు లయ్యారు. ఇలా భంగపడిన ఆ సైనికులంతా జీవితంపై ఆశను విడిచి, అన్ని దిక్కులకూ పారిపోయారు.

64. అర్జునుడు భీష్మునితో యుద్ధము చేయుట, భీష్ముడు ఓడిపోయి తొలగుట.

కురుపితామహు డయిన భీష్ముడు, తనపక్షాన నున్న వీరుల సంహారం చూసి, అర్జునునివైపు తరలాడు. భీష్ముడు బంగారు ధనుస్సును ధరించి, మర్మభేదకాలయిన బాణాలను గైకొన్నాడు. అతని శిరస్సుపై తెల్లని గొడుగు అమరి ఉంది. దానిచే నరశ్రేష్ఠ డయిన భీష్ముడు సూర్యోదయకాలంలో ఉదయాచలం వలె ప్రకాశించాడు. భీష్ముడు శంఖాన్ని పూరించి, ధృతరాష్ట్ర కుమారులకు ఆనందాన్ని కలిగిస్తూ కుడివైపుగా తిరిగివచ్చి అర్జునుని పురోగమనాన్ని అడ్డుకొన్నాడు. అర్జునుడు తనమీదికి వస్తున్న భీష్ముని చూసి, సంతసించి, భీష్ముని కెదురు వెళ్ళాడు. ఆ సమయంలో అర్జునుడు చలించని పర్వతం వర్షధారలను కురిసే మేఘాన్ని నిలువరిస్తున్న ట్లున్నాడు. భీష్ముడు పార్థుని ధ్వజంపై బుసలుకొట్టే సర్పాలవంటి మహావేగంకల ఎనిమిది బాణాలను విడిచాడు. ఆ బాణాలు పాండునందనుని ధ్వజంమీద వెలిగే వానరుని, ఇతర భూతాలనూ పీడించాయి. అర్జునుడు దృఢమైన అంచు ఉన్న భల్లంతో భీష్ముని గొడుగును ఖండించాడు. వెంటనే అది భూమిపై విరిగిపడింది. కుంతీనందనుడు వేగంగా బాణాలతో భీష్ముని ధ్వజాన్నీ, పార్శ్వరక్షకునీ, సారథినీ మిక్కిలి బాధించాడు. తన పరివారంపై అర్జునుడు చేసే దాడిని భీష్ముడు సహించలేకపోయాడు. ధనంజయుని శక్తి నెరిగికూడా దివ్యాస్త్రాన్ని ప్రయోగించి అతడు బాణవర్షం కురిపించాడు. కాని అమేయమైన ఆత్మబలం కల పాండునందనుడు పర్వతం మహామేఘాన్ని ఎదుర్కొన్నట్లు భీష్ముని ఎదిరించాడు. తానుకూడ దివ్యాస్త్రంతో బాణవర్షం కురిపించాడు. అపుడు భీష్మార్జునులకు గగుర్పాటును కలిగించే సంకులసమరం జరిగింది. ఆ యుద్ధం బలి వాసవుల యుద్ధాన్ని తలపించింది.

కౌరవయోధులందరూ తమతమ సైనికులతో కూడి యుద్ధాన్ని చూడసాగారు. రణభూమిలో భీష్మఅర్జునులు ప్రయోగించిన భల్లములు ఒకదానితోనొకటి ఢీకొని వర్షాకాలంలో ఆకసంలో విహరించే మిణుగురుల వలె భాసించాయి. కుడి ఎడమలనుండి శరాలను ప్రయోగించే పార్థుని గాండీవం అగ్నిచక్రం వలె ప్రకాశించింది. మేఘం జలధారలతో పర్వతాన్ని కప్పి వేసినట్లు, అర్జునుడు వందలకొలది బాణాలతో భీష్ముని కప్పివేశాడు. సముద్రంనుండి ఉప్పెనలా పొంగి వస్తున్న శరపరంపరను భీష్ముడు

తన బాణవర్షంతో ఛిన్నాభిన్నంచేసి అర్జునుని వారించాడు. రణభూమిలో తునాతునకలు చేయబడిన బాణపు ముక్కలు అర్జునుని రథంపై పడసాగాయి. వెంటనే అర్జునుని రథం నుండి తిరిగి బంగారు పుంఖాలుకల బాణపరంపర మిడతలదండువలె వెలువడింది. కాని భీష్ముడు దానిని కూడ వందలకొలది వాడి బాణాలతో ప్రశాంత పరిచాడు. అపుడు కురుసైనికులంతా సాధువాదాలతో "భీష్ముడు గొప్ప సాహసం చేశాడు. అర్జునునితో యుద్ధం చేసి" అని భీష్ముని ప్రశంసించారు. అర్జునుడు బలవంతుడు, యువకుడు, సమర్థుడు. వేగంగా బాణాలు ప్రయోగిస్తాడు. భీష్ముడు, శ్రీకృష్ణుడు, ద్రోణుడు మాత్రమే అర్జునుని వేగాన్ని నిలువరింప గలరు. వేరెవ్వరిట్లు చేయగలరు? భరతవంశశ్రేష్ములయిన వీరిద్దరే మహాబలవంతులు. ఒకరి అస్త్రాలతో మరొకరి అస్త్రాలను వారిస్తూ, సమస్త ప్రాణుల నేత్రాలనూ మోహింపచేస్తూ క్రీడిస్తున్నారు. ప్రాజాపత్యం, ఐంద్రం, ఆగ్నేయం, రౌద్రం, కౌబేరం, వారుణం, యామ్యం, వాయవ్యం అనే అస్త్రాలను ప్రయోగిస్తూ వీరిద్దరు మహాపురుషులూ యుద్ధరంగంలో విహరిస్తున్నారు. ఆ సమయంలో యుద్ధరంగంలో వారిద్దరిని చూస్తున్న ప్రాణిసమూహం ఆశ్చర్యంతో ఇలా అంది. 'పార్థా! మహాబాహూ! సాధువాదాలు,భీష్మా! మహాబాహూ! సాధువాదాలు. (భేష్ అర్జునా! భేష్ భీష్మా)' భీష్మపార్థుల యుద్ధంలో గొప్ప గొప్పదివ్యాస్త్రాల సంప్రయోగం కన్పడుతోంది. ఇట్టిది మనుష్యలోకంలో ఇంకెక్కడా చూడలేము. ఈవిధంగా అన్ని అస్త్రాల ప్రయోగంలో పండితులైన భీష్మార్జునులకు అస్త్రయుద్ధం జరిగింది. తరువాత బాణాలతో యుద్ధం ప్రారంభమైనది. తర్వాత అర్జునుడు, సమీపించి కత్తివలె పదునైన అంచుకల బాణం ప్రయోగించి, బంగారంతో నగిషీ చేయబడిన భీష్మునియొక్క ధనుస్సును త్రుంచివేశాడు. క్షణాల్లోనే భీష్ముడు మరొక ధనుస్సును తీసికొని అల్లెత్రాటితో బిగించాడు, కోపంతో శీఘ్రంగా ధనంజయుని మీద అనేకబాణాలను సంధించాడు. మహాతేజుడయిన అర్జునుడు కూడ తీవ్రమైన వాడి బాణాల్ని అసంఖ్యాకంగా భీష్మునిపై ప్రయోగించాడు. అదే విధంగా భీష్ముడు కూడ అర్జునునిపై బాణాల్ని ప్రయోగించాడు.

రాజా! దివ్యాస్త్రపండితులయిన భీష్మార్జునులు వాడి బాణాల్ని పరస్పరం ప్రయోగించుకొంటూంటే, ఆ మహాత్ములిద్దరిలో భేదం ఏమాత్రం కనపడటంలేదు. అర్జునుడు, భీష్ముడు ఇద్దరూ అతిరథులే, మహావీరులే. వారిద్దరూ తమ బాణాలతో పది దిక్కులనూ మూసివేశారు. ఆ యుద్ధంలో ఒకసారి అర్జునుడు భీష్ముని

మించిపోతాడు.మరోసారి భీష్ముడు అర్జునుని మించి పోతాడు. ఈ యుద్ధం లోకంలో చాలా ఆశ్చర్యకరం. రాజా! భీష్ముని రథాన్ని రక్షించే శూరులైన సైనికులు అర్జునునిచేత చచ్చి రథానికి అన్నివైపులా పడి ఉన్నారు. తరువాత అర్జునుని గాండీవం నుండి వెల్వడిన వాడిబాణాలు శత్రువులను నిశ్శేషం చేయడానికి అన్ని వైపులా వ్యాపించాయి. అర్జునుని రధంనుండి బయలుదేరిన స్వర్ణ పరిష్కృతాలైన తెల్లని బాణాలు ఆకాశంలో హంసల బారుల్లా కనపడసాగాయి. అర్జునుడు మర్మభేదకాలైన దివ్యాస్త్రాలను చిత్ర విచిత్రంగా ప్రయోగిస్తున్నాడు. ఆకాశంలో ఉన్న ఇంద్రాది దేవతలు ఆశ్చర్యంతో చూస్తున్నారు.

ఆ సమయంలో చిత్రసేనుడనే గంధర్వుడు అర్జునుని చూస్తూ పరమానందంతో అతని చిత్రాద్భుతమయిన రణకౌశలాన్ని ప్రశంసిస్తూ ఇంద్రునితో ఇలా అంటున్నాడు. 'దేవరాజా! చూడండి. పార్థుడు విడిచిన బాణాలు ఒకదానితో మరొకటి కలిసి ఎలా ప్రయాణిస్తున్నాయో! దివ్యాస్త్రప్రయోగం చేస్తున్న విజయుని నేర్పు పరమాశ్చర్యకరంగా ఉంది. మరొక మనుష్య డెవ్వడూ ఇలాంటి దివ్యాస్త్ర ప్రయోగం చెయ్యలేడు. ఎందుచేతనంటే ఇలాంటి అస్త్రాలు ఏ మానవుడి వద్దా లేవు. ఇది మిక్కిలి ప్రాచీనా లైన గొప్పగొప్ప అస్త్రాలకు చిత్రమైన కలయిక! అర్జునుడు ఎప్పుడు బాణాన్ని తీస్తున్నాడో, ఎప్పుడు బాణాన్ని సంధిస్తున్నాడో, ఎపుడు విడుస్తున్నాడో తెలియదు. అసలీ క్రియలకు మధ్య విరామం ఉన్నట్లు కనపడదు. మిట్ట మధ్యాహ్నం ప్రచండకిరణాలతో తపింప చేసే సూర్యుడిని ఎవరూ చూడలేనట్లు కౌరవసైనికులు పాండుకుమారుని కన్నెత్తి చూడలేకపోతున్నారు. ఆ విధంగానే భీష్ముని కూడా చూడటానికి జనం సాహసించలేక పోతున్నారు. ఇద్దరూ లోకంలో సాహసకార్యాలకు ప్రసిద్ధులే. ఇద్దరూ గొప్ప పరాక్రమం కలవారే. ఇద్దరూ సమానంగా పోరాడే వారే. ఇద్దరూ యుద్ధంలో ఎవరిచేతనూ జయింప బడేవారు కాదు!' చిత్రసేను డిలా చెప్పగానే దేవేంద్రుడు దివ్యమైన పూలజల్లుతో అర్జునభీష్ముల సంగర సమాగమాన్ని అభినందించాడు. భీష్ముడు కౌరవ సైన్యాన్ని బాధిస్తున్న సవ్యసాచియొక్క ఎడమ పార్శ్వాన్ని బాణంతో బాధించాడు. ఆప్పు డర్జునుడు నవ్వి, గారుడ పత్రాలు కల బాణంతో భీష్ముని ధనుస్సును విరగగొట్టాడు. వెంటనే ధనంజయుడు విక్రమిస్తున్న భీష్ముని వక్షఃస్థలాన్ని పదిబాణాలతో వేధించి గాయపరిచాడు. అర్జునుని బాణాలతో

బాధింపబడి మహాభుజు డైన గాంగేయుడు రథకూబరాన్ని పట్టుకొని చాలాసేపు నిశ్చేష్టుడై ఉండిపోయాడు. భీష్ముడు మూర్ఛపోయాడు. 'ఇలాంటి సందర్భంలో సారథి రథిని రక్షించవలసియున్నది' అనే ఉపదేశాన్ని తలచుకొని, భీష్ముని రక్షించే ఉద్దేశ్యంతో రథాన్ని, గుర్రాలను రక్షించే సారథి భీష్ముని యుద్ధ భూమినుండి దూరంగా కొనిపోయాడు.

65. అర్జునుడు దుర్యోధనునితో యుద్ధము చేయుట - దుర్యోధనుడు పారిపోవుట.

భీష్ముడు యుద్ధరంగాన్నుండి తొలగింపబడగానే దుర్యోధనుడు, తన రథపతాకాన్ని ఎగురవేసి, సింహనాదం చేస్తూ ధనుస్సును ఎక్కు పెట్టి, అర్జునుని సమీపించాడు. ఆ సమయంలో ధనంజయుడు భయంకరమైన గాండీవంతో శత్రుగణంలో విహరిస్తున్నాడు. దుర్యోధనుడు భల్లమనే బాణాన్ని కర్ణాంతంవరకు లాగి అర్జునుడి నుదుటిపై గాయపరిచాడు. అర్జునుడు ఆ స్వర్ణాగ్రబాణంతో అందమైన శిఖరం మోద వెదురుచెట్టుతో శోభించే పర్వతంలా కనపడ్డాడు. దుర్యోధనుని బాణంతో ఛేదింపబడిన అర్జునుని నుదుటినుండి వెచ్చని నెత్తురు నిరంతరంగా ప్రవహిస్తోంది. బంగరుపుంఖంగల ఆ బాణం పార్థుని ఫాలాన్ని భేదించి అందంగా అక్కడే ఉండిపోయింది. తరువాత పార్థుడు దుర్యోధనుని మీద, దుర్యోధనుడు పార్థుని మీద తలపడ్డారు. ఆ సమయంలో కుంభస్థలంనుండి స్రవిస్తున్న మదంతో ఏనుగునెక్కి వికర్ణుడు జయశీలుడైన కుంతీసుతునితో తలపడ్డాడు. ఆ మహాగజానికి నాలుగువైపులా పాదరక్షకాలైన నాల్గు రథా లున్నాయి. తీవ్రవేగంతో వస్తున్న గజరాజును చూసి ధనంజయుడు ఒక లోహబాణాన్ని చెవులవరకు లాగి, వేగంగా కుంభస్థలమధ్యం మీద కొట్టాడు. పార్థుడు విడిచిన ఆ బాణం ఇంద్రుడు ప్రయోగించిన వజ్రాయుధం పర్వతాన్ని చీల్చినట్లు ఏనుగు కుంభస్థలంలో చివరివరకు దిగబడిపోయింది. ఆ గజరాజు అర్జునుని బాణంతో తపించి పోయింది. దాని అంతరాత్మ వ్యథ చెందింది. శరీరం కంపించిపోయింది. వజ్రహతిచేత పర్వతశిఖరం కూలినట్లు ఆ ఏనుగు భూమి మీద కుప్పకూలిపోయింది. గజరాజు నేలకూలగానే వికర్ణుడు భయంతో ఏనుగు దిగి, వేగంగా ఎనిమిదివందల అడుగుల దూరం వెళ్లి, వివింశతియొక్క రథాన్ని

ఎక్కాడు.

వజ్రసమానమైన బాణంతో పర్వతం వంటి, మేఘం వంటి ఏనుగును సంహరించాక, అర్జునుడు అటువంటి మరొక బాణంతో దుర్యోధనుని వక్షఃస్థలాన్ని భేదించాడు. ఈవిధంగా గజరాజు కురురాజూ కూడా గాయపడితే, పాదరక్షకులతో సహా వికర్ణుడు పలాయనం చిత్తగించాడు. గాండీవం నుండి వెలువడిన బాణాలు పీడించిన యోధముఖ్యు లందరూ క్రమంగా రణరంగాన్ని విడిచిపెట్టారు. అర్జునునిచేత చంపబడిన ఏనుగును చూసి, యోధు లంతా యుద్ధరంగాన్నుండి పారిపోవటాన్ని తెలుసుకుని, కురువీరుడైన దుర్యోధనుడు రథాన్ని మరలించి, అర్జునుడికి దూరంగా పారిపోయాడు. అపుడు దుర్యోధనుని రూపం అతిభయంకరంగా ఉంది. పరాజయాన్ని చవిచూసి బాణపుదెబ్బతో రక్తం క్రక్కుకుంటూ పారిపోతున్నాడు. దీనిని చూసి అర్జునుడు యుద్ధ కాంక్షతో, రణోత్సాహంతో దుర్యోధనునితో ఇలా అన్నాడు. 'దుర్యోధనా! యుద్ధం వదలి వెన్నుచూపించి ఎందుకు పారిపోతావు? ఇలా చేస్తే నీ కీర్తి, విశాలమైన యశస్సు నశించి పోతాయి. ఈరోజు నీవిజయదుందుభులు మ్రోగటం లేదేం? నీచేత రాజ్యం నుంచి తొలగించబడిన యుధిష్ఠిరుని సేవకుడను, పాండవులలో మూడవవాడిని, యుద్ధం చేయడానికి సిద్ధంగానే ఉన్నాను. కనుక నీవు పారిపోవటం ఆపి నాకు ముఖం చూపించు. రాజు ఎలా ఉండాలో ఒకసారి గుర్తు చేసుకో. అనవసరంగా నీకు దుర్యోధను డని పేరుపెట్టారు. నీవేమో యుద్ధం నుంచి పారిపోతున్నావు. కనుక నీలో దుర్యోధనత్వమనేది ఏకోశానా లేదు. దుర్యోధనా! నీకు ముందు గానీ, వెనుక గానీ రక్షకులు ఎవ్వరూ కనబడటంలేదు. వీరపురుషా ! నేడు ఈ పాండవమధ్యమని నుండి అత్యంతప్రియమైన నీ ప్రాణాలను రక్షించుకో.'

.66. కౌరవులందరు ఓడిపోయి వెనుదిరుగుట.

మహాత్ము డైన అర్జును డిలా యుద్ధానికి పిలుస్తుంటే, ధృతరాష్ట్రసుతుడైన దుర్యోధనుడు అంకుశంపోటు తిన్న మత్తగజంలా మాట లనే అంకుశంతో పీడింపబడి రణభూమికి మరలాడు. మహారథుడైన అర్జునుడు తనమాటలతో దుర్యోధనుని గాయపరిచాడు. అతిరథుడు, వీరుడు అయిన సుయోధనుడు సహించలేకపోయాడు. కనుకనే అరికాలి క్రింద పడిన సర్పం ప్రతీకారం కోసం తిరిగి వస్తున్నట్లు దుర్యోధనుడు

రథారూఢుడై రణభూమికి తిరిగివచ్చాడు. యుద్ధభూమికి మరలివస్తున్న దుర్యోధనుని చూసి, అతనిని నివారించి, గాయపడిన తన దేహాన్ని సవరించుకొంటూ కర్ణుడు దుర్యోధనునికి ఉత్తరంగా బయలుదేరి పార్థునితో తలపడ్డాడు. తరువాత భీష్ముడు వేగంగా రథాన్ని మరల్చి, అచటకు వచ్చాడు. మహాబాహు వయిన అతడు విల్లు నెక్కుపెట్టి దుర్యోధనుని పార్థునినుండి రక్షించటానికై పశ్చిమానికి చేరాడు. వెంటనే ద్రోణుడు, కృపుడు,వివింశతి, దుశ్శాసనుడు కూడా శీఘ్రంగా వచ్చారు, వారందరూ తమతమ ధనుస్సులను ధరించి దుర్యోధనునికోసం అతని ముందు భాగాన మోహరించారు. సూర్యుడు తనకభిముఖంగా వస్తున్న మేఘసమూహాన్ని తపింప చేసినట్లు ధనంజయుడు నీటి ప్రవాహంవలె మరలి వస్తున్న సైన్య సమూహాలను తపింప జేయనారంభించాడు. దివ్యాస్త్రాలను ధరించిన ఆ యోధు లందరూ అన్ని వైపులనుండి పార్థుని ముట్టడించి, మేఘాలు పర్వతాన్ని వర్షధారలతో ముంచెత్తినట్లు శరపరంపరలు కురిపించారు.

అప్పుడు శత్రువేగాన్ని సహించే అర్జునుడు తన అస్త్రాలతో కౌరవముఖ్యుల అస్త్రాలను మరలించి, సమ్మోహన మనే పేరుగల మరొక అస్త్రాన్ని ప్రయోగించాడు. దాని ప్రభావాన్ని ఎవ్వరూ ఎదుర్కొనలేరు. తరువాత వాడి బాణాలతో దిక్కులను దిగంతరాళాలను నింపి, మహాబలు డైన అర్జునుడు గాండీవఘోషతో కౌరవ యోధుల మనస్సులను కలచి వేశాడు. పిమ్మట పార్థుడు తన హస్తాలతో ఉదాత్తంగానూ, భయంకరంగానూ ఘోషించే శంఖాన్ని గైకొని; దిక్కులు, విదిక్కులు, భూమ్యాకాశాలు మారు మ్రోగే విధంగా శంఖనాదం చేశాడు. అర్జునుని ఆ శంఖనాదంతో కురువీరు లందరూ సమ్మోహితులయ్యారు. అప్పుడందరూ తమతమ దుర్లభమైన ధనుస్సులను విడిచిపెట్టి ప్రశాంతు లయ్యారు. కురువీరు లందరూ అచేతనులై ఉండటం చూసి పార్థుడు ఉత్తరయొక్క వాక్యాన్ని స్మరించుకొని ఉత్తరకుమారునితో ఇలా అన్నాడు. 'నరవీరా! కౌరవులందరూ ప్రస్తుతం మూర్ఛలో ఉన్నారు. కనుక నీవు సేనమధ్య నుండి వెళ్ళి ద్రోణ కృపాచార్యుల తెల్లని వస్త్రాలు, కర్ణుని పసుపువస్త్రం, అశ్వత్థామ సుయోధనుల నీలవస్త్రాలు తీసుకొని రా. తాతగారైన భీష్ముడు మూర్ఛను పొందలేదని భావిస్తాను. ఎందుకంటే సమ్మోహనాస్త్రాన్ని ఎలా ప్రతిఘటించాలో ఆయనకు తెలుసు. భీష్ముని గుర్రాలు నీకు కుడివైపున ఉండేటట్లు వెళ్ళు. చైతన్యవంతులైన వీరుల

సమీపం నుండి వెళ్ళేటపు డీ విధంగానే చేయాలి.' అదివిని ఉత్తరుడు గుర్రపుపగ్గాలను విడిచిపెట్టి, రథం దిగి, కౌరవ మహారథుల వస్త్రాలను తీసుకొని తిరిగి వచ్చి, శీఘ్రంగా రథాన్ని ఎక్కాడు. వెంటనే విరాటపుత్రుడు సువర్ణాభరణ భూషితాలైన నాలుగురథాశ్వాలను అదిలించాడు. అర్జునుని రథాన్ని వహించే ఆతెల్లని గుర్రాలు రణరంగమధ్యమందున్న సైన్యసమూహాలనుండి తరలి వెళ్ళాయి. అలా యుద్ధరంగంనుండి తరలిన పురుష ప్రవీరుడైన అర్జునుని చూసి, వేగశాలియైన భీష్ముడు అర్జునుని గాయపరిచాడు. అపు డర్జునుడు కూడా భీష్ముని రథాశ్వాలను చంపి, పది బాణాలతో భీష్ముని కూడా గాయపరిచాడు. దుర్భేద్యమైన ధనుస్సుకల అర్జునుడు యుద్ధం భూమిలో భీష్ముని విడిచిపెట్టి, భీష్మసారథిని గాయపరచి, రథ సమూహం నుండి బయటకు వచ్చాడు. ఆసమయంలో అర్జునుడు మేఘమండలాన్ని చీల్చుకొని ప్రకాశిస్తున్న సూర్యునివలె ప్రకాశించాడు.

కొంతసేపటికి తేరుకున్న కురువీరులు ఇంద్రసముడైన పార్థుని చూశారు. యుద్ధరంగంనుండి బయటపడి దూరంగా, ఒంటరిగా ఉన్న అర్జునుని చూస్తూ దుర్యోధనుడు వెంటనే ఇలా అన్నాడు. 'తాతా! అర్జునుడు మీచేతినుండి ఎలా బయట పడ్డాడు? అర్జునుడు దాటిపోకుండా అతనిని మథించండి.' భీష్ముడు నవ్వుతూ దుర్యోధనునితో 'రాజా! చిత్రమైన నీ ధనుస్సును బాణాలను విడిచిపెట్టి పూర్తిగా ప్రశాంతుడవై మూర్ఛపోయావుకదా! ఆ సమయంలో నీబుద్ధి వీర్యం ఎక్కడికి వెళ్ళాయి? ఈ అర్జునుడు ఎప్పుడూ నిర్దయగా వ్యవహరించేవాడు కాదు. ఇతని విశిష్టమైన మనస్సెప్పుడూ పాపకార్యాల్లో ప్రవర్తించదు. ఇతడు ముల్లోకాలను జయించటం కోసమైనా సరే అధర్మాన్ని చేయడు. కనుకనే మనమందరం యుద్ధంలో అర్జునునిచేత చావలేదు. కురువీరుడా! నీవు వెంటనే కురుదేశాలకు తరలివెళ్ళు. అర్జునుడు గోవులను విడిపించుకొని వెనక్కు వెళ్ళిపోతాడు. మోహంచేత స్వప్రయోజనాన్ని నాశనం చేసుకోవద్దు. అందరూ కల్యాణకరాలయిన తమతమ పనులను చూసుకోవటం మంచిది.' అన్నాడు. తాతగారైన భీష్మునియొక్క హితవచనాలు విన్నాక ముక్కోపి దుర్యోధనుడు యుద్ధంపట్ల కోరికను విడిచిపెట్టాడు. పెద్దగా నిట్టూర్చి, మౌనంగా ఉండిపోయాడు. ఇతరయోధులకు కూడా భీష్మునిమాట హిత మనిపించింది. యుద్ధంచేస్తే ధనంజయాగ్ని ప్రజ్వరిల్లే సూచనలే కానవస్తున్నాయి. ఇదంతా ఆలోచించి దుర్యోధనుని

రక్షించుకొంటూ మరలి పోవటానికే యోధు లందరూ నిశ్చయించారు. కౌరవవీరు లందరూ తిరిగి వెళ్ళిపోతుండటాన్ని చూసి, ధనంజయుడు సంతోషించాడు. అర్జునుడు ఒక ముహూర్త కాలంపాటు అనునయభాషణం చేయకుండా మౌనంగా ఉండిపోయాడు. తరువాత తాతగారైన భీష్మునికీ, గురువైన ద్రోణునికీ శిరసుతో నమస్కరించి కుశలప్రశ్నలు చేశాడు. తరువాత అశ్వత్థామకు, కృపాచార్యునికి, మాన్య కురువీరులకు (బాహ్లీకసోమదత్తాదులకు) విచిత్రాలైన బాణాలతో అభివాదనంచేసి, పార్థుడు ఉత్తమ రత్నఖచితమైన దుర్యోధనుని కిరీటాన్ని ఒక బాణంతో ఛేదించాడు. ఇదేవిధంగా ఇతర కురువీరులనుండి సెలవు తీసుకొని, గాండీవఘోషతో లోకాలను పిక్కటిల్ల చేశాడు ధనంజయుడు. ఆ వీరుడు వెంటనే దేవదత్త శంఖాన్ని పూరించి శత్రువుల మనస్సులు బ్రద్దలు చేశాడు. ఈవిధంగా శత్రువులందరినీ పరాభవించి, హేమ మాలాలంకృతమైన ధ్వజంతో ప్రకాశిస్తూ కిరీటి కురువీరులు మరలినట్లు నిర్ధారించుకొని, మత్స్య పుత్రుడైన ఉత్తరునితో సంతోషంగా ఇలా అన్నాడు. 'ఉత్తరా! గుర్రాలను పశువులను మళ్ళించు. శత్రువులు ఓడిపోయారు. మరలిపోయారు. కనుక ఆనందంగా పట్టణంలోకి ప్రవేశించు'. కౌరవవీరులతో అర్జునుడు చేసిన మహాద్భుతయుద్ధాన్ని చూసిన దేవతాసమూహం పరమానందాన్ని పొందింది. దేవతలందరూ అర్జునుని పరాక్రమాన్ని స్మరించుకొంటూ తమతమ నివాసాలకు తిరిగి వెళ్ళారు.

67. అర్జునుడు విజయుడై రాజధానికి మరలుట.

అర్జునుడు యుద్ధంలో కౌరవులను జయించి, విరాటుని గోధనాన్ని తిరిగి తీసుకొనివచ్చాడు. పరాజితులై కౌరవులు వెళ్ళిన తర్వాత ఎంతోమంది కురుసైనికులు వివిధ ప్రదేశాల నుండి బయటకు వస్తున్నారు. వారంతా భయంతో కంపించి పోతున్నారు. వారి జుట్టు కకావికలయ్యింది. ఆకలి దప్పులతో అలసి పోయారు, చైతన్యం పూర్తిగా తిరిగిరాని వారందరూ చేతులు జోడించి బయటకు వస్తున్నారు. వారందరూ అర్జునునికి నమస్కరించి, కంగారు పడుతూనే అర్జునునితో 'పార్థ! మీకు మేము ఏవిధమైన సేవ చేయగలం?

(మేమంతా హృదయాంతరాళాల్లో దాగిన ప్రాణాలను నిలుపుకొన్నాము. ప్రాణరక్షణకై మిమ్ము యాచిస్తున్నాము. అర్జునా! మేము నీదాసులం. నీవే రక్షించ వలసినవారం!' అన్నారు. అర్జునుడు ఇలా

అన్నాడు.'సైనికులారా! విచారాన్ని వీడండి. అనాథులను, దుఃఖితులను, దీనులను, కృశించినవారిని, ముసలివారిని, పరాజితులను, శస్త్రపరిత్యాగం చేసినవారిని, నైరాశ్యంలో ఉన్నవారిని, నమస్కరిస్తున్న వారినీ నేను సంహరించను.)

మీకు శుభం కలుగుతుంది. సుఖంగా వెళ్ళండి. మీకు ఎంత మాత్రమూ భయం వద్దు. నేను బాధితులను చంపాలని భావించను. మిమ్మందరినీ అనునయిస్తున్నాను". అర్జునుని నుండి అభయదానాన్ని పొందిన యోధు లందరూ అర్జునుని కాయుర్దాయం, కీర్తి యశస్సు కలగాలని ఆశీర్వదిస్తూ ఆనందాన్ని కలిగించారు. అర్జునుడు శత్రువులను విడిచిపెట్టి, వారికి జీవనదానం చేశాడు. దెబ్బతిన్న గజంలా విరాటనగరాభిముఖంగా ప్రయాణిస్తున్న అర్జునునిపై ఆక్రమణం చేయటానికి కౌరవు లెవ్వరూ సాహసించలేకపోయారు.

అర్జునుడు మేఘాల్లా వచ్చిపడిన కురుసైన్యసమూహాన్ని పారద్రోలి, మత్స్యదేశరాజా కుమారుడైన ఉత్తరుని గాఢంగా కౌగలించుకొని, ఇలా అన్నాడు. 'నాయనా! నీతండ్రివద్దనే పాండవులందరూ కాలం గడుపుతున్నారు. ఈ విషయం నీకొక్కడికే తెలుసు. కనుక నీవు నగరంలోకి పోయి పాండవులను ప్రశంసించవద్దు. ఎందుకంటే మత్స్యరాజు విరాటుడు భయంతో ప్రాణత్యాగం చేసే ప్రమాదం ఉంది. ఉత్తరకుమారా! నీవు నగరంలో ప్రవేశించి తండ్రిని సమీపించి 'కురుసైన్యమంతా నాచేతనే జయించబడింది. నేనే గోసంపదను జయించి తీసుకువచ్చాను. యుద్ధంలో చేసిన ప్రతికార్యమూ నేను సాధించినదే" అని చెప్పుమన్నాడు అర్జునుడు. ఉత్తరకుమారుడు 'సవ్యసాచీ! నీవు చేసిన ఈ అద్భుతకార్యం మరొకరికి సాధ్యం కాదు. నీవు చేసిన పని చెయ్యగలిగే అద్భుతశక్తి నాకు లేదు. అయినా నీవు ఆజ్ఞాపించే వరకు నాతండ్రివద్ద నీకు సంబంధించిన విషయాలేవీ తెలియపర్చను' అన్నాడు. అర్జునుడు శత్రుసేనను జయించి, కౌరవులనుండి గోధనాన్ని తిరిగి సంపాదించి శ్మశానాన్ని చేరుకుని జమ్మిచెట్టువద్ద నిలబడ్డాడు. ఆ సమయంలో అర్జునుని శరీరం గాయాలతో కకావికలై ఉంది. తరువాత అగ్నిసమానతేజస్కుడైన మహాకపి, భూతసమూహంతో పాటు ఆకసంలోకి ఎగిరిపోయాడు. అలాగే మాయచేసినట్లు సింహధ్వజం మళ్లీ రథాన్ని చేరింది. కురుశ్రేష్ఠుల యుద్ధసామర్థ్యం పెంచి పోషించే గాండీవాన్ని, అక్షయతూణీరాన్ని, బాణాలను పూర్వం లాగే జమ్మిచెట్టుమీద దాచి, ఉత్తరుడు మహోత్కృష్టమైన కిరీటికి

సారథిగా సంతోషంగా నగరాన్ని ప్రవేశించాడు. పార్థుడు శత్రుసమూహాన్ని జయించి, అద్భుతకార్యాన్ని నిర్వర్తించి, తిరిగి పూర్వం లాగే జడను అలంకరించుకొని, ఉత్తరుని రథం పగ్గాలను చేపట్టాడు. అర్జునుడు బృహన్నలరూపం స్వీకరించి సారథియై సంతోషంగా నగరంలో ప్రవేశించాడు.

తరువాత కౌరవులు యుద్ధంలో పరాభవం పాలై, వివశులై, దీనవదనాలతో హస్తినాపురంవైపు ప్రయాణం సాగించారు. ఇటు అర్జునుడు కూడా విరాటనగరంవైపు ప్రయాణిస్తూ దారిలో ఉత్తరునితో ఇలా అన్నాడు. 'రాజకుమారా! చూడు! అన్నివైపుల నుండి గోగణమంతా గోపాలకులతో సహా తిరిగి వచ్చింది. కనుక అపరాహ్ణసమయంలో విరాటనగరానికి వెడదాము. ప్రస్తుతం గుర్రాలకు నీళ్ళు త్రాగించి సేద తీరుద్దాము. ఈ గోపాలురను నీవు శీఘ్రంగా నగరంలోనికి పంపు.వారు ప్రియమైన నీవిజయవార్తను నగరమంతా చాటిచెప్పాలి.' వెంటనే ఉత్తరుడు పార్థుని సూచన మేరకు శీఘ్రంగా దూతల నాజ్ఞాపించాడు. 'వెళ్ళండి మహారాజుతో నా విజయగాథను చెప్పండి. శత్రువులు పారిపోయారని గోసంపద విడిపింపబడిందని తెలియచేయండి.'

ఈ విధంగా అర్జునుడూ, ఉత్తరుడూ సంప్రదించుకొని తరువాత జమ్మిచెట్టును సమీపించి, విజయంతో మళ్ళీ సంతోషాన్ని పొంది పూర్వం అచట పాత్రలో ఉంచిన అలంకారాల్ని శరీరానికి అలంకరించుకొన్నారు. ఇలా శత్రుసైన్యాన్నంతా పరాభవించి, కౌరవుల నుండి సమస్త గోధనాన్ని లాగివేసి విరాట కుమారుడు, వీరుడు అయిన ఉత్తరుడు బృహన్నల సారథ్యంలో నగరంలో ప్రవేశించాడు.

68. విరాటుడు ఉత్తరుని గురించి చింతించుట - ఉత్తరుడు నగరప్రవేశము చేయుట.

విరాటరాజు (దక్షిణ గోష్ఠంలోని) గోవులను జయించి, శీఘ్రంగా నలుగురు పాండవులతో కలిసి, మిక్కిలి సంతోషంతో నగరంలో ప్రవేశించాడు. మహారాజా! యుద్ధంలో త్రిగర్తులను ఓడించి, గోవులన్నీ మరల్చి, విజయలక్ష్మీ సంపన్నుడైన విరాటరాజు కుంతీ పుత్రులతో కలిసి మిక్కిలి శోభించాడు. వీరుడైన విరాటరాజు రాజసింహాసనంమీద ఆసీను డయ్యాడు. కుంతీపుత్రులు రాజును సేవిస్తూ సమీపంలోనే

కూర్చున్నారు. బ్రాహ్మణులతోసహా సమస్త ప్రకృతివర్గం కూర్చునిఉన్నారు. అందరూ సైన్యంతో సహా మత్స్యరాజును అభినందించి స్వాగతసత్కారాలు చేశారు. అపుడు విరటుడు బ్రాహ్మణులను ప్రకృతివర్గాన్ని వీడుకొలిపి, అంతఃపురానికి వెళ్లి, ఉత్తరునిగూర్చి "రాజకుమారుడు ఉత్తరుడు ఎక్కడకు వెళ్లాడు?" అని అడిగాడు. అప్పుడు ఆ గృహంలో ఉండే స్త్రీలు, కన్యలు అతనిని గూర్చి అన్ని విషయాలు చెప్పారు. అంతఃపురంలో తిరిగే స్త్రీలు కూడా చెప్పారు. "మన గోధనాన్ని కౌరవులు హరించారు. అందుకని కుమార భూమింజయుడు మిక్కిలి సాహసంతో ఒక్కడూ గోవులను జయించి తీసుకురావడానికి బృహన్నలతో కలిసి బయలుదేరాడు. భీష్ముడు, కృపాచార్యుడు, కర్ణుడు, దుర్యోధనుడు, ద్రోణాచార్యుడు, అశ్వత్థామ – ఈ ఆరుగురు అతిరథవీరులు యుద్ధం చేయడానికి వచ్చారని తెలిసింది.'

తన కొడుకు బృహన్నలను సారథిగా తోడ్కొని, ఒక్కరథం సహాయంతోనే కౌరవులను ఎదిరించడానికి వెళ్లాడని విని, విరాటరాజుకు మిక్కిలి సంతాపం కలిగింది. అతడు తన మంత్రి ముఖ్యులందరితో ఇలా అన్నాడు. "కౌరవులే కానీ ఇతరరాజు లెవరైనా కానీ యుద్ధంలో త్రిగర్తులే వెన్నుచూపి పారిపోయారని వింటే వారు ఎప్పుడూ ఇక్కడ నిలువలేరు. కాబట్టి నా సైనికులలో త్రిగర్తులతో జరిగిన యుద్ధంలో గాయపడని వారంతా అధికమైన సైన్యంతో రాజకుమారుని రక్షణకోసం వెళ్లండి". అనంతరం అతడు కుమారుని రక్షణకోసం చిత్రవిచిత్రమైన ఆయుధాలు, ఆభరణాలు ధరించిన ఆశ్వికులను, గజారోహకులను, రథికులను, కాల్బలాన్ని మహావీరులైన వారిని ఎంచి పంపించాడు. అపుడు వాహినీపతి అయిన విరాటరాజు తనయొక్క చతురంగబలాలనూ ఇలా ఆదేశించాడు – "వెళ్ళండి. కుమారుడు జీవించిఉన్నాడా లేడా వెంటనే జాడ తెలుసుకోండి. సారథిగా వెళ్లిన నపుంసకుడు నా ఉద్దేశ్యంలో అయితే ఇప్పటికి బ్రతికి ఉండడు".

విరాటరాజు చాలా ఆందోళనగా ఉండడం చూసి ధర్మరాజు అతనితో నవ్వుతూ ఇలా అన్నాడు – 'రాజా! బృహన్నల సారధి అయితే శత్రువులు నేడు మీ గోవులను తీసుకు వెళ్లలేరని నమ్మవచ్చు. మీ హితం కోరే ఆ సారథియొక్క సహకారం వలన అన్ని కార్యాలు చక్కబడతాయి. మీకుమారుడు యుద్ధంలో సమస్త రాజులతో

వచ్చిన కౌరవులనే ఏమిటి? దేవతలను, రాక్షసులను, సిద్ధులను, యక్షులను కూడ నిశ్చయంగా జయింపగలడు'. అదే సమయంలో ఉత్తరుడు పంపించిన వేగవంతులైన దూతలు విరాటనగరానికి వచ్చి విజయవార్తను నివేదించారు. మంత్రులు ఆ సమాచారమంతా మహారాజుకు వినిపించారు. మన పక్షానికి గొప్పవిజయమూ, కౌరవులకు పరాజయమూ లభించాయి. రాజకుమారుడు ఉత్తరుడు నగరానికి వస్తున్నాడు. గోవులన్నిటినీ జయించి తీసుకొని వస్తున్నాడు. కౌరవులు ఓడిపారిపోయారు. శత్రుసంతాపకుడైన ఉత్తరకుమారుడు సారథిసహితంగా కుశలంగా ఉన్నాడు.

యుధిష్ఠిరు డన్నాడు. 'మహారాజా! గోవులను జయించి తీసుకురావడం, కౌరవులు పారిపోవడం అదృష్టమే. మీ పుత్రుడు కౌరవుల మీద విజయం పొందడం ఆశ్చర్యకరమైన విషయ మని నేను అనుకోవడంలేదు. బృహన్నల సారథిగా ఉంటే విజయం నిశ్చయమే. దేవతలకు రాజైన ఇంద్రునియొక్క సారథి మాతలి, అలాగే శ్రీకృష్ణుని సారథి దారుకుడు వీరిద్దరూ కూడా బృహన్నలకు సాటిరారు.' అమిత పరాక్రమవంతుడైన తనకుమారుని ' విజయవార్తను విని విరాటరాజు మిక్కిలి ఆనందించాడు. అతని శరీరం గగుర్పొడిచింది. అతడు దూతలను వస్త్రాలతో ఆభరణాలతో సత్కరించాడు. మంత్రులను ఈ విధంగా ఆజ్ఞాపించాడు. 'మన నగరవీథులన్నీ జెండాలతో అలంకరించి, పుష్పోపహారాలతో దేవతలకు పూజలన్నీ జరిపించాలి. కుమారులను, ముఖ్యులైన యోధులను, అలంకరించుకొనిన గణికలను, అన్ని రకాల మేళతాళాలను నా పుత్రునికి స్వాగతం చెప్పడానికి పంపాలి. ఒక మనిషి చేతితో గంట పట్టుకొని, మదగజాన్ని ఎక్కి నగరంలోని అన్ని కూడళ్లలోను మా విజయవార్తను వినిపించాలి. రాజకుమారి ఉత్తరకూడా చక్కని అందమైన వేషభూషలను అలంకరించుకొని, ఇతర రాజకుమారికలతో నా పుత్రునికి స్వాగతం చెప్పడానికి వెళ్ళాలి.' రాజుయొక్క ఈ ఆజ్ఞను విని విలువైన వేషభూషలలంకరించుకొన్న సౌభాగ్యవతులైన తరుణీమణులు, సూతులు, మాగధులు, వందిజనులతో సహా పురవాసులందరూ చేతులలో మంగళద్రవ్యాలతో, భేరీతూర్యశంఖపణవాది మంగళవాద్యాలతో పరాక్రమవంతుడైన ఉత్తరకుమారునికి స్వాగతం పలకడానికి నగరం వెలుపలికి బయలుదేరారు.

సైన్యాన్నీ, అందమైన వస్త్రభూషణాలను అలంకరించుకొనిన కన్యలనూ, గణికలనూ

పంపి మత్స్యనరేశుడు హర్షోల్లాసంతో ఇలా అన్నాడు. "సైరంధ్రీ! పాచికలు పట్టుకురా. కంకా! జూదం మొదలుపెడదాం". అతడు ఇలా అనడం విని యుధిష్ఠిరు డిలా అన్నాడు. 'జూదరి మిక్కిలి ఆనందంగా ఉన్నప్పుడు అతనితో జూదం ఆడకూడదని నేను వినిఉన్నాను. ఈ రోజు మీరు మిక్కిలి ఆనందంలో మునిగిఉన్నారు. కాబట్టి మీతో జూదం ఆడడానికి సాహసించలేను. అయినా మీకు ఇష్టమైనది చేయాలనే అనుకొంటున్నాను. కాబట్టి మీరు కావాలనుకొంటే ఆట ప్రారంభిద్దాం.' విరాటు డన్నాడు.' స్త్రీలు, గోవులు, సువర్ణం ఇంకా ఇతరమైన ధనం ఏదయినా సరే! సురక్షితంగా ఉన్నా జూదాన్ని మించి అవి ఏవీ నాకు రుచించవు. (నాకు జూదమే అన్నింటికంటె ఇష్టం).' కంకుడు అన్నాడు. 'రాజా! మీకు జూదం ఎందుకు? దీనిలో అనేక దోషాలు ఉన్నాయి. కాబట్టి దీన్ని విడిచి పెట్టాలి. తమరు ధర్మరాజును చూసి ఉండవచ్చు. లేదా అతని పేరయినా విని ఉంటారు. అతడు తన దేశాన్ని, తమ్ముళ్లను, రాజ్యాన్ని కూడా జూదంలో ఓడిపోయాడు. కాబట్టి నేను జూదాన్ని ఇష్టపడను. అయినా రాజా! మీకు ఆడాలని ఉంటే నేను తప్పక ఆడతాను.'

జూదం మొదలయింది. ఆడుతూ మత్స్యరాజు పాండునందనునితో ఇలా అన్నాడు. "చూడు. ఈ రోజు నాకొడుకు యుద్ధంలో ఆ ప్రసిద్ధులైన కౌరవులమీద విజయం సాధించాడు." అప్పుడు యుధిష్ఠిరుడు విరాటునితో ఇలా అన్నాడు - 'బృహన్నల సారధిగా ఉంటే అతడు యుద్ధంలో జయించకుండా ఎలా ఉంటాడు?' ఈమాట వింటూనే మత్స్యరాజు కుపితుడై పాండునందనునితో ఇలా అన్నాడు - 'నీచబ్రాహ్మణుడా! నీవు నాపుత్రునితో సమానంగా ఒక నపుంసకుని పొగడుతున్నావు. ఏది అనవచ్చునో, ఏది అనకూడదో నీకు తెలియడం లేదు. నిశ్చయంగా నీవు నీమాటలతో నన్ను అవమాన పరుస్తున్నావు. మంచిది. నాకొడుకు భీష్మద్రోణాది సమస్తవీరులను ఎందుకు జయించలేడు? బ్రాహ్మణుడా! మిత్రుడవయిన కారణంగా నిన్ను ఈ అపరాధానికి క్షమిస్తున్నాను. జీవించి ఉండాలనుకొంటే తిరిగి ఇలాంటి మాటలు మాట్లాడకు'. యుధిష్ఠిరుడు అన్నాడు. 'ద్రోణాచార్యుడు, భీష్ముడు, అశ్వత్థామ, కర్ణుడు, కృపాచార్యుడు, దుర్యోధనుడు, ఇంకా ఇతర మహారథికులు ఎందరు ఉన్నా వారినందరిని ఒక్క బృహన్నల తప్ప ఆ దేవతాగణాలతో కూడిన ఇంద్రు డయినా

సరే ఎదిరించగలుగుతాడా? బాహుబలంలో ఎవరికి సాటి లేదో, ఉండబోదో, యుద్ధం వస్తోందని తెలిసి ఎవడు సంతోషిస్తాడో, దేవతలు, దానవులు, మానవులు అందరూ కూడినా అందరినీ ఎవడు జయించగలడో అట్టి బృహన్నల సహాయకుడుగా ఉండగా రాకుమారుడు ఉత్తరుడు విజయం పొందకుండా ఎలా ఉంటాడు?'

విరాటు డన్నాడు -' కంకా! నేను ఎన్ని మారులు వారించినా నీవు నీ నాలుకను అదుపులో పెట్టుకోవడం లేదు. నిజమేలే. శాసించే రాజు లేకపోతే ఎవరూ ధర్మాన్ని ఆచరించరు.' ఇలా అన్న తరువాత కోపంతో మండిపడుతూ విరాటరాజు "ఇంక ఎప్పుడూ ఇలాంటి మాటలు ఆడకు" అంటూ చేతిలో ఉన్న పాచికను యుధిష్ఠిరుని ముఖం మీదకు బలంగా విసిరికొట్టాడు. పాచికదెబ్బ గట్టిగా తగలడంతో అతని ముక్కు వెంట రక్తం ధారకట్టింది. ధర్మాత్ముడయిన యుధిష్ఠిరుడు ఆ రక్తం భూమిమీద పడకుండా ముందుగానే తన రెండుచేతులతో అదిమిపెట్టి ప్రక్కనే నిలబడి ఉన్న ద్రౌపదికేసి చూశాడు. ఆమె భర్త మనసు గుర్తించి తదనుగుణంగా నడుచుకునేది కాబట్టి అతని అభిప్రాయాన్ని గుర్తించింది. వెంటనే నీటితో నిండిన బంగారుపాత్రను తెచ్చి, యుధిష్ఠిరుని ముక్కునుండి కారే రక్తాన్ని అందులోకి పట్టింది.

అదే సమయంలో రాజకుమారుడు ఉత్తరుడు మహాసంతోషంతో స్వేచ్ఛగా నగరంలో ప్రవేశించాడు. దారిలో అతనిమీద ఉత్తమమైన సువాసనగల పూలమాలలు కురియసాగాయి. మత్స్యదేశవాసులైన పౌరులు, జానపదులు, స్త్రీలు- అందరూ అతనికి స్వాగతం పలికారు. అలా అతడు రాజభవనద్వారం చేరుకుని తండ్రికి తన ఆగమనవార్తను పంపించాడు. అప్పుడు ద్వారపాలకుడు లోపలికి వెళ్లి విరాట మహారాజుతో "ప్రభూ! బృహన్నలతో కూడా రాజకుమారుడు ఉత్తరుడు ద్వారం దగ్గర వేచియున్నాడు." అని చెప్పాడు. ఈ వార్త విని ఆనందించిన మత్స్యరాజు విరాటుడు తన సేవకునితో "నేను వారిద్దరినీ చూడాలనుకొంటున్నాను. వారిని శీఘ్రంగా లోపలకు తీసుకురా" అన్నాడు. వెళ్లిపోతున్న సేవకుని చెవిలో యుధిష్ఠిరుడు నెమ్మదిగా "ముందు ఉత్తరుడిని ఒక్కడినే ఇక్కడకు ప్రవేశపెట్టు. బృహన్నలను వెంట రానీకు. వీరుడా! బృహన్నలకు ఒక నిశ్చితమైన వ్రతం ఉంది. యుద్ధభూమిలో కాకుండా ఎవరయినా సరే నా శరీరంలో గాయం చేసినా, రక్తం కారేటట్లు చేసినా

ఆ చేసినవాడు జీవించడు నా శరీరం మీద రక్తాన్ని చూసి అతడు తీవ్రంగా కోపిస్తాడు. ఈ అపరాధాన్ని క్షమించడు. విరాటరాజును మంత్రి సైన్య వాహనాలతో సహితంగా చంపిపారేస్తాడు' అన్నాడు.

తదనంతరం విరాటుని జ్యేష్ఠపుత్రుడు కుమార భూమింజయుడు లోపలికి వచ్చి, తండ్రిపాదాలకు నమస్కరించి, కంకునికి కూడా తలవంచి, నమస్కరించాడు. కంకభట్టు ఏకాంతంగా నేలమీద కూర్చుని ఉండడం, సైరంధ్రి అతనికి పరిచర్య చేయడం, అతడు వ్యగ్రమనస్కుడై ఉండడం, నిరపరాధి అయిన అతని శరీరం నుండి రక్తం కారడం చూశాడు ఉత్తరుడు. అప్పుడతడు ఉద్వేగంతో తండ్రిని "రాజా! ఎవ రీతనిని కొట్టినది? అంత పాపకర్మ చేసినవారెవరు?" అని అడిగాడు. విరాటుడన్నాడు - "కుమారా! నేనే ఈ కుటిలుని కొట్టాను. అత డంతటి గౌరవాని కెన్నటికీ అర్హుడు కాదు. చూడు మరి.. నేను నీ పరాక్రమాన్ని ప్రశంసిస్తూంటే.. అతడు ఆ పేడిని గురించి గొప్పగా చెప్తున్నాడు." ఉత్తరు డన్నాడు- "రాజా! నీవు చాలా అనుచితమైన పని చేశావు. వెంటనే ఇతనిని ప్రసన్నం చేసుకో. లేదా బ్రాహ్మణుని యొక్క భయంకరమైన కోపమనే విషం నిన్ను సమూలంగా దహించివేస్తుంది.' పుత్రుని మాటలు విని, దేశాభివృద్ధిని కాంక్షించే విరాటమహారాజు నివురుగప్పిన నిప్పులా ఉన్న యుధిష్ఠిరుని క్షమాపణ అడిగాడు. క్షమాపణ అడిగిన రాజును చూచి యుధిష్ఠిరుడు ఇలా అన్నాడు- 'రాజా! నేను చిరకాలంనుండి క్షమావ్రతాన్ని పాటిస్తున్నాను.కాబట్టి నీ ఈ అపరాధాన్ని అప్పుడే క్షమించేశాను. నాకు నీమీద ఇసుమంతయినా కోపం లేదు. మహారాజా! నా ముక్కునుండి కారిన రక్తం భూమిమీద పడినట్లయితే నీ రాజ్యంతో సహా నీవు నశించిపోయి ఉండేవాడవు. ఇందులో సందేహం ఏమీ లేదు. రాజా! ఎవరినీ నిందించని, ఏ అపరాధం చేయని వ్యక్తిని కొట్టడం అన్యాయం. అయినా నీవు చేసిన పనిని నేను నిందించను. ఎందుకంటే బలవంతుడైన రాజు తరచుగా తొందరపడి ఇటువంటి కఠినకర్మలు చేసే అవసరం వస్తుంటుంది."

యుధిష్ఠిరుని ముక్కునుండి రక్తం కారడం ఆగిపోయాక బృహన్నల రాజసభలో ప్రవేశించి, విరాట మహారాజుకు, కంకభట్టుకు కూడా నమస్కరించాడు. ఇటు

మత్స్యనరేశుడు కురునందనుడైన యుధిష్ఠిరుని క్షమాపణ అడిగి, సవ్యసాచియైన అర్జునుని గూర్చి విని ఉన్నప్పటికీ యుద్ధభూమినుండి వచ్చిన ఉత్తరుని ప్రశంసించడం మొదలుపెట్టాడు. 'కైకేయీ నందనా! నిన్ను పొంది నిజంగా నేను పుత్రవంతుడిని అయ్యాను. నీతో సమానుడైన వేరొక కొడుకు నాకు లేడు. ఉండబోడు. తండ్రీ! ఒకే లక్ష్యంతో పాటుగా వేయి లక్ష్యాలను కూడా ఛేదించ గలిగే బాణం వేస్తూకూడా ఎన్నడూ గురి తప్పని ఆ కర్ణునితో నీయుద్ధం ఎలా జరిగింది? బిడ్డా! మనుష్యలోకంలో సాటివచ్చేవారు ఎవరూ లేని ఆ భీష్మునితో నీవు ఎలా తలపడ్డావు? వృష్ణివీరులు, కౌరవవీరులు- వీరిరువురికే కాక సమస్త క్షత్రియులకు ఆచార్యుడైన, ద్రోణాచార్యునితో నీ యుద్ధం ఎలా సాగింది? ఆచార్యునియొక్క పుత్రుడు, అశ్వత్థామ పేరుతో ఖ్యాతికెక్కిన అతనితో నీ పోరు ఎలా సాగింది? ఆ కృపాచార్యునితో నీసంగ్రామం ఎలా జరిగింది? ఆ దుర్యోధనుని నీవెలా జయించి తిరిగి తెచ్చావు. ఇది చాలా మెచ్చుకో దగినది. ఈనాడు మన శత్రువు ఓడిపోయాడు. అందుకని నాకు ఈ గాలి చాలా సుఖదాయకంగా ఉంది. నరోత్తమా! నీవు శత్రువులందరినీ యుద్ధంలో జయించి, వారిని భయంలో పడవేశావు. పైగా ఆ సమస్త బలశాలుల చేతినుండి మన గోధనాన్ని పులి ఇతర జంతువులనుండి మాంసాన్ని లాగు కొన్నట్లుగా విడిపించి, తీసుకొనివచ్చావు.'

69. గెలుపును గూర్చి విరాటోత్తరుల సంభాషణ.

ఉత్తరుడు 'తండ్రీ! నేను గోవులనూ జయించలేదు. శత్రువుల మీద విజయాన్నీ సాధించలేదు. ఈసమస్త కార్యాన్నీ ఎవరో ఒక దేవకుమారుడు చేశాడు. నేను భయంతో పారిపోయి తిరిగి వస్తూంటే వజ్రంవలె బలిష్ఠమైన శరీరంగల తరుణుడైన దేవపుత్రుడు నన్ను మరలించి, అతడు స్వయంగా రథంపై రథికుడై కూర్చున్నాడు. అతడే గోవులను జయించి తెచ్చాడు. కౌరవులను ఓడించాడు. తండ్రీ! ఇదంతా ఆ వీరుని పనే. నేను ఏమీ చేయలేదు. కృపాచార్యుడు, ద్రోణాచార్యుడు, అశ్వత్థామ, కర్ణుడు, భీష్ముడు, దుర్యోధనుడు - ఈ ఆరుగురు మహారథికులను అతడే తన బాణాలతో యుద్ధ విముఖులను చేశాడు. యూథపతి అయిన గజరాజు తన ఏనుగుల గుంపుతో పారిపోయినట్లు దుర్యోధనుడు, వికర్ణుడు మొదలయిన రాజకుమారులు

భయంతో పారిపోసాగారు. అప్పుడు ఆ మహాబలుడు దేవపుత్రుడు దుర్యోధనునితో ఇలా అన్నాడు. "ధృతరాష్ట్రకుమారా! ఇపుడు హస్తినాపురంలో నీ ప్రాణరక్షణకు తగిన ఉపాయమేదీ నాకు కనిపించడం లేదు. కాబట్టి దేశ దేశాంతరాలలో తిరిగి నీ ప్రాణాలు రక్షించుకో. రాజా! పారిపోయినా నీవు బ్రతకలేవు. యుద్ధం మీద మనసుపెట్టు. జయించావా ఈ పృథ్వీరాజ్యాన్ని అనుభవిస్తావు. లేక మరణించావా స్వర్గం లభిస్తుంది. మహారాజా! ఈ మాట విన్నాడంతే. నరశ్రేష్ఠుడైన దుర్యోధనుడు సర్పంలా బుసకొడుతూ రథాన్ని మళ్లించుకొని వచ్చి, మంత్రులందరూ చుట్టూ చేరి ఉండగా ఆ దేవపుత్రుని మీద వజ్రనిభమైన బాణవర్షాన్ని కురిపించాడు. ఆ సమయంలో దాన్ని చూసిన నాకు భయంతో రోమాలు నిక్కపొడుచుకొన్నాయి. కాళ్లు వణకసాగాయి. కాని ఆ దేవపుత్రుడు తన బాణాలతో సింహసమాన పరాక్రమం కల దుర్యోధనునీ, అతని సైన్యాన్నీ తపింపచేశాడు. సింహంతో సమానమైన దృఢమైన శరీరం కల్గి ఆ తరుణవయస్కుడైన వీరుడు రథాలను అధిరోహించిన సైన్యాన్ని అంతటినీ ఛిన్నభిన్నం చేసి, నవ్వుతూ ఆ కౌరవులను కూడా నేలమీద పడవేశాడు. వాళ్ల వస్త్రాలు అపహరించబడ్డాయి. మదించిన సింహం అడవిలో తిరిగే జంతువులను పరాభవించినట్లుగా ఆ వీరుడైన దేవపుత్రుడు ఒంటరిగానే ఆ ఆరుగురు మహారథికులను ఓడించాడు.' అది విని విరాటుడు అడిగాడు- 'కుమారా! యుద్ధంలో కౌరవులను వశపరుచుకొని మన ఆవులను గెలుచుకొని నిన్ను, మన ఆవులనుకూడా రక్షించిన దేవపుత్రుడు ఎక్కడ ఉన్నాడు? నే నా వీరుడిని, పరాక్రమవంతుడిని చూడాలని, సత్కరించాలని కోరుకొంటున్నాను.' ఉత్తరుడు చెప్పాడు. 'తండ్రీ! ఆ మహా బలవంతుడైన దేవపుత్రుడు అక్కడే అంతర్ధానం అయిపోయాడు. కాని అతడు రేపో, ఎల్లుండో తిరిగి ప్రత్యక్ష మవుతాడని అనుకొంటున్నాను.' ఈ రీతిగా సంకేతపూర్వకంగా చెప్పినప్పటికీ విరాటరాజు ప్రచ్ఛన్నంగా ఉన్న అర్జునుని గుర్తుపట్టలేకపోయాడు. తరువాత మహాత్ముడైన విరాటుని అనుమతితో బృహన్నలారూపంలో ఉన్న అర్జునుడు యుద్ధంలో మహారథులనుండి తీసుకొన్న ఆ వస్త్రాలనన్నింటిని స్వయంగా విరాటకన్య ఉత్తరకు ఇచ్చాడు. వివిధవర్ణాలుకల, మిక్కిలి విలువైన ఆ నూతనవస్త్రాలను తీసుకుని ఉత్తర చాలా ఆనందించింది. అర్జునుడు మహాత్ముడైన ఉత్తరునితో యుధిష్ఠిరుని వెల్లడిచేసే విషయం ఆలోచించి,

ఏమేమి చేయాలో నిశ్చయించుకొన్నాడు. అనంతరం అతడు ఆ నిర్ణయాన్ని అనుసరించి అన్నికార్యాలు చక్క బెట్టాడు. భరతకుల శిరోమణులైన పాండవులు ఉత్తరునితో కలిసి ఆ ఏర్పాట్లన్నీ చేసి మిక్కిలి సంతోషించారు.

70. అర్జునుడు విరాటునకు ధర్మరాజును గూర్చి తెలుపుట.

తరువాత నియమితసమయం వరకు తమ ప్రతిజ్ఞను పాటించి అగ్నివలె తేజరిల్లే ఆ ఐదుగురు పాండవులు మూడవరోజున స్నానంచేసి, తెల్లని వస్త్రాలు రాజోచిత భూషణాలు ధరించి, రాజసభలో ద్వారం వద్ద నిలచియుండే మదోన్మత్తగజరాజులవలె శోభిల్లారు. వారు యుధిష్ఠిరమహారాజును ముందుంచుకొని, రాజసభలో ప్రవేశించి, రాజులకోసం ఉంచబడిన సింహాసనాలమీద కూర్చున్నారు. అపుడు వారు వేరువేరు వేదికల మీద ప్రకాశిస్తున్న అగ్నుల వలె ప్రకాశించారు. వారు అక్కడ అలా కూర్చుని ఉండగానే విరాటరాజు రాజకార్యాలు నిర్వహించడానికి సభకు వచ్చాడు. ప్రజ్వరిల్లుతున్న అగ్నులవలె తేజస్సులూ, శోభాసంపన్నులూ అయిన పాండవులను చూసి విరాట మహారాజు రెండుక్షణాలు మనసులో తబ్బిబ్బుపడ్డాడు. తరువాత కోపంతో దేవగణ పరివేష్టితుడైన దేవేంద్రుని వలె ప్రకాశిస్తున్న కంకునితో ఇలా అన్నాడు. 'కంకా! నేను నిన్ను పాచికలాడే సభ్యునిగా నియమించాను గదా! ఈ రోజు నీవు అలంకరించుకొని సింహాసనం మీద ఎలా కూర్చోగలిగావు?' పరిహాసానికి అన్నట్లుగా ఉన్న విరాటరాజు మాటలను విని, అర్జునుడు చిరునవ్వు నవ్వుతూ ఇలా అన్నాడు.

'రాజా! నీ సింహాసనమే అన్నమాట ఏమిటి? ఇతడు ఇంద్రుని అర్ధాసన మెక్కటానికే అర్హుడు. ఈతడు బ్రాహ్మణభక్తుడు. శాస్త్రపండితుడు. త్యాగి. యజ్ఞశీలుడు. దృఢంగా తనవ్రతాన్ని కొనసాగించగలిగినవాడు. ఇతడు మూర్తీభవించిన ధర్మం. పరాక్రమవంతులైన పురుషులలో శ్రేష్ఠుడు. ఈ లోకంలో అందరికంటె బుద్ధిమంతుడు, తపస్సుకు ఆశ్రయమైనవాడు. ఇతనికి అనేకవిధాలైన అస్త్రాలు తెలుసును. వానిని ఈ చరాచరమైన ముల్లోకాలలో వేరొకరెవరూ తెలుసుకోలేదు, తెలుసుకోలేరు. దేవతలకు, అసురులకు, మనుష్యులకు, రాక్షసులకు, గంధర్వులకు, యక్షులకు,

కిన్నరులకు, మహానాగులకూ కూడా తెలియని అస్త్రాలు అన్నీ ఇతనికి తెలుసును. ఇతడు దీర్ఘదర్శి. మహాతేజస్వి. పట్టణవాసులకు, పల్లెవాసులకు కూడా మిక్కిలి ఇష్టుడు. పాండవులలో అతిరథుడైన వీరుడు. యజ్ఞధర్మానుష్ఠానాలలో లగ్నమై ఉండేవాడు. మనసును, ఇంద్రియాలను వశంలో ఉంచుకొనేవాడు. ఇతడు మహర్షితుల్యుడు. రాజర్షి. సర్వలోక విఖ్యాతుడు. బలవంతుడు. ధైర్యవంతుడు. చతురుడు. సత్యవాది. జితేంద్రియుడు. ధనభోగంలోను, సంగ్రహంలోను ఇంద్ర కుబేరులతో సమానుడు. మహాతేజస్వి అయిన మనువు సమస్తలోకాలను రక్షిస్తూ ఉన్నట్లు ఈ మహాతేజస్వి అయిన మహారాజు కూడా ప్రజలను అనుగ్రహిస్తూ ఉంటాడు. ఇతడే కురువంశంలో సర్వశ్రేష్ఠు డయిన ధర్మరాజు యుధిష్ఠిరుడు. ఉదయించే సూర్యుని కాంతిలాగ ఇతని కీర్తి సుఖదాయకమై సమస్తలోకాలలో వ్యాపించింది. సూర్యుడు ఉదయించేటపుడు ఆ కాంతికిరణాలు అన్నిదిక్కులకు వ్యాపించినట్లుగా ఇతని సత్కీర్తితో పాటు ఆ సుధాధవళమైన కిరణాలు కూడా అన్నిదిక్కులలో వ్యాపిస్తున్నాయి.

రాజా! ఈ మహారాజు కురుదేశాలలో నివసించేటపుడు వేగంగల పదివేల ఏనుగులు ఇతనిని అనుసరించేవి. అలాగే మంచి గుఱ్ఱాలు పూన్చిన సువర్ణమాలాలంకృతాలైన ముప్పదివేల రథాలు కూడా ఆ సమయంలో ఇతనిని అనుసరిస్తూ ఉండేవి. మహర్షి గణాలు ఇంద్రుని స్తుతించినట్లుగా, విశుద్ధమైన మణిమయకుండలాలు ధరించిన ఎనిమిదివందలమంది సూతులు, మాగధులు ఇతని గుణగణాలను మునుపు గానం చేసేవారు. దేవగణాలు ధనాధ్యక్షుడైన కుబేరుని కొలిచినట్లు సమస్తరాజులూ, కౌరవులూ కింకరులవలె ఇతనిని నిత్యం సేవిస్తూ ఉండేవారు. ఈ మహాభాగుడైన నరేశుడు ఈ దేశంలోని సమస్తరాజులను, వైశ్యులవలె వశ్యులను చేసికొని కప్పం కట్టించుకొన్నాడు. ఉత్తమమైన వ్రతాన్ని పాటించే ఈ రాజు దగ్గర ప్రతిదినం ఎనభైవేల మంది బుద్ధిమంతులైన స్నాతకులు ఆశ్రయం పొందేవారు. ఇతడు వృద్ధులను, అనాథలను, కుంటివారిని, గ్రుడ్డివారిని కూడా మిక్కిలి స్నేహంతో పోషిస్తూ ఉండేవాడు. ఈ మహారాజు తనప్రజలను ధర్మబద్ధంగా పుత్రులవలె రక్షిస్తూ ఉండేవాడు. ఈ రాజు ధర్మమందు, ఇంద్రియ నిగ్రహమందు తత్పరుడు. క్రోధాన్ని వశంలో ఉంచుకొనే దృఢప్రతిజ్ఞ పూనినవాడు. మిక్కిలి

దయాళువు. బ్రాహ్మణభక్తి కలవాడు. సత్యవాది. దుర్యోధనుడు శక్తిశాలి అయినా కర్ణుడు, శకుని మొదలయిన గణాలతో కూడినా ఇతని ప్రతాపంతో అతడు తీవ్రంగా పరితపించే వాడు. నరేశ్వరా! ఇతని సద్గుణాలు ఎన్నశక్యం కాదు. ఈ పాండునందనుడు నిత్యధర్మపరాయణుడు. దయాస్వభావుడు. రాజా! సమస్తరాజులకు తలమానికమైన పాండునందనుడు మహారాజు యుధిష్ఠిరుడు. ఇన్ని సర్వోత్తమ గుణాలు కలిగినవాడు రాజోచితమైన ఆసనానికి ఎందుకు అర్హుడు కాడు?'

71. విరాటుడు మిగిలిన పాండవులను తెలిసికొనుట.

విరాటుడు అడిగాడు – 'ఇతడు కురుకులరత్నం, కుంతీనందనుడు, మహారాజు యుధిష్ఠిరుడు అయితే వీరిలో ఇతని సోదరుడు అర్జునుడు ఎవరు? మహాబలి భీము డెవరు? నకులసహదేవులు, యశస్విని ద్రౌపది ఏరీ? కుంతీపుత్రుడు జూదంలో ఓడిపోయినప్పటినుండి అతని జాడయే తెలియలేదు.' అర్జునుడు చెప్పాడు –'మహారాజా! వల్లవుడు అనే పేరుతో మీవంటశాలలో ఉన్నవాడే భయంకర వేగమూ, పరాక్రమమూ గల భీమసేనుడు. ఇతడే గంధమాదనపర్వతం మీద క్రోధవశ నామకులైన రాక్షసులను చంపి, ద్రౌపదికోసం దివ్య సౌగంధికకమలాలను తెచ్చినవాడు. దురాత్ముడయిన కీచకుని చంపిన గంధర్వుడు కూడా ఇతడే. ఇతడే నీఅంతఃపురంలో ఎన్నో పులులను, ఎలుగులను, వరాహాలను చంపినవాడు. ఇతడే హిడింబునీ, బకాసురునీ, కిర్మీరునీ, జటాసురునీ సంహరించి, అడవిని అన్నివిధాలా నిష్కంటకం, సుఖమయం చేసినవాడు.

ఇదిగో. ఇతడు శత్రువులను సంతాపింపచేయ గల నకులుడు. ఇంతవరకు నీఅశ్వశాలానిర్వాహకునిగా ఉన్నాడు. గోవులను సంరక్షించేవాడే సహదేవుడు. మాద్రీపుత్రులైన వీరు మహారథికులు, వీరులు. చక్కని శృంగారవేషభూషణాలతో శోభిల్లే అన్నదమ్ములు. ఇద్దరూ రూపవంతులు. క్షీర్తిమంతులు. భరతవంశ శ్రేష్ఠులైన ఈ నకులసహదేవులు యుద్ధంలో వేలకొద్దీ మహా రథికులను ఎదిరించగల సమర్థులు. రాజా! వికసించిన కమలదళాలవంటి విశాల నేత్రాలూ, చక్కని నడుమూ ,మనోహరమైన చిరునవ్వు కల సైరంధ్రియే మహారాణి ద్రౌపది. ఈమె పతివ్రతాధర్మాన్ని రక్షించడం

కొరకే కీచకులు వధింపబడ్డారు. మహారాజా! నేనే అర్జునుడిని. నా పేరు వినే ఉంటారు . నేను కుంతీ పుత్రుడను. భీమసేనునికంటె చిన్నవాడిని. నకులసహదేవుల కంటె పెద్దవాడిని. రాజా! సంతానం గర్భవాసంలో సురక్షితంగా ఉన్నట్లుగా మేమంతా మీ భవనంలో అజ్ఞాతవాస సమయాన్ని సుఖంగా గడిపాం, అర్జునుడు ఐదుగురు పాండవులను పరిచయం చేశాక ఉత్తరుడు అర్జునుని పరాక్రమంగూర్చి చెప్పడం మొదలు పెట్టాడు. తిరిగి అతడు పంచపాండవులను ఒక్కొక్కరిగా రాజుకు పరిచయం చేశాడు.

ఉత్తరుడు చెప్పాడు - 'తండ్రీ! విశుద్ధమైన బంగారంతో సమానమైన శరీరం కలవాడు, అందరికంటె ఉన్నతుడు, సింహంవలె హృష్టి పుష్టి కలవాడు, పొడవైన నాసిక, కొద్దిగా ఎఱ్ఱనై చెవులదాకా వ్యాపించిన పెద్దపెద్ద కన్నులు కల. ఇతడే కురుకుల నరేశుడైన యుధిష్ఠిర మహారాజు. మదపుటేనుగు నడక, పుటం పెట్టబడిన బంగారంతో సమానమైన గౌరవర్ణపు శరీరం, వెడల్పయి బలిసిన భుజాలు, పెద్దవయి దీర్ఘమయిన బాహువులు కల ఇతడే భీమసేనుడు. చక్కగా తేరిపార చూడు ఇతనిని. ఇతని ప్రక్కన కూర్చున్న మహాధనుర్ధరుడు, నల్లని వర్ణం కల తరుణవయస్కుడు వీరుడు, యూథపతి అయిన గజరాజులా శోభిల్లేవాడు, సింహంలా ఎత్తయినబుజాలు, మదపుటేనుగు నడక, కమలదళాలతో సమానమైన విశాలనేత్రాలు కల ఈ వీరవరుడే అర్జునుడు. మహారాజు యుధిష్ఠిరునికి సమీపంలో కూర్చున్న ఇంద్రోపేంద్రులతో సమానమైన ఈ నరశ్రేష్ఠులు ఇద్దరు మాద్రి కవలకొడుకులయిన నకులసహదేవులు. వీరితో సమానమైన రూపబలశీలాలు కలవారు ఈసమస్త ప్రపంచంలో వేరొకరు లేరు. ఈ ఇరువురిప్రక్కన తేజస్సుతో సాక్షాత్తూ గౌరీదేవివలె నిలబడి నల్లకలువల కాంతిని కూడా లజ్జింప చేసే కనులతో సువర్ణశరీరకాంతితో దేవతల కందరకు దేవి అయిన లక్ష్మీదేవితో సమానంగా శోభిల్లే ఈమెయే ద్రుపదుని కూతురు, మహారాణి కృష్ణ.'

ఇలా ఆ ఐదుగురు పాండవులను మహారాజుకు పరిచయం చేసి విరాటకుమారుడు అర్జునుని పరాక్రమాన్ని వర్ణించడం ప్రారంభించాడు. ఉత్తరుడు చెప్పాడు.' తండ్రీ! సింహం మృగాలను వధించినట్లు శత్రువులను వధించిన ఇతడే ఆ దేవపుత్రుడు.

ఇతడే కౌరవుల రథసైన్యంలో సర్వ శ్రేష్ఠులయిన మహారథికులను గాయపరిచి, నిర్భయంగా విహరించినవాడు. యుద్ధంలో ఇతని ఒక్కబాణంతోనే గాయపడి, వికర్ణునియొక్క పెద్దవీనుగు బంగారుకటిసూత్రంతో నేలకూలి రెండుదంతాలు విరిగి, చనిపోయింది. ఇతడే గోవులను జయించాడు. యుద్ధంలో కౌరవులను ఓడించాడు. ఇతని శంఖంయొక్క గంభీరనాదంచేత నాచెవులు వినపడకుండా పోయాయి. ఉత్తరుని ఈ మాటలను విని, యుధిష్ఠిరుని పట్ల అపరాధభావం కల ప్రతాపశాలియైన మత్స్యనరేశుడు తనకొడుకుతో ఇలా అన్నాడు.' పుత్రా! ఈ పాండవులను ఆనందింప చేయవలసిన సమయమిది. నాకు ఇలా చేయడం ఇష్టం. నీకు కూడా ఇష్టమయితే మనఉత్తరను కుంతీపుత్రు డయిన అర్జునునికి ఇచ్చి వివాహం చేద్దాం.' ఉత్తరు డంటున్నాడు. 'తండ్రీ! పాండవులు పూజ్యులు, సౌభాగ్యయోగ్యులు. నాఉద్దేశ్యంలో వీరిని సత్కరించడానికి మనకు అవకాశం లభించింది. కాబట్టి ఈ పూజనీయులైన పాండవులను తాము తప్పక పూజించాలి.'

అపుడు విరాటుడు ఇలా అన్నాడు.'నేను కూడా త్రిగర్తులతో యుద్ధంలో శత్రువులకు వశమయ్యాను. అపుడు భీముడే నన్ను విడిపించాడు. గోవులనూ అలాగే జయించాడు. ఈ పాండవుల బాహుబలంచేతనే యుద్ధంలో మనకు విజయం కలిగింది. కాబట్టి వత్సా! నీకు భద్రమగుగాక! మనమందరం మంత్రులతో కూడి వెళ్లి పాండవశ్రేష్ఠుడయిన యుధిష్ఠిరుని అతని తమ్ములతో సహా సంతోషపరచాలి. అజ్ఞానంతో తెలియక వీరిపట్ల అనుచితంగా మనం పలికిన మాటలన్నీ ధర్మాత్ముడు, పాండుపుత్రుడు, అయిన యుధిష్ఠిరమహారాజు మన్నించునుగాక!'. తరువాత విరాటమహారాజు మిక్కిలి ఆనందంతో తనపుత్రునితో కలిసి కొద్దిసేపు ఆలోచించి, దండ కోశ నగరాదులతో సహితంగా తన సంపూర్ణరాజ్యాన్ని యుధిష్ఠిరునికి సమర్పించాడు. అంతేకాదు. ప్రతాపవంతుడైన ఆ మత్స్యరాజు అర్జునుని ముందుంచుకొని, పాండవులందరిని కలిసి "మీదర్శనం అయింది. మాభాగ్యం. మాఅదృష్టం" అని అన్నాడు. అతడు యుధిష్ఠిరుని, భీముని, అర్జునుని, నకులసహదేవులను శిరసుమూర్కొని హృదయానికి అత్తుకొన్నాడు. వాహినీపతి అయిన విరాటునికి పాండవులను ఎంతసేపు చూసినా తనివి తీరలేదు. ఆయన ప్రేమపూర్వకంగా యుధిష్ఠిరమహారాజుతో ఇలా అన్నాడు.

'మీరంతా వనవాసంనుండి క్షేమంగా తిరిగిరావడం అదృష్టమే. దుర్మార్గులైన కౌరవులకు తెలియకుండా మీరు ఈకష్టసాధ్యమైన అజ్ఞాతవాసనియమాన్ని పూర్తి చేయడం కూడా చాలా ఆనందించదగినవిషయం. నా ఈ రాజ్యం కుంతీపుత్రునకు సమర్పించాను. ఇంకా ఏదైనా నాదన్నది ఉంటే దానిని ఈపాండవు లందరూ నిస్సంకోచంగా తీసుకోవచ్చును. సవ్యసాచి ధనంజయుడు నాకూతురు ఉత్తరను భార్యగా స్వీకరించునుగాక! ఈనరశ్రేష్ఠుడు ఆమెకు అన్నివిధాలా యోగ్యుడైన భర్త.' విరాటరాజు ఇలా అన్నవెంటనే ధర్మరాజు అర్జునునివైపు చూశాడు. అన్నచూపును గ్రహించిన అర్జునుడు మత్స్యరాజుతో ఇలా అన్నాడు -'రాజా! నేను మీకుమార్తెను కోడలిగా గ్రహిస్తున్నాను. మత్స్య భరతవంశాల మధ్య ఏర్పడే ఈ సంబంధం అన్నివిధాలా తగినది.'

72. ఉత్తరాభిమన్యుల వివాహము.

విరాటుడు అడిగాడు. 'పాండవశ్రేష్ఠా! నేను స్వయంగా నాకూతురిని నీకు ఇస్తున్నాను. అయినా నీవు భార్యగా ఆమెను ఎందుకు స్వీకరించడంలేదు?' అర్జునుడిలా చెప్పాడు. 'నేను చాలాకాలం మీ అంతఃపురంలో ఉన్నాను. మీ కుమార్తెను ఏకాంతంలోనూ, అందరి ఎదుటా కూడా పుత్రీభావంతోనే చూస్తూ వచ్చాను. ఆమెకూడా నన్ను తండ్రిలాగే విశ్వసించింది. నేను నాట్యం చేయడమేకాదు. గానవిద్యలోనూ నేర్పరినే. కాబట్టి ఆమెకు నాయందమితమైన ప్రేమ. కాని ఆమె నన్ను ఎప్పుడూ ఆచార్యునిగానే భావించింది. రాజా! యుక్తవయస్కురాలు అయిన ఆమెతో నేను సంవత్సరంపాటు ఉన్నాను. ప్రభూ! ఇట్టి పరిస్థితిలో నేను ఆమెను వివాహమాడితే మీకు గాని, ఇతరులకు గాని మా నడవడి విషయంలో సందేహం రావచ్చును. మహారాజా! అలాంటి సందేహం లేకుండా నేను మీకుమార్తెను కోడలిగా అర్థిస్తున్నాను. అలా చేస్తేనే నేను శుద్ధచరితుడిని, జితేంద్రియుడిని, మనోనిగ్రహం కలవాడి నని తెలుస్తుంది. పైగా దీనివల్లనే నాద్వారా మీ కుమార్తె నడవడిలోని శుద్ధత స్పష్టమవుతుంది. కోడలికి, కూతురికి, అలాగే కొడుకుకి తనకు భేదం లేదు. కాబట్టే ఆమెను కోడలిగా స్వీకరిస్తేనే కళంకశంక ఉండ దనిపిస్తోంది. పైగా

దీనివలన మా ఇద్దరి పవిత్రత కూడా అందరికీ స్పష్టమవుతుంది. పరంతపా! నేను అభిశాపానికి అపనిందకు భయపడుతున్నాను. కాబట్టి రాజా! నేను మీకుమార్తె ఉత్తరను కోడలిగానే స్వీకరిస్తాను. నాకొడుకు దేవపుత్రునితో సమానుడు. అతడు సాక్షాత్తు భగవంతుడైన వాసుదేవునికి మేనల్లుడు. చక్రధారి అయిన శ్రీకృష్ణునికి అతడు మిక్కిలి ఇష్టుడు. అంతేకాదు. అతడు అన్నిరకాల అస్త్రవిద్యలలో కుశలుడు. మహారాజా! మహాబాహువైన నాపుత్రునిపేరు అభిమన్యుడు. మీకు అతడు మిక్కిలి యోగ్యుడైన అల్లుడు. మీకుమార్తెకు తగిన భర్త అవుతాడు.'

విరాటు డన్నాడు- 'పార్థా! మీరు కౌరవులలో శ్రేష్ఠులు. కుంతీపుత్రులు. ధనంజయుడు ఈ విధంగా ధర్మచర్చ చేయడం ఉచితమే. పాండుపుత్రు డైన అర్జునుడే ఈ రకమైన నిత్యధర్మపరాయణుడు, జ్ఞానసంపన్నుడు కాగలడు. ఇటుపిమ్మట ఏమి చేస్తే మంచిది అని మీరు అనుకొంటారో అది చేయవచ్చు. అర్జునునితో సంబంధం నెరపిన నాకోరికలన్నీ నెరవేరాయి.' విరాటమహారాజు ఇలా అన్నమీదట కుంతీనందను డయిన యుధిష్ఠిరుడు మత్స్య పార్థుల సంబంధాన్ని ఆమోదించాడు. తదనంతరం యుధిష్ఠిరుడు, విరాటరాజు తమ మిత్రులకు, బంధువులకు, అందరికీ భగవంతుడైన వాసుదేవునికీ ఆహ్వానాలు పంపారు.

పంచపాండవులు తమ పదమూడవ సంవత్సరం పూర్తి కావడంతో అందరూ విరాటుని ఉపప్లవ్యమనే నగరానికి వచ్చి నివసించసాగారు. అర్జునుడు ఆనర్తదేశంనుండి అభిమన్యుని, వాసుదేవుని, దశార్హవంశానికి చెందిన తన ఇతర బంధువులను కూడా అక్కడికి పిలిపించాడు. యుధిష్ఠిరుని పట్ల ప్రీతి గలిగిన కాశీరాజు, శైబ్యుడు అనే రాజులు ఇద్దరు ఒక్కొక్క అక్షౌహిణి సైన్యంతో ఉపప్లవ్యనగరానికి వచ్చారు. మహాబలుడైన ద్రుపదమహారాజు ఒక అక్షౌహిణి సేనతో విచ్చేశాడు. అతనితో పాటు ద్రౌపదియొక్క వీరులైనపుత్రులూ, ఓటమిఎరుగని శిఖండి, శస్త్రధారులందరిలో శ్రేష్ఠుడు, దుర్ధర్షుడు అయిన ధృష్టద్యుమ్నుడు కూడా వచ్చారు. వీరే కాకుండా ఒక్కొక్క అక్షౌహిణిసైన్యంతో పాండవులకోసం ప్రాణాలుఇచ్చే అనేక రాజులు కూడా అక్కడికి వచ్చారు. వారు భూరిదక్షిణ లిచ్చి యజ్ఞాలు చేసి అవభృథస్నానం చేసిన వీరులు. ధర్మాత్ములలో శ్రేష్ఠుడైన విరాటరాజు ఆ వచ్చిన వారిని చూసి సేవకులు, సైన్యం, వాహనాలతో

సహితంగా వారందరికీ యథావిధిగా స్వాగతసత్కారాలు చేశాడు.

అభిమన్యునికి తన కూతురును ఇస్తానని మాట ఇచ్చి విరాటరాజు చాలా ఆనందించాడు. తరువాత ఆవచ్చిన రాజులందరూ తమకు తమకు నియమితమైన స్థానాలకు వెళ్లి విశ్రమించారు. అప్పు డక్కడికి వనమాలాధారి అయిన వసుదేవనందనుడు శ్రీకృష్ణుడు, హలాయుధధారి అయిన బలరాముడు, హృదీకుని పుత్రుడైన కృతవర్మ, యుయుధానుడు (సాత్యకి), అక్రూరుడు, సాంబుడు, నిశఠుడు, శత్రుసంహారం చేయగల వీరులందరూ అభిమన్యుని, అతని తల్లిని కూడా వెంటవెట్టుకొని వచ్చారు. ఒకసంవత్సరంపాటు ద్వారకలో ఉండిపోయిన ఇంద్రసేనాది సారథులు కూడా చక్కగా సమస్తసామగ్రితో నిండియున్న రథాలతో అక్కడికి వచ్చారు. పరమతేజస్వి, వృష్ణివంశశిరోమణి అయిన వాసుదేవుని పదివేల ఏనుగులు, అంతకు రెట్టింపు గుఱ్ఱాలు, పదివేల రథాలు, పదిలక్షల కాల్బలమూ కల సైన్యం అనుసరించింది. అంతేకాక వృష్ణి, భోజ, అంధక వంశాలకు చెందిన మహాపరాక్రమ వంతులైన వీరులు కూడా అతనితోపాటు వచ్చారు.

శ్రీకృష్ణుడు మహాత్ములైన పాండవులకు దాసీలను, అనేక రత్నాలను, వస్త్రాలను వేర్వేరుగా కానుకలుగా ఇచ్చాడు. అనంతరం మత్స్యపార్థవంశాల మధ్య వైవాహికక్రతువు విధిపూర్వకంగా ప్రారంభ మయింది. కుంతీపుత్రులతో సంబంధం కలుపుకొన్న విరాటరాజు భవనంలో శంఖభేరీలు, గోముఖాలు, డంబరాలు మొదలైన వివిధవాద్యాలు మ్రోగాయి. తినడానికి, త్రాగడానికి యోగ్యమైన అన్నపానీయాలను ఎక్కువ పరిమాణంలో సమకూర్చారు. గాయకులు, ప్రాచీనగాథలు వినిపించేవారు, నటులు, వైతాళికులు, సూతమాగధులు అందరూ వచ్చి పాండవులను ప్రస్తుతించారు. సర్వాంగీణమైన సౌందర్యంతో విశుద్ధమణిమయ కుండలాలు ధరించి మత్స్యనరేశుని రాణివాసంలోని సుందరీమణులు సుదేష్ణను పురస్కరించుకొని ద్రౌపది దగ్గరకు వచ్చారు. ఆ స్త్రీలందరూ మంచిరంగుతో, రూపవతులై రకరకాల సుందరమైన నగలు ధరించి ప్రకాశిస్తున్నారు. అయినా ద్రౌపది తన దివ్యరూపంచేత, యశస్సుచేత,కాంతిచేత వారందరినీ మించి ఉంది.

ఆసమయంలో రాజకుమారి ఉత్తర వస్త్రాభరణాల నలంకరించుకొని దేవేంద్రుని

కూతురయిన జయంతి వలె ప్రకాశిస్తూ ఉంది. రాజపరివారస్త్రీలు ఆమెకు ఇరువైపులా చేరి, ఆమెను అక్కడికి తీసుకొని వచ్చారు. అప్పుడు అర్జునుడు తన కొడుకు సౌభద్రునికోసం సలక్షణాంగి అయిన విరాటకుమారి ఉత్తరను స్వీకరించాడు. ఇంద్రునిరూపంతో సమానమైన రూపం గల కుంతీపుత్రుడు యుధిష్ఠిరమహారాజుకూడా అక్కడ ఉన్నాడు. అతడు కూడా ఉత్తరను కోడలిగా అంగీకరించి, స్వీకరించాడు. ఈ రీతిగా పార్థుడు ఉత్తరను స్వీకరించి, శ్రీకృష్ణుని సమక్షంలో మహాత్ముడైన అభిమన్యునికి, ఉత్తరకు వివాహం జరిపించాడు. వివాహసమయంలో విరాటుడు చక్కగా జ్వలించే అగ్నిలో వారిచే విధిపూర్వకంగా హోమం చేయించి బ్రాహ్మణులను పూజింపచేశాడు. అనంతరం వరునికి వాయువేగం గల ఏడువేలగుఱ్ఱాలను, రెండువందల పెద్దపెద్దఏనుగులను, అంతులేని ధనాన్ని కానుకగా ఇచ్చాడు. ఇంకా రాజ్యం, సైన్యం, కోశంతో పాటుగా తన్ను తాను కూడా వారిసేవకు అర్పించుకొన్నాడు. వివాహం అయిన తరువాత ధర్మపుత్రుడు యుధిష్ఠిరుడు అచ్యుతుడిచ్చిన ధనం చాలావరకు బ్రాహ్మణులకు దానం చేశాడు. వేలకొద్దీ గోవులు, రత్నాలు, వివిధ వస్త్రాలు, ఆభరణాలు, ముఖ్యవాహనాలు, శయ్యలు, భోజనసామగ్రి హృద్యాలైన అనేకవిధ పానీయాలు కూడా ఇచ్చాడు. ఆ సమయంలో తుష్టి పుష్టి పొందిన వేలు, లక్షల మందితో నిండి మత్స్యనగరం ఒక గొప్ప మహోత్సవంతో శోభించింది.

ఇది విరాటపర్వం



భారతం ఎందుకు చదవాలి ?

1. మనం భారతీయులం కనుక. భారతీయులుగా పెరగాలంటే భారతీయులుగా మిగలాలంటే భారతం చదివి తీరాలి.
2. నీవు - నేను అనే భేదం విడిచి మనం అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
3. మనల్ని మనం చక్కగా పరిపాలించుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
4. ప్రపంచంలో మన ఉనికిని నిలుపుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
5. ప్రజలంతా నా బంధువులు, మిత్రులు అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
6. దేవ, ఋషి, పితృఋణాలతో పాటు మనుష్యఋణం తీర్చుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
7. పాలించడమంటే చెప్పుకిందకు తొక్కడం కాదనీ రక్షించడమనీ తెలియాలంటే... భారతం చదివి తీరాలి.
8. బుద్ధిజీవి అయిన మానవుడు వయసులో ఉన్నపుడే భారతం చదివితే ఇహపర సౌఖ్యాలు రెండూ అందుకోగలడు. కనుక ముందుగా యువతరం భారతం చదివి తీరాలి.
9. తీవ్రబుద్ధి మనిషి మనస్సును చీలుస్తుంది - సద్బుద్ధి మనుషుల మనస్సులను బుద్ధులను కలుపుతుంది. ఆ భావన కోసం... భారతం చదివి తీరాలి.